# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక జనవరి, 2012 ₹ 20



శివపూజకు వేళాయె

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**

*- Dammapada.*


**సంపుటి 23 జనవరి 2012 సంచిక 1**



*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*

కాండ్రేగుల నాగేశ్వర రావు

*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి

డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి

కుర్రా జితేంద్రబాబు

నందిగం కృష్ణారావు

*సంస్థాపక సంపాదకులు*

**రవీంద్రనాథ్ ఆలపాటి**



*Printed & Published by*

Bapanna Alapati

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads,

Musheerabad, Hyderabad - 500 020.

Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in

e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹240

విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

*మీ చందా* **మిసిమి** *పేర పై చిరునామాకు పంపండి.*



మరిన్ని వివరాలకు 80 వ పుట చూడండి.


# ఈ నెల...


కమ్మతెమ్మెరలు ........ 3

ఇదీ మన భాగవతం ........ 5

*– డాక్టర్ శ్రీరంగాచార్య*

పురాణం సూరిశాస్త్రి (తొలి తెలుగు నాటకరంగ విమర్శకులు) .... 10

*– ఆచార్య మొదలి నాగభూషణశర్మ*

నన్ను ప్రభావితం చేసిన పుస్తకం ........ 17

*– వాడ్రేవు వీరలక్ష్మీదేవి*

ఉస్తాద్ బడే గులాం ఆలీఖాన్ ........ 21

*– డాక్టర్ మంతెన సూర్యనారాయణరాజు*

సూక్ష్మజీవి ........ 25

*– ఎ.కె; ము.పా.సా*

రమణీయ జానపద గేయాలు ........ 27

*– సి. వేణు*

ఒద్దిరాజు సోదరులు ........ 31

*– కుర్రా జితేంద్రబాబు*

సంప్రదాయం–సంస్కృతి ........ 36

*– దేవరకొండ బాలగంగాధర్ తిలక్*

మన తెలుగు ........ 38

*– డాక్టర్ శాఖమూరి రవిచంద్రబాబు*

వడ్డాది పాపయ్య ........ 40

*– బాలి*

సాహిత్యం భాషయొక్క విశిష్ట ప్రయోగం ........ 44

*– గోవింద చంద్ర పాండే*

క్రీడాభిరామం ........ 49

*– ఎన్నార్కె*

యల్లాప్రగడ సీతాకుమారి ........ 54

*– డాక్టర్ ముక్తేవి భారతి*

నారాయణ శాసనం ........ 61

*– వల్లూరి సూర్యనారాయణరావు*

జన్ను పరంపర (ఆరోహణ, చివరి భాగం) ........ 66

*– ముక్తవరం పార్థసారథి*

వృత్తి కళాకారుల జీవితం ........ 73

*– ఆచార్య మూలె విజయలక్ష్మి*

చదవండి (పుస్తక పరిచయం) ........ 76

నవ్వులు ........ 78


*ముఖచిత్రం* : హిమపుత్రి

*రెండవ అట్ట* : శివపూజకు వేళాయె

*మూడవ అట్ట* : మొల్ల రామాయణం

*నాల్గవ అట్ట* : పెండ్లికూతురు

చిత్రకారుడు : వడ్డాది పాపయ్య


(*ప్రత్యేక కథనం* : 40 వ పుటలో...)

తెలుగు నాటకరంగం సినిమా సునామితో ఏ నాడో తెరమరుగయ్యింది. ఈ స్థితి అటు కన్నడ, మరాఠీ, బెంగాలీ తమిళనాట లేదు. అక్కడా సినిమాలకు కొదవ లేకపోయినా నాటకానికి వాళ్లు తెర దించలేదు. తెలుగు నాటకరంగ విమర్శకు తొలి పలుకులు పలికిన పురాణం సూరిశాస్త్రి గురించి మొదలి నాగభూషణశర్మ విపులమైన రచన అందించారు. ఈనాటికీ తెలుగునాట నాటకరంగంపై పరిశోధన, చర్చ జరుగుతున్నదంటే దానికి ముఖ్యంగా ఇద్దరు వ్యక్తులను పేర్కొనవచ్చు. ఒకరు చాట్ల శ్రీరాములు, మరొకరు మొదలి నాగభూషణశర్మ. కేవలం నాటకాన్ని రక్షించటానికే వీరు సినిమాకు దూరంగా వుండిపోయారు. వీరు తమ సహకారం **మిసిమి** కి అందించటం ముదావహం.

అరవయిమూడు కళలను నేర్వటమే కాదు, అన్నింటిని ఆచరణలో పెట్టగలిగిన ఒద్దిరాజు సోదరులు ఎన్నో గ్రంథాలను వ్రాసి వారి సొంత ప్రెస్‌లో వారు స్వహస్తాలతో కట్టిన ఇంటిలో అచ్చొత్తించి తెలుగుకు ఎనలేని సేవ చేశారు. ఒద్దిరాజు సోదరులు తెలుగులో స్వదస్తూరితో వ్రాసిన, పాణిని సూత్రవృత్తిని (అష్టాధ్యాయిని) గత వందసంవత్సరాలుగా ప్రచురణకు నోచుకోలేదు.

వడ్డాది పాపయ్య గురించి వారి బొమ్మలు మినహా బయట ప్రపంచానికి తెలిసింది చాలా తక్కువ. బాలి ఎంతో శ్రమకోర్చి వారిని కలిసినప్పటి అనుభవాలను మనకు అందించారు. జనవరి సంచిక అట్టమీది బొమ్మలన్నీ వడ్డాది వారు వేసినవే.

పండితులు, కవులే కాదు, సామాన్యులూ సాహిత్యాన్ని అందించగలరు. అలాంటిదే నారాయణ శాసనం.

ఎనభైఅయిదు సంవత్సరాల వేణు గారు **మిసిమి** ద్వారా ప్రభావితులై పంపిన రమణీయ జానపద గేయాలు ఎంత రసరమ్యంగా వున్నాయో గమనించండి.

భారతీయ సంగీతకారులను రేఖామాత్రంగా పరిచయం చేయాలని ఉస్తాద్ బడే గులాం ఆలీఖాన్ తో మొదలు పెడుతున్నాము.

**మిసిమి** పాఠకులకు కొత్త సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు.



– **సంపాదకులు**

# కమ్మతెమ్మెరలు

**ఉత్తరాలతో పలకరించే పాఠకులకు అభివందనాలు. ఎంతో ఆసక్తితో**
**మిసిమి చదివి మీ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్రాస్తున్నందుకు**
**మా ఆనందాన్ని తెలుపుతూ, చేవగల్గిన ఉత్తరానికి 'అంతర్వీక్షణం'**
**పుస్తకం బహుమానంగా పంపుతున్నాము!**

* "...జీవనమనే పరుగు పందెంలో *ఎనభైఅయిదవ* మైలురాయి దాటినాను. ***మిసిమి*** ని చదవటం ద్వారా చైతన్యాన్ని పొంది ఈ రచన చేసినాను. ఎన్నో గేయాలు, అందులోని పంక్తులు మరుపు తెరల మధ్య మరుగు పడినాయి. చేయి వణుకుతూ వున్నందున అక్షరాలు కుదరటం లేదు. మన్నించాలి. ఈ రచన ***మిసిమి*** లో ముద్రణకు నోచుకుంటే ధన్యుణ్ణి. ***మిసిమి***ని నాకు పరిచయం చేసిన పూజ్యులు శ్రీ చంద్రమౌళి మేలు మరచిపోలేను..." **– సి. వేణు,** బెంగుళూరు.

* "...మీ ***మిసిమి*** మాసపత్రికలో వెన్నెల వెండి వెలుగులు, విరబూస్తూ, వుల్లాసాన్ని వినోదాన్ని కలిగిస్తున్నాయి అని అనటంలో అతిశయోక్తిలేదు. అక్టోబరు ***మిసిమి***లో చిలకమర్తివారి *భార్య బ్రహ్మరాక్షసా!* చదువుతుంటే అలనాటి ఉద్దాలక మహాఋషి కథ గుర్తుకు వస్తుంది. "భార్యను లొంగదీసుకొనే వుపాయం ఆలోచించవలె" అని అన్నారు. ఏమీ లేదు. మీకు కావలసిన దాన్ని అక్కరలేదంటే చాలు. మీకు కావలసింది వస్తుంది...

  ...*నాకు తెలియని మా నాన్నగారు* లో తిరుమల నీరజ చక్కని సందేశాన్ని సమాజానికి అందించేరు బ్రతుకు బాటలో తన పనిని తనే స్వయంగా చేసుకుంటూ, సుఖదుఃఖాలయందు సమభావన కలిగి యుండి, పరోపకార చింత కలిగి, పెద్దల మాటలకు విలువయిస్తూ, పయనించడమే పరమార్థమన్న సత్యాన్ని అందించేరు. అందులకు వారు అభినందనీయులు...

  ...శ్రీ సుబ్బరాజుగారు తమ *చింతామణి* లో అటు, శూద్రకుని, కాళ్ళకూరి వారిని, గురజాడవారలు సృష్టించిన వసంతసేన, చింతామణి, మధురవాణి పాత్రలలోని ఔచిత్యాన్ని ప్రచురించిన శైలి శ్లాఘనీయము, వారి తులనాత్మక శక్తి అభినందనీయం..." **– రామ నరసింగరావు,** విజయనగరం.

* "...***మిసిమి*** పత్రికను మొదటినుండి చదువుతున్నాను. మేము విద్యార్థులుగా వున్నపుడు 'భారతి' పత్రికను ఇష్టపడే వాళ్ళం. ఆ తరువాత ఆ స్థాయిలో తెలుగులో సాహితీ పత్రిక ***మిసిమి*** అని చెప్పవచ్చును. ఆలపాటి రవీంద్రనాథ్‌గారి ఆశయాలను వారి కుమారులు బాపన్నగారు మొదలైన వారు నెరవేర్చడం ఒక చారిత్రాత్మకమైన కృషి...

  ...ఇటీవల పత్రిక బహుముఖ విషయ సంపత్తితో రావడం అభినందనీయం. *చింతనాత్మక సారస్వతం* అనే పేరును సార్థకం చేస్తున్నారు. నేను చదువుకునే రోజుల్లో వ్యవసాయకుటుంబాలనుంచి వచ్చిన గొప్ప కవులైన ఏటుకూరి వెంకటనర్సయ్యగారు. తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు, కొండవీటి వేంకటకవిగారు, కొత్త సత్యనారాయణ చౌదరిగారు గొప్ప పద్య కవిత్వం రాసారు. సంస్కృతాంధ్రాల్లో గొప్ప పాండిత్యం సంపాదించారు. వారిమీద ఇంకా విశ్లేషణాత్మక వ్యాసాలు ఈ తరంకు అవసరం. హేతువాద ఉద్యమ సాహిత్యాన్ని, చరిత్రని అందించాల్సిన బాధ్యత కూడ మనకు ఉంది. మహాకవి గుర్రం జాషువాగారి సాహిత్యంలో ప్రతి పుస్తకం మీద విశ్లేషణ ఈ తరానికి అవసరం. ఆవుల గోపాలకృష్ణమూర్తి వ్యాసాలు దొరికినవి ప్రచురిండం అవసరం. సంజీవ్‌దేవ్‌గారు మంచి వచనం పండించారు. సాహిత్యంలో వాద వివాదాలు సహజం. వాటివల్ల సాహిత్యం నిగ్గు తేలుతుంది. ఈనాడు స్త్రీవాదం, దళితవాదం వచ్చాక తెలుగు సాహిత్యం విస్తరిస్తుంది. కొత్త పుంతలు తొక్కుతుంది...

...తత్వశాస్త్ర అంశాల్లో కూడా సాంఖ్యం, బౌద్ధం, జైనం, తంత్రశాస్త్రం వంటివి తెలుగువారికి లోతుగా అందించాల్సి వుంది. కళ; శిల్పం, ఫొటోగ్రఫీ, సినిమాల్లో వస్తున్న నూత్న టెక్నాలజీని కూడా పరిచయం చేయాలి. బౌద్ధ వ్యాసాలు ఒక్క మే సంచికలోనే కాక ప్రతినెల ఒక్కొక్క వ్యాసం ఇవ్వగలగాలి. ఇంగ్లీషు రయితలను తెలుగులో పరిచయం చేయాలి. పాశ్చాత్య తత్వవేత్తలను కొత్త చూపుతో పరిచయం చేయాలి...

...అప్పుడు ఇంకా సమగ్రంగా ***మిసిమి*** రూపొందుతుంది...నిజానికి ఇంత చక్కగా మ్యాప్లితో పేపర్లో ఆకర్షణీయంగా తప్పులు లేకుండా, పత్రిక ప్రచురిస్తున్నందుకు మిత్రులు ఆలపాటి బాపన్న గారికి, గౌరవనీయ మిత్రులు చెన్నూరి ఆంజనేయరెడ్డి గారికి, బౌద్ధ తాత్వికులు అన్నపరెడ్డిగారికి ప్రత్యేక కృతజ్ఞతలు. ఇక పత్రిక సంపాదకులు వల్లభనేని అశ్వినీకుమార్‌గారికి, కాండ్రేగుల నాగేశ్వరరావుగారికి వివిధ అంశాలమీద పరిశోధనా వ్యాసాలనందిస్తున్న రచయితలకు అభినందనలు. ఇటీవల తన మనస్సులోని మాట బలంగా చెప్పి ఆర్ద్రంచేసిన, ఆలోచింపచేసిన ప్రముఖ చింతనాపరుడు 'మో'గారికి ఆత్మీయ శ్రద్ధాంజలి..." **– డా॥ కత్తి పద్మారావు,** హైదరాబాదు.

✶ "...అక్టోబర్ సంచిక అందింది. ముఖచిత్రం మహిషాసురమర్ధన స్ఫురణకు తెస్తోంది... పులికంటి సామాన్యుని సంకటాన్ని గాందీబొమ్మలో మీరన్నట్లు సూదుల వైద్యంలా తెలిపారు...

...ఛాయాదేవి పుస్తకాల ప్రభావంలో చివరికి ఎవరైనా అధ్యాత్మక చింతన పడవలిసిందే అన్నట్లుంది....

రాములమ్మ రమాదేవి ప్రస్థానం స్త్రీశక్తికి తార్కాణం...

...*వీణాభ్యుదయం*లాంటి వ్యాసం ఇంతవరకూ ఎవరూ ప్రచురించలేదు. రాసిన నండూరికి నమస్సులు. ఇప్పటి ఉద్యమాలపేర రక్తంచిందిస్తున్న మేతావులకు తిలక్ కవిత్వం కళ్లు తెరిపించ లేక పోవటం మనజాతి జబ్బు...

...రామాయణ అక్షర చిత్రాలు అద్భుతం...తిరుమల రామచంద్ర ఉదాత్తమైన వ్యక్తిత్వం ఎందరికి వుంటుంది?...

...అక్టోబరు సంచికలో 'ఎడారిదారి' స్కెచ్ గురించి, పాఠకుని ఎడారి విస్తారంలోకి తీసుకువెళ్లి దారి తప్పించి–మన పట్టణ జ్ఞానంలోని డొల్లతనాన్ని చాలా సూటిగా చెప్పారు. రచయిత కవా–కథకుడా? బొమ్మలు చాలా బాగున్నాయి...ఎన్నో పుస్తకాలు ఓపికగా పరిచయం చేస్తున్నారు...పైగా చదవండి అని శీర్షిక! బాగుంది..." **– డా॥ మేఘన,** హైదరాబాదు.

✶ "...***మిసిమి*** ప్రతి అక్షరం బాగుంటుంది. ఈ విధంగా సామాన్యంగా చెప్పటం అన్యాయమే. ***మిసిమి***కి అలవాటు పడిపోయాను. చాలా హాయిగా వుంటోంది. సూర్యోదయం చూసినట్లు – సాయంసమయంలో సాగరతీరంలో నడిచినట్లు ... హాయిగా ఉంటుంది..." **– ఎగళ్ళ రామకృష్ణ,** పుస్తకమ్.కామ్

✶ "...అక్టోబర్ 2011 సంచికలోని శ్రీ కాండ్రేగుల నాగేశ్వరరావుగారి *రామాయణానికి అక్షరాంజలి* వ్యాసంలో శ్రీ పూసపాటి పరమేశ్వరరాజుగారి "కలిగ్రఫీ" కమనీయ కళాత్మక చిత్రాలు బహు అర్థవంతములై ఒప్పినాయి. సాహితీ పిపాసులకు ***మిసిమి*** ఓ విజ్ఞానఖని అని నుడవడంలో వింతేమీలేదు..." **– చక్కా చెన్నకేశవరావు,** కావలి.

✶ "...***మిసిమి*** మూడునెలలుగా మాకు వస్తోంది. అందులో టాపిక్స్ మా విద్యార్థులకు చాలా ఇంటరెస్టింగ్‌గా వుంటున్నాయి. వాటి మీద రివ్యూ రాయించాలని అనుకుంటున్నాము..." **– కామేశ్వరరావు,** (విష్ణు కళాశాలలు) భీమవరం.

✶ "..అట్టమీది బొమ్మలన్నీ కళాఖండాలే. ఎక్కడ తీసుకొస్తున్నారో. డిసెంబరు సంచిక ముఖచిత్రం అపురూపం ...కథనం ఎన్నో వివరాలు అందించింది. ధన్యవాదాలు..." **– జి.లక్ష్మి,** వాయిస్ మెయిల్, విజయవాడ.

✶ "... చాలా ఆలస్యంగా చేరుతుంది. ఇది పోస్టల్ వారి నిర్వాకమని తెలుసు. అయినా మీ దృష్టికి తెస్తున్నాము, అందుకోవాలనే ఆతృతతో..." ***– రాజారావు,*** చందానగర్.

✶ "...మధురవాణి సంభాషణలు చాలా మధురంగా భావస్ఫోరకంగా వున్నాయి. ఇంకా ప్రచురిస్తారా? పురాణం వారి ప్రతిభకు ఇవి నిదర్శనం..." **– జోగి శాస్త్రి,** బాలానగర్.

# ఇదీ మన భాగవతం

- శ్రీరంగాచార్య

**వేదకల్పవృక్షవిగళితమై శుక**
**ముఖ సుధాద్రవమున మొనసియున్న**
**భాగవతపురాణఫలరసాస్వాదన**
**పదవిగనుడు రసిక భావవిదులు**

సాహిత్యోద్ధారకుడైన సి.పి. బ్రౌన్ దొరవారికి నందన సంవత్సరం కరువులో 29-2-1833 తేదీ నాడు సోమయాజురామయ్యగారనే బీద పండితుడు ఆనాటి క్షామ పరిస్థితులలో తన జీవన వ్యధను తెల్పుతూ ఒక అర్జీవ్రాసి-దాని ముగింపులో -

**లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె ప్రాణంబులున్**
**ఠావుల్ దప్పెను మూర్ఛవచ్చె తనువున్‌డస్సెన్ శ్రమంబయ్యెడిన్**
**నీవేతప్పనితః పరంబెరుగ మన్నింపందగుందీనునిన్**
**రావేయీశ్వర! కావవే వరద! సంరక్షించుభద్రాత్మకా**

**దీనులకుయ్యాలింపను**
**దీనులరక్షింపమేలుదీవెనలొందన్**
**దీనావన నీకొప్పును**
**దీన పరాధీన......**

అని విన్నవించుకోగా

బ్రౌన్ మహాశయుడీ దీనునకేదో కొంత సొమ్ముతో పాటు అదే అర్జీమీద ఎండార్స్‌మెంటుగా -

**ఏనుమృతుండనౌదుననియింతభయంబుమనంబులోపలన్**
**మానుము సంభవంబుగల మానవకోట్లకు చావునిక్కమౌ**
**గాన హరిందలంపు మికకల్గదు జన్మము నీకు ధాత్రిపై**
**మానవనాథ! చెందెదవు మాధవలోక నివాససౌఖ్యముల్.**

అనే పద్యాన్ని వ్రాసి పంపినారట- ఇది బ్రౌన్‌దొర కప్పటికే పరిచయమైన తెలుగు భాగవతం. ప్రసిద్ధమైన భాగవత పద్యానికి జవాబుగా మళ్లీ భాగవతపద్యాన్నే సందర్భాను గుణంగా వ్రాసి పంపటం ఈయన ధిషణా వైభవాని కొక ప్రతీక. అంతేకాక లావొక్కింత... పద్యానికి చక్కని ఇంగ్లీషు అనువాదం కూడ చేసి భాగవతాన్ని *లవ్లీ లాంగ్వేజ్* అని ప్రశంసాపూర్వకంగా వ్రాసిపెట్టుకున్న సహృదయుడు. ఈ సందర్భం తెల్పటానికి కారణం ఏమంటే బ్రౌన్‌పండితుడు 1827 వరకే సుమారు 67 భాగవత తాళపత్ర గ్రంథాలను సేకరించి, అసమగ్రభాగాలను గుర్తించి కాగితాలపై వ్రాయించిపెట్టి సంపూర్ణ భాగవత గ్రంథాన్ని పరిష్కరణమొనర్చి సిద్ధపరచినాడు.

1840 సం.లో అప్పటికే విద్యార్థుల పఠనానికి అవసరం అని గ్రహించి భాగవతంలోని సప్తమస్కంధాన్ని ముద్రణచేయించి ప్రప్రథమంగా భాగవతగ్రంథ సూర్యాలోక భాగ్యాన్ని కలుగ చేసిన సాహితీవ్రతుడు - ఆనాడు అంటే 1827 సం. వరకే తాను సిద్ధం చేసియుంచిన తెలుగు భాగవతాన్ని ముద్రించుకునే నిమిత్తం తనకు దఖల్ పరచవలసిందిగా 10-4-1840 లో శ్రీపురాణం హయగ్రీవశాస్త్రిగారు (1810-1870) లేఖాపూర్వక విన్నపం చేయగా బ్రౌన్ వారికప్పగించినాడు.

దీనినే పురాణంవారు 1848లో ముద్రణమొనర్చి ప్రప్రథమ సమగ్ర భాగవత ప్రకాశకులైనారు. ఇది ఆనాడు బ్రౌన్ మహాశయుడు శ్రీమహాభాగవతానికొనర్చిన సాహితీ పరివస్య, అప్పుడు బ్రౌన్ సేకరించిన తాళపత్ర గ్రంథాలు

డాక్టర్ శ్రీరంగాచార్య, ఫోన్: 9299451266

లిఖిత ప్రతులు నేడు మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలో వున్నాయి. ఇదీ మొట్టమొదటి మన భాగవతావతరణం. పోతన్నగారు తెనుగుల పుణ్యపేటి భాగవతాన్ని తెనిగించటం పురాకృతశుభాధిక్యమని, తనజననము సఫలమై పునర్జన్మము లేకుండునట్లు శ్రీహరిని ప్రార్థించిన పరమభక్త కవి శిఖామణి, అందుకే దీనిని హరినామాంకితముగా సువర్ణాంభోజ హంసావళీసురుచి భ్రాజితమొనర్చిన నిరీహాకవివతంసుడు. ఇది ఒక్క పోతనగారే కాదు భాగవతాన్ని పూర్తిచేసిన నారన, సింగన, గంగనలు కూడా ఇట్టివారేయై నందున తెలుగు ప్రజల పురాకృత తపఃఫలంగా నేటికీ పఠనపాఠన ప్రవచనాదుల యందు భాగవతం ప్రథమతః గణనీయమై యున్నది.

కొన్ని వందల సంవత్సరాల నుండి భాగవతాన్ని గూర్చి అనేకవిధాలైన చర్చోప చర్చలు జరుగుచునేయున్నవి. పోతన దేశకాలనివాసాలు భాగవత రచన శైథిల్యవృత్తాంతం గంగనాదుల రచన–అనేవే కాకుండా భాగవతం లోని పద్య–పద– పాఠభేద వ్యాకరణచ్ఛందో విశేషాదులగూర్చి హోరాహోరి సాహిత్య సమర మొనర్చిన ధీర పరిశోధ కోత్తములు. *పోతననికేతనచర్చ, భాగవతపాఠ పరిశోధనము* వంటి గ్రంథాలను వెలయించి వినూత్న విషయావిష్కార మొనర్చిన ధిషణావైభవులున్నారు. పోతన ఓరుగల్లు ఒంటిమిట్టవాడు అని కొమర్రాజువారు జయంతివారు శేషాద్రిరమణకవులు చర్చాపటువైన రచనలనొనర్చి వితండవాదులను శాంతపరచినారు.

పోతన శ్రీమహాభాగవతాన్ని గూర్చి ఎన్నెన్నో పరిశోధనవ్యాసాలు వచ్చినవి. ప్రత్యేకసంచికలు వెలువడినవి. ఇక్కడొక విశేషమేమంటే పోతన పుట్టినది సిరిపుట్టిన యిల్లైన ఓరుగల్లుకు సమీపంలోని బమ్మెర గ్రామం కాగా, ఇదే ఓరుగల్లు ప్రక్కనున్న మడికొండ గ్రామవాసి కారణజన్ముడై బుధనికాయము మెప్పుపొందిన వానమామలై వరదాచార్యులవారు పోతనను గూర్చి *పోతన చరిత్ర* వ్రాసి *అభినవపోతన*గా నిలిచారు. తెలుగు సాహిత్యంలో ఒక మహాకవిని గూర్చి ఇంతటి మహాకావ్యం వెలువడటానికి కారణమైనది ఏకశిలానగరం. ఇట్లా ఇద్దరు పోతనలు మనకున్నారు.

ఇక వివిధ విశ్వవిద్యాలయాల్లో పోతన శ్రీమహాభాగవతాన్ని గూర్చి ఎన్నెన్నో పరిశోధనవ్యాసాలు వచ్చినవి. ప్రత్యేకసంచికలు వెలువడినవి. ఇక్కడొక విశేషమేమంటే పోతన పుట్టినది సిరిపుట్టిన యిల్లైన ఓరుగల్లుకు సమీపంలోని బమ్మెర గ్రామం కాగా, ఇదే ఓరుగల్లు ప్రక్కనున్న మడికొండ గ్రామవాసి కారణజన్ముడై బుధనికాయము మెప్పుపొందిన వానమామలై వరదాచార్యులవారు పోతనను గూర్చి *పోతన చరిత్ర* వ్రాసి *అభినవపోతన*గా నిలిచారు. తెలుగుసాహిత్యంలో ఒక మహాకవిని గూర్చి ఇంతటి మహాకావ్యం వెలువడటానికి కారణమైనది ఏకశిలానగరం. ఇట్లా ఇద్దరు పోతనలు మనకున్నారు. ఈ వరంగల్లులోనే కొంతకాలంనాడు (1982) *పోతన పంచశతి* సభలు జరిపి ఒక విశేష *స్మారిక* వెలువరించారు. అదే సంవత్సరం *కాకతీయ విశ్వవిద్యాలయ తెనుగువిభాగం* వారు *విమర్శిని* పత్రికను పోతనవాఙ్మయ జీవిత విశేషసంచికగా ప్రకటించి ఎంతో సమాచారాన్నిచ్చినారు. ఇది గొప్పనైన పోతన సాహితీదర్శనం. ఇదంతా మన భాగవత బహుముఖీన సాహితీ పరిశ్రమను గూర్చి రేఖామాత్ర సంస్మృతి.

**కాలానుపూర్విగా భాగవత ముద్రణలు:**

1.వేదంవేంకటాచలశాస్త్రి (1840) 2. పురాణం వేంకటకృష్ణశాస్త్రి (10.11 స్కంధాలే) (1843) 3. పురాణం హయగ్రీవశాస్త్రి (1848) 4. కరాలపాటి వెంకటరంగయ్య (1865) 5. దేవరాజ పెరుమాళ్లయ్య (దేవరాజ సుధీమణి) 6. నేలటూరి వెంకటసుబ్బాశాస్త్రి (1889) 7. మృగీస్థల అయ్యామాచార్యులు (సంగ్రహటిప్పణి) (1889) 8. వనప్పాకం అనంతాచార్యులు (1894) 9. వేమూరి వేంకటకృష్ణమచెట్టి (1905) 10. తంజనగరం తేవప్పెరుమాళ్లయ్య (1905). 11. రాయదుర్గం నరసయ్య శాస్త్రి (పరిష్కరణ) (1915) 12. వావిళ్లరామస్వామి శాస్త్రులు (1922) 13. వావిళ్లరామస్వామిశాస్త్రులు. శేషాద్రిరమణ కవుల పరిష్కరణ (1926) 14. వావిళ్లరామస్వామిశాస్త్రులు. రాయదుర్గం వారి పరిష్కరణ (1934) 15. పమ్మిరామకృష్ణ (1940) 16. వావిళ్లవారు – నిడదవోలువారి పీఠిక (1947) 17. వావిళ్లవారు (1948) 18. రాయల్ పబ్లికేషన్స్ – రాళ్లపల్లి, పుట్టపర్తి, ఇద్దరి పీఠికలు (1954) 19. టాగూర్ పబ్లిషింగ్‌వారు – బులుసు వారి

పీఠిక లఘుటీక (1962) 20. ఆంధ్రప్రదేశ సాహిత్య ఎకాడమీ ( 1964) 21. ఆంధ్రప్రదేశ సాహిత్య ఎకాడమీ (1968) 22. వీరివే మరి రెండు ముద్రణలు (సం॥ ?) 23. వీరివే మరి రెండు ముద్రణలు ( సం॥ ?) 24. వావిళ్ళ ప్రచురణ – నిడుదవోలు వారి పీఠిక (1973)

నెం.3 ఈ మహానుభావుడే 1842లో సంస్కృత రామాయణం 1849లో భాగవతం, 1855లో భారతం ప్రచురించిన సాహితీ తపస్వి. నెం. 25, 26, 27 సాహిత్య ఎకాడమీ రద్దయిన తర్వాత తెలుగు విజ్ఞానపీఠం, తరువాత ఇదే తెలుగు విశ్వవిద్యాలయం ముద్రించింది. (1987 వరకు ఆరుముద్రణలు)

28–33 తిరుమల–తిరుపతి దేవస్థానాల వారు ఇప్పటికి 6 పర్యాయాలు 1987లో 1/8 సైజు 17 సంపుటాలు. జంధ్యాల పాపయ్యశాస్త్రి సంపాదకత్వంలో వెలువడగా.

1988 – సంపుటాల సైజుమార్చి గట్టి బైండు పోతనగారి ముఖచిత్రంతో 5 సంపుటాలలో *పోతన భాగవతము* పేర ప్రచురించినారు.

ఇది ప్రతిపద్య తాత్పర్య యుక్తం. 2004, 2005, 2008, 2010 సం. ఇవే సంపుటాలు పునర్ముద్రణమైనవి. విజయవాడలోని రోహిణి పబ్లికేషన్స్‌వారు 2 సంపుటాల్లో 2004, 2007, 2009 సం. ఇది నా పరిశీలనలో లభించిన *శ్రీమహాభాగవత ముద్రణలు* ఇవేగాక ఇంకా ఎన్నో సంస్థలు భాగవతాన్ని ముద్రించియుండవచ్చు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం వారి పరిష్కృత మహాభారతం వలె ఎకాడమీ వారి భాగవతంకూడా ప్రామాణికంగా పేరుగాంచింది. తర్వాత వచ్చిన (ఎకాడమీ రద్దు తర్వాత) తెలుగు విజ్ఞానపీఠం తెలుగు విశ్వవిద్యాలయం వారు ఎకాడమీ పుస్తకాలను యధాతథంగా ప్రకటించినట్లే శ్రీ మహాభాగవతాన్ని ప్రకటించినా ఒక్కొరకమైన ముద్రాదోషాలు అస్తవ్యస్తాలు చోటుచేసుకుంటున్నాయి.

**ముద్రణ విశేషాలు:**

భాగవత ప్రపథమ ముద్రణ 1848లోనే జరిగినదని పరిశోధకుల అభిప్రాయమైనా 1840లో వేదం వేంకటాచల శాస్త్రి ఒక భాగవతాన్ని ముద్రించినట్లు నిడదవోలు వారు తెల్పిరి. కాని దీని సమాచారం లభించటంలేదు.

ఆంధ్రప్రదేశ సాహిత్య ఎకాడమీవారు పండితులు – పరిశోధకుల తోడ్పాటుతో 1961లో ఆరంభించి 1964లో పూర్తిచేసిన *బహుపాఠాంతర పరిష్కార విపుల పీఠికాసహిత శ్రీ మహాభాగవతం* 1964లో 4 సంపుటాలుగా 1968లో 2 సంపుటాలుగా 165 పుటలు విశేష విషయయుక్త పీఠికతో ప్రచురించినప్పుడు పురాణం వారి ప్రతిని 'హ' ప్రతిగాపేరు పెట్టి దానిలోని ముద్రిత ప్రథమ పత్రం ఫోటో చేర్చినా ఈ గ్రంథం ముద్రణ వత్సరం 1855 అని తెల్పటం ఆశ్చర్యకరం. దీనితోపాటు తాళపత్రాల ఫోటో. పరిష్కరణ కార్యంలో పాల్గొన్న పండితులు పరిశోధకుల జాబితా కూడా యిచ్చినారు. సేకరించిన 257 తా.ప్ర. లిఖితప్రతులలో 26 ప్రతులను సమగ్రంగా గుర్తించి 16గురు పరిశీలకులతో ప్రతిపంక్తిని వ్రాయించి పాఠాలను సరిచూచి చక్షురక్షర సంయోగ నిర్నిద్రదృష్టి పరిశీలనమొనర్చినా – ఇది వెలువడిన వెంటనే దీనిలోని పాఠాలను గూర్చి ఆనాటి సుప్రసిద్ధసాహిత్య పత్రికల్లో శరపరంపర వ్యాస సమర మొనర్చిన పండిత పరిశోధకుల కృషి గొప్పది. అందుకే అనతికాలంలోనే దీపాలవారి *భాగవతపాఠ పరిశోధన* మనే గ్రంథం వచ్చింది.

ఎకాడమీ వారి భాగవత గ్రంథ సంపాదక వర్గంలో రాయప్రోలు, దివాకర్ల, రామరాజు, తాపీ, దీపాల వారున్నారు. ఆనాడు వీరొనర్చిన మహాభాగవత ప్రకాశనక్రతువు చిరస్మరణీయం, ఇక్కడ మనం గమనించవలసిన మరొక ముఖ్య విషయం గ్రంథనామం *శ్రీమహాభాగవతము* అనే ఉంచటం. పోతనాదులు కూడా గద్యములలో ఇట్లే వ్రాసు కున్నారు. (ఎవరో ప్రకాశకులు పెట్టిన *శ్రీమదాంధ్ర* శబ్దం భారత–భాగవతాలకు అతికి అసలు పేరును అడుగున పడవేసింది.)

ఉస్మానియా విశ్వవిద్యాలయం వారి పరిష్కృత మహాభారతం వలె ఎకాడమీవారి భాగవతంకూడా ప్రామాణికంగా పేరుగాంచింది. తర్వాత వచ్చిన (ఎకాడమీ రద్దు తర్వాత) తెలుగు విజ్ఞానపీఠం తెలుగు విశ్వవిద్యాలయం వారు ఎకాడమీ పుస్తకాలను యధాతథంగా ప్రకటించినట్లే శ్రీ మహాభాగవతాన్ని ప్రకటించినా ఒక్కొరకమైన ముద్రాదోషాలు అస్తవ్యస్తాలు చోటుచేసుకుంటున్నాయి. యథాతథ ముద్రణయే వీరి పనియైనందున కనీసం, వావిళ్ల

వారి ప్రతులనైనా సంప్రతించలేక పోయినారు. వీటి తరువాత వచ్చిన తిరుమల తిరుపతి దేవస్థానం వారి భాగవతప్రకాశన కృషి చాలగొప్పది. వ్యాఖ్యానయుతంగా కవిత్రయ భారతాన్ని ప్రచురించిన దేవస్థానం వారి ప్రతి పద్యతాత్పర్య యుక్తంగా భాగవతాన్ని కూడా ముద్రించటం తెలుగువారికి సంతోషదాయకమైన విషయం.

అందమైన రూపం, మంచి బైండు, పోతనగారి ముఖచిత్రం, తక్కువవెల, మంచిఅచ్చు, పెద్దసైజు ఇట్లా సిద్ధంచేసిన ఈ గ్రంథాలకు సాహితీలోక సుప్రసిద్ధులైన జంధ్యాల పాపయ్య శాస్త్రి, నండూరి రామకృష్ణమాచార్యుల వంటివారు సంపాదకులుగా మరికొంతమంది పండిత - పరిశోధకులు సలహామండలిగా ఏర్పడి ఆయా స్కంధాలలోని పద్యాలకు సులభశైలి తాత్పర్యం వ్రాయగలిగే పండితులను ఏర్పాటుచేసికొని శ్రద్ధాసక్తులతో భాగవతాన్ని 5 సంపుటాలుగా ప్రకటించి తెలుగుజాతికి చిరస్మరణీయమైన సాహితీ సేవచేసినారనటంలో సందేహం లేదు.

అందమైన రూపం, మంచి బైండు, పోతనగారి ముఖచిత్రం, తక్కువవెల, మంచిఅచ్చు, పెద్దసైజు ఇట్లా సిద్ధంచేసిన ఈ గ్రంథాలకు సాహితీలోక సుప్రసిద్ధులైన జంధ్యాల పాపయ్య శాస్త్రి, నండూరి రామకృష్ణమాచార్యుల వంటివారు సంపాదకులుగా మరికొంతమంది పండిత - పరిశోధకులు సలహామండలిగా ఏర్పడి ఆయా స్కంధాలలోని పద్యాలకు సులభశైలి తాత్పర్యం వ్రాయగలిగే పండితులను ఏర్పాటుచేసికొని శ్రద్ధాసక్తులతో భాగవతాన్ని 5 సంపుటాలుగా ప్రకటించి తెలుగుజాతికి చిరస్మరణీయమైన సాహితీ సేవచేసినారనటంలో సందేహంలేదు.

అయితే *ప్రమాదోధీమతామేవ* అని ఈ సంపుటాల పరిశీలనలో నిజమని తెలుస్తున్నది. ఈ విషయాలను గూర్చి కొంత కాలం నాడు 20-3-2006 ఆంధ్రపత్రికలో *అందమైన గ్రంథంలో అసంగతాలు* అని విపుల విమర్శవచ్చింది. ఐనా 2005 ముద్రణ తర్వాత వచ్చిన మలిముద్రణలోను 2007సం. శ్రీరామకృష్ణమతం వారి ముద్రణలోను ఈ పొరపాట్లు ఆవిధంగానే వున్నాయి.

**ఈ పొరపాట్లలో కొన్ని:**

1. **పోతన భాగవతము** : దీనివలన ఇతర స్కంధకర్తలపేర్లు ఎక్కడ? భాగవతం అనగానే పోతన అనే వ్యాప్తిని బట్టి వీరు ఇట్లా పేరుపెట్టి దీన్ని సమర్థించుకున్నా ఎకాడమీవారివలె *శ్రీమహాభాగవతము* అనడం సమంజసం.

వీరు ప్రచురించిన వ్యాఖ్యానయుత *శ్రీమదాంధ్ర మహాభారతం* అంతా కవిత్రయ విరచితమే కదా!

2. రెండవ సంపుటంపైన *షష్ఠమ స్కంధం* అనే వేసిన వీరు 20-3-2006 నాటి పత్రికా విమర్శ కారణంగా ఇటీవల 2010 సం. వచ్చిన సంపుటంపై షష్ఠ అనివేసి దిద్దుకున్నా మిగిలిన దోషాలట్లేగలవు.

3. జంధ్యాలవారు కీర్తిశేషులైనా సంపాదకులుగా వారి పేరే గలదు. అట్లే మరి కొందరు కీర్తిశేషులైన పండితుల పేర్లున్నాయి. వీరిని గూర్చి సంక్షిప్త పరిచయం వేస్తే బాగుండేది. గ్రంథంలో కీర్తిశేషులతో బాటు వర్తమాన పండితులనూ చేర్చినారు. మలి ముద్రణలో దీనిమార్పు అవసరం.

4.దేవస్థానం వారు భాగవతాన్ని పద్య భావయుక్తంగా అందరూ చదువుకునే అవకాశం కలిగించటానికి ఈ బృహత్కార్యం చేస్తున్నారు. అయితే మన సంపాదక పండిత మండలివారి వ్రాతలు మాత్రం విచిత్రంగా వున్నాయి. పద్యాలకు భావాన్ని వ్రాసిన వారిని *అనువాదకులు (1,2 సం) సరళ గద్యానువాదసహితం (3సం) అనువాదం (4సం) సరళ గద్యానువాదసహితం (5సం) సులభవ్యాఖ్యానం, సరళవ్యాఖ్య* అని ముద్రించినారు. ఇక్కడ *భావం తాత్పర్యం, గద్యం, అనువాదం, సరళవ్యాఖ్య* అనేవి వీరికి సమానార్థకాలా? ముఖపత్రం పైన బ్రాకెట్లో *సరళగద్యానువాద సహితం* అన్నారు. వీటిని సరిచూచే పండితులే లేరా? ఈ విధమైన పొరపాట్లు దేవస్థానాధికారుల పాలిటి శాపాలు, అపార దయా *నిధియైన* శ్రీ శ్రీనివాసస్వామి కృపవలన ముమ్ముందు ఈ పొరపాట్లు రాగూడదని ఆశిద్దాం. ఇది మన తెలుగు భాగవతాల ముద్రణాసమాచారం.

చాలకాలంనాడే మనభాగవత వ్యాప్తిని గమనించిన పెద్దలు దీనిలోని *ప్రహ్లాదచరిత్ర, వామనచరిత్ర, రుక్మిణీకల్యాణం, గజేంద్రమోక్షం, రంతిదేవుని కథ* మొదలైన వాటిని అర్థతాత్పర్యయుక్తంగా ప్రచురించి పరీక్షార్థులైన విద్యార్థులకేగాక గ్రామీణ ప్రాంత జనంలో అక్షరాస్యులైనవారు

చదివి, చదివించుకుని విజ్ఞానానందవర్ధనులు కావటానికి కృషిచేసినారు. ఆనాడే బ్రౌన్ భాగవత భాగాలను విద్యార్థుల నిమిత్తం ప్రచురించినట్లు తెల్పినారు. తరువాత లఘు టీకలతో భాగవత భాగాలు కొన్ని వచ్చినవి.

ఇప్పటి వరకు వచ్చిన భాగవతపీఠికలో *పాఠాంతరాలు, ఛందోవిశేషాలు, శబ్దచర్చలతోపాటు భాగవత కవి, కవితావిశేషాల* గూర్చిన నూతన విషయాలు విశేషంగా వున్నాయి. మన తెలుగు సాహిత్యంలో కవిత్రయ భారతం తర్వాత అనేక ముద్రణలనందినది శ్రీమహాభాగవతం. దానితోపాటు ఎన్నో రకరకాల చర్చలు వాదోపవాదాలకు కూడా ఇది భాగవతమే అయింది. ఈ విధమైన వాటిని పరిశీలనగా పరిస్తున్నప్పుడు ఆయాపండితుల పరిశోధకుల కృషి, పట్టుదలలు ఎంతగొప్పవోగదా అనిపించటమేగాదు, మామూలు వ్యక్తులు వాదులాడితే మిగిలేది అవాచ్యాలే. కాని పండితులు, పండితులు వాదిస్తే సాహితీకులకెన్నో వినూత్న విషయాలు తెలుస్తాయి అనే సంగతి మన భాగవత వాదోపవాదాలవలన వ్యక్తమైంది. ఈ సందర్భంలో నేను భాగవత పద్య పాఠాంతరాలను పీఠికల్లోని విషయాలను పేర్కొనలేదు. అదంతా ఒక్క ప్రత్యేక రచన కావలసినంత సమాచారం.

**మనకర్తవ్యం**

1. శ్రీమహాభాగవతం, వివిధ ప్రతులను సేకరించి ప్రామాణికమైన పాఠాలతో వెలువరించుకోవలెను.
2. ఇప్పటివరకు నన్నయ, తిక్కన నన్నెచోడ, శ్రీనాథకవుల పదసూచికల వలె *భాగవత పదసూచిక*ను సిద్ధం చేయటం.
3. తిరుమల తిరుపతి దేవస్థానం వారు శ్రీమహాభారతానికి వ్యాఖ్యను ప్రకటించినట్లే భాగవతాన్ని కూడా వ్యాఖ్యాన యుతంగా ముద్రించటం అవసరం.
4. పూర్వ పూర్వం నుండి ఇదానీంతనకాలంవరకు వచ్చిన *పోతన భాగవత సంబంధ వ్యాసాలను, విమర్శలను, గ్రంథాల*ను సేకరించి జాగ్రత్తపరచటం
5. వివిధ విశ్వవిద్యాలయాల్లో భాగవతం గూర్చి పరిశోధనచేసి డిగ్రీలుపొందిన వారి రచనలను సేకరించటం.
6. కేవలం భాగవతమునేగాక అనంతరకాలంలో వివిధ రీతులుగా వచ్చిన భాగవతానువాద గ్రంథాలను సేకరించవలెను.
7. ఆంధ్రమహాభారతానికి అబ్బరాజు సూర్యనారాయణ 1 భాగం 1978, 2 భాగం 1982 పుత్తా పుల్లారెడ్డి గారు (2010) నిఘంటువుల సిద్ధంచేసినవిధంగానే మనం భాగవత నిఘంటువును సిద్ధం చేయగలిగితే ఎన్నో క్రొత్తపదాలు, సామెతలు, మాండలికాలు వెలుగులోకి వస్తాయి.
8. పోతనాదుల భాగవత రచనకు ముఖ్యమైన సంస్కృత భాగవతాలను వివిధ వ్యాఖ్యలతో సేకరించి వాటిని ఆధునిక పద్ధతుల్లో జాగ్రత్తపరచవలెను.
9. మనతెలుగు భాగవతంలో అనువదింప బడని మూలకథలను గూర్చి పరిశోధించ వలెను.
10. ఇవన్నీ ఒక యెత్తు ప్రతి సంవత్సరం పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయ విద్యార్థులకు భాగవత పద్య పఠనం (కంఠస్థం) భాగవత సంబంధ వ్యాసరచనా స్పర్థలను ఏర్పరచి విజేతలకేగాక పాల్గొన్న ప్రతివ్యక్తికీ భాగవతం ప్రతులను బహుమతిగా ఇచ్చే సంప్రదాయాన్ని ఏర్పరచవలెను. వరంగల్లులో ఏర్పడిన *పోతన విజ్ఞానపీఠము* సార్థకమై వ్యాప్తి చెందుతున్నది.

   వీరు, కాకతీయ విశ్వవిద్యాలయం వారు కలసి *భాగవత సర్వస్వము*ను సిద్ధంచేసి సాహితీలోకాని కందిస్తే వర్తమాన కాలానికేగాదు భవిష్యత్ తరాలవారికి కూడా భాగవతకథా సుధాద్రవాన్ని పంచిన వారౌతారు. *పోతన విజ్ఞాన పీఠము* ఈ పనులను చేయటానికి సహకరించి అన్నివిధాలా బలవంతంగా వున్న తిరుమల తిరుపతి దేవస్థానం వారి ద్వారానో తెలుగు ఎకాడమీ ద్వారానో ఈ సత్కార్యాలను చేయించటం అవసరం. లేకుంటే చిన్నయసూరి చెప్పినట్లు *భవిష్యత్తుధూర్వహము*

**అరవిందాక్షపదారవింద మకరందాసక్తులైయున్న స**
**త్పురుష శ్రేష్ఠుల వృత్తముల్ వినక దుర్బుద్ధిన్ విలంఘించి దు**
**ర్నర వార్తాకథన ప్రపంచములు కర్ణప్రాప్తముల్ చేసి వా**
**సరముల్ వ్యర్థత ద్రోచుచుండ జనదీ సంసార మోహంబునన్**

**(శ్రీమహా....1-390)**



పురాణం సూరిశాస్త్రి

### తొలి తెలుగు నాటకరంగ విమర్శకులు

# శ్రీ పురాణం సూరిశాస్త్రి

– మొదలి నాగభూషణశర్మ

> *పురాణం సూరిశాస్త్రి: మేధావి, రచయిత, విద్యాకళాపోషకుడు, విమర్శకుడు, భక్తుడు, త్యాగి మాత్రమేకాక జీవితమాధుర్యాన్ని, రసానుభూతిని అన్ని కోణాల నుంచి అనుభవించిన భోగి...*

నాటకాన్ని 'సర్వకళా సమ్మేళనం' అనీ, 'సమాహారకళ' అనీ అంటారు. అన్ని లలితకళలు, ప్రదర్శక కళలు నాటకంలో అంతర్లీనమైన ముత్యాల పేరులా కలిపి వుంచడానికి పాఠ్యం (సాహిత్యం) అనే జలతారుదారం ఉంటుంది. ఇన్ని కళల అర్థవంతమైన మేళవింపు జరిగితేనేగాని రాసినవాడికి, వేసినవాడికి, చూసినవాడికి ఆనందాన్నిచ్చే ప్రక్రియ కాలేదు నాటకం. మిగిలిన ఏ సాహితీమాధ్యమానికి లేని రెండు ప్రత్యేకతలున్నాయి నాటకానికి. ఒకటి, ఇది 'నిత్యవర్తమానం' లోనే రాయబడడం. కథ ఎప్పటిదయినా, ఎక్కడ జరిగినా – ఇప్పుడు, ఇక్కడ జరుగుతున్నట్లుగా ప్రదర్శించడం. రెండోది – ఇది 'ప్రాణవంతమైన మాధ్యమం' కావడం. మనలాంటి వ్యక్తులే మనముందుకు వచ్చి ఒక కథను దృశ్యమానం చేయడం, వేసేవాళ్లు నేరుగా చూసేవాళ్ళముందు ఒక పాత్ర్యాన్ని ప్రదర్శించడం– ఈ ప్రత్యక్ష అనుభవం నాటకానికి, దానిని ప్రదర్శించడానికి కూడా ఒక విశిష్టతను ఆపాదించింది. ఈ కారణాలవల్ల నాటకాన్ని వివేచించడం, విమర్శించడం సంక్లిష్ట మైన శాస్త్రచర్చ అయింది. తెలుగులో ఆ నాటక శాస్త్రచర్చకు లక్ష్య, ప్రమాణాలను అందించే రచనలను చేసిన వ్యక్తి పురాణం సూరిశాస్త్రి.

తెలుగు నాటక విమర్శ శైశవదశ దాటి యౌవన ప్రాదుర్భావాలు సంతరించుకున్నది సూరిశాస్త్రిగారి విమర్శన గ్రంథాల ద్వారానే. ప్రాచ్య, పాశ్చాత్య విమర్శన చరిత్రలను, వాటితోపాటు ప్రపంచ నాటక చరిత్ర రీతులను ఆకళింపుచేసుకొన్న తరువాతనే సూరిశాస్త్రిగారు తమ విమర్శనాప్రస్థానాన్ని ప్రారంభించారు. తాను 'చూసిన' నాటకాలను గురించి, 'చూసిన' నటులను గురించి మాత్రమే రాస్తున్నానని చెప్పిన ధీశాలి ఆయన. నాటకానికి రచనా ప్రమాణాలు ఎంత ముఖ్యమో, ప్రదర్శనా ప్రమాణాలూ అంతే ముఖ్యమని నమ్మి రచన, ప్రదర్శనలు నాటక విమర్శకు రెండు కళ్ళని భావించిన నిజమైన నాటకరంగ అధ్యయన శీలి ఆయన. అంతవరకు వేరువేరుగా నాటకరచనను గురించి విమర్శలు, నాటకప్రదర్శనల సమీక్షలు వస్తున్న నేపథ్యంలో నటన, రచన, ప్రదర్శన యోగ్యతల సంయోజనమే నాటకం గొప్పతనాన్ని తెలియజేయగలదని చాటి చెప్పి తెలుగులో నాటక విమర్శకు పితామహుడనదగిన స్థాయికి ఎదిగాడు. ఆయన రచనల్లో భావసౌష్టవం ఉన్నంత గొప్పగా భాషాసౌకుమార్యం ఉండదన్నది ఏ చదువరికయినా యిట్టే తెలిసి పోతుంది. తెలుగుభాషలో ఉన్న అందాల్ని, సౌకుమార్యాన్ని, మార్దవాన్ని – ఒక్క మాటలో చెప్పాలంటే, అసలు సిసలైన తెలుగుదనాన్ని – తన ప్రతి వాక్యంలోను పొదిగిన భావ భాషా శిల్పి మల్లాది రామకృష్ణశాస్త్రిగారికి – వాక్యం నడకని, పదాలపొంకాన్ని అంతగా పట్టించుకోని కేవల భావైక రచయిత మామగారు కావడం తెలుగు సాహిత్యంలో చాలా అరుదైన ఐరనీ!

నిజానికి ఆధునిక తెలుగు నాటక విమర్శ 1875వ సంవత్సరం సెప్టెంబరు 21న ప్రారంభమైనదని చెప్పవచ్చు. "జూలియస్ సీజర్" నాటకాన్ని "సీజరు చరిత్రము" అనే పేరుతో ఆసాంతమూ తేటగీతులలో రచించి దానికొక పీఠికను

ఆచార్య మొదలి నాగభూషణశర్మ, ఫోన్ : 9246103316

రాశారు. వావిలాల వాసుదేవశాస్త్రిగారు – 1875 సెప్టెంబరు 21వ తేదీన, అందులో తాను అనువాదంలో అవలంబించిన పద్ధతుల్ని గురించి వివరించాడాయన. ఈ పీఠికా రచనలకు సమాంతరంగా వెలసిన "సమీక్షలు" నాటక విమర్శకు రెండో పార్శ్వంగా చెప్పుకోవచ్చు. "సీజరు చరిత్రము"ను తమ 'వివేకవర్ధిని' పత్రికలో పత్రికాధిపతులు (బహుశా కందుకూరి వీరేశలింగంగారే అయివుండవచ్చు) చేసిన సమీక్ష సద్విమర్శనా పద్ధతికి గొప్ప ఉదాహరణగా చెప్పుకోవచ్చు. (వివేకవర్ధని: రెడవ సంపుటం, అయిదవ సంచిక).

ఈ విధంగా స్వీయరచనా విధానం, నాటక రచనల సమీక్ష రెండు పార్శ్వాలుగా దాదాపు ముప్పయి సంవత్సరాలు కొనసాగింది. తమ నాటకగ్రంథాలకు అర్థవంతమైన పీఠికలు వెలువరించిన వారిలో ధర్మవరం రామకృష్ణమాచార్యులు, గురజాడ అప్పారావు (1897, 1909 ప్రతులకు రెండింటికీ), ఆచంట వేంకటరాయ సాంఖ్యాయనశర్మ, కోలాచలం శ్రీనివాసరావు, నాదెళ్ళ పురుషోత్తమశాస్త్రిగార్లను పేర్కొనవచ్చు. ఆయా రచయితలు తాము ఏ నాటక సమాజాలకోసం ఈ నాటకాలు రాశారో, ఆ సమాజాలను గురించి ఉటంకించడం వలన ఈ పీఠికలు రంగస్థల మర్యాదను సంతరించుకున్నాయి.

అలాగే, నాటక సమీక్షలను ప్రోత్సహించిన ఆనాటి పత్రికలలో పూండ్ల రామకృష్ణయ్య "అముద్రిత గ్రంథ చింతామణి" (1887), నాయపతి సుబ్బారావు "చింతామణి" (1891), వనప్పాకం అనంతాచార్యులు "వైజయంతి" (1894) ముఖ్యమైనవి. మొదటి పత్రికలో పూండ్లవారు, చింతామణిలో ఆచంట సుందరరామయ్య, వైజయంతిలో పనప్పాకం శ్రీనివాసాచార్యులు (సి.యస్. చార్యులు అన్న పేరుతో) విలువైన సమీక్షలను ప్రచురించారు. వీరిలో పనప్పాకంవారు నాటక సమీక్షలో ప్రదర్శనా సౌలభ్యాన్ని కూడా పరిశీలించవలసిన అగత్యాన్ని గుర్తించారు.

1895–1900 సంవత్సరాలకు ఆంధ్రదేశంలోని అన్ని పట్టణాలలోను నాటక సమాజాలు వెలిశాయి. నాటక ప్రదర్శనల గురించి, నాటక ప్రయోగ పద్ధతులను గురించి 1900 నుంచి ఆలోచించడం ప్రారంభించారు తెలుగు నాటక విమర్శకులు. కొండిపర్తి సూర్యనారాయణరావు రాసిన 'ఆంధ్రనాటక సంఘ మార్గదర్శిని' అన్న చిన్న పుస్తకం (1910) నాటక ప్రదర్శనలను దృష్టిలో వుంచుకొని రాసిన మొదటి గంథం అనవచ్చు. అలాగే 'సాక్షి'లో పానుగంటివారు "సారంగధర నాటక ప్రదర్శనము" (1913), "నాటక ప్రదర్శనము" (1913) అనే పేర్లతో ప్రచురించిన రెండు సాక్షి వ్యాసాలు తెలుగు నాటక ప్రదర్శనలలో చోటు చేసుకుంటున్న అనౌచిత్యాలమీద చేసిన వ్యంగ్య విమర్శ. 1913 నాటికి తెలుగు నాటక విమర్శనా చరిత్రలో రెండో దశ ప్రారంభమైనదని చెప్పవచ్చు. తల్లాప్రగడ సూర్యనారాయణ రావు ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికలోను, పురాణం సూరిశాస్త్రి "గ్రంథాలయ సర్వస్వము"లోను అదే "ఆంధ్ర రంగస్థలములు" "ఆంధ్ర నాటకములు" అన్న పేర్లతో వేరు వేరు విమర్శనా వ్యాసాలు వెలువరించారు.

ఈ రెండింటిలోను వ్యాఖ్యానాత్మక విమర్శకు శ్రీకారం చుట్టారు ఆ యిద్దరూ. నాటక విమర్శకు మార్గదర్శక సూత్రాలను ఒకరు నిర్వచిస్తే ఆ సూత్రాలను తమ కాలంనాటి నాటకాలకు అన్వయింపచేసి వింగడించారు మరొకరు. వీరితో పాటు టేకుమళ్ల అచ్చుతరావు, తణికెళ్ల వీరభద్రుడు, శ్రీపాద కామేశ్వరావు వంటి విద్యావేత్తలు నాటకాంతర్గత అంశాలయిన ఇతివృత్త నిర్వహణ, పాత్రచిత్రణ వంటి వాటిని ఆధారం చేసుకుని నాటకాలను విమర్శించారు.

ఈదశలో సమగ్రమయిన, లక్షణ సమన్వితమైన సంయోజనాత్మకమయిన విమర్శ చేసినవారు పురాణం సూరిశాస్త్రి. ఆయన తాను అధ్యయనం చేసిన ప్రాచ్య పాశ్చాత్య నాటక సాహిత్యాలు ఆలంబనంగా, నాటకరచనా రీతులను అధ్యయనం చేశారు. అలానే నటనా విధానాలకు కొన్ని ప్రాథమిక సూత్రాలను నిర్వచించి అవి ఎంతమేరకు ఏఏ నటులలో చూడవచ్చునో వివరించారు. తెలుగులో ఆనాటి ప్రఖ్యాత నటుల నటనా విధానాలమీద అనూహ్యమైన రీతిలో సుదీర్ఘమైన విమర్శలు వెలయించిన ప్రప్రథమ విమర్శకుడాయన.

శాస్త్రిగారికి సమకాలికుడైన గొల్లపూడి శ్రీరామశాస్త్రి, వసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రి గారల రచనలను కూడా తెలుగు నాటక విమర్శను పరిపుష్టం చేసినవే! ఇదే సమయంలో విశ్వనాథ కవిరాజు ప్రారంభించిన నటసభను గురించి, ఆయన చేపట్టిన 'నాటకకళ' (1923) పత్రికను గురించి ఆయన తెలుగు నాటకానికి చేసిన బహుముఖ సేవను గురించి చెప్పుకోవాలి. తరువాతి తరంలో రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారి "నాటకోపన్యాసములు" (1935), వేదం వేంకటరాయశాస్త్రి "భారతాభారత రూపకమర్యాదలు" (1941) తెలుగు నాటక

విమర్శలో మరో కొత్త కోణాన్ని స్పృశించాయి. దువ్వూరి రామిరెడ్డిగారి "నాటక కళాసంస్కరణము" (1935) ఆనాటి నాటకాలను గురించి లోతైన వివేచన.

1943 నుంచి ప్రారంభమైన ఆధునిక తెలుగు నాటకరంగంలో నాటక విమర్శనా నిపుణులుగా పేర్కొనవలసినవారిలో శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, కె.వై.గోపాలస్వామి, శ్రీనివాస చక్రవర్తి ముఖ్యులు. నాటక చరిత్రలను రాసిన మొదటి తరం సాహిత్యవేత్తలలో పేర్కొనవలసిన వారు డాక్టర్ పి.యస్.ఆర్. అప్పారావుగారు, ఆ తరువాత శిష్లా రామకృష్ణశాస్త్రి ప్రభృతులు.

నాటక విమర్శలో పైన చెప్పిన పార్శ్వాలేకాక, యింకా అనేక పార్శ్వాలున్నాయి. కొందరు తమ పట్టణాలలో ఉన్న నాటక చరిత్రలను గ్రంథస్థం చేశారు. అప్పారావు, జమ్మలమడక మాధవరాయశర్మ వంటి పండితులు భారతీయ నాట్యశాస్త్ర వైభవాన్ని తెలుగు వారికి చాటి చెప్పారు. ఇదే పద్ధతిలో నాటకశాస్త్ర గ్రంథాలు చాలా అనువదించబడ్డాయి. ప్రత్యేకసంచికలు వెలువడ్డాయి. వెలువడుతున్నాయి. మొదటి దానికి *పరిశోధన* పత్రిక ధర్మవరం, గురజాడల మీద ప్రచురించిన ప్రత్యేకసంచికలు, రెండవదానికి *ఆంధ్రనాటక కళా పరిషత్తు రజతోత్సవ సంచిక* గొప్ప ఉదాహరణలు. 20 సంవత్సరాల పాటు నాట్యకళ పత్రిక తెలుగు నాటకానికి విలువైన సేవ చేసింది. అలాగే విశ్వవిద్యాలయాలలో నాటక పరిశోధన విస్తృతంగా జరుగుతున్నది. అందులో కొన్ని ముద్రణ భాగ్యాన్ని పొందుతున్నాయి.

ఆధునికులలో అనేకులు నాటక విమర్శ, సమీక్షలలో గణనీయమైన సేవచేస్తూ ఉన్నారు. ఈ విధంగా బహుముఖాలుగా విస్తరిస్తున్న తెలుగు నాటక విమర్శకు తొలిరోజుల్లో దిశానిర్దేశం చేసిన, నాటకవిమర్శకు అవసరమైన అన్ని అంశాల సమన్వయంతో గ్రంథాలు రచించిన పురాణం సూరిశాస్త్రి తరతరాల నాటక విద్యార్థులకు 'నిరంతర మార్గదర్శి'.

తెలుగునాటక విమర్శనా చరిత్రలో పురాణం సూరిశాస్త్రి గారికి ఒక విశిష్టమైన స్థానం ఉంది. ఒక సంయోజక విమర్శనా మార్గానికి (Composite theatre criticism) ఆయన ఆద్యుడు; మార్గదర్శి. ఇరవయ్యో శతాబ్దం తొలిరోజుల్లో వికసిస్తున్న ఒక సాంస్కృతిక, మేధో పునరుత్థానంలో భాగస్వామిగా, నిరంతర చింతనతో తాను నేర్చుకున్న కొత్త వైజ్ఞానికాంశాలను తన పాఠకులతో పంచుకోవాలని ఉత్సహించిన సునిశిత భావుకుడు. నిత్య అధ్యయనశీలి. తనకొక విషయం మనసుకు పడితే దానిని తోటివారితో పంచుకోవాలని తహతహలాడిన సన్మనస్వి. ఆగర్భ శ్రీమంతుల కుటుంబంలో పుట్టి, రసాయనశాస్త్రంలో పట్టభద్రుడై, తన జీవితాన్నంతా సాహిత్యానికి, శాస్త్రచర్చకు అంకితం చేశారు సూరిశాస్త్రిగారు. ఆనాటి అవిభక్త కృష్ణాజిల్లా (అంటే ఈనాటి పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలన్నీ కలిసివున్న ప్రదేశం) అంతటిలో ఆయనే ప్రప్రథమ పట్టభద్రులట! 1888లో జన్మించారు. తన 53వ సంవత్సరంలో అంటే 1941లో మరణించారు. ఎన్ని రాష్ట్రాలు, ప్రదేశాలు తిరిగినా బందరునే తమ కార్యస్థానంగా ఎన్నుకున్నారు. అక్కడ కళానిలయమని పేరుగాంచిన "విద్యానిలయా"న్ని నెలకొల్పి కవి పండితగోష్ఠులకు దానిని కేంద్రంగా మార్చారు.

ఆరోజుల్లో ఆంధ్రదేశంలో కవులు, పండితులు శాస్త్రజ్ఞులు పురాణం వారి ఆతిథ్యం తీసుకోవడానికే బందరు వచ్చేవారని, ఆయన ఇంట్లో జరిగే నిరంతర సాహిత్య చర్చలు ఆంధ్రదేశంలోని రాజాస్థానాలలో జరిగే సాహితీగోష్ఠులకు తీసిపోయేవి కావని వినికిడి. అయితే ఆయన నాటక పక్షపాతి. సాహిత్యప్రక్రియల్లో కవిత్వం ప్రథమస్తానం వహిస్తున్న ఆరోజుల్లో – ముఖ్యంగా ఆంగ్లసాహిత్య వాసన నెరిగిన విద్యాబృందంలో నాటక చర్చకు తన కాలాన్ని వెచ్చించిన విమర్శకాగ్రేసరుడు సూరిశాస్త్రి.

అంతేకాదు, ఆయన బందరు దగ్గరలోని తరకటూరులో "పర్ణశాల" అనే పేరుతో ఒక విద్యాకేంద్రాన్ని స్థాపించారు. అక్కడ చుట్టూ పర్ణశాలలను కట్టించి, ఆ ప్రక్కనే క్రీడలకు ('ఈత'ను ఒక క్రీడగా గుర్తించిన వ్యక్తి ఆయన) ఒక తటాకాన్ని నిర్మించారు. ఉపాధ్యాయులకు విద్యార్థులతోపాటే ఇళ్లు కట్టించి అక్కడే వుండే ఏర్పాట్లు చేశారు. ఒక ఆరుబయలు నాటకశాలను నిర్మించారు. ఇంత పరిపుష్టమైన రెసిడెన్షియల్ విద్యాలయాన్ని ఆనాడే రూపొందించడం ఆయన సర్వతోముఖమైన భావనకు, భావదర్శనానికి నిదర్శనం. ఆ రోజుల్లో ప్రజాజీవితంతో పెనవేసుకుని పోయిన అన్ని సంక్షేమ కార్యక్రమాలతోను ఆయనకు సన్నిహితమైన ప్రమేయం ఉన్నది. గ్రంథాలయోద్యమంలో ఉత్సాహంగా పాల్గొని

కృష్ణాజిల్లా గ్రంథాలయోద్యమానికి అండగా ఉన్నారు. రైతు సంఘాల కార్యక్రమాలలో పాల్గొన్నారు. జాతీయోద్యమంలో పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహంలో సత్యాగ్రహులకు తన యింట్లో ఆశ్రయం యిచ్చినందుకు అరెస్టయి ఆరునెలలపాటు జైలు జీవితం అనుభవించారు.

పాశ్చాత్య సాహిత్యాన్ని, ముఖ్యంగా ఆంగ్ల సాహిత్యాన్ని ఆ సాహిత్య సిద్ధాంతాలను ఆకళింపు చేసుకున్నారు. తంజావూరులోని సరస్వతీమహల్ లైబ్రరీలో రెండునెలల కాలం వెచ్చించి అందులో ఉన్న తెలుగు గ్రంథాల వివరాలను సవిమర్శకంగా తెలుగువారికి అందించిన ప్రథముడాయన. చదువుకునేరోజులనుంచీ మదరాసులో ప్రదర్శించే నాటకాలన్నింటినీ చూశారు. దక్షిణదేశమంతా తిరిగి తమిళ, మళయాళ, కన్నడ, శ్రీలంకలలోని నాటక వ్యాసంగాలను కూలంకషంగా పరిశీలించారు.

ఆయనకు చిత్రలేఖనం అంటే ప్రాణమని చెప్పుకొన్నారు. చిత్రాలను గీయడం చేతకాదుకాని దానిని గురించిన వివేచన చేయడం, అనందించడం నేర్చుకున్నానని వ్రాసుకున్నారు.

స్వయంగా చూసి, కూలంకషంగా అధ్యయనంచేసి, తాను చూసిన చదివిన విషయాలను ఆకళింపు చేసుకొని ఆ విషయాలను తన తరంవారికి చెప్పాలన్న తహతహతో గ్రంథరచనలకు పూనుకున్నారు. సాహిత్యంలో, నాటకంలో, చిత్రలేఖనంలో తనకున్న అనుభవాన్ని తనకు చేతనైన విమర్శనా మాధ్యమంలో తన తరంవాళ్లకు తరువాత తరాలవారికి తెలియచెప్పాలన్న తపన ఆయన అన్ని రచలనకు ప్రేరణ.

బహుముఖీయమైన కళాసంస్కృతుల మేళనమయిన నాటకాన్ని గురించి అంతే బహుముఖీనమైన సాంస్కృతిక మేధోసంపత్తి కలిగిన సూరిశాస్త్రి ఏ రకమైన మొహమాటం లేకుండా చేసిన విమర్శలు సాంస్కృతిక పునరుత్థాన కాల సంస్కృతికి, నిజాయితీగా అద్దం పడతాయి. విస్తృత సాంస్కృతిక కళాప్రాభవం, సాహిత్యశాస్త్ర అధ్యయనం, నాటకసాహిత్యం, నాటకప్రదర్శనల యెడ అభిరుచితో కూడిన వివేచన – ఇవీ సూరిశాస్త్రి విస్తృత సాహితీ, నాటక విమర్శనా గ్రంథాలకు మూలకందం; ఆయన రచనలకు ప్రేరణ. సూరిశాస్త్రి విమర్శనా వ్యాసంగం పది పన్నెండేళ్లిలా సాగింది (1916–1927). ఆ తరువాత ఆయన దృష్టి జీవితోద్యమాలవైపు మళ్ళింది. కాని ఈ 12 సంవత్సరాలలో ఆయన ఆరుగ్రంథాలు రాశారు. "ఆంధ్రనాటక నామావళి" (1916) నాట్యాంబుజము" (1923), "నాట్యోత్పలము" (1924), ''నాట్యశోకము'' (1925–27), ''విమర్శక పారిజాతము" (1925), "ఆంధ్రనాటక సంస్కరణము" (1925). ఇవికాక ఆయన నాటక వ్యాసంగం పలుముఖాల విజృంభించి, నాటకోత్సాహకులకు ప్రేరకశక్తిగా నిలిచింది. 19, 15, 17 సంవత్సరాల మధ్యకాలంలో ఆంధ్రనాటక పరిషత్తు ప్రారంభకులలో ఒకరై, దానికి కార్యదర్శిగా ఉండి 1900–1915 మధ్యకాలంలో వచ్చిన తెలుగు నాటకాల జాబితాను తయారుచేయడమేకాక దానిని అనేక కోణాలనుంచి వింగడించి, విశ్లేషించి అప్పటివరకు వచ్చిన నాటకసాహిత్యాన్ని పట్టికల సాయంతో శాస్త్రీయంగా అధ్యయనం చేయడం ఎలాగో తరువాతి తరాలవారికి చూపించారు.

**నాట్యాంబుజము**

1916 నుంచి 1922 వరకు దేశాటనం చేస్తూ, తాను చూసిన నాటకాలను నటులను అధ్యయనం చేసి తన అధ్యయనం ఆధారంగా నాటకకర్తల, నటుల, నాటక సమాజాల సేవను గురించి ఎప్పటికప్పుడు కృష్ణాపత్రికలోను, గ్రంథాలయ సర్వస్వములోను అవిచ్ఛిన్నంగా వ్యాసాలను ప్రచురిస్తూనే వచ్చారు. ఆ వ్యాసాల సంకలనమే సూరిశాస్త్రి "నాట్యాంబుజం". తాను చూచిన నాటకాలను గురించి ఆ నాటకాల బాగోగులను గురించి ఎంత విస్పష్టంగా, ఎంత నిర్మొహమాటంగా రాశారో చూడనివాటిని గురించి రాయడానికి అంత నిర్మొహమాటంగాను నిరాకరించారు. ఇది ఆయన నిష్పాక్షిక దృష్టికి ప్రత్యక్ష నిదర్శనం.

"నాట్యాంబుజము కళయందభిమానముచే గూర్చబడిన వ్యాసమాలికగాని నాట్యశాస్త్రపు నిగ్గుతేల్చు 'నాట్యశాసనము' కాదు'' అని చెబుతూనే యీ వ్యాసమాలికలో తను అనుసరించిన పద్ధతిని ఇలా వివరించారు.

"ఆంధ్రనాటక సమాజములలో కొన్నిటిని మాత్రమే నేను చూచియున్నాను. నేను చూడని నటులు, నాటకము లెన్నేని కలవు. నా యనుభవము ననుసరించి యీ పొత్తము కూర్చబడినది. ఈ పద్ధతిలో నాంధ్రదేశపు నలుదెసలనుండి నాలుగైదు పుస్తకములిట్టివి వెలువడినగాని ఆంధ్రనాట్య రంగము సంపూర్ణముగ తెలియనేరదు. ఇందులో జేర్చబడని

పెద్దనటులందఱి పరిచయానుభవములు లేనందున విడచితినని మన్నింపవలెను."

("నాట్యాంబుజము", అవతారిక, పే.2).

"నాట్యాంబుజం"లో 'ఎనిమిది దళాలు' ఉన్నాయి. ఇవి అన్నీ నాటకకళను గురించి "ఇంతదనుక తెలుగు పత్రికలలో ప్రచురించిన వ్యాసములు, విమర్శనములు, కొన్నితావులనిచ్చిన యుపన్యాసములు, సంభాషణలలో వెలిబుచ్చిన అభిప్రాయములు" అని చెప్పారు సూరిశాస్త్రి.

ఈ ఎనిమిదిదళాలలో విషయపరంపరను చూస్తే యీ సంకలన గ్రంథం విశేషస్వానుభవ సంపన్నమని యిట్టే తెలుస్తుంది.

| | | |
|---|---|---|
| మొదటి దళము | : | నాటకానుభవము |
| రెండవ దళము | : | ఆంధ్రనాటకములు (పూర్వరూపము) |
| మూడవ దళము | : | నాటక సమాజములు |
| నాల్గవ దళము | : | ప్రసిద్ధ నటులు |
| ఐదవ దళము | : | ప్రదర్శన విమర్శనములు |
| ఆరవ దళము | : | ఆంధ్ర నాటక విమర్శనములు |
| ఏడవ దళము | : | నాటక సమస్యలు |
| అష్టమ దళము | : | నాటక విమర్శనము |

ఈ విషయసూచికను గమనిస్తే నాటకాలను అన్ని కోణాలనుంచి పరిశీలించిన ఒక దిగ్దర్శనం కనిపిస్తుంది. మొదటి అధ్యాయంలో తనకున్న నాటక విలోకనానుభవాన్ని గురించి, ఆంధ్రనాటక పరిషత్తుకు కార్యదర్శిగా ఉండడం, ఆ పదవిలో తాను ప్రచురించిన "ఆంధ్రనాటక నామావళి" అన్న సూచికాగ్రంథాన్ని గురించి వివరించి, తన నేతృత్వంలో జరిపించిన మూడు నాటక పోటీలను గురించి చెప్పి తాను యీ నాటకరంగ విశ్లేషణ చేయడానికి ఏవిధంగా అర్హుఁలో అన్యాపదేశంగా చెప్పారు సూరిశాస్త్రి.

మొదటి అధ్యాయం నాందీప్రాయం అయితే, రెండవ అధ్యాయం ఈ పుస్తకానికి ప్రస్తావన వంటిది. అది పూర్వరంగం. ఆధునిక తెలుగు నాటకానికి పూర్వరూపాలయిన యక్షగాన, వీధి నాటకాలను గురించి వివరిస్తూ 1906-1915 మధ్యకాలంలో ఎటువంటి నాటకాలు ప్రచురింపబడ్డాయో, కథావస్తువు దృష్ట్యా పాతకొత్త నాటకాల రచన ఎలా సాగిందో పట్టికల రూపంలో వివరించారు. 1920 వరకు వచ్చిన నాటకాల సంఖ్యను వివరిస్తూ సూరిశాస్త్రి సరికొత్త సూచన చేశారు.

తెలుగుదేశమున ఎన్ని నాటకసమాజము లున్నదియు అవి యేనాటకము లాడునది తెలిసిన యెడల ఆంధ్రుల నాటకాభిరుచుల దెలుపు మ్యాపులనే గీయవచ్చును. ఇట్టి మ్యాపులను మా సంఘమువారు ప్రచురించి క్యాటలాగులతో బాటు వెలిబుచ్చనుద్దేశించియున్నాము. ఇండస్ట్రియల్ మ్యాపును జూచినచో నేదేశమున కేవిధమైన వస్తువులు కావలసియుండునో తెలియును. అటులనే ఆంధ్రదేశమందలి నానాప్రాంతములలోని నాటక కంపెనీలు, ఆడే ఆటలు, వాని ప్రదర్శనాక్రమములు దెలిపెడి మ్యాపు లుండినచో మనము సులభముగ నచ్చటి ప్రజల రుచులను గుర్తెరిగి పనిచేయ గలుగుదుము.

ప్రేక్షకుల దృష్టితో నాటకాల్ని చూచి, వారి అభిరుచులను బేరీజు వేయవలసిన ఆగత్యాన్ని 1916లోనే గుర్తించారు సూరిశాస్త్రి. అటువంటి వివేచన యీనాటివరకు జరగకపోవడం; సూరిశాస్త్రి నిష్క్రమణతో ఆంధ్రనాటక పరిషత్తు కూడా యీ పనికి పూనుకోకపోవడం, తెలుగువారికి నాటక విమర్శ అంటే ఉన్న నిరాదరణకు ఉదాహరణ.

మూడవ అధ్యాయం "నాటక సమాజములు". ఈ అధ్యాయంలో ఆనాటి నాటకరంగ సమగ్ర స్వరూపాన్ని మనకు అందచేస్తారనుకొన్న వారికి కొంత నిరుత్సాహం తప్పదు. కేవలం చెన్నపురిలోని సుగుణవిలాస సభ, బళ్లారి, మైలవరం, రాజమండ్రి కంపెనీలను గురించి క్లుప్తంగా చర్చించారు. నిజానికి ఒక భాషలోని నాటకరంగ చరిత్ర ఆయా భాషాప్రాంతాల్లో వర్ధిల్లిన నాటక సమాజాలచరిత్రే! అటువంటి నాటకరంగ చరిత్రకు ఎంతో సంక్షిప్తంగా రాసిన - మార్గదర్శకులు సూరిశాస్త్రి.

ఈ గ్రంథంలో అతి విశిష్టమైన అధ్యయనం నాల్గవది - ప్రసిద్ధ నటులను గురించినది. 1900-1920 మధ్యకాలంలో ఎందరో మహామహులైన నటులు ఆంధ్రనాటకరంగాన్ని సుసంపన్నం చేశారు. ఈవెన లక్షణస్వామిగారితో ప్రారంభమైన ఈ నటుల నటనావిధాన విశ్లేషణలో సూరిశాస్త్రి నెల్లూరు నాగరాజారావు, మాగంటి

సుబ్బారావు, మంజులూరి కృష్ణారావు, హరి ప్రసాదరావు, మల్లాది గోవిందశాస్త్రి, ముప్పిడి జగ్గరాజు, పారుపల్లి సుబ్బారావు వంటి నటమూర్ధన్యుల నటనను గురించి శాస్త్రచర్చ చేశారు. ఈ మహామహులంతా ఏదో ఒక నాటక సమాజంలో ప్రధాన భూమికలు ధరించేవారు కావడంవల్ల ఒకరకంగా ఆయా సమాజాలను గురించి పరోక్షంగా వివరించానని సూరిశాస్త్రి భావించి వుండడంవల్ల నాటక సమాజాలను గురించిన విస్తృత చర్చ చేయలేదమోననిపిస్తుంది.

ఈ నటచర్చ జరిపే సందర్భంలోనే సూరిశాస్త్రి ఒక మూలభూతమైన శాస్త్రనిర్వచనం చేశారు. నటులను స్థూలంగా రెండువర్గాలుగా విభజిస్తూ ఒక మౌలికమైన సూత్రాన్ని ప్రతిపాదించారాయన. పింగళి లక్ష్మీకాంతంగారి ధర్మరాజు వేషాన్ని విశ్లేషిస్తూ – "…. లక్ష్మీకాంతము తన నిత్యజీవన పద్ధతుల కనుకూలమైన పాత్రలనే యెక్కువ సామర్థ్యముతో నిర్వహించగలడుగాని లక్ష్మణస్వామి ఘమేరుసింగు భీభత్సమును, నాగరాజారావు పఠాను మతిభ్రమణమును, రాఘవాచారి రామదాసు భక్తి నిశ్చేష్టతను, సంబంధం మొదలియారయాగో కౌటిల్యమును, గోపాలర్సు శకారశ్యాలకత్వమును ప్రకటించునట్లు నిజస్వభావమునకు సంపూర్ణ విరుద్ధముగ నుండు నాటకపాత్రలతో గుణరూప సాదృశ్యమొంది యభినయించలేదు" అన్నారు.

ఈ విశ్లేషణవల్ల మంచినటులలో కూడ రెండు వర్గాలవారుంటారని – ఒకరు తమ నిజగుణరూపాదులను అతిక్రమించి తమ లక్షణాలకు విరుద్ధంగా ఉన్న పాత్రలను కూడా ధరించి మెప్పించగలరని, మరికొందరు తమ నిజస్వరూప స్వభావాలకు సరిపోయిన పాత్రలలో రాణించగలరని సూరిశాస్త్రి నిర్ణయించారు. ఈవెన లక్ష్మణస్వామి, నెల్లూరు నాగరాజారావు, బళ్లారి రాఘవ మొదటివర్గానికి చెందిన మహోన్నత నటులని శ్లాఘించారు.

తరువాతి అధ్యాయంలో కొన్ని నాటక ప్రదర్శనల విమర్శలు చేశారు సూరిశాస్త్రి. ఇందులో రాఘవాచారి బెంగుళూరు ఆమెచ్యూర్ డ్రమాటిక్ అసోసియేషన్ వారి ''రామదాసు'', ''రామరాజ్య వినాశము''ల విమర్శ, డి.వి.సుబ్బారావు "చంద్రహాస", బందరు రాయల్ డ్రమాటిక్ కంపెనీవారి "ముద్రారాక్షస" నాటక ప్రదర్శనలను గురించిన విశ్లేషణలున్నాయి. వీటితోపాటు 1920 ప్రాంతాల ప్రఖ్యాతిగాంచిన "పఠాన్–రుస్తుం" నాటకాన్ని గురించిన తీవ్రమైన విమర్శకూడా వుంది. తాను స్వయంగా శ్రీరామభక్తుడు కావడంవల్ల "రామదాసు" నాటకంలోని కథను, ప్రధాన ఘట్టాల ప్రాముఖ్యతను చాలా విపులంగా సమీక్షించారు ఈ అధ్యాయంలో. ఈ అధ్యాయంలోనే శాస్త్రిగారు నాటకరచన, నటన, ప్రదర్శనలను సమిష్టిగా చూడవలసిన అవసరాన్ని నొక్కి చెబుతూ, అటువంటి సంయోజనాత్మక నాటక విమర్శకు నాంది పలికారు.

ఆరు, ఏడు అధ్యాయాలు సూరిశాస్త్రి తమ సమకాలీన నాటకరంగంలోని ప్రధాన సమస్యలను గురించి పలువురు నాటక నిష్ణాతులు చర్చించిన, లేదా ప్రచురించిన వ్యాసాలను కూడా యిందులో పొందుపరిచారు. ఈ విమర్శకులలో ప్రఖ్యాత రచయితలు, విమర్శకులు – ముఖ్యంగా కోలాచలం శ్రీనివాసరావు, పానుగంటి లక్ష్మీనరసింహారావు, వింజమూరి రంగాచారి, ముత్తరాజు సుబ్బారావులు నాటక ప్రదర్శనలను గురించి, చేసిన నాటక పరీక్షలను గురించి, నాటకాలలో పద్యరచనను గురించి చర్చలున్నాయి.

ఈ అభిప్రాయాల తరువాత సూరిశాస్త్రి పై సమస్యలమీద తమ అభిప్రాయాలను గురించి కూడా చర్చించారు. నాటక పరికరాలు, రంగము, దృశ్యరచనావిధానాలు, దుస్తులు, పద్యముల ఉపయోగము – మొదలైన విషయాలమీద ఆనాటి సమాజాలు అనుసరిస్తున్న పద్ధతులమీద పలువురి వ్యాసాల సారాంశాన్ని వెలువరిస్తూ తమ అభిప్రాయాలను క్రోడీకరించారు.

ఇక చివరి అధ్యాయం "నాటక విమర్శనము". దీనిని నాటక రచనారీతుల అధ్యయనం అనవచ్చు. తెలుగు నాటకాలలో శ్రీకృష్ణ, కర్ణపాత్రల చిత్రణ, "ముద్రారాక్షస" నాయకుని గూర్చిన చర్చ, "చింతామణి" నాటకంలో వేశ్యపాత్ర చిత్రణ, నాటకాలలో కల్యాణాంత విషాదాంత నాటకాలు మొదలైన విషయాలను ఈ అధ్యాయంలో చర్చించారు. వీనితోపాటు "అవి తర్కిక దైవికములు" అనే శీర్షిక క్రింద "దేవతలు నాటకాంతమున వచ్చుటకు కారణములు" అన్న విషయాన్ని చర్చించడం, దానికి సమాంతరంగా ఇతర దేశాల నాటక పద్ధతులను ఉటంకించడం చూస్తే సూరిశాస్త్రి నాటక పరిజ్ఞానం ఎంత విస్తృతమైందో అవగతమవుతుంది. 'సారంగధర' నాటకంలో నాటకాంతాన సిద్ధుడు వచ్చి

"సారంగధరునికి తిరిగి కాలుసేతుల నతికించుట–" ఇటువంటి వాటిలో ఒకటి. 'గయోపాఖ్యానం'లో శివుడడ్డపడి 'నరనారాయణుల సమరసంరంభ సన్నాహమపనయించు' చున్నాడన్నది వేరొకటి. ఈ ఉదాహరణల ఆధారంగా "ఈవిధముగా మనదేశములోని నాటకాలనేకములందు పాత్రలు నిజస్వరూప పరిణామానురూపములగు సుఖదుఃఖముల పతనౌన్నత్యముల మంచిచెడ్డలనుభవింపక తుదకెద్దియో యొక యసంభావిత, యచింతిత దైవికముచే సత్ఫలమొందుచున్నారు" అనే సత్యాన్ని ఉల్లేఖించారు. పాశ్చాత్య నాటక విమర్శ రీతులెరిగి, గ్రీకు నాటకాలలో కనిపించే divine machine యిటువంటిదేనని నిరూపించారు. ఇది విస్తృతమైన నాటకరంగ పరిశీలన ఉంటేకాని స్ఫురించే విషయం కాదు. ఇటువంటి అనేక నాటకరంగ విషయాల సమగ్ర వివేచన వీరి గ్రంథంలో కనిపిస్తుంది. నాటక విమర్శకునికి అవసరమైన సంయోజనాస్ఫూర్తికల కళావైశద్యం ఈ గ్రంథవిమర్శలో మనకు అడుగడుగునా అవగత మవుతుంది. అలాగే నాటకానికి నాటకరచన ఎంతముఖ్యమో, నాటక ప్రదర్శన కూడా అంతే ముఖ్యమని, ప్రదర్శనలోని నటీనటబృందం అంతా కలిసి నాటక విజయానికి సమిష్టి కృషి చేయడం అవసరం అన్న విషయాలను మనకు మరోసారి జ్ఞాపకం చేశారాయన. తెలుగు సమగ్ర నాటకవిమర్శకు సూరిశాస్త్రి గారి "నాట్యాంబుజం" ఒక శాస్త్రబద్ధమైన దిశానిర్దేశం చేసిందని చెప్పవచ్చు. ❁

## ఉత్తమ చిత్రం

**ఉ**జ్జయినిలో గొప్ప శిల్పి, చిత్రకారుడు వుండేవాడు. ఆ దేశపు చక్రవర్తి ఒక రోజు ఆ శిల్పిని పిలిపించి తన కొక ఉత్తమ చిత్రాన్ని రచించి ఇవ్వమన్నాడు. కావలసిన పారితోషికాన్ని స్తానన్నాడు. ఆ శిల్పి అందుకొక సంవత్సరం గడువు కోరాడు. చక్రవర్తి అందుకంగీకరించాడు. సంవత్సరంనాటికి చిత్రం పూర్తికాకపోతే మరణదండన ఖాయపడింది. ప్రభువు పంపే పదార్థాలన్నిటినీ చక్కగా తింటున్నాడు. తిరుగుతున్నాడు ఆ శిల్పి. కాని ఎప్పుడూ చిత్రించినట్లు ఎవరూ చూడలేదు. ఆరు మాసాలయింది. చక్రవర్తి కబురు పంపించాడు. చిత్రం ఎంతవరకయిందో చెప్పమని. కాని ఇంకా ప్రారంభించలేదని జవాబు. తొమ్మిది నెలలయింది. నవమాసాలొచ్చినా చిత్రం ఇంతవరకూ జన్మించనేలేదు. మిగిలిన మూడు మాసాలు కూడ సమీపించినాయి. కాని చిత్రం మాత్రం మొదలైనా పెట్టబడలేదు. ఇక రేపే గడువు. కాని శిల్పి దగ్గర చిత్రమే లేదు. నగర వాసులంతా శిల్పికి మరణమే శరణ్యమనుకొంటున్నారు. ఇంత వరకు చిత్రం తయారుకాకపోగా దాన్ని ప్రారంభిచను కూడా లేదని చక్రవర్తి కోపోద్దీపితుడై రేపటి గడువుకు శిల్పికి మరణదండన విధించటానికి సిద్ధంగా వున్నాడు. తెల్లవారింది. చిత్రాన్నివ్వాల్సిన గడువదే. రాజదర్బారులోకి శిల్పి ప్రవేశించి తన వెంట తెచ్చిన అద్భుతమైన ఒక గొప్ప చిత్రాన్ని ప్రదర్శించాడు. చక్రవర్తి, సభలోవున్న వారంతా దాన్ని చూచి చకితులయిపోయారు. చక్రవర్తి పరమానంద భరితుడయినాడు. నిన్న సాయంత్రం వరకు ప్రారంభించని ఇంత పెద్ద చిత్రాన్ని ఎప్పుడు తయారు చేశావని ప్రశ్నించాడు చక్రవర్తి. శిల్పి జవాబిచ్చాడు:

'రాజా! ఈ చిత్రాన్ని రాత్రి పూర్తిచేశాను. ఈ సంవత్సరం నుండి మనో చిత్రాన్ని తయారు చేసుకోవటమే సరిపోయింది. నిన్నటికి ఆ మనో చిత్రం పరిపూర్ణత చెందింది. రాత్రి ఆ మనోచిత్రాన్ని ఈ పట్టుగుడ్డపై ఉంచాను. భౌతిక రూపాన్ని నిర్మించటానికంటె మనో రూపాన్ని నిర్మించు కోటం కష్టతరమైన ప్రక్రియ. మనో చిత్రం పూర్తి అయితే, దానికి భౌతిక రూపాన్ని ప్రసాదించటానికి ఎక్కువ సమయం అవసరంలేదు.'

ఇదే జీవన రంగంలో కూడా వర్తిస్తుంది.



# నన్ను ప్రభావితం చేసిన పుస్తకం

*- వాడ్రేవు వీరలక్ష్మీదేవి*

ప్రభావం అన్న మాటే ఎంతో విలువయిన మాట అనిపిస్తుంది. శక్తిని ప్రవహింపజేసే మాట కూడా. జీవితంలో మనని ప్రభావితం చెయ్యగల వ్యక్తులు, అటువంటి శక్తి వంతమయిన పుస్తకాలు దొరకడం ఎంతో గొప్ప సంగతి. అది మనకు పట్టిన మహాదృష్టం.

నా చిన్నతనంలో నన్ను ఆకర్షించిన మొదటి పుస్తకం నాలుగో తరగతి తెలుగు వాచకం అని గుర్తు. అందులోని *జీమూత వాహనుడి కథ* నాకు ఇప్పటికీ అద్భుతమే. అప్పటి నుంచీ ప్రతీఏటా చదువుకునే తెలుగు వాచకాలూ, అందులోని గొప్ప గొప్ప కథలూ వెన్నంటి ఉండేవి. పానుగంటి నరసింహారావుగారి సాక్షివ్యాసాలు ఎంతో ఉత్తేజకరంగా ఉండేవి– ఆ భాష, వ్యంగ్యం, విమర్శ, హాస్యం అన్నీ కలగలిసిన ధార – పాఠ్యభాగాలుగా పెట్టిన ఆ వ్యాసాలు ఇప్పటికీ కంఠస్థమే.

తెలుగు వాచకాలు చదువుకునే రోజుల నుంచి, తెలుగే సర్వస్వంగా చదువుకుని, తెలుగు సాహిత్యమే పాఠాలుగా చెప్తూ ఉండగానే రోజులు గడిచాయి. ఆ విధంగా సంవత్సరాలకి సంవత్సరాలు వెలిగేయి. ఎన్నో ఇబ్బందుల లోంచి, వడిదుడుకులలోంచి సాగే జీవితాన్ని సారవంతం చేసాయి ఎన్నో పుస్తకాలు. అదే లేకపోయి ఉంటే ఈ జీవనం లోంచి చేదు తప్ప మరే రుచీ ఆస్వాదించడం తెలిసి ఉండేది కాదు. మహానుభావులయిన ఎందరో కవులు, రచయితలు ఈ జీవితంలోని శోభాయమానమయిన పలువర్ణాల కాంతుల్ని చూపిస్తూ వాటి సమ్మేళనం వల్ల కలిగే స్వచ్ఛ శుభ్రమయిన ధవళ సరస్వతీరూపాన్ని కూడా ఆనందం రూపంలో సాక్షాత్కరింప చేయగలరు, చేశారుకూడా. ఇంత మందిలో, ఇన్ని పుస్తకాలలో ఏ ఒక్కదాన్ని బయటకు తీసి *దీని ప్రభావం నా మీద అమితంగా ఉంది* అని చెప్పగలను? ఈ ఆలోచన చాలా రోజులుసాగింది. నిజానికి ఒక చిన్న కవిత, చిన్న కథకూడా నా మీద ఎంతో ప్రభావం చూపిన జ్ఞాపకాలున్నాయి. జీవితంలో వెన్నంటి వస్తూ ప్రతి సందర్భంలోనూ దారి చూపిన కథలున్నాయి. మునిపల్లె రాజుగారి *సవతి తమ్ముడు* కథ అలాంటిది. ఆ కథ నా మీద చాలా ప్రభావం చూపించింది. ఎంతటి అపకారం చేసిన వాళ్ళనైనా సరే ద్వేషించకుండా ఉండే ప్రయత్నం చెయ్యవచ్చుని ఆ కథ ఎంతో శక్తివంతంగా, ఒప్పితంగా చెప్తుంది. పాలగుమ్మి పద్మరాజుగారి *హెడ్‌మాస్టారు* కథ బలమైన ప్రభావం వేయగల మరో కథ. గొప్ప వ్యక్తులు మన జీవితంలో తారసపడితే వారు మన మీద తమ ప్రభావం ఎలా చూపగలుగుతారో – మనం ఎంత జులాయిగా ఉన్నా కొన్ని అవసరమైన సందర్భాలలో వారి ప్రభావం వల్ల ఎంత పెద్దతరహాగా పనులు నిర్వహించగలమో! అద్భుతంగా చెప్తుంది ఆ కథ. *హెడ్‌మాస్టారు* అన్నపేరులోనే ఎంతో సున్నితమైన సూచన చేస్తూ పద్మరాజుగారు ఆకథ రాశారు.

ఇలా చెప్పుకుంటూ వెళ్తే లెక్కలేనన్ని కథలు, ఎన్నెన్నో నవలలు వచ్చి పడతాయి.ఈ ప్రవాహం అంతు లేకుండా సాగుతుంది. గొప్పసాహిత్యం జీవితంలో భాగమైతే ఆ మనుషుల ప్రపంచమే వేరుగా ఉంటుంది. అయితే వీటన్నిటి వెనుకా మూలసూత్రం లాంటి దేదో ఒక గొప్ప పుస్తకం కూడా ఉండితీరుతుంది. జీవితానికి అది ఒక లక్షణ గ్రంథం లాంటి దని చెప్పుకోవచ్చు.

అలా నా పదిహేనవ ఏట నా అదృష్టవశాత్తూ నా చేతిలోకి వచ్చిన చలంగారి మొదటి పుస్తకం *స్త్రీ*. అదృష్టవశాత్తూ అని ఎందుకంటున్నానంటే, చాలా మంది *మైదానం* పుస్తకంతో మొదలు పెట్టారు. అందులో ఎంతో మంది అక్కడే ఆగిపోయారు కూడా. నాకు దొరకలేదు. *స్త్రీ* పుస్తకం తర్వాత *ప్రేమలేఖలు*, *మ్యూజింగ్సు* చదివాను. *స్త్రీ*

వాడ్రేవు వీరలక్ష్మీదేవి, ఫోన్: 9848016442

పుస్తకం మాత్రం ఇంచు మించు ప్రతి సందర్భంలోనూ చదువుతూ వచ్చాను. అప్పటికీ ఇప్పటికీ నా ఆలోచనల మీద, జీవిత విధానం మీద ఎప్పటి కప్పుడు అవసరానికి తగినట్టుగా ప్రభావం చూపిస్తూ నన్ను ప్రభావితం చేస్తూ వచ్చిన పుస్తకం స్త్రీ పుస్తకమే అని అర్థమవుతోంది ఇప్పుడు ఆలోచించుకుంటూ ఉంటే. ఎవరయినా సరే చలంగారి సమస్త కల్పనాత్మక సాహిత్యమూ చదవడానికి ముందు ఈ పుస్తకం చదివి తీరాలి. ఇందులో అనేక విషయాల మీద ఆయన తన అభిప్రాయాలూ, ఆలోచనలూ స్పష్టంగా రాశారు.

కల్పనా సాహిత్యంలో ఎప్పుడూ ఆ స్పష్టత ఉండదు. ఉండకపోవడమే కవితాత్మక లక్షణం కూడా. వాచ్యార్థాన్నిమించిన వ్యంగ్యార్థమే కదా కవితాత్మకతకు ప్రాణం. అయితే ఆయన సమాజంలో పాతుకునివున్న పాతవాటి వెలిసిపోయిన తనాన్ని కడగడమే లేదా కరిగించి బద్దలు కొట్టడమే ధ్యేయంగా పెట్టుకుని రాసింది కూడా తక్కువేమీ కాదు కాబట్టి విశృంఖల చక్రవర్తి గానే అర్థమవుతూవచ్చారు. చలం స్త్రీ పుస్తకం ఇది స్త్రీల-విముక్తి-స్వేచ్ఛలకు సంబంధించిన పుస్తకమే అనే ఎక్కువమంది అభిప్రాయపడతారు. అందులో మొదట్లో రాసిన స్త్రీకి శరీరం ఉంది. దానికి వ్యాయామం కావాలి- అన్న వాక్యాలనే పదేపదే చెప్పుకుని అక్కడే ఆగిపోతారు. ఈ వేళ ఈ మాటలు స్త్రీ పురుషులిద్దరికీ కూడ అవసరమని నేను భావిస్తున్నాను. ఎందుకంటే శరీరము, మేధ, మనసు తాలూకు అన్ని స్పృహలు పోయిన జడత్వంలోకి జాతి మొత్తం జారిపోతూన్న ప్రమాద సూచిక కనిపిస్తోంది.

అదలా ఉంచితే స్త్రీ పురుషులిద్దరూ తమ జీవితాలను ప్రకాశవంతం చేసుకోడానికి దారి చూపగల పుస్తకం ఇది అని నాకు అర్థమయింది. మన చుట్టూ ఉన్న సమాజానికి నచ్చేలా బతుకుతూ దాని మెప్పు పొందడం కోసం మనది కాని జీవితం మనం ఎలా జీవిస్తున్నామో చెప్పడమే ఆయన ఇందులో చేసిన పని. అది తప్పా? ఒప్పా? వేరే విషయం ముందు మనలోని ఆ *లోకపరత్వం* వల్ల మనం ఎంత కపట జీవనం జీవిస్తున్నామో గుర్తుపెట్టుకోమన్నాడు. ఈ పుస్తకం చాలా ముద్రణలు పొందింది. చలం ఆంధ్రదేశంలో ఉన్నంత కాలమూ ప్రతిసారీ దానికి ముందు మాటలు రాస్తూ వచ్చారు. ఇప్పుడు దొరికే పుస్తకంలో అయిదు ముందు మాటలు న్నాయి. పుస్తకంలోని మిగతా అంశాలన్నీ అలా ఉంచి, ఈ అయిదు ముందు మాటల్లోనే చలాన్నీ, మననీ కూడా మనం అర్థం చేసుకో గలుగుతాం. ఐతే ప్రతివాక్యమూ శ్రద్ధగా చదవాలి. అదే విధంగా నిజాయితీగా మననీ గమనించు కుంటూ ఉండాలి. మొదటి ముద్రణకు రాసిన ముందు మాట తర్వాత



పదినేహేనేళ్లకి రెండోముద్రణలో "ఈ పదిహేనేళ్ళలో చాలా దూరం ప్రయాణం చేశాను. లోపల బయట కాదు. ఏళ్లలో కాక మనసులో ఎదిగే వాళ్లకి ఈ ఆయాసప్రయాణాలు తప్పవు". అని రాశారు. ఈ మాట ఒక వయసులో నా మీద చాలా ప్రభావం చూపింది. మనసులో ఎదగడమనే అంశం గురించి ఆలోచింపచేసింది. మనసును ఉల్లాసంగా ఉంచుకోవడమూ, విశాలం చేసుకోవడమూ, ఎదిగేలా చెయ్యడమూ అన్న మూడు, మూడంశాలని తెలిసేలా చేసింది.

"మతాన్ని గురించీ, నీతిని గురించీ నా భావాలు విశాలం చేసుకున్నాను. కానీ, మతమూ, నీతీ, వేదాంతమూ మాట్లాడే మనుషుల్ని ఏ మాత్రమూ నమ్మవద్దనీ, వాళ్ల దగ్గర మతమూ, నీతి ఏ మాత్రమూ లేవనీ హెచ్చరిస్తూన్నాను". ఈ మాటలు కూడా నన్ను తక్కువ ప్రభావితం చెయ్యలేదు. స్త్రీ పురుషానుభవం అమూల్యమని శృంగారపు విలువలలో నమ్మి ఆ విలువ ద్వారా జీవితాలను వెలిగించుకోగల దీక్ష ఉన్నవారి కోసమే తన మొత్తం కాల్పనిక సాహిత్యం రాసానని, తన స్వేచ్ఛాబోధని సరిగా అర్థం చేసుకోలేక తప్పుఅర్థం చేసుకునే వారికి వివాహబంధం చాలా అవసరమనీ స్పష్టంగా చెప్పాడు.

మనం ఏ కోవకి చెందగలమో తెలుసుకుని ఆ విధంగా ఉండగల స్వేచ్ఛ మనకి ఉంది. "సంఘ నీతుల్ని చాటుగా దొంగతనంగా కాక, మనసు మీది ప్రేమవల్ల, సంఘం మీది అభిమానం వల్ల ఎదిరించగల ధీరులు అవసరం". అని కూడ చెప్పాడు. అలా చెయ్యలేకపోతే సంఘనీతి నియమాలకి కట్టుబడి ఉండమనే హెచ్చరిక కూడా నాకు అర్థమయింది. "నాగరికత హెచ్చిన కొద్దీ పనులూ, ధ్యాసలూ, ఆశలూ ఎక్కువయినకొద్దీ మనుషుల్నీ మనుషులుగా గుర్తించుకోవడం

తగ్గిపోతోంది". 1945లో రాసిన ఈ మాట ఇవాళ ఉన్నసమాజానికి ఇంకా బాగా సరిపోతూంది. మనుషుల కోసం పనులు చెయ్యాలిగానీ పనుల కోసం మనుషుల్ని వాడుకోకూడదనే అర్థం చెప్తోంది ఈ మాట. ఇది బాగా అర్థమయిన కొద్దీ నా స్నేహాలూ, బాంధవ్యాలూ పదిలంగా ఉంచుకోవటం ఎలాగో తెలుసుకుంటూ ఆ ప్రయత్నం చెయ్యగలుగుతున్నాను. లోకంలో ఇన్ని సమస్యలుండగా మీరు స్త్రీ పురుష సంబంధాల సమస్య గురించే ఎందుకు మాట్లాడతారు? అనే ప్రశ్నకు చలంగారు ఇలా సమాధానం చెప్పారు.

"ఈ లోకంలో ఏ ఒక్క సమస్య తీరినా తక్కినవన్నీ తీరినట్టే. ఎందుకంటె సమస్య అనేది బైట కాక మనిషి లోపల ఉంది గనక". మనస్తత్వశాస్త్రవేత్తలు, వ్యక్తిత్వ వికాస నిపుణులు ఇవాళ చదివే మంత్రాలు నాకు ఎప్పుడో స్త్రీ పుస్తకంలో ఇలా దొరికేయి.

స్వేచ్ఛ, బయటి స్వేచ్ఛ- లోపలి స్వేచ్ఛ అని రెండు రకాలు అని విడదీసి బయటి స్వేచ్ఛకి కావలసిన ముఖ్యమయిన అవసరాలలో డబ్బు ఒకటి అని ఆనాడే చెప్పారు. ఇది చదవని వాళ్ళు చలంగారు స్త్రీకి అతిముఖ్యమయిన ఆర్థిక స్వేచ్ఛ గురించి ఏమీ మాట్లాడలేదంటారు. చలం తన ఫిక్షన్ అంతటా లోపలి స్వేచ్ఛ గురించే చెప్పారన్న విషయం గుర్తించక. స్త్రీ పురుష వివక్ష అతి స్పష్టంగా చూపించే కుటుంబాలలో పుట్టి పెరిగిన ఆనాటి మాలాంటి మధ్య తరగతి ఆడపిల్లలకి ఆర్థిక స్వేచ్ఛ గురించి ఆయన చెప్పిన మాట తారక మంత్రంలా పనిచేసింది. చదువుకుని ఉద్యోగం చెయ్యటం ధ్యేయంగా పెట్టుకున్న తరంమాది. ఆర్థిక స్వేచ్ఛ అవసరం తెలిశాక, అది సంపాదించుకున్నాక లోపలి స్వేచ్ఛ గురించి కూడా చలం నన్ను ఆలోచింపచేశాడు. పురుషాధిపత్య భావజాలం నుంచి బయట పడ్డాక డబ్బుకీ, అధికారాలకీ, ఫ్యాషన్‌కీ, మర్యాదకీ, అవినీతికీ, సక్సెస్‌కీ బానిస కాకుండా ఉండగల మానసిక స్వేచ్ఛ గురించి కూడా చెప్పి ఆలోచింప చేశారు. ఈ లోపలి స్వేచ్ఛ సంపాదించడానికి జీవిత మంతా ప్రయత్నం చేస్తూ ఉండవలసిన అవసరాన్ని గురించి కూడా చెప్పాడు. ఎన్ని ఉన్నా వాటన్నింటిని మించి మనిషి కోరుకునే 'స్థిమితం' కోసమే ఈ ఆలోచనలన్నీ. స్వేచ్ఛ వల్ల సుఖమూ, శాంతీ, ఆత్మవైశాల్యమూ కలగాలనే మాటను మరీ మరీ మననం చేసుకునేలా చేశాడు. అవి కలిగించలేని స్వేచ్ఛ అనవసరమని కూడా చెప్పాడు. చివరిగా నాలుగోసారి రాసిన ముందు మాటలో చెప్పిన కొన్ని వాక్యాలు ఎప్పుడూ నా మనసులో మెదులుతూ నా కాలాన్ని చైతన్యవంతం చేస్తూ ఉంటాయి. అవి ఇవి.

"ఈ ప్రపంచ మహావృక్షంలో మనిషి ఒక ఆకు. ఆకు తాను విడి కాదనీ తన జీవనం, తన అందం ఎండలో ఆడే సంతోషం అన్నిటికీ మూలం చెట్టు వేరులోంచి వచ్చి తనను నింపే జీవన రసమనీ తెలుసుకున్న కొద్దీ ఆ ఆకుకి వర్చస్సు, పుష్టి, సంతుష్టి, తనకీ, సృష్టిలోని ప్రతిదానికీ మనుషులకీ, చెట్లకీ, జంతువులకీ బైట కనపడే సంబంధం కాక అసలు వీటన్నిటి ఉత్పత్తిలో ఉండే సంబంధాన్ని తెలుసుకున్న కొద్దీ జీవితానికి అందమూ, అర్థమూ, సార్థకతా వ్యక్తమవుతాయి. పై పొరల్లోంచే, ఈ తేలిక స్నేహాల్లోంచీ ఎంతవరకూ ఉపయోగం అనే దృష్టిలోంచి, స్వార్థపరమైన సంబంధాల లోంచి మనసు తప్పుకుని లోతైన బాంధవ్యానికి దగ్గరైన కొద్దీ....కళ్లు కొత్త కాంతికీ, సామరస్యాలకీ తెరుచుకుంటాయి."

ఇంతకన్న సోషలిజం ఎక్కడుందనిపించింది. ఈ వాక్యాలు చదివినప్పుడు నేను రాసిన మొదటి వెన్నెలముగ్గు ఇతివృత్తం మీద చలం భావాల ప్రభావం ఉంది. ఏదయినా అలవాటు కావడంలో కొత్తదనం పోతుందని, జీవనంలో యాంత్రికత ప్రవేశిస్తుందని, సూర్యోదయంలాంటి అద్భుతం కూడా రోజూ చూడడం వల్ల సాధారణం అయిపోయిందని చెప్పారు ఆయన.

ఇందువల్ల స్త్రీ పురుషుల మధ్య ఉండవలసిన అపురూపం పోయి భార్యాభర్తల సంబంధాలు రొటీన్ అయిపోతాయి. అలా రొటీన్ కాకుండా ఉంచుకోగల నేర్పు సంపాదించుకుంటే సంసారాల్లో భార్యాభర్తల అనుబంధాలు ఎప్పటికీ కొత్తవిగానే ఉంటాయని వెన్నెలముగ్గు కథ చెప్తుంది. చలం రచనలు చదివిన ప్రభావం. నా వాక్య నిర్మాణం మీద, నేనేమిటి? చలాన్ని బాగా చదివిన వారందరి మీదా ఉంటుంది. వారందరూ చదివింపజేసే సరళమైన తెలుగు వాక్యం రాయగలుగుతారు. పుస్తకాలు సరే ఈ సమాజం లోని గొప్ప వ్యక్తులు కూడా నా ఆలోచనల మీద స్పందనలమీద వారి ప్రభావాన్ని చూపగలిగేరు. వారిలో మొదటి వ్యక్తి మా నాన్నగారు. ఆయనది చాలా దృఢమైన వ్యక్తిత్వం. హృదయం

నిండా ఎంతో ప్రేమ–జీవితకాలమంతా గిరిజన గ్రామాలలో గ్రామాధికారిగా పనిచేశారు. నిజమైన అర్థంలో గిరజనులను ప్రేమించారు. "వాళ్లు ఋషీశ్వరులలాంటి వాళ్లు" అనేవారు. మేం కూడా బాల్యకాలమంతా గిరిజనులతో కలిసి మెలిసి తిరుగుతూ కాలం గడపటం వల్లా, మా నాన్నగారు చెప్పగా తెలిసిన ఎన్నో విషయాల కారణంగానూ నేను *కొండఫలం, బినామీ, పేరెంటో* లాంటి కథలు రాయగలిగాను. ఇప్పటికీ ఆ ఊళ్లకి వెళ్తె ఒంట్లో కొత్త నెత్తురు ప్రవహిస్తుంది. కాస్త భావుకత, మరికాస్త సాహిత్యజ్ఞానమూ కలగలసిన వయసులో నాకూ మా తమ్ముడికీ కూడా దొరికిన అపురూప వరం మా గురువుగారు మల్లంపల్లి శరభేశ్వర శర్మగారి శిష్యరికం. సాహితీ జగత్తులో ఆయన ఒక అద్భుతం *ఎప్రీసియేషన్* అన్న విద్యను ఆయన మాకు అనుగ్రహించారు. రుచిచూసి, అభిరుచి అనేగీటురాయి మీదకు తెచ్చి పరీక్షలో నిగ్గుతేల్చి చూడగల చూపును ఆయన మాకు నేర్పారు. ఇస్మాయిల్ చెప్పినట్టు "మా కళ్లమీది కటకటాల్ని తన కుంచెతో చెరిపేసి" మా భావాలకు ఎగరగలగడం నేర్పారు. ఆ విద్యను ఇంకా ఇంకా పదును పెట్టుకోవడమే జీవితంలో ప్రధానమైన పనుల్లో ఒకటి అని అనుకుంటూ ఉంటాను. ఇంత రాశాక మా చిన్న తనంలో ఆధునిక సాహిత్యాన్ని మాకు పరిచయం చేసిన మరొక వ్యక్తి గురించి చెప్పక తప్పదు. ఆయన ఎన్నో మంచి పుస్తకాలను మంచి వ్యక్తులను మాకు చూపించి మా సాహిత్యాభిరుచి పెరగడానికి దోహదం చేశారు. వారి పేరు భమిడిపాటి జగన్నాథరావుగారు.

తేనెటీగ ప్రతి పూవు నుంచి మకరందాన్ని సంపాదించి తెచ్చి తన పట్టులో దాచుకుంటుంది. నేను కూడా ప్రతి మంచి పుస్తకం వల్లా ప్రభావితం అవుతూ వచ్చాను. తేనెటీగలా కాకుండా ఈ దాచిన మధుకోశం నుంచి నా అనుభవ సారాన్ని మరెంతో మందికి రుచి చూపించి పంచుకోవాలని ఆశపడుతూ ఉంటాను. దానికి కారణం కూడా నన్ను ప్రభావితం చేసిన ఈ పుస్తకాలూ, ఈ మహానుభావులే. ప్రభావితం కావడం అన్నది కూడా ఎంతో విలువైన మాటే. ప్రభావితం కావడానికి మన లోపలి తలుపులన్నీ తెరిచి ఉంచుకోవాలి అలా కాకుండా మూసి ఉంటే అంతా చీకటే. ⓜ




# మిసిమి
మాసపత్రిక

## చందాదారులుగా చేర్పించండి
# బహుమతి
పొందండి!

**మీ** ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా. మీకు ప్రియమైన వారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యం కదా. వీరందరికీ మీరు *మిసిమి* ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. మీరు కోరిన గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం **మిసిమి**కి చందా **₹240** పంపండి (వారి పూర్తి చిరునామాతో). ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపికచేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే – మంచి సారస్వతంతో...

ఈ క్రింది పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి

| | | ₹ |
|---|---|---|
| 1. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 2. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 3. | VEMANA - Through Western Eyes - *V.R. Narla* | 50.00 |
| 4. | THE FIRST POETICAL READER (Walter Joyes and N.C. Sashacharloo) | 50.00 |
| 5. | వేమన ఉపదేశామృతం – *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |
| 6. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |
| 7. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |
| 8. | అమాహ (కథలు) వి. అశ్వినీకుమార్ | 60.00 |
| 9. | అంతర్వీక్షణం (వ్యాసాలు) " " | 60.00 |
| 10. | నాలో నేను (కవితలు) " " | 60.00 |
| 11. | సిద్ధార్థ " " | 50.00 |

మీ చందా *మిసిమి* పేర ఈ క్రింది చిరునామాకు పంపండి

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine: www.kinige.com/misimi



# ఉస్తాద్ బడే గులాం ఆలీఖాన్

*- మంతెన సూర్యనారాయణరాజు*

**ఉ**స్తాద్ బడేగులాం ఆలీఖాన్ ప్రసిద్ధ సంగీత విద్వాంసుల వంశంలో జన్మించారు. ఆయన పాకిస్థాన్‌లోని లాహోర్‌లో 1902 ఏప్రిల్ 2న జన్మించారు. గులాం ఆలీఖాన్ ముత్తాతగారు మహారాజు రన్‌జిత్ సింగ్ ఆస్థాన గాయకుడు. ఈయన తండ్రి, ఆలీబక్ష్ ఖాన్ అప్పటికే ప్రముఖ గాయకుడు. చిన్ననాటి నుంచే సంగీతంలో గులాం అలీఖాన్‌కి అభిరుచి ఏర్పడింది. తన పినతండ్రి కాలేఖాన్ దగ్గర బాల్యంలో సంగీత విద్యాభ్యాసం జరిగింది. గాయక వంశం, తండ్రి తాతలు రాజాస్థాన సంగీత విద్వాంసులు కావడం వల్ల ఏడేళ్ల వయసు నుంచే సంగీత సాధన మొదలు పెట్టారు, గులాం ఆలీ. మొదట్లో హిందూస్థానీ సంగీతంలో పాటలు పాడటంతో బాటు 'సారంగి' అనే వాద్య పరికరాన్ని కూడా వాయించేవారు. ఆయనకి 16 ఏళ్ళు వచ్చేటప్పటికి దురదృష్టవశాత్తు ఖాన్ పినతండ్రి చనిపోయాడు. అప్పుడు తండ్రి దగ్గరే హిందూస్తానీ సంగీత విద్యాభ్యాసం కొనసాగించాడు.

ప్రిన్స్ ఆఫ్ వేల్స్ మన దేశానికి 1922లో వచ్చినపుడు బడేగులాం తన గానం వినిపించారు. అప్పటినుంచీ ఆయన మధురగానలహరి ఉవ్వెత్తున ఎగిసే కడలి తరంగమై భాసిల్లింది. 1924లో భారత్‌లో, లక్నో నగరంలో గొప్ప సంగీత పరిషత్ జరుగుతున్నది. అందులో తండ్రి అల్లా బక్ష్‌ఖాన్ సమక్షంలో బడేగులాం గానం చేశారు. ఆ పోటీలో ఖాన్ ప్రథముడుగా ఎంపికై, బంగారు పతకాన్ని స్వంతం చేసుకోగలిగారు. ఆ విధంగా చాలా కాలంపాటు స్వంత రాష్ట్రంలోనే కచేరీలు జరుపుతూ వచ్చారు గులాం ఆలీ.

1939లో కలకత్తా నగరంలో అఖిల భారత సంగీత మహాసభ జరిగింది. ఆ సందర్భంలో ఖాన్ అద్భుతంగా పాడి, యావత్‌భారత కీర్తి సంపాదించుకోగలిగారు. ఆ తరువాత వరుసగా ఆయన గయలోను, 1944లో బొంబాయిలోను తన సంగీత కచేరీల ద్వారా ఘనసన్మానాలకు పాత్రులయ్యారు. ఆనాటి నుండే అఖిల భారత మహాగాయక శ్రేణిలో ఖాన్ గారికి స్థానం ఏర్పడింది. సంగీత సామ్రాట్ వంటి బిరుదుల జల్లు కురిసింది.

బొంబాయిలో సత్కారం అనంతరం అదే సంవత్సరం అలహాబాద్, పాట్నా, రాజషాహి పరిషత్తులలో ఆయన గౌరవ, సత్కార, సన్మానాల నెన్నింటినో పొందారు. అదీగాక ఆయన సంగీత శాస్త్రవేత్త అయిన కారణాన *స్వరమండల్* అనే ఒక జంత్ర వాద్యాన్ని శాస్త్రోక్తంగా నిర్మించారు. 1945లో గాంధీ మహాత్ముని సమక్షంలో ఖాన్ తన ప్రతిభావ్యుత్పత్తులతో భజన గీతాలను ఆలాపన చేసి ఆయన అభినందనలను పొందగలిగారు. బడేగులాం హిందుస్థానీ గానానికి మంత్ర ముగ్ధులైన ఆఫ్ఘన్ సుల్తానులు నాదిర్‌షా, ఆయన కొడుకు జార్జిఖాన్ అమితంగా ఆనందించి ఎన్నో విలువైన కానుకలు సమర్పించుకున్నారు. వీరిని తమ దర్బారులో ఆస్థాన విద్వాంసులుగా ఉండిపొమ్మని బ్రతిమలాడారు. అందుకు అంగీకరించక భారతీయ సంగీత సాంప్రదాయం పట్ల తన భక్తి విశ్వాసాల వల్ల తిరిగి భారతదేశం వచ్చేసారు. వీరు మంద్రస్థాయిలో మేఘ్‌మల్హార్ రాగాలాపన ప్రారంభించి కంఠనాదంలోనే మేఘగర్జనలు ప్రదర్శించగల మేటి గాయకుడు అని చెప్పుకునేవారు.

1953లో ఆయన మన దక్షిణాది రాష్ట్రరాజధాని మద్రాసులో కచేరీ చేసినప్పుడు *హరి: ఓం తత్సత్* అనే వేదవాక్యాన్ని తనకు ఇష్టమైన రాగాలలో ఒక్కటైన *బేహాగ్* (భాగ్‌శ్రీ) రాగంలో ఆలపించినప్పుడు అది తారాస్థాయిని అందుకున్నప్పుడు శ్రోతలు తన్మయులైపోయారు. ఆనాటి ముఖ్యమంత్రి చక్రవర్తుల రాజగోపాలాచారి శ్రోతల మధ్యనుండి లేచి వెళ్ళి వేదిక నెక్కి అశ్రుపూరిత నయనాలతో

ఖాన్‌ను ఆలింగనం చేసుకున్నారట. ఇంతకన్నా గౌరవం ఏ కళాకారుడికైనా ఏం కావాలి చెప్పండి. దేశవిభజన తర్వాత ఆయన లాహోరు వాడు కావటం వల్ల పాకిస్థాన్‌లో కొంతకాలం గడపాల్సివచ్చింది. ఆయన అభిమానులైన సంగీత ప్రియుల కోరిక మీద భారత్ వచ్చి లక్నోలో కొన్ని సంవత్సరాలు, హైద్రాబాద్ వంటి నగరాల్లోనూ ఉంటూ వచ్చారు.

1961లో బడేగులాంకి పక్షవాతం వచ్చింది. అయినా సంగీత సేవను ఆయన వీడలేదు. భారత రాష్ట్రపతి *పద్మభూషణ్* బిరుదిచ్చి గౌరవించారు. 1962లో కేంద్ర సంగీత నాటక అకాడెమీ ఫెలోషిప్‌తో గౌరవించింది. కలకత్తా విశ్వవిద్యాలయం ఖాన్‌కి *డాక్టర్ ఇన్ మ్యూజిక్* అనే గౌరవ పూర్వకమైన బిరుదునిచ్చింది. 1968 నాటికి ఆయన బొంబాయిలో తన 65వ ఏట స్వగృహాన్ని సంపాదించు కుని స్థిరపడ్డారు.




ఆయన సంగీత ప్రస్థానాన్ని గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే ననిపిస్తుంది. గులాం ఆలీ హిందూస్థానీ సంగీత శక్తులు గొప్పవి. అందుకే ఖాన్ టుమ్రీలోగాని, తానంలోగాని, అద్వితీయుడనిపించు కున్నారు. రాగాలాపన విషయంలోకి వస్తే మాల్‌కోస్, కేదార్, యమన్, దర్బారీ, కానడా ఆలపిస్తున్నప్పుడు ఆయన శాస్త్రపాండిత్యం ఎంతలోతైనదో, కంఠశ్రావ్యత ఎందరి జనాన్ని ఆకర్షించేదో అనుభవించిన వారికందరికీ తెలుసు. రాగాలాపన కన్నాకూడా ఆయన *టుమ్రీ* ***క్యా కరూ నా జాని ఆయేనా బలం*** వంటివి సంగీత ప్రియుల్ని అలరిస్తూనే ఉండేవి. తన సంగీత సాధనకు ఆయన ఆహార నియమాలు ఏనాడు అడ్డురాలేదు. మత్స్య మాంసాహార ప్రియుడు ఖాన్, శుద్ధమైన నేతితో రకరకాల మిఠాయిలు తయారు చేసి తాను తినడం, తన వారికి తినిపించడం ఆది నుంచీ అలవాటే! ఉస్తాద్ స్థూలకాయుడు, ముసల్మాన్. అయినా ఆయనంటే పడిచచ్చే తమిళనాడు ప్రసిద్ధ గాయకుడు జి.ఎన్. బాలసుబ్రహ్మణ్యం ఇలా అంటారు. "నేను పాదాభివందనం చేసింది అతనికి కాదు. అతనిలో నిండుగా నెలకొని వున్న సంగీత సరస్వతికి" అని. జి.ఎన్.బి.కి చెందిన మరోముచ్చట ఇక్కడ చెప్పుకోవడం సబబనిపిస్తుంది. ఎం.ఎ (ఆంగ్లం) చదివి, సాటిలేని గాయకుడుగా పేరు గాంచి మద్రాసు మ్యూజిక్ అకాడెమి అధ్యక్షుడైన జి.ఎన్. బాలసుబ్రహ్మణ్యం ఆ రోజుల్లో కర్ణాటక సంగీతంలో దిట్ట. ఆయన మన గులాం ఆలీ సంగీతాన్ని విని ఉన్నాడు. బొంబాయి వెళ్లి ఖాన్‌ని 1951లో జరిగే అకాడెమీ వార్షికోత్సవాల్లో పాల్గొనమని ఆహ్వానించాడు. ఎందరో గాయనీగాయకులను, విద్వాంసులను, రసికులను ఖాన్ హిందూస్థానీ కచేరికి రమ్మని పిలిచాడు. ముఖ్యంగా మైలాపూర్ (చెన్నైలో అంతర్భాగం) బ్రాహ్మణ సంగీత విద్వాంసుల్ని ఆహ్వానించాడు జి.ఎన్.బి. అతనూ సద్బ్రాహ్మణుడే! సమావేశంలో కచేరీకి ముందుగా ఉస్తాద్ బడే గులాం ఆలీ ఖాన్‌కి తానే శాలువా కప్పి సన్మానిస్తూ 'ఈ నాటి మహాగాయకుడు' అంటూ ఆ ముస్లిం గాయకుని పాదాలకు నమస్కరించాడు. అది అక్కడికి చేరిన బ్రాహ్మణ సమాజానికి రుచించలేదు. గులాం ఆలీ తన హిందూస్థానీ కచేరీ మొదలెట్టారు. స్వరసంచారం సాగింది. సరిగమలు, గమకాలు, ముర్కీలు, బోల్‌తాన్లు ఖటక్‌తాన్లూ, ఇవన్నీ ఆలకించాక వెళ్ళిపోవడానికి సిద్ధంగా వున్న విద్వాంసులు టక్కున ఆగిపోయారు. ఖాన్ పాట అందం వేరు. ఆ స్వర సంస్కారం వేరు. అది *కిరాణాఘరానా బాణి* అది పాత్యాలు ఘరాన పద్ధతి. అంతా కచేరీ విన్నాక ఉస్తాద్‌కి నమస్కరించి తమ సంస్కారాన్ని చాటుకున్నారు.

ఉస్తాద్ గాయకులలో రాజు, రాజులలో గాయకుడు అని అప్పుడర్థమైంది. 1947లో భారతదేశం నుంచి పాకిస్థాన్ విడిపోయిన సంగతి జగద్విదితం. అప్పుడు ఆలీఖాన్‌తో గులాం ఆలీ పాకిస్థాన్ వెళ్లారు. అయితే ఆయన దేశవిభజనకు సుముఖుడుగా లేరు. భారతదేశానికి వచ్చేశాడు. 1957 లో ఆయనకు భారత పౌరసత్వం లభించింది.

1932లో ఖాన్‌కి అలీజునైతో నిఖా జరిగింది. ఈయనకు ముగ్గురు కొడుకులు. వారిలో ఒక్క మునావర్ ఆలీఖాన్ మాత్రం తండ్రి పేరు నిలబెట్టగలిగాడు. భారత

పౌరసత్వం లభించాక ముంబయి, కలకత్తా నగరాల్లో ఎక్కువగా నివశించాడు ఆయన. అప్పట్లో గులాం ఆలీ కొన్ని హిందీ సినిమాలలో పాటలు కూడా పాడటం జరిగింది. హిందీ చిత్రసీమలో ఆనాడు లతామంగేష్కర్, మహమ్మద్ రఫీ లాంటి ప్రముఖులు తాము పాడిన ఒక్కోపాటకు పారితోషకంగా 500 రూ॥లు పొందేవారు. బడే గులాం ఆలీకి ఆయన పాడిన ఒక్కోపాటకీ 25వేలు తీసుకున్నట్లుగా చెబుతారు. దీనిని బట్టి ఆయన పాడిన పాట విలువ ఏ పాటిదో అర్థమవుతుంది.

వారు పాడిన బైజుబావరా, మొఘల్-ఎ-ఆజమ్ వంటి చిత్రాలలోని పాటలు తాన్‌సేన్‌ని గుర్తుకు తెస్తాయి. మన తెలుగు ఆకాశవాణి గాయకుడు అటు కర్ణాటక, ఇటు హిందుస్థానీ రాగాలలో సిద్ధహస్తుడు ఓలేటి వెంకటేశ్వర్లు ఖాన్‌కి బడే గులామ్‌కా గులామ్ అని ప్రస్తుతించేవారు. గులాం ఆలీ ఖాన్ మూడో కొడుకు మునావర్ ఆలీఖాన్ తండ్రి బ్రతికి వున్నంతకాలం ఆయనతో పాటు సహకార గానం చేస్తుండేవారు. గులాం ఆలీఖాన్ శిష్య పరంపరలో హిందూస్థానీ సంగీత పరంగా ఎక్కువ మందే ఉన్నారని చెప్పవచ్చు. ప్రథమ శిష్యగణంలో రమేష్ చంద్ర ఠాకూర్, సాయిగల్, తులసీదాస్ శర్మ, చిన్మయ్‌లహరి వీరితో బాటు శ్రీమతి మారా బావర్జి వంటి విదుషీమణులూ ఉన్నారు. వర్తమాన సంగీత శ్రేణిలో పర్వీన్ సుల్తానా ఖాన్‌కి మనుమరాలు వంటిదని పెద్దలు చెబుతారు. ***రసచక్రవర్తి ఠుమ్రీ-కీ-బాద్‌షా, స్వరభూషణ, గానవిద్యాప్రపూర్ణ*** వంటి బిరుదులెన్నో గులాంకి భూషణాలై సంగీత ప్రపంచంలో నిలిచాయి. మీరాబాయి, సూరదాస్, కబీర్, తులసీదాస్ వంటి పలువురు గాయకుల భజనలను కూడా ఉస్తాద్ సాహిత్యాభివ్యక్తితో, రససిద్ధితో గానం చేసిన మహనీయుడు.

ఆయన నిరాడంబర జీవితాన్ని గడిపాడు. వివాదాస్పదమైన స్వరాలను కూడా ఎంతో గడుసరితనంతో విలీనం చేసి సంగీత రసోత్పానం కలిగించిన వ్యక్తి. ఎటువంటి క్లిష్టమైన కర్ణాటక రాగాన్ని వినిపించినా వెంటనే స్వరకల్పన చేసుకొని సదస్ఫూర్తితో పాడి వినిపించగలగటం ఆయనకే చెల్లింది. కొన్ని నిజాలిక్కడ ప్రస్తావించాలి. మన గాయకులు అపశృతులు పాడినా సదస్యులు గుర్తించలేరులే అన్న నిబ్బరంతో రోలర్ లాగించేస్తారు. కాని ఖాన్ ఒకసారి జబ్బు పడి బ్రతికి కచేరిచేస్తూ తారాస్థాయిలో పాడుతుండగా అపశృతి పడితే వెంటనే రెండు చేతులూ జోడించి కచేరీ ఆపారు. పైగా "క్షమించండి! జబ్బుపడి బ్రతికాను. నా గానం ఖరాబవుతోంది. మాఫ్‌కీజియే! అంటూ సభాసదుల ముందు వినయంగా చెప్పుకున్నాడు. మన సినీగాయకుడు ఘంటసాల వెంకటేశ్వర రావు మద్రాసులో ఖాన్‌ని కలిశారు. అప్పుడు ఖాన్ చెన్నైలో అద్దెభవనం కోసం ప్రయత్నిస్తున్నాడు. విషయం విన్నాక ఘంటసాల పెద్దమనసుతో "ఉస్తాద్ ! ఈ సారి మా పేదకుటీరానికి దయచేయండి" అని అడిగారట. ఖాన్ వద్దు బేటా! నా తిండి పద్ధతులు వేరు, నా అవస్థ నే పడతానన్నారు. ఘంటసాల ఖాన్‌ను వదిలిపెట్టకుండా ఆయన మందీమార్బలాన్ని మంచి మాటలతో ఇంటికి తీసి కెళ్ళి విడిది ఏర్పాటు చేశారు. ఉస్తాద్ ఆయనకి సహకారం అందించే వారంతా ఇంట్లో వుండగా ఊరెళ్ళి వచ్చిన ఘంటసాల భార్య సావిత్రమ్మ వాకిట్లో పడి వున్న చెప్పుల జతల గుట్టను చూశారు. అప్పటికే తమ ఇంట్లోంచి రకరకాల సంగీత ధ్వనులు, పడక్కుర్చీలో జారగిలబడి ఉస్తాద్ బడే గులాం ఆలీ ఖాన్ సురమండల్ మీటుతున్న దృశ్యం అగుపించింది. సావిత్రమ్మ తాను బ్రాహ్మణకులానికి చెందిన స్త్రీ అయినా ఖాన్ దగ్గరకెళ్ళి వినయంగా నమస్కరించి ఆయన పాదాల దగ్గర చతికిలబడింది. "బహూరాణీ" అని ఆమెను ఖాన్ సంబోధించారు. నువ్వు ఉండమంటే ఇక్కడుంటాను. లేకుంటే ఇప్పుడే వెళ్ళిపోతాను అన్నారట ఖాన్. సావిత్రమ్మ "ఉస్తాద్! ఇది మీ అబ్బాయి ఇల్లేననుకోండి, నన్ను బహూరాణీ అన్నారు. మీ బహూరాణీ ఇంట్లో మీరుండవలసిందే! మీకు ఇష్టమొచ్చినన్ని రోజులుండండి. మాకు ఆనందమే తప్ప ఇబ్బంది కలగదని ఆ తల్లి చెప్పారు. అందుకే కాబోలు ఘంటసాల గారి భార్య సావిత్రమ్మగారు ఈ మధ్య 'సాక్షి' దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఉస్తాద్ బడే గులాం ఆలీ ఖాన్ తనకు దేవుడిచ్చిన మావగారు అని సగర్వంగా ప్రకటించారు.

ఇలా మహాత్ములొక్కొక్కరి గొప్ప గొప్ప జీవిత విశేషాలు చెప్పుకుంటూ పోతే చరిత్ర తవ్వే కొద్దీ విశేషాలు బైటపడ్డట్టు ఎన్నో మధురానుభూతులు వెల్లువలై బైటికొస్తాయి. బడే గులాం సంగీతమంటే మన నిజాం నవాబుకు ఎంతో ఇష్టం.

అందుకే మీరు హైద్రాబాద్ రండి. మీకు వైద్యం నే చేయిస్తానని భరోసా ఇచ్చి రప్పించాడు. దురదృష్టవశాత్తూ కేన్సర్ వ్యాధి ఆయనకు డెబ్భై సంవత్సరాలైనా పూర్తికాకుండానే అల్లా సన్నిధిలోకి తీసుకు పోయింది. మి

# బడే గులాం అలీఖాన్ రికార్డులు

– నండూరి పార్థసారథి

ఉస్తాద్ బడే గులాం అలీఖాన్ మొదటి 78 ఆర్.పి.ఎం. గ్రామఫోన్ రికార్డు (మూడున్నర నిమిషాల నిడివి) 1939లో హిందూస్థాన్ రికార్డింగ్ కంపెనీ వారి లేబుల్‌పై విడుదలయింది. అందులో ఒక వైపు అడానేకీ బహార్ (అడానా, బహార్ రాగాల మిశ్రమం) రాగంలో ఖయాల్, రెండో వైపు భైరవి రాగంలో 'బాజు బంద్ ఖుల్‌ఖుల్ జాయే' ఠుమ్రీ వున్నాయి.

ఆ రికార్డు హిందూస్థానీ సంగీత ప్రియులను సమ్మోహితులను చేయడంతో వెంటనే యింకో మూడు రికార్డులను హిందూస్థాన్ కంపెనీ విడుదల చేసింది. ఖాన్ సాహెబ్ వాటిలో లలిత్, పహాడీ, కాళింగ్డా రాగాల్లో ఖయాల్ రచనలను, తిలంగ్ రాగంలో ఒక ఠుమ్రీ (తోరేనైనా జాదు–భరే), మరొక ధున్ గానం చేశారు.

తర్వాత 1940, 50 దశకాలలో హిజ్ మాస్టర్స్ వాయిస్ (హెచ్.ఎం.వి) సంస్థ పది 78 ఆర్.పి.ఎం. రికార్డులను విడుదల చేసింది. వాటిలో ఖాన్ సాహెబ్ ఒక వైపు ఖయాల్ రచనలను, రెండో వైపు ఠుమ్రీలను గానం చేశారు.

1960 ప్రాంతాల్లో మన దేశంలో ఎల్.పి.రికార్డులు తయారవడం మొదలయ్యాక హెచ్.ఎం.వి సంస్థ అంతకు ముందు విడుదల చేసిన పది 78 ఆర్.పి.ఎం. రికార్డుల నుంచి ఖయాల్‌లను, ఠుమ్రీలను వేరు చేసి పది ఠుమ్రీలతో ఒక రికార్డును, పది ఖయాల్‌లతో మరొక రికార్డును విడుదల చేసింది. ఇవి పదంగుళాల ఎల్.పి. రికార్డులు.

ఆయే న బాలమ్, సయ్యా బోలో, యాద్‌పియా కి ఆయే, ప్రేమ్ కి ఫందేమే, మారన్ ముతే / నైనా మురే తరస్ రహే, కాటేనా బరహా కీ రాత్, ప్రేమ్ కి మార్ కటార్, తిరిచి న జరియా, ప్రేమ్ అగన్ జియారా– ఇవి ఠుమ్రీల ఎల్.పి. లోనివి.

భోర్ భయీ (గుజరీతోడి), మన్‌వాలార్‌జే (దేశితోడి), లటక్ చలీ తో మన్ (పరజ్), మందిర్ దేఖ్ దరే (మాల్ కౌన్స్), భజరే హర్ నామ్ (దర్బారీ) / ఛాంద్ దే మోరా (కామోద్), బినతీ కా కరియే (జైజైవంతి), నవేలి నార్ (కేదార్), బేగున్ ఆయే (భీంపలాస్), జైసీకరియే (అడానా)– ఇవి ఖయాల్ రచనల ఎల్.పి.లోనివి.

1963లో హెచ్.ఎం.వి సంస్థ ఖాన్ సాహెబ్ ఎల్.పి.రికార్టులు రెండు, ఇ.పి (ఎక్స్‌టెండెడ్ ప్లే ) రికార్డు ఒకటి విడుదల చేసింది. వాటిలో ఒక ఎల్.పి. లో ఖాన్ సాహెబ్ మాల్‌కౌన్స్, గుణ్ కవి రాగాలలో ఖయాల్ రచనలు గానం చేశారు. రెండవ ఎల్.పిలో కౌశిధ్వని, దర్బారీకానడ రాగాలు గానం చేశారు. ఇ.పి.రికార్డులో ఒకవైపు పహాడీ రాగంలో 'హరి ఓం తత్సత్' అనే భజన్, రెండో వైపు 'కంకర్ మార్ జాగాయే' అనే ఠుమ్రీ మాంజ్ ఖమాస్ రాగంలో గానం చేశారు.

ఖాన్ సాహెబ్ చివరి గ్రామఫోన్ రికార్టింగ్‌లు అవే. 1968లో ఆయన పోయిన తర్వాత గ్రామఫోన్ రికార్డులు, కెసెట్లు, సి.డిలు చాలానే వచ్చాయి. వాటిలోని వన్నీ ఆకాశవాణి ఆర్కైవ్స్ నుంచి స్వీకరించిన రికార్డింగ్‌లు, లేదా ఆయన అభిమానులు దాచిపెట్టుకున్న కచేరీల రికార్డింగులు.

ఆకాశవాణి రికార్డింగులతో హెచ్.ఎం.వి విడుదల చేసిన ఎల్.పి రికార్డులు:

శుద్ధ సారంగ్ ఖయాల్ / మేఘ్ మల్హార్ ఖయాల్, పహాడీ ఠుమ్రీ.

తన్‌మన్ ధన్ తో పేవర్నా (తిలక్ కామోద్ ఠుమ్రీ); జల్‌జమునా కైసే జావుం (మిశ్ర ఖమాజ్ ఠుమ్రీ) / అబ్‌తో ఆవో సజనా (దాద్రా); బాజు బంద్ ఖుల్ ఖుల్ జాయే (భైరవీ ఠుమ్రీ).

జాన్‌పురి – ఖయాల్, తరానా / భూపాలీ– విలంబిత్ ఖయాల్, ద్రుత్ ఖయాల్, తరానా.

రాగేశ్వరి – ఖయాల్ / దేఖే బినా చైన్ – మిశ్ర ఖమాజ్ ఠుమ్రీ; తొరే నైనా జాదూ భరే – తిలంగ్ ఠుమ్రీ.

ఇన్‌రెకో (INRECO) లేబుల్ పై విడుదలైన ఎల్.పి. ఆకాశవాణి రికార్డింగ్ బేహాగ్– ఖయాల్ / మిశ్ర బేహాగ్ ఠుమ్రీ.

టి సీరిస్ లేబుల్ పై వెలువడిన పదకొండు సి.డిల సెట్. ఇందులోని వన్నీ ఆకాశవాణి రికార్టింగులు. దేశి, దేశ్, హిండోల్ సారంగ్, బసంత్, తోడి, ఆసావరి, మధుమద్ సారంగ్, బేహాగ్, దర్బారీ కానడ, గుణ్‌కవి, అడానా బహార్, మాల్ కౌన్స్, జాన్‌పురి, జైజై వంతి రాగాలలో ఖయాల్ రచనలు, భైరవి, పీలూ, ఖమాజ్ రాగాలలో ఠుమ్రీలు, దాద్రాలు– ఇవి ఆ సి.డిలలో వున్నాయి.

'ఆకాశవాణి సంగీత్' లేబుల్ పై ఆకాశవాణి స్వయంగా విడుదల చేసిన సి.డి. ఇందులో రాగేశ్వరి – విలంబిత్, ద్రుత్ ఖయాల్ రచనలు, మిశ్ర పహాడీ రాగంలో 'అబ్‌తో ఆవో సజనా' ఠుమ్రీ వున్నాయి.

సాగరిక లేబుల్ పై సి.డి. ఇందులో – 'అల్లా జానే మౌలా జానే' తోడి ఖయాల్, రాగేశ్వరి ఖయాల్ వున్నాయి.

మ్యూజిక్ టుడే సి.డి. మాల్ కౌన్స్, భాగేశ్వరి రాగాల్లో ఖయాల్ రచనలు, ఒక ఠుమ్రీ, వున్నాయి.

మాగ్నాసౌండ్ లేబుల్ పై ఆడియో కేసెట్. ఇందులో రాగేశ్వరి, విలంబిత్ ఖయాల్, భైరవి, పీలూ ఠుమ్రీలు వున్నాయి.

హెచ్.ఎం.వి లేబుల్ పై కేసెట్. ఇందులో జైజై వంతి విలంబిత్, ద్రుత్ ఖయాల్‌లు, కేదార్ విలంబిద్ ఖయాల్, 'యాద్‌పియా కీ ఆయే' ఠుమ్రీ వున్నాయి.

# సూక్ష్మజీవి

- ఎ.కె; ము.పా.సా

ఉపనిషత్తులు ఔపోసన పట్టాడు. వేదవేదాంగాలు చదివాడు. షడ్దర్శనాలు, బ్రహ్మసూత్రాలు బట్టీయం పట్టాడు. పుణ్యక్షేత్రాలు దర్శించాడు. బ్రహ్మచర్యం పాటించాడు. భగవంతుని భజనలో, సేవలో జీవితాన్ని పునీతం చేసుకున్నాడు. కాలం ఆగదుకదా! వృద్ధాప్యం సమీపిస్తోంది. ఆత్మజ్ఞానంతో సజీవ సమాధిలోనికి వెళ్ళాడు. ప్రజలు బ్రహ్మరథం పట్టారు. బొందితో స్వర్గ మార్గాన్ని అన్వేషించి స్వర్గద్వారాలను చేరాడు. అలసి సొలసి బంగారు తలుపులు తట్టాడు.



ఇరవై ముప్పై అడుగుల ద్వార పాలకుడు మన వేదాంతిని చూడటానికే ఇబ్బంది పడి 'ఎవ్వరదీ' అన్నాడు. 'నేను-మానవుణ్ణి - నా జీవితమంతా పవిత్ర భగవన్నామ స్మరణలోనే గడిపాను. ఆయన కీర్తిని సంకీర్తన చేస్తూ ప్రచారం చేశాను. నాకు స్వర్గ ప్రవేశం కలిగించండి' అని కొంచెం ఆర్తి స్వరంతో అన్నాడు.

'ఏమిటి? ఎవరూ? మానవుడా? ఎప్పుడూ వినలేదే - అయినా నీలాంటి సూక్ష్మజీవి భగవంతుని కీర్తిని ఇనుమడింపచేయటమా? వినటానికే హాస్యంగా ఉంది.' అన్నాడు ద్వారపాలకుడు ఎగతాళిగా.

మనస్వామికి ఆశ్చర్యం కోపం పెనవేసుకొన్నాయి. 'నీకు మానవుని గురించే తెలియదా? సృష్టికర్త చేసిన మహోన్నత జీవి-భూమి పాలకుడు మానవుడని తెలియదా? ఇది మావజాతికే అవమానం.'

'మీరు చెప్పిన విషయం ఇంతవరకు విననే లేదు. మీరు ఉపయోగించే పదాలు. అవీ మానవుడు - భూమి ఇవి అర్థం కావటంలేదు. ఇలాంటి విషయాలు ఇక్కడ ఎవ్వరికీ తెలియవనే నా నమ్మకం. అయినా మీరు ఇంత కష్టపడి వచ్చారు గనక మీ గురించిన వివరాలు- మా గ్రంథాలయంలో వున్నాయేమో- గ్రంథాలయాధికారిని చూసే అవకాశం మాత్రం కల్పిస్తాను.' అని దయదలచాడు.

వెయ్యి కళ్ళు ఒక నోరు ఉన్న విచిత్ర ఆకారుని కొన్ని కళ్ళు మన స్వామిని చూసి 'ఇదేమిటి' అని ద్వారపాలకుని అడిగాడు.

'ఇదండీ, భూమి అనేచోట నివసించిన మానవుడని అంటున్నాడు. పైగా భగవంతుని కీర్తిని ఇనుమడింప చేస్తాడట.' అని వచ్చే నవ్వుని ఆపుకున్నాడు. 'ఇతనికి తమరు ఏమయినా వివరాలు చెప్పగలరేమోనని....' అంటూ సణిగాడు.

గ్రంథాలయాధికారి మన స్వామిని జాలిగా చూశాడు. 'భూమి! ఇదెక్కడున్నదో చెప్పగలరా?' అన్నాడు.

'అది సౌరకుటుంబంలో ఒక గ్రహం.' అన్నాడు స్వామి -వేదాంతి, కాస్త వెటకారంగానే ఈ మాత్రం తెలియదా అన్నట్లు.

'ఏ సౌర కుటుంబం?' అని ప్రశ్న వెంటనే వచ్చింది.

'అయ్యబాబోయ్! ఇవన్నీ భౌతిక విషయాలు- నాలాంటి వేదాంతులకు ఆధ్యాత్మిక పరాయణులకు ఎలా తెలుస్తాయి. అయినా ఒక ఖగోళ శాస్త్రం సెమినార్లో విన్నాను. సౌరకుటుంబం - పాలపుంతలో వుంటుందని'

'పాలపుంతా? అంటే ఏమిటి సెలవిస్తారా?'

'పాలపుంత - అది వందల లక్షల నక్షత్ర వీథుల్లో ఒకటి' ఇప్పటికే స్వామిజీకి తల తిరుగుతోంది.

'ఇదంతా చాలా గందరగోళంగా వుంది. నాకు చాలా పని కూడా వుంది. కాని ఈ 'నక్షత్రవీధి' అన్నమాట విన్న

గుర్తు. మా సహాయకుడొకరు ఆ విభాగం చూస్తుంటాడు. అతనికి కబురు పెడతాను' అన్నాడు గ్రంథాలయాధికారి. చాలా కాలం తర్వాత పదితలలున్న సహాయకుడు వచ్చాడు. అతని వంటి నిండా నక్షత్రధూళి పేరుకు పోయి వుంది. స్వామి లోపల 'వీళ్ళకి నీళ్ళు దొరకవా?' అనుకున్నాడు.

గ్రంథాలయాధికారి కథంతా చెప్పి- మానవుడు-భూమి, నక్షత్రవీధి, అతనికేమైనా సహాయం చేయగలవా అని అతనికి అప్పగించి అడిగాడు. 'నక్షత్రవీధి' విభాగపు సహాయకుడు 'ఓపికగా, వెతుకుతూ పోతే దొరకక పోతుందా- కాని కొన్ని వందల లక్షల నక్షత్ర వీధులున్నాయి. ఒక్క నక్షత్రవీధికి ఒక్కొక్క సంపుటి వున్నది. ఈ సూక్ష్మ వీధి వెలికి తీయటానికి చాలా శ్రమతో కూడిన కాలం పడుతుంది, అయినా ఈ సూక్ష్మ జీవికి ఏమికావాలట?' అని అడిగాడు.

'ఏ పాలపుంతో చెప్పాలి'.



'సరే ప్రయత్నం చేస్తాను' అని వెళ్లాడు. చాలా కాలం గడిచింది. మన స్వామిజీ కునుకు తీస్తుండగా వచ్చి నక్షత్రవీధి సహాయకుడు లేపాడు. మా విభాగం లోని వేలమంది కలిసి వెదికితే కాని ఇది వెలుగులోకి రాలేదు. ఈ నక్షత్రవీధి విభాగం చూసే విచిత్రగుప్తుడు ఇతడే అని అప్పగించాడు. ఎనిమిది తలకాయలున్న విచిత్ర గుప్తుడు – చీకటికి ఆలవాటు పడిన కళ్లతో చిట్లించి – 'నా నక్షత్రవీధి సమాచారం మీ కెందుకు?' అన్నాడు చిరాకుగా.

'మా పాలపుంతలోని నాకు సౌరకుటుంబం గురించి వివరాలు కావాలి. సౌరకుటుంబం అంటే ఒక్కో నక్షత్రం చుట్టూ పరిభ్రమించే కొన్ని గ్రహాల గుంపు. మా భూగ్రహం సూర్యుని చుట్టూ తిరుగు తుందని భౌతిక శాస్త్రవేత్తలు నిర్ధారించారు.'

అప్పటికే ఆ సహాయకుడు తేలకళ్ళు వేశాడు.

'నక్షత్రవీధి కనిపెట్టటానికి ఇంతకాలం పట్టింది. ఆ ప్రత్యేక నక్షత్రం – గుర్తించటం చాలా కష్టం. నా నక్షత్రవీధిలో మూడువందల కోట్ల నక్షత్రాలున్నాయి. అందులో నక్షత్రాలన్నీ ఒకేలాగ ఉంటాయి. తేడా నాకే తెలియదు. ఒకప్పుడు పరిపాలనా శాఖవారు మూడువందల కోట్ల నక్షత్రాల జాబితా అడిగినట్లు గుర్తు. ఆ జాబితా ఎక్కడో వుండాలి. ఇంత శ్రమ అవసరమనుకుంటే ప్రత్యేక సిబ్బందిని పెట్టి వెతికించాలి...' అన్నాడు.

ఎలాగూ ఇంతవరకు కొంత పరిశోధన జరిగింది కదా. ఈ సూక్ష్మజీవి ఇక్కడే పడి వున్నాడు ఇంతకాలం- అందుకని ఈ పని ప్రత్యేకసిబ్బందితో పూర్తి చేయిద్దామని నిర్ణయించారు. ఆ విధంగా కొన్నేళ్ళు గడిచిపోయాయి. తీవ్రంగా పరిశోధన జరిగింది. నాలుగు తలకాయల సహాయకుడు నక్షత్ర ధూళి దులుపు కుంటూ 'అమ్మయ్య మీరు అడిగిన నక్షత్రాల గురించిన సమాచారం దొరికింది. మీరు దీనిగూర్చి ఇంతగా శ్రద్ధ చూపిస్తున్నారు? ఇన్ని కోట్ల నక్షత్రాల లాగానే ఇదే వుంది. ఉష్ణోగ్రత, పరిమాణంలోను అన్నిటి మాదిరిగానే ఉంది. దీని చుట్టూ కూడ గ్రహాలు తిరుగు తున్నాయి. ఎంతో పరిశీలన తర్వాత కొన్ని గ్రహాల మీద పరాన్న భుక్కులు- సూక్ష్మజీవులు వున్నట్టు పసిగట్టాము. బహుశా ఈ జీవికూడా ఆ జాతిదే అయివుండ వచ్చు' అని అప్పుచెప్పి వెళ్ళిపోయాడు.

స్వామీజీకి దుఃఖం పొంగు కొచ్చింది.

ఈ విశ్వాలన్నీ మా కోసమే సృష్టించినట్లు – సృష్టి కర్త మాకు ఈ భ్రమలు ఎందుకు కలిగించాడు. నా జీవితమంతా ఆయన లీలలు పాడుతూ పొగుడుతూ గడిపానే – నా సేవకు – నా భక్తికి మెచ్చి నాకు ముక్తి ప్రసాదిస్తాడని వచ్చానే. ఇక్కడ చూస్తే నే నెక్కడి వాడినో చిరునామా కూడా తెలిదంటున్నారు.

వందల లక్షల నక్షత్రవీధుల్లోని లక్షల నక్షత్రాలలోని ఒక నక్షత్రం చుట్టూ పరిభ్రమించే సూక్ష్మ గ్రహం, మీద జీవితం గడిపిన ఒక సూక్ష్మాతి సూక్ష్మజీవినంటున్నారు. ఇది నేనెలా భరించాలి? నేనెందుకు ఈ సృష్టి కర్తని పొగడాలి. అతని కీర్తిని కీర్తించాలి? అంటూ దుఃఖించాడు.

'ఇక వెళ్ళొచ్చు' అన్నారు.

వేదాంతి-స్వామిజీ సజీవసమాధిలో పీడకలను మర్చిపోవటానికి తన్నుకుంటున్నాడు.

ఇప్పటికీ ఆ సమాధికి అమాయక ప్రజలు పూజలు చేస్తూనే వున్నారు.

(బెర్ట్రెండ్ రస్సెల్ స్ఫూర్తి...)



# రమణీయ జానపద గేయాలు

– సి.వేణు

**ప**ల్లెటూరి పసిడి భోషాణంలో జానపద సాహిత్యం పదిల పరచ బడింది. జానపదుల రస నాదాలలో జీవంపోసు కొంది. పల్లె పదాలు సాహిత్యంలో ఒక ప్రత్యేక వ్యక్తిత్వాన్ని సంతరించుకొన్నాయి. ఈ కవితలు కాల ప్రవాహపు ఆటుపోట్లను తట్టుకొంటూ మన సాంఘికాచారాలను, సంస్కృతిని, గ్రామీణ జనజీవన గతిని తనలో నిక్షిప్తపరచుకొన్నవి.

**జా**నపదుల ఏలలు, జోలలు, చందమామ సుద్దులు, గొబ్బిపదాలు, నలుగు పాటలు, కోలాటపాటలు, బువ్వ బంతి పాటలు, లాలి పాటలు, సీత వేవిళ్ళు, లక్షణదేవర నవ్వు, బాలగోపాల పదాలు, తెలుగు సాహితిని సుసంపన్నం చేశాయి. తియ్యందనాలను పండించాయి. శ్రమను దూరం చేశాయి.

"ఆనందం కంటే అమృతం లేదు. దుఃఖం కంటె రౌరవం లేదు'' అన్నారు. ఆనందాన్ని అందించటం, శ్రమను తొలగించటం ప్రధానంగా జానపదగీతాలు లక్ష్యంగా కవితలు వున్నాయి. శృంగార రస ప్రధానాలైన గేయాలే ఇందుకు ఉదాహరణాలు:

జానపద గీతాలలో శృంగారం తొణికిసలాడుతూ పరవళ్ళు తొక్కుతుంది. చదువు కొరవడినా ఈ పల్లెటూరి భావకవి రసికుడు–శృంగారప్రియుడు.

ఒక్కొక్క చోట ఔచితీ శోభితంగా, మరొక చోట కొద్ది హెచ్చుగాను, శృంగారాన్ని తన గేయాల్లో పొదిగినాడు. తన్మయత్వంతో హృదయాన్ని చక్కిలిగింతలు పెడతాడు. ఉదాహరణకు...

అది మధురానగరము. మునిమాపు వేళ. పాలబిందెను చంకనిడుకొని ఒయ్యారాలు ఒలకబోస్తూ రాధ రాజమార్గం ప్రవేశించింది. అటూ ఇటూ పరికించి రసికాగ్రగణ్యుడు గోపాల కృష్ణుడు రాధ కొంగు పట్టుకొంటాడు. ఆ అన్నుల మిన్న పెడమొఖం పెట్టి తెచ్చి పెట్టుకొన్న కోపాన్ని నటిస్తూ...

**ఏమిరా చినికృష్ణ ఏమోయి కృష్ణ!**
**ఏమిరా నెరజాణ! ఏల రావూరా!**
**అద్దములమేడ ఇద్దరము జోడు**
**పొద్దుపోయి పొరుగింట**
**నిద్దరేమిటిరా ....**
**అని మందలిస్తుంది.**

ఆపలుకుల్లో సుధ వర్షిస్తుంది. విరహంలోని వ్యధ హృదయంలో ధ్వనిస్తుంది. గోపాలుని అధరాలపై చిరుదరహాసం పొదువుకొంటుంది. కొండమీద పొద్దు పొడుపులా తొంగి చూస్తుంది. అతడు పల్లెత్తి పలుకడు. కన్నెత్తి రాధకనులలోకి చూస్తాడు. లోకమంతా ప్రశ్నగుర్తులు పూస్తాయి.

**మాపటికి నువ్వురారా**
**మదన గోపాలా"**
**అని ఆహ్వానిస్తుంది. అర్థిస్తూంది.**
**చీకటిలో మీ మేడ జాడ నేనెరుగ**
**అంటాడు కృష్ణుడు.**
**వరి గడ్డి కప్పిన వరసకూటముర**
**సజగడ్డి కప్పిన సరసకూటముర**
**ఏనుగులు కట్టేటి ఎదురిండ్లుదాటి**
**గుఱ్ఱాలు కట్టేటి శాలలుదాటి**
**దాగిదాగీవచ్చి గెడమాను తెలియర**
**పిలుపు పిల్లనగ్రోవి నాదములు సేయర**
**పకపకావచ్చినే పై గెడనూ తీతు**
**కిలకిలా వచ్చినే కింది గెడనూ తీతు.**

ప్రియుడికి తన నివాసాన్ని సంకేతాన్ని తెలియజేస్తుంది. ఆ ముగ్ధమోహన రసాధిదేవత రాధ.

మధుర నిదురలో కను మోడ్చింది. చీమ కూడా నిదురించిందేమో!

**అటుజాము ఇటుజాము**
**సరిజాము లాయె**
**పోయెనే కృష్ణయ్య రాధ మేడకు**

"అటుజాము ఇటుజాము సరిజాములాయె" అని కవి వ్రాయటం చేత రాత్రి పన్నెండు గంటలు దాటిన తర్వాత ఆ రాధామనోహరుడు రాధ మేడకు పయనమయ్యాడని తెలుస్తున్నది.

కృష్ణయ్య

**వరి గడ్డి కప్పిన వరసకూటముదాటె**
**సజగడ్డి కప్పిన సరసకూటముదాటె**
**ఏనుగులు కట్టేటి ఎదురిండ్లుదాటె**
**గుఱ్ఱాలు కట్టేటి శాలలుదాటె**
**దాగిదాగీవచ్చి గెడమాను తోసె**
**పిలుపు పిల్లనగ్రోవి నాదములు చేసె**
**పకపకావచ్చి పై గెడనూ తీసి**
**కిలకిలా వచ్చి కింది గెడనూ తీసి**
**కృష్టయ్య ఒడిలోన వాలె రాధమ్మ.**

శృంగారాన్ని ఎంత మనోజ్ఞంగా మలచారు. ఈ గేయం చదివేటప్పుడు హృదయం ఉఱ్ఱూతలూగుతుంది. ఏనుగులు, గుఱ్ఱాలు కట్టే శాలలు దాటి వెళితే రాధ అద్దముల మేడ కనిపిస్తుంది. యమునా తరంగభంగిని స్తంభించి, మోడులు చిగురించి ఉల్లములు పల్లవింపచేసే పిలుపు పిల్లన గ్రోవి నాదము వినిపిస్తుంది. ప్రకృతిని, పశువుల్ని, పడతుల్ని మురళీరవం సమ్మోహితుల్ని చేసింది ఈవిధంగానేమో! రచనను సజీవంగా చిత్రీకరించిన ఈ అజ్ఞాత కవి ధన్యుడు. కవిత ధన్యము –

**చుక్క పుట్టి రథమెక్కె**
**చూడోయి ప్రొద్దు**
**పొడుపు కొండ మీద**
**పటమెగిరె చూడు**
**జాము కోడి కూసి జాగాయె నోయి**
**లేవోయి లేవోయి మదన గోపాల**

చంద్రకాంత శిలానిర్మితమైన అద్దాలమేడలో రాధ హంసతూలికా తల్పంపై కృష్ణుడే కాదు పవిత్రమైన భావంతో మనం కూడా కనులు విప్పిన భావం కలుగుతుంది. లోకాలు, లోకేశులు, లోకస్థులు అక్కడనే కన్నులువిప్పారు. ప్రణయ చిత్రీకరణలో కవి చూపిన ఔచితీ శోభితమైన శృంగారము పవిత్రమైన దనుటకు ఈ గేయమొక మచ్చుతునక.

◆◆◆

అతి భీకరము, నిర్మానుష్యము. క్రూరమృగ సంచారం అయిన దుర్గమారణ్యం ఆ అడవిలోనికి ఒక అన్నుల మిన్నయగు కన్నె చెంచుభామ వస్తుంది. వేటకోసం. ఆమెపై మరులు గొన్న చెంచు యువకుడు జాడలా, నీడలా వెన్నంటుతాడు. ఒక పర్వత సానుప్రదేశంలోని మలుపులో చెంచెతను సమీపించి...

**పచ్చనీ నీలాలు**
**పారుటాకుల చీర**
**వేరుటాకుల రైక**
**పై మొల్ల గంధోళి**
**పాపరోకట పూవరి దానవే**
**పిల్ల చెంచితా! ఏవూరిదానవే?**

అంటాడు. పరిచయం లేని యువకుని యువతి ఈసడించుకొన్నట్లే చెంచిత...

**ఏ వూరు లైతేను, ఏపల్లెలైతేను**
**నాజోలి నీకేల? మగవాడా**
**వేటకొచ్చున్నాను మగవాడా**
**దుప్పేట కొచ్చాను మగవాడా**
**మారూపు కొండల్లో దుప్పేట కొచ్చాను**
**పడమాటి కొండల్లో పందేట కొచ్చాను.**
**పోరోరి పోరోరి మగవాడా**
**నీకు పొద్దేల పోదురా నాసామీ!**

అంతటితో ఆగిపోయే రకంకాదు ఆ చెంచు యువకుడు.

**ఏటకొచ్చీతేను ఏమాయె చెంచితా!**
**మాటలాడితేను కోపమా?**
**నీ కొంగు పట్టీతేను కోపమా?**
**నీకొప్పుపట్టీతేను కోపమా?**

అంటాడు. కొంగు, కొప్పుతో ఆగిపోయినా ఆ యువతి నిప్పులా గుప్పుమని మండిపోతుంది. అవమానకరమైన మాట సాగితే స్త్రీ రెచ్చిపోతుంది. చేతివేళ్ళు పటపట విరుస్తుంది. నానాశాపనార్థాలు పెడుతుంది. త్రాచులా బుసలు కొడుతుంది.

**పలుమాట లాడేవు**
**పైపైకి వచ్చేవు**
**నాగుబామూ నిన్ను**
**చెల పట్టికరువదా**
**పులివాయిలో నీవు**
**పడిపోక వుందువా?**
**పోరోరి పోరోరి మగవాడా**
**నీకు పొద్దేల పోదురా నా సామీ!**

అంటూ నానా శాపనార్థాలు పెడుతుంది.

**నాగుబాము తో నీకు**
**వద్దాణ మేతునే**
**పులి తోలు తోనె నీకు**
**పాన్పుగావింతునే**

అంటూ ముందుకు వస్తాడు. చెంచిత కొంత మెత్త బడినట్లుంది. కొన్ని షరతుల్ని విధిస్తుంది. ఈ షరతులు మగవాని శక్తిని పరీక్షించే స్వయంవర విధానమేమో!

**జోజో వానలు జోకొట్ట కురియంగ**
**జారుబండల నెక్కగలుగుదువా?**
**జర్తలంబులను ఏరగలుగుదువా?**

అడవి నువ్వులను ఏరగలననీ, జారుబండలను ఎక్కగలననీ చెబుతాడు.

**రావెరావే భామ చెంచితా**
**రావి చిగురుల సొగసు కలదానా!**

అంటూ ఆ అరణ్యంలోని లోయల్లో సెలయేటి ఇసుక తిన్నెల వైపుగా సాగిపోతారు.

**రావి చిగురుల సొగసు కలదానా!**

ఈ ఉపమానం పాతకొత్త కవితల్లో మణిపూస వంటిది. పరికించి చూస్తే రావిచిగురు సొగసు మావి చిగురులకు లేదేమో! చెంచుల జీవనచిత్రణ ఈ గేయంలో ద్యోతకమవుతూంది.

కీకారణ్యంలో ఏకాంత ప్రదేశంలో ఏకాకిగా ఒక జవ్వని కనిపించినా సభ్యత పాటించిన రచనావిధానం ఔచితీ శోభితంగా వుంది. లోకంలో భార్యశీలాన్ని శంకించే పురుషులు ఉంటారు. భార్య పవిత్రమైన శీలాన్ని శంకించి ఆమె ప్రతి కదలికను వేయి కండ్లతో చూచే పురుషుడూ, భర్తకు తగువిధంగా సమాధానమిచ్చే మగువ, ఇల్లాలూ ఈ గేయంలో మనకు దర్శన మిస్తారు.

ఈ గేయం సంభాషణరూపంలో సాగుతుంది.

**నీ చెంప నా గంధమేదదీ భామ యేదదీ?**
**లలనా ఏదదీ?**
**మన గంధాపు వనమూలో**
**చెక్కలేరబోతె**
**చెక్కజారి చెక్కు**
**నొక్కెర మగడా! నేర మెంచకురా!**
**నీ కొత్త కోకలో "కొఱ్ఱు" ఏదదీ?**
**భామ ఏదదీ లలనా ఏదదీ?**
**మన కలిమి చెట్టుకింద**
**కట్టెదించ బోతె కట్టె విరిగి**
**కొఱ్ఱు పట్టెర మగడా**
**నేర మెంచకురా!**
**నీ బుగ్గనా గురుతులేదవీ?**
**భామ ఏదవీ? లలనా ఏదవీ?**
**మన మల్లెపూపొదలోన**
**మొగ్గలేరబోతె**
**మొగ్గ జారిబుగ్గ**
**నాటేర మగడా**
**నేర మెంచకురా!**

పురుషుని మనసులోని 'శంక' చూపుల్లో కనిపిస్తుంది. క్రౌర్యం కంఠంలో వినిపిస్తుంది. స్త్రీ పాత్ర మీద సానుభూతి కలుగుతుంది. ఎదురైనచో తన మదకరీంద్రమూపి కేయూతమిచ్చి ఎక్కించు కొనే రాయలు ఆస్థానకవి పెద్దన మనుసంభవ కావ్యంలో వరూధినిని వర్ణిస్తూ...

**".... తెచ్చి నీర జాక్షిని**
**సానబట్టి పదును సుధనిడి పద్మభవుని**
**చేత చేయించిన 'వరూధిని'ని**
**ఇట్టి చేటియలు కలరె"** అంటారు.

ఆస్థాన కవి కాదు. అసలు అక్షరాలైనా రాని పల్లెటూరి ఈ భావకవి మల్లెమొగ్గ బుగ్గమీద జారి పడితే బుగ్గమీద నొక్కు పడేటంత సుందర సుకుమార సులలితగాత్రిని సృష్టించాడు. ఎవరి అందం ఎంతో మరి? పాఠకులు తెలుసుకోవాలి.

యౌవనం అడవి కాచిన వెన్నెలై ఆదరణలేని అతివ కన్నీరు జాలువారి, వాగులై, వరదలై, ఝరులై, పారిన హృదయవిదారకమైన నైరాశ్యత ఈ గేయంలో మనకు ధ్వనిస్తుంది. అన్యాపదేశంగా భర్త ఎడబాటును సహింపలేక చందమామనుద్దేశించి...

**ఒంటినేనుండలేనో చందమామా!**
**ఒక్కదానిని కోనలో**
**ఏనూరు ఏతాలు మున్నూరు కాలువలు**
**ఎంత చక్కని దోయి ఈపూలవనము**
**ఒంటినేనుండలేనో చందమామా!**
**మంచినీళ్ళాబావి మనపెరటి నుంచుకొని**
**ఉప్పునీళ్ళకు పోవ ఉపకారమేమో**
**ఒంటినేనుండలోనో చందమామా!**
**మల్లెపూలా పొదలు మనపెరట పెట్టుకొని**
**చీకిపూలకు పోవు సింగారమేమో**
**ఒంటినేనుండలోనో చందమామా!**

మధుర జలాలు మనపెరటి బావిలో ఉండగా, విమల సౌరభపరిమళము వెదజల్లు మల్లెలు కొల్లలుగా మనపొదలో విరబూచి ఉండగా ఉప్పునీళ్ళకును, చీకిపూలకును పోవ ప్రయోజనమేమి? అంటూంది. దవణమేసిన రాజు కల్లనాటకపోయె కావలి ఉండకపోయె...

**ఎల లేని దవణంబు ఏటిపాలాయె**
**ఎల లేని యవ్వనము యేటిపాలాయె**
**ఒంటినేనుండలోనో చందమామా!**

అన్యకాంత తలపు వొగురులలో తగులుకొన్న భర్తను తలచి విలపిస్తుంది. వెల లేని ఆమె యవ్వనము ఏటి



పాలైన దట. దవణ మేసిన రాజు కల్ల నాటక పోయినాడట ఒంటరిగా బ్రతక జాలదట. ఇది వేదనతో కూడిన విషాద రోదనపు గాథ. గుండె చెదరిపోయే రసవత్తర సన్నివేశం.

ప్రియురాలు పొరుగూరు పోలేరమ్మ జాతరకు ప్రయాణం కడుతుంది. ఆమె ఎడబాటును సహించలేని ప్రియుడు...

**చెలియ నన్నిడనాడి పోతావు తిరునాళ్ళు**
**ఎంత నీ దయలేదుగా చెలియా**
**సుంత నీదయ లేదుగా చెలియా**
**"నువుపోయె దారిలో నిలువు రాయున్నాది**
**నీరూపు రాసిపోవే చెలియా**
**నీరూపు రాసి పోవే."**
**పండినా పంటలో పసినిమ్మపండులు**
**పక్కనుంటే సాలునే చెలియా!**
**నువు పోయే దారిలో నిలువెత్తు రాయున్నాది.**

ఆ రాయిపై నీ రూపాన్ని చిత్రించి వెళ్ళు, ఆ చిత్తరువును నా చిత్తమున హత్తించు కొని ఆనందించెద నంటున్నాడు. ఎడబాటును సహించలేని సఖుడు. పండి ఒరిగిన పండు జవ్వనియైన భార్య జంటగా ఉండగా కోరదగినది మరేదీలేదనే నగ్నసత్యాని ఈ పల్లెపదంలో కవి పొందుపరచాడు. వరూధిని వన్నెచిన్నెలు, సత్యభామ సరసము ప్రభావతి ప్రణయము, గిరికా విప్రలంభము, శృంగార రస ప్రధానమైనవి. ప్రబంధనాయికలు, వలపు కాకచే కృంగి, కృశించి మన్మథుని, మధుపాళ్ని దూషించుట, చుక్కల రాయని వెక్కిరించుట, తామర చిగుళ్ళపై పవ్వళించుట, చల్లని గంధమలదుట, మొదలైన శృంగారముకన్న ఈ పల్లె పదాలలోని శృంగార ఔచితీ శోభితంగా వుంది. అట్లని నేను ప్రబంధాలను కించపరచటంలేదు. ఎందుకంటే అవి ప్రబంధాలు కనుక. పల్లె పదాలలో సైతం భాషనుడికారం, ఔచిత్యం, భావం ఇబ్బడిముబ్బడిగా ఆవిష్కరించబడిందిని భావిస్తున్నాను. తోరంపు చనుదోయి తృళ్ళింతలిడును కాని, కాకరకాయ రీతిగా కిసలయపాణి చన్నుగవకేళీ గగుర్పొడుచుట కాని ఈ పల్లె పదాలలో కనిపించదు. ఔచితీ శోభితమైన శృంగార రసాన్ని సృష్టించి, ఆబాలగోపాలము సిగ్గుపడనవసరంలేని విధంగా ప్రణయాన్ని చిత్రీకరించిన ఈ పల్లెటూరి భావకవి మన ప్రశంసలకు పాత్రుడు.

శృంగార రసౌచితికి భంగం కాని విధంగా వున్న జానపద సాహిత్యాన్ని సేకరించటం భద్రపరచటం ఎంతో అవసరం.




# ఒద్దిరాజు సోదరులు

## సారస్వత ప్రస్థానం

**– కుర్రా జితేంద్రబాబు**

నిజాం పాలనలో తెలుగు భాషా సారస్వతాలు అత్యంత నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురైన కాలంలో వాటి వ్యాప్తికి, పరిరక్షణకు విశేషమైన కృషి సల్పి తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఇతోధికంగా దోహదపడి ప్రాణంపోసిన ఒద్దిరాజు సోదరులు వరంగల్ జిల్లా, మానుకోట తాలూకా, ఇనుగుర్తి వాస్తవ్యులు దేశముఖ్, దేశపాండ్యాలు ఒద్దిరాజు వెంకట రామారావు, రంగనాయకమ్మలకు జన్మించారు. ఒద్దిరాజు సోదరులుగా ప్రసిద్ధికెక్కిన ఒద్దిరాజు సీతారామ చంద్రరావు 2-4-1887న ఒద్దిరాజు రాఘవరంగారావు 4-4-1894న జన్మించారు. స్వయంకృషితో సంస్కృతాంధ్రాంగ్లాలతో పాటు ఉర్దూ, పారశీ, మరాఠీ, తమిళ, కన్నడ భాషలలో పాండిత్యాన్ని సంపాదించడమేగాక, చౌర్యంతప్ప అరవైనాలుగు కళలలో నైపుణ్యాన్ని సంపాదించారు. చెఱుకుపల్లి గోపాలకృష్ణ శాస్త్రిగారి వద్ద వేదాన్ని అధ్యయనం చేశారు. 1918వ సంవత్సరములో ***విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాల*** పేరున ప్రచురణ సంస్థను ప్రారంభించి అనేక గ్రంథాలను ప్రచురించారు.

తెలంగాణలో సారస్వత సమారాధన అంతగా లేని రోజుల్లో "తెనుగు" వారపత్రికను ప్రారంభించి 1922 ఆగష్టు 27 నుండి ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా వెలువరిస్తూ దాదాపు ఆరు సంవత్సరాల పాటు నడిపారు. "వార్త యందు జగము వర్థిల్లుచున్నది. యదియులేని నాడు యఖిలజనులు నంధకార మగ్నులగుదురు గావున వార్త నిర్వహింపవలయు బతికి". అంటూ పత్రిక టైటిల్‌తో పాటు ఈ వాక్యంకూడా ఉండేది.

20వ శతాబ్ది ఆరంభంలో తెలంగాణాలో తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు ఉద్యమించిన మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు, రావిచెట్టు రంగారావు, నాయని వేంకటరంగారావుల స్ఫూర్తితో సేవా దృక్పథంతో సారస్వత సేవ, విజ్ఞాన వ్యాప్తి, దేశభక్తి ప్రభోదం మూలసూత్రాలుగా చేసుకొని ఆనాటి గ్రంథాలయోద్యమానికి, సాంస్కృతికోద్యమానికి తమవంతు సేవను ఒద్దిరాజు సోదరులందించారు. వీరు కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణ రావు ప్రోత్సాహంతో 1912లో విజ్ఞాన చంద్రికా పరిషత్తు పరీక్షలు రాసి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై కందుకూరి వీరేశలింగం ప్రశంసలను కూడా పొందారు.

ఎస్.రాయ్. ఫార్మసీ పేరుతో మందుల తయారీ సంస్థను స్థాపించి ఆయుర్వేద మందులను తయారుచేసి విస్తృతంగా గ్రామాలలో ప్రచారం చేయటంతో పాటు హోమియోపతి వైద్యంలోనూ కొంతమంది విద్యార్థులకు శిక్షణ ఇప్పించారు. ఆరోజులలో వ్యవసాయంలో నూతన పద్ధతులు ప్రవేశపెడుతూ అనేక ప్రయోగాలు చేస్తూ వచ్చారు. మొట్టమొదటి సారిగా ఆయిల్ ఇంజనులు వారి వ్యవసాయ బావులకు ఏర్పాటు చేసినారు. ఎక్కువ శక్తి కలిగిన ఆయిల్ ఇంజన్‌ల ద్వారా వడ్లదంపుడు, వేరుశెనగ విత్తులు ఒలిచే యంత్రం, నూనె తయారు చేసే గానుగ, పిండి విసిరే తిరగలి మొదలైన యంత్ర పరికరాలను ఏర్పాటు చేసి "గిర్నీ దొరలు"గా ప్రచారం పొందారు. స్వయం ప్రతిభతో ఫోటోగ్రఫీ నేర్చుకుని ప్రజల్లో ఆనాడు ఫోటోలు తీయించుకొనటం వల్ల ఆయుక్షీణం

కుర్రా జితేంద్రబాబు, ఫోన్: 9848882600

జరుగుతుంది అన్న మూఢనమ్మకాలను దూరం చేస్తూ గ్రామస్తులకు ఫోటోలు తీసి ఉచితంగా పంచారు. ఆరోజుల్లో విద్యుత్ తయారీకి ప్రయత్నాలు చేసి బేటరీలతో ఇంటి అవసరాల నిమిత్తం విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ స్వతహాగా పరిశోధించి బేటరీ చార్జింగ్ డైనమోను తయారు చేశారు. గాలి పంకాలద్వారా బేటరీలను చార్జి చేసే పద్ధతులను వారు కనుగొన్నారు. ఒద్దిరాజు సోదరులు అనేక రచనలను చేశారు.

ఒద్దిరాజు సీతారామచంద్రరావు రచనలలో తొలుత వెలువడింది రుద్రమదేవి నవల. (ప్రథమ ముద్రణ 1918, ద్వితీయ ముద్రణ 1922) ఈ రచనను ఒద్దిరాజు సోదరులు స్థాపించిన విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాల ప్రచురించింది. దీని సంపాదకులు అక్కినేపల్లి జానకిరామారావు గారు. ఈ నవల ద్వారా ఒద్దిరాజు చారిత్రక అవగాహనను అర్థం చేసుకొనవచ్చు. సీతారామచంద్ర రావు 'శౌర్యశక్తి', 'భ్రమర', 'బ్రాహ్మణ సాహసము', అను చారిత్రక నవలలను, 'స్త్రీ సాహసము', 'ముక్తలవ' అను నవలలను, 'ప్రేమ ప్రవాహము', 'మోహినీ విలాసము', (1912) అను నాటకాలను, 'శశవిషాణము' అను ఖండ కావ్యమును రచించారు. సీతా రామచంద్రరావుగారు 'సౌదామిని పరిణయము' అను పద్యకావ్యాన్ని రచించారు. దీనిని కాకతీయ విశ్వవిద్యాలయము వారు 1988లో ప్రచురించారు. దీని ప్రథమాశ్వాసము నందు తన పాండిత్యాన్ని గూర్చి



**“వంశీయ పౌర్వీక పౌంస్న విద్యాదుల**
**నెల్ల నాయందు నూహింప గోఱు**
**నట్టింద్రునన్ సంస్కృతాంధ్రాంగ్ల**
**యవనద్రావిడ మ్లేచ్ఛ సారస్వతజ్ఞు**
**డని యనవద్య విద్యాబల కృత**
**చతుర్విధ కవితా ప్రభావిలసిత ప్ర**
**బంధ సంకలుడని వైద్య సంగీత**
**మౌహుర్తిక శాస్త్ర విద్యోతమాను**
**డని యజుస్సంహితా పాఠియని నీలాప**
**నింద పాల్జేయ సహియింపనేర్చి నట్టి**
**శాంతమతిని, సీతారామచంద్రరాయ**
**నామధేయ మరభరుండ నగునేను”**

ఇది ఆరు ఆశ్వాసాల ప్రౌఢ ప్రబంధము. *చంపూకావ్యం.* దీనిలో 1485 గద్య పద్యాలున్నాయి. ఇందులో అవతారికలో 88 పద్యాలలో ఇష్ట దేవతా స్తుతి, గ్రంథకర్త వంశవర్ణన, ప్రస్తావన, కృతి ప్రశంస, షష్ఠ్యంతాలున్నాయి. దీనిలో నాయికానాయకులు సౌదామిని శ్రీకృష్ణులు. వారి పరిణయ కథను పురాణ పాత్రల పద్ధతిలో సంప్రదాయబద్ధమైన వస్తువు, భాష, భావములతో ఈ కావ్యరచనను చేయటం జరిగింది. వీరి ప్రచురిత గ్రంథాల్లో 'చేతిపనులు' అను గ్రంథం ముఖ్యమైనది.

ఈ గ్రంథాన్ని 1922లో విజ్ఞాన ప్రచారిణి గ్రంథమాల తరపున 362 పేజీలు ప్రచురించారు. దీనిలో సిరా, సబ్బులు, హెయిరాయిల్సు, ఔషధాలు, ఐస్‌క్రీములు, షర్బత్తులు మొదలైన 600 రకాల తయారీ పద్ధతులను వివరించారు. 'ఛాయాకర్షణము' అను గ్రంథాన్ని 1921లో విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాల తరపున ప్రచురించారు.

వీరి రచనలు అనేకం అముద్రితాలుగానే ఉన్నాయి. అందులో ముఖ్యమైనవి 'అనాథబాల' (1949 కావ్యం). దీనిలో 325 పద్యాలు ఉన్నాయి. పరమ నిష్ఠాగరిష్ఠులైన వైష్ణవ కుటుంబం ఊరు, పేరు, కులం, గోత్రం, జాతి, మతం తెలియని ఒక అనాథ బాలికను పెంచుకున్న ఇతివృత్తంతో ప్రారంభమైంది. అముద్రిత కావ్యాల్లో పేర్కొన దగినది *ఖడ్గతిక్కన* కావ్యం (1950). ఈ కావ్యం స్వేచ్ఛాస్వాతంత్ర్య భావనలతో రచింపబడినది. దీనిలో అనేక సూక్తులను, లోకోక్తులను, సామెతలను వాడినారు.

అందులో ముఖ్యంగా 'నిత్యకల్యాణం పచ్చతోరణం', 'ఇదం బ్రాహ్మ్యం ఇదం క్షాత్రం', 'పిఠికి బంటు తుమ్మేంనట', 'శౌర్యాధనికి కార్యసాధన చింత తప్పకుండు', 'వజ్రముఁబగల్ప వజ్రమే వలయు', 'ఱాతి కుక్కఁదాకిన గాని వీతహోత్ర ముద్భవించదు', 'వివేక జనముల్టుంలాడరు పని

కొఱకుజ్జగింతురు' లాంటివి వున్నాయి. 'నిస్వార్థ దరిద్రులు' (1951) అనే పేరున ఒక ఖండ కావ్యాన్ని రచించారు. ఇది కూడ అముద్రితము. దీనికి మొదట 'మిత్రయుగళము' అనుపేరు పెట్టి ఆ తరువాత మార్చారు. ఈ కావ్యారంభము ఇద్దరు మిత్రుల మధ్య ఉండే స్నేహబంధముతో ప్రారంభమవుతుంది.

**సీ॥ ఒక లేత తీవ కింపొనర లతాగ్రమందు**
**దయించు కిసలయ యుగము గాదు**
**ఒక గనిలోఁబుట్టి యొఱపుఁగాంచని**
**యట్టి మంజుల రత్న యుగమ్ము గాదు**
**ఒక పూవు గుత్తిఁ బొందిక గాంచి కనిపించు**
**జానగు పూవుల జంట గాదు**
**ఒక తీయమావి రెమ్మకు బుట్టు చవులూరు**
**కమ్మపండుల యుగళమ్ము గాదు**

**తే.గీ॥ ఒక్క కెందమ్మి పూవున నొడయుండేనేఁ**
**దవిలినొడ గోలు కొను నళిద్వయము కాదు**
**ఒక్క యిల్లాలు తొలినోఁచి యున్న నోము**
**పంటగాఁ గన్న కొడుకుల జంట గాదు.**

ఈ యిద్దరు మిత్రులు ఒక తల్లి పిల్లలు కానప్పటికీ, వారి కులగోత్రాలు ఒకటి కానప్పటికీ వారిద్దరి మధ్య ఉన్న స్నేహ బాంధవ్య మాధుర్యాన్ని ఈ ఖండకావ్యంలో సూచిస్తారు. సీతారామచంద్రరావు గారి మరొక అముద్రిత రచన 'నిరసనోపాఖ్యానము' ఇది వ్యంగ్య ప్రధానంగా జరిపిన రచన. శబ్దశాస్త్ర, భాషాశాస్త్ర, వ్యాకరణశాస్త్ర పరిజ్ఞానము లేకుండా రచనలు చేస్తున్న వారిని దృష్టిలోపెట్టుకుని చేసిన రచన యిది. దీనిలో కథానాయకుని వర్ణన:

**చం॥ కుడుచును యాకలైనతరి, కూరిమి పండును నిద్ర వచ్చినన్**
**బడి బడి దేహబాధలను పాయకనడ్డును వేళ వచ్చినం**
**గడువడి గద్దునొప్పయిన గ్రక్కున దల్లడమందు బ్రేమతో**
**న్నడకువతోడ గోక్కొనును న్యాయముగా నసిమీరి లేచినన్**

**కథానాయిక వర్ణన:**

**ఉ॥ ఆ సతి యావులించినను యాదరమొప్పగ నాల్కగన్పడున్**
**బేషుగ నవ్వదంతములు వేమరు బైటకి గానవచ్చెడున్**
**భాసుర రీతి గట్టుకొను బట్టమరుంగున గొంత దేహమున్**
**వాసిగ గొంత బైటయును వైభవమొప్పగనుండు మెండుగన్**

సీతారామచంద్రరావు అముద్రిత రచనలలో 'రాకుమారీ విద్యాభ్యాసము' (1953), 'లోకేశ్వర శతకము', 'మృగసభ', 'మారుమనువు', 'గురు దక్షిణ', 'చ్యవన ప్రతిజ్ఞ', 'మాతృదాస్య విమోచనము', అనునవి కావ్యాలు. 'రక్తమూల్యము', (కథానిక) (సుజాత పత్రిక మార్చి 1928) 'పితృబంధనము', 'ప్రత్యక్ష ప్రమాణము' అనునవి కథానికలు. 'నవనాగరిక భార్య' అను నాటకము, 'మైత్రీపరిణతి', 'ఎరువు సొమ్ము', 'జమీందారీ తౌరు', 'దుష్ట పంచాయితీ', 'మేనరికము', 'మేనత్త', 'మగ సంసారము', 'ఆడపెత్తనము', 'అదృశ్య వ్యక్తి', (కథానిక) (సుజాత పత్రిక అక్టోబరు, డిసెంబరు 1928) 'నటి' (కథానిక) (సుజాత మే 1929), 'సమయ సమరము', 'ఇరువురు మగలు', 'నౌకాభంగము' మొదలగు నాటికలు 'రాణా ప్రతాపసింహుడు', (ఏకాంకిక) (సుజాత పత్రిక జనవరి 1928) ఇతరాలు ముఖ్యమైనవి. సీతారామచంద్రరావుగారి సంస్కృత అముద్రిత రచనలలో ముఖ్యమైనవి. 'కృష్ణస్తవః', 'శ్రీస్తవః', 'శుకపక్షీయం', 'ఉత్సవానందః', 'వైభవస్తవః', 'విభక్త్యర్థమ్', 'ధాతునిఘంటువు', 'వృషవర్ష వింశతి', 'పాణినీయాష్టాధ్యాయి' ముఖ్యమైనవి.

'పాణినీయాష్టా ధ్యాయి'ని సంస్కృత అకాడెమీ వారు ముద్రించే ప్రయత్నంలో ఉన్నారు. ఆ గ్రంథలోని చేతితో వ్రాసిన పుటలను ప్రక్కన ఇస్తున్నాము.

* * *

వీరి ఆంగ్ల రచనలలో కొన్ని – 'The flower', 'The Blessing', 'Dedication of Vidyuthvignanam', 'My Shouts may be so', 'The Pride of the wealth', 'The Character of the Villain', 'The longing', 'The Obligation', 'I am only the mean', 'Manual of English Grammer'..



సీతారామచంద్రరావు గారింటి ప్రధాన ద్వారంపై కనిపించే శ్లోక పాదం.



శ్రీ రామ శ్రీ రామ నమః

ఓం నమః పాణిని కాత్యాయన పతంజలి
మహర్షి మునిభ్యో గురుభ్యో నమః.

పాణిని సూత్ర వృత్తిః

౧ వృద్ధిరాదైచ్॥ (వృద్ధిః, ఆత్ ఐచ్)

ఆదైచాం వృద్ధి సంజ్ఞా స్యాత్॥ (ఆత్ (ఆ) మరియు (ఐ, ఔ) లకు వృద్ధి యను సంజ్ఞ (పేరు) అగును. ఎట్లనగా.—

శాలాయాం భవః = శాలీయః (శాలలయందు పుట్టినది.

ఇతికస్యాపత్యం = ఐతికాయనః (ఇతికుని

ఉపగోరపత్యం = ఔపగవః (ఉపగుని కొడుకు

౨ అదేఙ్ గుణః॥ (అత్ ఏఙ్ గుణః)

అదేఙాం గుణ సంజ్ఞా స్యాత్॥ అత్ (అ) మరియు ఏఙ్ (ఏ, ఓ) లకు గుణసంజ్ఞ యగును. ఎట్లనగా.—

ఆర్కోదయః = ఆర్కుల యొక్క ఉదయము

ఏతి = పోవుచున్నాడు.

తరితా = ఈదెడు వాడు

చేతా = (ఒకదానిని) చేర్చువాడు

స్తోతా = స్తుతి చేయు వాడు.

పచే = నేను వండెదను.

3 ఇకో గుణ వృద్ధీ॥ (ఇకః, గుణవృద్ధీ)

గుణ వృద్ధి శబ్దాభ్యాం యత్ర గుణ వృద్ధీ విధీయేతే తత్రేకః స్థానే స్యాతాం॥ టీ॥ గుణ వృద్ధి శబ్దములలో నెచట గుణ వృద్ధి విధానము చేయబడునో అచట (ఇ, ఉ, ఋ, ఌ స్థానములను) మాత్రమే కాలడు. ఎట్లనగా.—

నయతి = వీనుకొనిపోవుచున్నారు.

అకార్షీత్ = చేసెను.

౪ నధాతులోప ఆర్ధధాతుకే (న, ధాతులోపే ఆర్ధధాతుకే)



2

ధాత్వవయవలోప నిమిత్తే ఆర్ధధాతుకే పరే తన్నిమిత్తే ఇకో గుణవృద్ధీ న స్యాతాం॥ టీ॥ ధాత్వవయవలోప నిమిత్తముగు ఆర్ధధాతుక ప్రత్యయము పరమగునపుడు దాని అర్థముగా ఇక్కునకు గుణ వృద్ధులు రావు. ఎట్లనగా.

లోలువః = మాటిమాటికి కోయువాడు.

మరీమృజః = మాటిమాటికి పవిత్రము చేయువాడు.

౫ క్ఙితి చ॥

గిత్కిఙిన్నిమిత్తే ఇగ్లక్షణే యే గుణవృద్ధీ ప్రాప్నుతస్తే న స్యాతాం॥ టీ॥ కిత్, గిత్, మరియు ఙిత్ ప్రత్యయములు పరమైనపుడు ఇక్‌నకు గుణవృద్ధులు రావు. ఎట్లనగా.

కృతం = చేసినది

జిష్ణుః = జయించెడివాడు

చినుతః = వారిద్దరు పేరుచున్నారు.

౬ దీధీవేవీటాం॥

దీధీవేవ్యోరిటశ్చ గుణవృద్ధీ న స్యాతాం॥ టీ॥ దీధీ—వేవీ—ఇట్—లకు గుణవృద్ధులు రావు॥ ఎట్లనగా.—

ఆదీధ్యనం = ప్రకాశము

ఆవేవ్యనం = గమనము

కణిష్యతి = కాగలదు.

౭ హలోఽనన్తరాః సంయోగః॥ (హలః—అనన్తరాః—సంయోగః) అజ్భిరవ్యవహితా హలః సంయోగ సంజ్ఞాః స్యుః॥ టీ॥ అచ్ దేని అంతరము (మధ్య) నుండదో అట్టి ఒకటిగాని అంతకెక్కువగాని హల్లులకు సంయోగ సంజ్ఞ (పేరు) అగును॥ ఎట్లనగా.—

అగ్నిః = నిప్పు (ఇచట గకారనకారముల మధ్య అచ్చు యొకటి

ఇంద్ర చంద్ర మంద్ర ఇతి = అక్షరము లేదు కావున సంయోగ

౮ ముఖనాసికావచనోఽనునాసికః॥

(ముఖనాసికావచనః—అనునాసికః) ముఖసహిత నాసికయా ఉచ్చార్యమాణో వర్ణోఽనునాసిక సంజ్ఞకః స్యాత్॥ టీ॥ ముఖసహిత నాసికతో దేనిని పలికెదరో ఆ యక్షరము అనునాసిక సంజ్ఞ (పేరు) గలదగును. ఎట్లనగా.—

సంస్కర్తా = సంస్కారము చేయువాడు.



౯ తుల్యాస్యప్రయత్నం సవర్ణం॥ 3

తాల్వాది స్థానమాభ్యంతర ప్రయత్నశ్చేత్యేతద్వయం యస్య యేన తుల్యం తన్మిథః సవర్ణ సంజ్ఞః స్యాత్॥ టీ॥ [illegible] (దంత) మొదలగు స్థానమేగాని మరియు ఆభ్యంతర ప్రయత్నమేగాని యే వర్ణమునకు స్థానమేయే వర్ణముచేత స్థానముల్య మగునో అది ఆ వర్ణముతో పాటు సవర్ణ సంజ్ఞ (పేరు) గలదగును. ఎట్లనగా.—

దణ్డాగ్రం = దంతము యొక్క అగ్రభాగము.

(ఋ ఌ వర్ణయోర్మిథః సవర్ణ్యం వాచ్యం) = ఋకారఌకారములు

హోతృ + ఌకారః = హోతౄకారః (లాంఛనలకు సవర్ణతను చెప్పవలయును

౧౦ నాజ్ఝలౌ॥ (న—అచ్—హలౌ)

తుల్యస్థానప్రయత్నావప్యజ్ఝలౌ మిథః సవర్ణ సంజ్ఞౌ న స్యాతాం॥ టీ॥ తుల్యస్థానము, తుల్యప్రయత్నము గలవియైనను అచ్చులు, హల్లులు పరస్పరము సవర్ణ సంజ్ఞ (పేరు) గలవి కాజాలవు॥ ఎట్లనగా.—

దధిశీతలం = చల్లని పెరుగు.

౧౧ ఈదూదేద్ ద్వివచనం ప్రగృహ్యం॥

(ఈత్—ఊత్—ఏత్—ద్వివచనం—ప్రగృహ్యం) ఈత్—ఊత్—ఏత్—ఇత్యేవమన్తం ద్వివచనం శబ్దరూపం ప్రగృహ్య సంజ్ఞం స్యాత్॥ టీ॥ ఇదంత—ఉదంత—ఏదంతములు ద్వివచనాంత శబ్దరూపమైన అది ప్రగృహ్య (మార్పులు చెందక ఎట్లుండినది అట్లేయుండు) సంజ్ఞ (పేరు) గలదగును. ఎట్లనగా.—

కవీ ఆస్తాం = ఇరువురు కవులుండిరి.

సాధూ ఉపదిశతః = ఇరువురు సాధువులుపదేశించుచున్నారు.

బాలికే ఇమే = వీరిద్దరు బాలికలు.

౧౨ అదసో మాత్॥ (అదసః—మాత్)

అస్మాత్ పరావీదూతౌ ప్రగృహ్య సంజ్ఞౌ స్తః॥ టీ॥ అదస్ శబ్దము యొక్క మకారమునకు పరముగు ఈకార ఊకారములు ప్రగృహ్య సంజ్ఞ (పేరు) గలవియగును॥ ఎట్లనగా.—

అమీ అధీయతే = వారు చదువుచున్నారు.

అమూ ఆసాతే = వారిరువురు ఆర్యులు.

(ఇది (౧౧) వ సూత్రముననే చెప్పబడినది. ఎందుకనగా దీని యందు 'అమీ' అని బహువచనము చెప్పబడినది)



ఒద్దిరాజు సోదరులు చెక్కిన తలుపులు





ఒద్దిరాజు సోదరులు స్వహస్తాలతో నిర్మించుకుని నివాసమున్న గృహాలు

ఇతని ఆంగ్ల కవిత్వ శైలిని పరిశీలించినట్లైతే 'The flower' అనే కవితలో ఒక పువ్వు రాలిపోవటాన్ని గూర్చి తెలుపుతూ...

...through the tyrannic gate
The fate that would send a call
To the wind to cause thy fall.

అంటూ సుకుమారంగా చెప్పే భావాలను గమనించవచ్చు.

ఒద్దిరాజు రాఘవరంగారావు రచనలలో ముద్రితమైన గ్రంథాలలో ముఖ్యమైనవి:

'వీరావేశము', 'వరాహముద్ర', అనునవి చారిత్రక నవలలు. 'పంచకూళకషాయము' అనునది ప్రహసనము. 'విషములు తచ్చికిత్సలు' అనునది వైద్య గ్రంథము. 'సప్తపది', 'ఉత్తర గురుపరంపర', సంప్రదాయ గ్రంథాలు. 'ముదలాయిరం', 'వణ్ణమాడజ్గల్', అను రెండు గ్రంథాలు తమిళ అనువాదాలు. 'సుశీల మైనావతి' అనునది కథానిక.

అముద్రిత రచలలో 'అష్టాధ్యాయి', (ఆంధ్రవ్యాఖ్యాన సాధన సహితము), 'తపతీ సంవరణోపాఖ్యానమ్', 'మత్కుణోపాఖ్యానమ్' ముఖ్యమైనవి.

కాంచీపురం రామానుజ గ్రంథమాల వారు ప్రచురించిన సంస్కృత గ్రంథాలు 'ఆర్తి ప్రబంధమ్', 'సప్తగాథావాఖ్య', మాత్రమే.

సీతారామచంద్రరావు, రాఘవ రంగారావులు కలిసి రచించిన గ్రంథాలు 'ఉపదేశ రత్నమాల', 'తిరుప్పల్లాండు', 'భక్తి సార చరిత్ర'.

ఒద్దిరాజు సోదరులిద్దరికి సాహిత్యంతో పాటు సంగీతంలోనూ చక్కని ప్రవేశం ఉన్నది. వీణ, వాయులీన, మోర్సింగ్ సంగీతాల్లో నిష్ణాతులు.

వీరు చతుష్షష్టి కళల్లో భాగంగా వడ్రంగం, తాపీపని కూడ నేర్చుకుని వీరు సంగీత వాయిద్యాలను వీరే తయారు చేసుకున్నారు. వీరు తయారు చేసిన ఒక వీణకు నారదుని వీణ పేరైన 'మహతి' అని నామకరణం చేశారు. రెండవ వీణ కచ్ఛపి వీణ. దీనిని అష్టకోణాకృతిలో నిర్మించారు.

తాపీపని నేర్చుకొని తమ 'తెనుగు' పత్రిక ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల ఆఫీసు నిమిత్తమై ఓ బంగళాను తమ నివాస గృహాలను వారే సుందరంగా నిర్మించుకొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో వీరు నిర్మించిన బంగళాను కూల్చ, కాల్చ ప్రయత్నించి కమ్యూనిస్టులు విఫలమయ్యారు.

ఆ కోపంతో మాత్రం వీరి సొంత గ్రంథాలయాన్ని దానిలోని అనేక అరుదైన గ్రంథాలను దగ్ధం చేయగలిగారు. వీరు ఆ ప్రాంతంలో నిర్మించిన రైస్ మిల్లును కూడ ఆ కాలంలో ధ్వంసం చేశారు.

ఒద్దిరాజు సీతా రామచంద్రరావు 28-1-1956 లోను, ఒద్దిరాజు రాఘవ రంగారావు 17-5-1973లోను మరణించారు.

ఒద్దిరాజు సోదరులు అర్ధశతాబ్దికాలం తెలుగు భాషా సారస్వతాలకు విశేష సేవలను అందించి చిరస్థాయిగా నిలిచారు. మి

# సంప్రదాయం-సంస్కృతి

నాగరికత అనేది ఒక రీతిలో వుండదు- అదీ మనకు తెలిసిన విధంగా! ఆ తరం వెళ్ళి పోతుంది- దానితో పాటు ఆ మర్యాదలు, ఆ విలువలు కూడా కొట్టుకు పోతాయి. అవి ఏతరంలోనూ ఒకే విధంగా ఉండవు!

దీనికి సంప్రదాయమని – సంస్కృతి అని పదాలను అడ్డు పెట్టుకుని తమ పబ్బం గడుపుకునే పరాన్నభుక్కులు మన దేశంలో కోకొల్లలు.

సంప్రదాయం – భౌగోళికం, కాలబంధం – సంస్కృతి, ఛాందసుల పదం – అది జీవన పరిణామం. ఒక ప్రమాణం కాదు. అందుకనే వీరు చెప్పే విలువలు – వీరి కాదనే విలువలు కేవలం భ్రమ కలిగించే పదాల పటాటోపమే.

సంప్రదాయం-సంస్కృతి ఈ మాటలకు ఇప్పుడు ఏ అర్థం వుంది? సంప్రదాయం అంటూ- మనం గుండు గీయించుకుని పిలక పెట్టుకుని పంచ కట్టుకోవాలా? సంస్కృతి అంటూ – మనం సంస్కృతంలో మాట్లాడాలా? ఈ పదాలు వాడే సంప్రదాయ వాదులు ఏ దుస్తుల్లో వున్నారు- ఏమి తింటున్నారు. ఏ సినిమాలూ చూడరా? ఏ కబ్బుల్లో తిరుగరా?

దీనికి సమాధానం చెప్పలేని పరిస్థితి – అందుకనే మోసపోకండి – వుండలసింది – మానవీయ విలువలు- చెప్పవలసింది మానవీయ విలువల గురించి మాత్రమే. – ఎ.కె.

మన సంస్కృతి నశించిపోతూందన్న
మన పెద్దల విచారానికి
మనవాడు పిలకమాని క్రాఫింగ్ పెట్టుకున్నాడనేది ఆధారం,
మన గలిగినదీ
కాలానికి నిలబడ గలిగినదీ వద్దన్నా పోదు,
మరణించిన అవ్వ నగలు
మన కాలేజీ అమ్మాయి ఎంత పోరినా పెట్టుకోదు.
యుగయుగానికీ స్వభావం మారుతుంది
అగుపించని ప్రభావానికి లొంగుతుంది,
అంతమాత్రాన మనని మనం చిన్నబుచ్చుకొన్నట్టు ఊహించకు
సంతత సమన్వయావిష్కృత వినూత్న వేషం ధరిచడానికి జంకకు
మాధుర్యం, సౌందర్యం, కవితా
మాధ్వీక చషకంలో రంగరించి పంచిపెట్టిన
ప్రాచేతస కాళిదాస కవిసమ్రాట్టులనీ,
ఊహా వ్యూహోత్కర భేదనచణ
ఉపనిషదర్థ మహోదధినిహిత మహిత రత్నరాసుల్నీ
పోగొట్టుకునే బుద్ధిహీనుడెవరు? ఎటొచ్చీ
విధవలకి వ్యాకరణానికీ మనుశిక్షాస్మృతికీ
గౌరవంలేదని వీరికి లోపల దిగులు
వర్తమానావర్త ఘూర్ఘూవీచికలికి
కాళ్ళుతేలిపోయే వీళ్ళేం చెప్పగలరు
మనం మాత్రం భగవదంశ సంభూతులమని వీరి నమ్మిక
సూర్యుడూ చంద్రుడూ దేవతలూ దేవుళ్ళూ
కేవలం వీరికే తమ వోటిచ్చినట్టు వీరి అహమిక
ఇది కూపస్థమండూకోపనిషత్తు
ఇది జాతికి ప్రగతికీ కనబడని విపత్తు
మనవేషం, మనభాషా, మన సంస్కృతీ,
ఆదినుండీ, ద్రవిడ బర్బర యవన తురుష్క హూణులనుండీ,
ఇచ్చినదీ పుచ్చుకున్నదీ ఎంతైనా ఉన్నదనీ,
అయిదు ఖండాల మానవ సంస్కృతి
అఖండ వసుధైక రూపాన్ని ధరిస్తోందనీ,
భవిష్యత్ సింహద్వారం తెరుస్తోందనీ,
గ్రహించలేరు పాపం వీరు
ఆలోచించలేని మంచివాళ్ళు.
ఏ దేశ సంస్కృతి అయినా ఏనాడు కాదొక స్థిరబిందువు
అనేక నదీనదాలు అదృశ్యంగా కలిసిన అంతస్సింధువు.

– దేవరకొండ బాలగంగాధర తిలక్ (1965)



**మ**న అవసరాలను పరిమితం చేసుకో గలిగితే-

మనం పరిసరాలను కాపాడుకోగలం.

పేదల అవసరాలను తీర్చనూ వచ్చు.

సంస్కృతికి నిజమైన అర్థం-
మన కోర్కెలను అదుపులో ఉంచుకోవటమే.
అందుమూలంగానే అర్థవంతమైన ఆనందాన్ని
పొందగలము.
సంతృప్తిని మించిన సంస్కృతి ఏముంటుంది?
అంతకంటే ఆరోగ్యం ఎక్కడుంటుంది?
కొంత వరకు ఈ శరీరానికి హాయి అవసరమే -
కాని మోతాదుకు మించిన సౌఖ్యాలు అనర్థాన్ని తెస్తాయి.
కోరికలను పెంచుకుంటూ పోవటమంటే-
కష్టాలను కొని తెచ్చుకోవటమే.

(జనవరి 30, గాంధీ వర్థంతి)

# మన తెలుగు

- శాఖమూరి రవిచంద్రబాబు

ప్రపంచమంతా చుట్టివచ్చి పాశ్చాత్యదేశస్తుడు భారత దేశానికి వచ్చిన ఇటలీ యాత్రికుడైన నికోలాయ్ కాంటి తెలుగు భాషను "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని కొనియాడడం తెలుగు గడ్డపై పుట్టిన ప్రతి ఒక్కరూ గర్వించదగ్గ విషయం. వినడమే తప్ప అనడం రాని ఆ పాశ్చాత్యుని చెవులకు సైతం ఇంపుగా వినిపించిందంటే మన మాతృభాషలోని మాధుర్యం మాటలకందని మహదానందం.

పాశ్చాత్య దేశస్తుల నుండి ప్రశంసలు పొందడమే గాకుండా, పాశ్చాత్యులచే పరిష్కరింపబడి తాటాకులలోనే సమాధి కాకుండా రక్షింపబడిన భాష కూడా తెలుగు భాష. ఆవిధంగా అన్యులచే అమృత తుల్యంగా భాసింప బడిన మన తెలుగు భాష నేడు ఆదరణ కోసం ఆక్రోశించే పరిస్థితి ఏర్పడింది. దేశభాషలలోనే గొప్పభాషగా తెలుగుభాషని ఆనాడు కీర్తించారంటే అందులోని మాధుర్యం, స్పష్టత, ప్రకాశం విశదమవుతాయి. "నాడులలో మేటినాడు తెలుగునాడు, నవరసాల కళలవీడు, తెనెగూడు" అని ప్రఖ్యాతి చెందింది. తెలుగు.

"కవితలకిల తగిన భాష తెలుగు భాష" అనడంలో సందేహం లేదు. నన్నయ, తిక్కన, ఎర్రన, బమ్మెర పోతన వంటి మహాకవులు తెలుగుభాషా సౌందర్యాన్ని కలకాలం నిలిచిపోయేలా ఉద్గ్రంథాలను మనకందించారు. శ్రీమద్భాగవతం, శ్రీమహాభారతం తెలుగుభాషకి మణిహారాలు. తెలుగులోని మార్దవాన్ని కమ్మని వెన్నగా చవిచూపించిన దేవులపల్లి కృష్ణశాస్త్రి, దాశరథి, సి.నా.రె. వంటి ఆధునిక కవులు చిరస్మరణీయులు. పలువిధాల కళల పంటగా తెలుగు భూమిని అభివర్ణించవచ్చు. ప్రత్యేక నాట్యరీతి కూచిపూడి, త్యాగరాజ కీర్తన తెలుగు వారి వెలుగు జిలుగులు. తెలుగు భాషలోని 'అమ్మ' అనే పదంలోని తీయదనాన్ని మరే భాషలోనూ మనం చవిచూడలేమని ఎందరో పండితులు, పామరులుకూడా అంగీకరించిన వాస్తవం. పేరెన్నిక గన్న ఆంగ్ల, బెంగాలీ, సంస్కృత మొదలైన భాషలలోని ఉత్తమరచనలెన్నో తమ అభిమానభాష అయిన మాతృభాష తెలుగులోకి అనువదించి పరిపుష్టత సాధించిన తెలుగు రచయితలెందరో సాహితీరంగంలో మనకు దర్శనమిస్తారు.

ఆది కవి నన్నయ దగ్గరనుండి నేటి ఆధునిక కవుల దాకా ఎన్నో సొబగులు, సొగసులు దిద్దుకుని భాష విరాజిల్లుతూనే ఉంది. కానీ వ్యవహారంలో భాష పట్ల ఆదరణ అణగారి పోతూఉంది. తెలుగు భాషమాట్లాడడమే అవమానంగా భావించే దుర్గతి ఈనాడు ఆంధ్రదేశంలో మనకు కనిపిస్తుంది. దీనికి కారణం చదవుకున్నవారు, మేధావులు, ఉద్యోగులు, పాలకులు మాత్రమే.

"కొన్ని భాషలు త్వరలో కనుమరుగైపోతాయి" అని విశ్లేషకులు చాలా మంది సెవిస్తున్నారు. భాష ఎన్నటికీ కనుమరుగుకాదు. భాషకు మరణం లేదు. మనమే భాషను చంపేస్తున్నాం. పరభాషా వ్యామోహంలో పడి మాతృభాషపై మమకారం వీడి మోహంలో కొట్టుకు పోతున్నాం. దీనికి ప్రధానకారణం చదువుకున్నవారే. తెలుగు పల్లెల్లో భాష నేటికీ నిత్యనూతనంగా వెలుగుతున్నది. చందమామను చూపిస్తూ కన్నతల్లి బిడ్డకు బువ్వపెట్టడం ఈ నాటికీ మనం చూడవచ్చు. తెలుగు జనపదాలలో నేటికీ శ్రమజీవులు జానపదాలను ఆలపిస్తూనే ఉన్నారు. ఇంటికి వచ్చిన అతిథులను అచ్చమైన ఆరణాల తెలుగు పదాలతో ఆహ్వానిస్తూనే ఉన్నారు. భాషకు జవము, జీవము పల్లెటూళ్లే. పల్లెటూళ్లే ఆప్యాతానురాగాల పలకరింపులకు పట్టు కొమ్మలు, అక్కడ అచ్చతెలుగు భాషకు ఎటువంటి అవరోధమూ, ఆటంకము లేదు. మాతృభాషను బతికి బట్టకట్టనివ్వకుండా చేస్తున్నది పట్టణ ప్రజానీకమే. దీనికి కారణం పాలకుల్లో మాతృభాషపైన ఉన్న అలసత్వం, అలక్ష్యం, దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా మాతృభాష

డాక్టర్ శాఖమూరి రవిచంద్రబాబు, ఫోన్ : 9440271585

చదవకుండానే మాస్టర్ డిగ్రీ వరకు చదువే దుర్గతి ఒక్క ఆంధ్ర రాష్ట్రంలోనే ఉంది. ఏ అధికారభాషా సంఘమూ దీని గురించి ఆత్మవిమర్శ చేసుకోవడానికి సాహసించడం లేదు.

తెలుగుకు ప్రాచీన భాష హోదా కల్పించమని హస్తినాపురానికి హస్తాలు జోడించి వేడుకునే దుర్గతి ఈ నాడు మనకు దారపురించింది. తెలుగు ప్రాచీన భాస అన్న, విషయం జగమెరిగిన సత్యం, 11వ శతాబ్దం నుండి లిఖిత పూర్వకంగా ఉండినదన్న విషయం శాసనాలు సైతం నిర్ధారిస్తున్నాయి. మన తెలుగు భాష ఎన్ని ఒడిదుడకుకులకు లోనైందో మనకందరికీ తెలుసు. కన్నడ ప్రభావం కలిసిపోయినా, తమిళ పదాలను తనలో చేర్చుకొని తస్మయత్వం పొందినా, ఉర్దూ పదాలలో ఊయల లాడినా అది ఒక మన తెలుగు భాషకే చెల్లింది. ఆంగ్ల పదాలు తెలుగు భాషలో నేడు అగ్రస్థానాన్ని ఆక్రమించాయి. అయినా అవి తెలుగు పాదాలే అన్నరీతిగా మన భాషలో మిళితమైనాయి.

దేశవ్యాప్తంగా పది కోట్లకు పైగా ప్రజలు మాట్లాడే భాష ఒక తెలుగు మాత్రమే. ఆంగ్లేయుల కాలంలోనే రూపాయి పైన ఆంగ్లము, హిందీ భాషలతో పాటు తెలుగులో మాత్రమే “ఒక్క రూపాయి” అని ముద్రించే వారు. దీనిని బట్టి ఆనాడే మన భాషకున్న ప్రాముఖ్యత తేటతెల్లమయింది. మన భాషను పరిరక్షించు కోవడానికి, జరిగి పోయిన నష్టాన్ని పూడ్చుకోవడానికి తీసుకోవలసిన చర్చలు చాలా ఉన్నాయి. దీనికి ప్రజల సహకారం, పాలకుల చిత్త శుద్ధి, మేధావుల సంకల్పబలం చాలా అవసరం. ఈ మూడు వర్గాలు కలసి కృషిచేస్తే అజంత భాష అయిన మన తెలుగు భాష అంతరించి పోయే భాష కాదు. అనంతంగా ప్రకాశించే భాషగా నిలిచిపోవడంలో ఎటువంటి సందేహమూ లేదు.

మాతృభాష అయిన మన తెలుగు భాష ఉజ్వలంగా ప్రకాశించాలన్నది మనందరి వాంఛ, కాంక్ష. అలా జరగాలంటే నర్సరీ నుండి డిగ్రీ వరకు తప్పనిసరిగా మాతృభాష చదవాలి. ఏ భాషలో అయినా చదవడం విద్యార్థి హక్కు కానీ మాతృ భాష తప్పనిసరిగా ఒక భాగంగా చదవాలన్నది నిబంధన.

దీనికి పాలకులు తక్షణమే ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయాలి. ఏ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలుకానీ, కళాశాలలుకానీ దీనిని అతిక్రమిస్తే వాటి గుర్తింపును రద్దుచేయాలి. ప్రభుత్వ అధికారులు చిత్తశుద్ధితో దీనిని విధిగా అమలు చేయాలి.

తల్లిదండ్రులు తప్పనిసరిగా ఇందుకు సహకరించాలి. అప్పుడే తెలుగుతల్లి ఋణం మనం తీర్చుకోగలుగుతాం. తెలుగు బిడ్డగా జన్మించిన మన జన్మకు అర్థం, పరమార్థం సాధించిన వారమవుతాము. మి

---



# బందీ

**మంచిగా ఉండి చూడు,**

**ఒంటరిగా మిగిలిపోతావు !**

**ఎంతో చదివావా?**

**ఎందుకూ కొరగావు !**

**ఎవ్వరికీ తలవంచవా?**

**నీ స్వేచ్ఛకు నీవు బందీవి !**

*- ఎ.కె.*



# వడ్డాది పాపయ్య

– బాలి

ప్రబంధ కావ్యకన్యక అందం వెన్నెలలా జాలువారు తుంది ఆయన కుంచెనుంచి. ప్రపంచంలో ఎందరో చిత్రకారులున్నారు. ఒక్కొక్కరిది ఒక్కొక్క శైలి. ఎవరి ప్రత్యేకత వారిదే, కాని వారి చిత్రాలలో వారి గురువులదో, లేక వారిని ప్రభావితులను చేసిన మరొకరి శైలో ఎక్కడో ఒక చోట తొంగిచూస్తుంది. కాని వడ్డాది పాపయ్య సృష్టి అతనికి మాత్రమే పరిమితం. అతనికి గురువు అంటూ లేడు. (తండ్రి వద్ద వారసత్వంగా సంక్రమించినది తప్ప) శిష్యులూ లేరు. అంతా ఏక్ నిరంజన్. అతనికతనే సాటి. అతని శైలి వేరే, రీతివేరే, నడకవేరే, వర్ణమిశ్రమం వేరే–

ఒకే చిత్రంలో కొన్ని వందల వర్ణసమూహాలను ఇమడ్చగలడు. ఎన్ని వర్ణాలున్నా చిత్రం పరిశుభ్రంగా ఉంటుంది. పువ్వులను కౌగలించు కున్న పరిమళం లాంటిది అతని శైలి. అతని చిత్రకళను కొందరు కాలండర్ ఆర్ట్‌గా



తీసివేసినా, అతని దొక శుద్ధ ఛాందస కాల్పనికత అని నిరసించినా, అతనిలోని సృజనను, ప్రతిభను, నైపుణ్యాన్ని అతని చిత్రాలను, శైలిని మెచ్చని వారు కూడా మెచ్చుకుంటారు. అనంతమైన రంగులతో అత్య నంతమైన ఆ రంగుల షేడ్స్‌తో అలరారే ఆయన చిత్రకళ అజరామ రమైనది, చంద మామ, దీపావళి యువ కతనొక ప్రత్యేక ఆకర్షణ. అతని వినూత్న శైలికి తెలుగు వారిగా మనం ఒకించుక గర్వించక తప్పదు.

ఇపుడు చాలా మంది చిత్రకారుల్ని చూస్తున్నాం. పేపర్లలో వాళ్ళగురించి చదవుతున్నాం కూడానూ. అయితే పాపం వాళ్లకి సన్మానాలంటే ఇష్టం ఉండదు. బిరులు వద్దు ఎవరన్నా ఎవార్డ్స్ ఇస్తామంటే అసలే వద్దు అయితే, దీని పక్కన కామా మాత్రమే ఉంటుంది. ఎవరో మరో పేరున్న పెద్దమనిషి బలవంతం చేసి తీసుకోమంటాడు అందుకోసం తీసుకొంటారు. విదేశస్తులెవరో వీళ్ల బొమ్మలు చూస్తారు. వెంటనే వారిని ఎల్లప్పుడూ ఓ కంటకనిపెట్టే ఎడిటరమాత్యుడు ఉంటాడు. పతాకశీర్షికలో రాస్తాడు. తెలుగువారి బావుటా అక్కడెక్కడో ఎగిరిందని. ఆ ఫలానా చిత్రకారుడికి ఇవన్నీ ఇష్టం లేకపోతే జరిగేవేనా ఇవన్నీ?

అకాడెమీలను ఆశ్రయించడం, కళాసంస్థల్ని ప్రసన్నం చేసుకొని గొప్పవాడయి పోవడం, మందిని పోగేసుకొని తనకోసం రాయించుకోవడం లాంటివి చెయ్యని, అసలు మనుషుల్నే దగ్గరకు రానియ్యని ఒకే ఒక చిత్రకారుడు వడ్డాది పాపయ్య – రెండక్షరాలలో చెప్పాలంటే వ.పా. తన దగ్గరకి ఎవర్నీ రానీకపోడమే కాదు తాను ఎవరి దగ్గరికీ వెళ్ళిన జాడలూ లేవు. తన గురించి గోరంతలు, కొండంతలుగా రాయించుకోలేదు. తన పనేమో తనేమో! అంతే. అందుకే ఆయనేమీ సంపాదించుకోలేదు. అవార్డులు ఆయన దరిదాపుల్లోకి రాలేదు. బిరుదులు కనుచూపు మేరలో కనపడలేదు. అరవై సంవత్సరాల కృషి– మహాతపస్సు

బాలి, ఫోన్ : 9849963082

ఆయనది. చందమామ కవర్ మీద ఆయన బొమ్మలు చూసి సినిమా సెట్స్ వేసిన వాళ్ళున్నారు. నగలు చూసి అటువంటివి సినీ దేవతల వేషాలకి డిజైన్ తయారుచేసిన వాళ్ళున్నారు. ఇంతెందుకు ఆయన మరణించినా అతనిచ్చిన, వరవడిని మరచిపోకుండా ఇప్పటికీ చందమామ కవర్ డిజైన్‌లు మరో చిత్రకారుడితో గీయించి అలాగే ప్రచురిస్తున్నారు.

ఆయన చనిపోయినపుడు పత్రికలు ఏవో కొద్దిగా రాసి ఊరుకున్నాయి. దానిక్కారణం ఆయన గురించి ఎప్పుడూ, ఎక్కడా చెప్పుకోకపోవడం, అడిగినా ముక్తసరిగా మాట్లాడ్డం, మిత్రులుగా ఎవర్నీ మిగుల్చుకోక పోవడం అది ఆయన తత్త్వం. చివరి క్షణాల్లో ఆయన కోరింది ఏమిటో తెలుసా? తాను మరణిస్తే ఆ విషయం ఎవరికీ చెప్పవద్దని కుటుంబ సభ్యులను కోరారట.

శ్రీకాకుళంలో 1921 సెప్టెంబరు 10న జన్మించారు. వ.పా. తండ్రి శ్రీరామమూర్తి చిత్రకళా ఉపాధ్యాయుడు. ఆయన ప్రభావం వ.పా. మీద చాలా ఉంది. ఆ విషయం మాటల్లో ఆయనే తెలియజేశారు. ఆయనను పరిచయం చేసుకోవాలంటే కొంచెం ఇబ్బందికరమైన విషయమే! మా ఊరు అనకాపల్లి వెళ్లినపుడు శారదానదికి ఆవల ఒడ్డునున్న ఖాశింకోటలో సొంత ఇల్లు కట్టుకొని సెటిలయిన వ.పా. గార్ని చూడాలని వెళ్లాను. ఆ ఊరు రిక్షాలో చేరగానే నా దగ్గర చుట్టమైన వ్యక్తితో విషయం అంతా చెప్పాను. అతను మెయిన్ రోడ్డులో ఉన్న లైబ్రరీకి తీసుకెళ్ళి లైబ్రేరియన్‌ను పరిచయం చేశాడు. వ.పా. గీసిన సరస్వతీ దేవి బొమ్మ కలువపూలతో వీణాపాణియై గుమ్మానికి ఎదురుగా దర్శన మిచ్చింది. చాలా బాగుంది. లైబ్రేరియన్ అంతా విని మీ పేరు బాలి అని చెప్పకుండా ఏదో మామూలు అభిమాన వ్యక్తిగా పరిచయం చేసుకోమన్నాడు. 'బాలి' మరో చిత్రకారుడిగా గుర్తించి మనస్సు విప్పి మాట్లాడకపోవచ్చని అతని అనుమానం. అదే జరిగింది.

మట్టి బాట వెంట మసీదు చిన్న చిన్న పూరిళ్లు దాటగానే కనపడే చిన్న ఒంటి గది మేడ ఇల్లు అది. ఇంటికీ, వాకిలి గేటుకీ మధ్య ఏదో పూల తీగ ఉంది. మేడ మెట్ల మలుపులో వనిత సంచిక పేజీలు తిరగేస్తూ నిలుచుని ఉన్నాడు వ.పా.

పరిచయాలు అయ్యాక సాదరంగానే మేడ మీది గదిలోకి ఆహ్వానించాడు. అదే ఆయన స్టూడియో. చూడగానే అర్థమయిపోయింది. పెద్ద పొడగరి కాదు. సాదా దుస్తులు. పంచె కట్టు. నోటిలో పళ్లన్నీ ఊడిపోయాయి. మద్రాసు తనకు పడలేదనీ చాన్నాళ్లు పయోరియాతో బాధపడ్డాననీ తరువాతే తన మకాం ఈ ఖాశింకోటకు మారిందని మాటల మధ్య చెప్పాడు.

"మా నాన్నగారు మంచి ఆర్టిస్టు, రంగులు కలపడం, వాటిని ఉపయోగించే పద్ధతి కూడా ఆయన నుండే తెలుసుకున్నాను. దేవతల బొమ్మలు, వెనక పరివారాన్ని చిత్రికరించడంలో దిట్ట. రంగుల పొందికే కాదు-నగిషీలు సాంప్రదాయబద్ధంగా గీసేవాడు- బొమ్మ పూర్తయి దూరం నుండి చూస్తే లేత ముదురు రంగుల్లో అందమే కాదు. ఖచ్చితమైన పెర్‌ఫెక్టివ్‌నెస్ అందులో కనపడేది. మా నాన్న బొమ్మలు వేస్తున్నంతసేపూ దగ్గరే ఉండేవాడ్ని రంగులు కలపడం, బ్రష్‌లు శుభ్రం చేయడం నా పని. అలా నా ఐదవ ఏటనే హనుమంతుని బొమ్మను గీసాను". "శ్రీకాకుళంలో మా ఇంటి దగ్గర ఓ దేవాలయం ఉండేది. ఆ గుళ్లో మా నాన్న చాలా బొమ్మలు గీసాడు".

మేం కూచున్న హాల్లాంటి ఆ పొడవైన గదిలో వెలుతురు వచ్చే చోట పాత కాలపు పెద్ద టేబుల్ ఉంది. దాని మీద అద్దం ముక్కలున్నాయి. వాటి మీద కావలసిన రంగులు కలిపిన గుర్తులున్నాయి. చిన్న చిన్న రంగుడబ్బాలు గూట్లో ఉన్నాయి. అవన్నీ పక్కా కేమిల్ నీటి రంగులు కావు. చాలా



వరకూ బజార్లో ఇనప సామాన్ల కొట్లో దొరికే మామూలు మట్టి రంగులూ, నీలిమందు డబ్బా. అంటే తళతళ లాడే ఫలానా కంపెనీ రంగులే వాడాలని లేదన్న మాట. బొమ్మ వేస్తున్న పేపర్ కూడా చాల మామూలు సాదా సీదా కాయితం. అయితే కాస్త దళసరి ఉంటే చాలు. బొమ్మ లో వచ్చే సంఘటన బట్టీ, రాజకుమార్తె వెనక కోటసీను ఉందనుకుందాం. పెద్ద పెద్ద స్తంభాలతో, దర్వాజాలతో అంతా రంగు రంగులుగా అలంకరణ నిండి ఉంది. పైన ఆర్చీలు ఖచ్చితమైన కొలతలతో. అటువంటివి వెయ్యడానికి, తప్పులు రాకుండా ఉండటానికి కాబోలు. సైజుకి తగ్గట్టు పోస్ట్ కార్డ్ నుండి, అదే మందం గల కాస్త పెద్ద సైజు కార్డ్‌లపై సున్నాలు సున్నాలుగా మోల్డ్‌లు కత్తిరించి ఉన్నాయి. అరిగిపోయిన టూత్ బ్రష్‌లు, గీతలూ, పువ్వులూ ఉన్న అద్దం పెంకులూ గూట్లో ఉన్నాయి. అంటే అవన్నీ రకరకాల టెక్నిక్‌లకు ఉపయోగించ వచ్చున్నమాట.

'శ్రీ సూరిశెట్టి సాంబశివరావు బాబ్జీ (ఈయన కొన్నాళ్లు బాలమిత్రకు ఎడిటర్‌గా పని చేశారు.) గారి వద్ద మీ ఆయిల్ పెయింటింగ్‌లు చూశాను. అవన్నీ నాలుగడుగుల పైగా ఉండే ప్లైవుడ్ చెక్కల మీద. అవన్నీ ఇప్పుడెక్కడ ఉన్నాయి అని అడిగాను.

"అవును – అవన్నీ శ్రమపడి గీసాను– ఖరగ్‌పూర్‌లో ఎగ్జిబిషన్ అయితే తీసుకెళ్ళారు. ఇప్పుడెక్కడున్నాయో తెలీదు" అని సమాధానమిచ్చారు.. ఆ ఆయిల్ పెయింటింగ్‌లు ఇరవై ఏళ్ళ క్రిందటే అనకాపల్లిలో చూశాను. మొత్తం ఇరవై వరకూ ఉంటాయి. అన్నీ ఋతువులూ, కాలానికి సంబంధించినవి. ఎంతో సుందరమైన వర్ణ సమ్మేళనంలో. అందులోని సబ్జెక్ట్‌ను వ.పా. గుర్తు పెట్టుకుని తిరిగి యువ పత్రికలో నీటి రంగుల్లో వేశారు. "ఆయిల్ పెయింటింగ్‌లు చేయడం లేదు. పత్రికల కవర్ డిజైన్లు, లోన ఇండియన్ ఇంక్‌తో కొద్దిగా బొమ్మలు వేస్తున్నాను. అంతా వాటర్ కలర్ చేస్తున్నాను. నాకు మూడ్ అంటూ ఏం లేదు. పత్రికలకు పంపే టైమ్ గుర్తు పెట్టుకుంటాను. ఈ ఊరు పల్లెటూరు త్వరగా పోస్ట్ చేయాలి. ఎప్పుడు వీలయితే అప్పుడు కూచుని కొంచెం కొంచెం పూర్తి చేస్తాను" అని చెప్పుకొచ్చారు.

అంతే కాబోలు. పక్కన మరో వ్యక్తి ఉండగా కుటుంబ సభ్యుడయినా సరే– ఆయన బ్రష్‌ను రంగులో ముంచేవాడు కాదట. బ్రష్‌ను నీళ్లలో పడేసి అవతలి వ్యక్తి అక్కడ్నించి వెళ్లిన తరువాతే బొమ్మ వెయ్య నారంభిచడం ఆయన నేచర్.

సగం సగం వేసి వదిలేసిన బొమ్మలు తలుపు మూల, బల్ల క్రిందా ఉన్నాయి. లక్ష్మీ విష్ణువులు పరిష్వంగ సౌఖ్యంలో ఉన్నప్పుడు చేతులు అటూ ఇటూ అల్లుకుని విష్ణువుకు ఐదు చేతులు కనిపిస్తాయి. దాన్ని నేను గమనించగానే వ.పా. అన్నారు. "అవును, చాలావరకూ పూర్తి చేశాను. ఆరు చేతులు వేశాననుకున్నాను. ఎక్కడో బ్యాలన్స్ తప్పిపోయింది". ఆ హాలు గోడల మీద సగం సగం వేసిన బొమ్మలు ఇంకా చాలా ఉన్నాయి– స్కెచ్ అంతా పూర్తయి కొన్ని భాగాలకు రంగులు వేసి వదిలేసినవి, ఎగురుతున్న హనుమంతుడు, గోపికాకృష్ణుల రాసలీలా దృశ్యం– ఇలా ఎన్నో. అవి ఇక ఆయన పూర్తి చేయకపోవచ్చు. మీ బొమ్మల్లో మీ సంతకం చాలా మార్పు అయింది. మొదట్లో హిందీలో ఉండేది. ప్రస్తుతం రెండు సున్నల మధ్య నిలువుగీత. నాకయితే పూరీ జన్నాథుడు గుర్తొస్తాడు. "మంచిదేగా"– అటు ఏమీలేదు. ఇటు ఏమీలేదు. మధ్య నేను మాత్రం వాస్తవం అనే తాత్త్విక దృష్టి" ఏదో కొంచెం కొంచెం చెప్పాడు. మేడపై పిట్టగోడమీద ఎగురుతున్న హనుమంతుడు. ఆ పక్కన ఎర్రరంగు బ్యాక్ గ్రౌండ్‌లో అదే గుర్తు. హాలులో చాలా చోట్ల కనబడుతుంది. ఇక ఆయన బొమ్మల్లో సరేసరి. నగలుగా, కిరీటంపై రాయిగా, చెట్ల



అన్నమయ్య

ఆకుల్లోనూ కనిపిస్తుంది. ఆయనకు తాత్త్విక దృష్టే కాదు. యువ కు వేసిన లోపలి కవరు పేజీలపై ఎన్నెన్నో సామాజిక విషయాలూ సృజించారు. విశ్వశాంతి గురించి, శాంతి సౌభాగ్యాల గురించి, శాంతికాంక్ష, మతసామరస్యం గురించి. 'సమభారతి' బొమ్మ పేద, ధనిక అంతరాలను సూచిస్తూ, 'కొలువెక్క నోచని బొమ్మా' అని "యథార్థం"లో అతను అనే మనుష్యుల లోని ద్వంద్వ స్వభావాన్ని చూపడం, మనిషిలోని కుళ్ళును, స్వార్థాన్ని ఎండగడుతూ ఎన్నో బొమ్మలు గీశాడు. 'సామాజికాలింగనం', 'రాజకీయ బంధనం', అన్నవి అందులో ప్రధానమైనవి. ఒక రచయిత కథల ద్వారా, కవి కవిత్వం ద్వారా తన భావాన్ని ఎలాగైతే వెలిబుచ్చుతాడో అలా వ.పా. తన భావాన్ని బొమ్మల ద్వారా వెలిబుచ్చాడు. ఆ హాలులోని గోడల మీద వేసిన బొమ్మల మీద నుంచి మన దృష్టిని ఇంకా పైకి సారిస్తే ఆయన ఏ స్థితిలో ఉన్నాయో ఆ గోడలే చెప్తాయి. అక్కడక్కడా పగుళ్ళు, నీళ్లతో గోడలు నానడం వల్ల అంతా నాచుపట్టి చారలు, మరకలు, పెచ్చులూడిపోయి, తనకంటూ ఉన్న చిన్న ఇల్లు అది.

ఆర్థింకగా ఆయన బాగున్నట్లనిపించడు. సంతలో కాయగూరల దుకాణం ముందు కూచుని భుజాల మీద చిరిగిన కావిరంగు గుడ్డల్లో ఉంటూ, రుమాలులో పచ్చి మిరపకాయలు, వంకాయలూ కొని, మూట కట్టుకుని వెడుతూ, వెడుతూ మన వంక ఓ మారు తేరిపార చూసే వ్యక్తి మహా చిత్రకారుడు. రంగుల రాజ్యానికి ఆయనేనా పెట్టాభిషేకం జరిపిందీ? అని అనిపించి ఆశ్చర్యపోతాం. ఆయన వేసే బొమ్మల్లోని నాయకా నాయికలకు ఎన్నెన్నో నగలు తొడుగుతారు. ఎన్నో అందమైన దుస్తులు వేస్తారు. ఆ మనుషుల్ని ఎన్ని వంపుల్లో ఒదుగుతారు. పొడిపొడిగా మాట్లాడ్డం మాటిమాటికి బయటకు పోవడం ఆయన తత్త్వం కాబోలు. పరిచయాలు పెంచుకోవడం, సంతోషంగా మాట్లాడటం, యువ చిత్రకారులను చేరదీయడం వంటివి ఆయన చేసుంటే ఎంతో మంది చిత్రకారులు ఆయన వారసులుగా అవతరించేవారు. శ్రీ నాగిరెడ్డి గారితో గొడవలు రాకుండా ఉంటే (ఒక దశలో) మనం 1970-75 సంవత్సరాల్లో మంచి రంగుల కేలండర్ (పన్నెండు ప్లేట్లతో) చూసి ఉండేవాళ్ళం. ఆయనే స్థిరచిత్తంతో ఉంటే మన ప్రాచీన వైభవంతో నిండిన విషయాలు బొమ్మలతో సహా చూపించిన మంచి పత్రికను చూసి ఉండేవారం. దాని టైటిల్‌తో యువలో ఒక అడ్వర్‌టైజ్‌మెంట్ కూడా వచ్చింది. ఒక దశలో మట్టెలు, మంగళసూత్రాలూ మన తెలుగు స్త్రీల జీవితాల్లో ఎప్పుడు ప్రవేశించినదీ, అమంగళంగా బ్రతుకును వెళ్లదీయడంలో పురుషుల ఆధిపత్య పాత్ర ఎంతవరకూ ఉందన్న విషయాల్లో ఆయన దగ్గర రచనలున్నాయి.

మొదటే అన్నట్లు ఆయన చిత్రకళా రంగంలో విపరీతంగా కృషిచేసినా ఎవరూ పట్టించుకోలేదు. అక్కడ గొలుసులు లాగితే ఇక్కడ మొరిగే భజనపరులు ఆయనకు లేరు. అటువంటి వ్యక్తికి అవన్నీ అక్కర్లేదేమో! ఆయన మహాఋషి. ఋషిలాగే ఊరి చివర ఆ చిన్న ఇంటిలో చిత్రకళా తపస్సు చేశారు. జీవితాంతమూ దృష్టి ఆనకపోయి, చేతులు వణికిపోతున్నా ఇంకా ఏవేవో వేస్తూ కొంచెం బ్రష్, కొంచెం రంగూ, మార్కర్ పెన్నూ ఉపయోగిస్తూ చివరికంటా బొమ్మలు వేశారు. ముఖ్యంగా వ్యక్తిగత ప్రచారానికి ఆయన ఇష్టపడే వారు కాదు. "ఒక వ్యక్తిని ప్రేమిస్తే ఊహకు తగ్గట్టు వారుండక పోతే నిరుత్సాం కల్గుతుంది. కళాకారునిగా నన్ను అభిమానించ వద్దు, నా కళనే అభిమానించండి" అని తన అభిమానులను కోరేవారు. వ్యక్తి ఆరాధన కన్నా, ఆ వ్యక్తి సృజనాత్మకత కృషి, వారి గుణాలే నా కిష్టం అనేవారు. వీరి గురించి తెలుసుకోవాలని ఎంతో మంది వీరి ఇంటికి వెళ్ళి నిరాశతో వెనుదిరిగి వచ్చారు. వీరి అవసాన దశలో హైదరాబాద్ దూరదర్శన్ వారు ఇంటర్వ్యూ చెయ్యడానికి కెమెరాతో సహా 'కశింకోట' వెళ్ళినా వాళ్ళని నిర్మొహమాటంగా పంపివేసారు.

వ.పా. మిత్రుల బలవంతంపై ఖరగ్‌పూర్‌లోనూ, శ్రీకాకుళలోనూ చాలా కాలం క్రితం తన వ్యక్తిగత చిత్రకళా ప్రదర్శనలు నిర్వహించారు. తర్వాత ఎంతమంది కోరినా అంగీకరించలేదు. ఆంధ్రా ఆర్టిస్టు, స్కల్ప్‌టర్స్ అండ్ కార్టూనిస్టు అసోసియేషన్ వారు విజయవాడలో వీరి చిత్రాలను, స్లైడ్స్ ప్రదర్శనను యం.యస్.మూర్తి ఆర్ట్ గాలరీలో ప్రదర్శించి కళాభిమానులకు కనువిందు చేశారు. వీర్ని సత్కరించడానికి ఎందరో ఉత్సాహం చూపినా అందుకు ఆయన అనుమతించలేదు. వీటన్నిటికీ దూరంగా ఉండదల్చుకున్నానని అంటూండేవారు. సన్మానాలు, బిరుదులు అందుకునే అవసరం లేని మహా చిత్రకారుడు ఆయన. సామాన్యుల మనో నేత్రాలపై చెరగని ముద్ర వేసిన చిత్రకళా తపస్వి వడ్డాది పాపయ్య.

*ఈ సంచిక రంగుల బొమ్మలు వడ్డాది పాపయ్య వేసినవే.*

## సాహిత్యం
# భాషయొక్క విశిష్ట ప్రయోగం

*- గోవింద చంద్ర పాండే*

**సరస్వతీ సమ్మాన్ స్వీకారోపన్యాసం:**

**"వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే**
**జగతఃపితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ"** (రఘువంశం)

*(పదము, అర్థము లాగా కూడి ఉన్న జగజ్జనని, జగజ్జనకుడు అయిన పార్వతీ పరమేశ్వరులకు వాక్కు, అర్థము రెండింటి సిద్ధికోసం నా వందనాలు అర్పిస్తున్నాను).*

కవికుల గురువు కాళిదాసు చూపిన మార్గంలోనే నడిచి ఆచార్య మమ్మటుడు కవిత్వాన్ని 'తదదోషౌ శబ్దార్థౌ సగుణావనలంకృతీ పునః క్వాపి' (దోషరహితమైన పదాలు, అర్థాలు, ఉత్కృష్టత, ఉండి, అక్కడక్కడ అలంకారాలు కలిగినది), అని నిర్వచించాడు. పండిత రాజ జగన్నాథుడు 'రమణీయార్థ ప్రతిపాదకః శబ్దః కావ్యమ్' (రమణీయమైన అర్థాన్ని వెలిబుచ్చే పదమే కావ్యము) అన్నాడు. ఈ నిర్వచనాలను చూసినప్పుడు కవిత్వంలో గానీ సాహిత్యంలో గానీ ప్రాథమికమైంది పదమే అని తెలుస్తుంది.

ఆధునిక పదజాలంలో 'సాహిత్యం భాష యొక్క విశిష్టమైన ప్రయోగం' అని అనడం అభ్యంతరకరం కాదనుకుంటాను. తత్వశాస్త్రం, విజ్ఞానంలో కూడా భాషయొక్క ప్రయోగం విశిష్టమైన పద్ధతిలో జరుగుతుంది కదా, అని ఎవరైనా అనవచ్చు. అయితే సాహిత్యంలో జరిగే భాష యొక్క ప్రయోగం ప్రత్యేకతతో ఉండడమే కాక మహిమామయంగా కూడా ఉంటుంది. ఎందుచేతనంటే సాహిత్యంలో భాష ద్వారా విషయాలను సజీవమైన పదచిత్రాల రూపంలో చలన చిత్రంలోని పాత్రల్లాగా ముందుంచడం జరుగుతుంది. అన్నిటికంటే ముందు భాషకు సంబంధించి ప్రచారంలో ఉన్న కొన్ని భ్రమల గురించి చెప్పడం అవసరమని నాకు తోస్తొంది. ఆధునిక భాషాశాస్త్ర వికాసానికి రెండు దశలున్నాయి. తులనాత్మక భాషా శాస్త్ర రూపంలో భాషాశాస్త్ర వికాసం జరిగింది సంస్కృతంతో పరిచయం కలిగిన తర్వాతనే. సంస్కృత వ్యాకరణంలో భాష నిర్మాణాన్ని అద్భుతమైన పారదర్శకతతో వెలువరించడం జరిగింది.

దాని ఆధారంగా పాశ్చాత్య పరిశోధకులు భారతీయ-యూరోపీయ భాషల మధ్య ఉన్న సామ్యాన్ని చూశారు. ఆ యుగం రొమాంటిసిజానికి సంబంధించిన యుగం కూడా కావడం వల్ల రొమాంటిసిజంలో ఏ విధంగా జాతులను, జాతుల స్మృతులను, ప్రాణుల్లాగా వికాసించే గుణం కలిగిన శక్తులుగా చూడడం జరిగిందో, అదే విధంగా భాషలను కూడా జాతి చరిత్రలో భాగంగా పుడుతూ - గిడుతూ ఉన్నట్లు భావించడం జరిగింది. అయితే ఈ అభిప్రాయం సరికాదు. ఎందుచేతనంటే భాష జాతులకు జన్మతః ప్రాప్తించే లక్షణాల్లాంటి సహజ ధర్మం కాదు. అలాగే అది సాంఘిక వ్యవస్థల్లాగా చరిత్ర నిర్మితం కూడా కాదు. ఎందువల్లనంటే భాష తనంతతానే రాదు. బోధన ద్వారానే వస్తుంది. బోధన మార్పు లేకుండా ఒకే విధంగా ఉన్నంత వరకు భాష కూడా అలాగే నిలిచి ఉంటుంది. అది సహజ మరణం పొందుతుందని గానీ, తప్పని సరిగా మరణించి తీరుతుందని గానీ అనలేం. అన్ని భాషల్లోనూ మార్పు ప్రక్రియకుండే వేగం కూడా వేరువేరుగా ఉంటుంది. ఏ విధంగా సెమిటిక్ భాషలు (హిబ్రూ, అరబిక్ మొదలైన భాషలు) అతి తక్కువగా మార్పు చెందాయో, అదే విధంగా చైనా భాష, దాని లిఖిత రూపం, సంస్కృతభాష వ్యాకరణ నిర్మాణం, ఇవి కూడా చాలా తక్కువే మార్పు చెందాయి. ఇతర ప్రాణులకు, మనిషికి ఉన్న ముఖ్యమైన తేడా

హిందీ నుంచి అనువాదం : డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి, ఫోన్ : 09811589430

ఏమిటంటే, మనిషి ఇంద్రియ సంవేదనలకంటే మనోవికల్పాల్లో, మనో లోకంలో ఎక్కువ జీవితం గడుపుతాడు. భాష మనిషి భౌతిక–సామాజిక సంవాదానికి మాత్రమే సాధనం కాదు. అది అతని ఆత్మ చైతన్యాభివ్యక్తికి కూడా ఉపకరించే సాధనం. మనిషి భాష ద్వారా తనను తాను చైతన్యం కలిగిన ఒక ప్రాణిగా వ్యక్తీకరించుకోగలుగుతున్నాడు.

రస సిద్ధాంతం, శబ్దశక్తి వివేచన, మొదలైన అంశాల్లో ప్రాచీన సాహిత్య శాస్త్రం యొక్క శాశ్వతమైన విలువలు, సార్థకత మనకు తెలిసి వస్తున్నా కూడా మారిన కాలానికి అనుగుణంగా ప్రాచీన సాహిత్య రూపాల్లో, భావాల్లో మార్పు రావడం అవసరం. మహాకావ్యం లాంటి ప్రక్రియలు ఇప్పుడు అంతగా ప్రచారంలో లేవు. నవలలాంటి ప్రక్రియల్లో రాయడమే ఎక్కువగా జరుగుతూంది. మనోభావాలు సామాజిక పరిస్థితులననుసరించి మార్పు చెందుతూ ఉంటాయి. రాగద్వేషాలు, భయం, క్రోధం, శోకం ఎప్పుడూ ఉండేవే. అయినా వాటిని ఉద్రేకపరిచే విషయాలు, వాటి అభివ్యక్తి రూపాలు మారుతూ ఉంటాయి. ఉదాహరణకు భగవద్భక్తి ప్రాచీన అలంకార శాస్త్రంలో ఒక రసంగా గుర్తింపు పొందలేదు. భరతుని నాట్యశాస్త్రంలో శాంత రసానికి కూడా ఒక రసంగా స్వీకృతి లభించలేదు. ఆధునిక యుగంలో దేశప్రేమ, విశ్వశాంతి, సాంఘిక సమానత్వం, మొదలైన అనేక కొత్త భావాలు కొత్త కావ్యవస్తువులకు జన్మనిస్తున్నాయి. ప్రేమ, శోకం వీటి అభివ్యక్తి పద్ధతుల్లో ఔచిత్యభావన కూడా మార్పు చెందింది. శృంగారం యొక్క రూపం వాల్మీకిలో ఒక విధంగా ఉంటే, తులసీదాసులో మరో విధంగా ఉంది. శరత్‌చంద్రలో ఇంకో విధంగా ఉంది. అలాగే వీరరస రూపం కాడా. ఈ విధంగా సాహిత్యంతో ఏకాకారమైన రసం శాశ్వతమే అయినా, దానికి ఉపకరించే వస్తువులు, అభివ్యక్తి రూపాలు కాలానుగుణంగా మారుతూ ఉంటాయి.

సాహిత్యం అజరామరంగా ఉంటుందనే భావన ఒక పరిమితమైన అర్థంలోనే, ఒక అరూపమైన అర్థంలోనే సత్యం. సాహిత్యంలో అమరత్వకాంక్ష ఉంటుంది. అయితే అన్ని మానవ కాంక్షల్లాగే అది కూడా మృత్యువు పరిధిలోనే ఉంటుంది. సాహిత్యం సంస్కృతి ప్రవాహంలో జన్మిస్తుంది. అక్కడే అది తన రూపాన్ని, శరీరాన్ని పొందుతుంది. అయితే అందులో సనాతన మానవత ప్రతిబింబిస్తూ ఉంటుంది నచికేతునితో యముడు "నేను అనిత్యమైన సాధనాల ద్వారా నిత్యమైన నిధులను సంపాదించాను", అని అన్నాడు. శంకరాచార్యుడు నిత్యత్వం సాపేక్షమైందని, నిరపేక్షమైంది కాదని, వ్యాఖ్యానించాడు. సాహిత్యం యొక్క పరిస్థితి కూడా అంతే. భాష, నైతిక నియమాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలు, లాంటి ప్రధానమైన అనిత్య సాంస్కృతిక సాధనాల పైన సాహిత్యం ఆధారపడి ఉంటుంది.

అందువల్ల సర్వశ్రేష్ఠ సాహిత్య రచనలు ఎల్లప్పుడు పరిశీలించ తగినవే అయినా అవి సాహిత్యకారునికి ఎల్లప్పుడూ అనుకరణీయమైనవి మాత్రం కావు, అనేది ధ్రువసత్యం. సాహిత్యంలో శాశ్వత ప్రమాణాలు ఏవీలేవు. అలాంటి ప్రమాణాలను స్థాపించాలనే భ్రమవల్ల సాహిత్య ఔన్నత్యం తగ్గుతూ పోతుంది.

సంస్కృతంలో కొత్త రచనలు రాకుండా పోవడం అనేది ఎన్నడూ జరగకపోయినా ఈ కొత్త రచనల్లో చాలా వరకు ప్రాచీన రూపాల, ప్రమాణాల అనుకరణ–అనుసరణ బయటికి కనిపించని అడ్డంకిగా వుంటుంది. మరో వైపు కొందరు సంస్కృత రచయితలు సంప్రదాయాన్ని వదలిపెట్టి ఇతర భాషల కొత్త తరహా రచనలను అనుకరించినప్పుడు వారి రచనలు హాస్యాస్పదంగా మారుతాయి. సంప్రదాయంతో సంబంధం తెంచుకోకుండా ఏవిధంగా అందులో అపూర్వమైన రచనలు చేయవచ్చు, అనే దానికి ఉదాహరణగా రవీంద్రనాథ్ టాగూరును తీసుకోవచ్చు. ఆయన రచనలు సంప్రదాయం యొక్క వివిధ పార్శ్వాలతో చేరి ఉంటూ కూడా భావాల్లో, భాషలో, పద చిత్రాల్లో కొత్తదనాన్ని సంతరించుకొని ఉన్నాయి. చైతన్యం జన్మాంతరం పొందిన విధంగా. సంస్కృతంలో కూడా ఇదేవిధంగా నవ్యరీతి రచనలు చేసే అవకాశం ఉంది. అంబికాదత్త వ్యాస్ రాసిన 'శివరాజ విజయమ్'లో కథానుకరణ ఉన్నా కూడా అది ఒక అపూర్వ రచన.

సంస్కృతం భారతీయ సంస్కృతి యొక్క ఒక ప్రాథమికమైన, శాశ్వతమైన తత్వమని నా అభిప్రాయం. సంస్కృతం అన్ని భారతీయ భాషలను కలుపుతుంది, వాటికి ప్రాణం పోస్తుంది. సంస్కృతం లేకుండా భారతీయ మనీషతో గాఢమైన పరిచయం పొందడం అసంభవం. భారతీయ సహృదయత, సౌందర్య భావన, భావ సంపద, వీటి మూలాధారం సంస్కృత కావ్యాల్లోనే ఉంది. అయితే ఈ కావ్యాలను వైదిక యుగం నుంచే తీసుకోవాలి. పుట్టినప్పటి నుంచీ ఒక సజీవభాష మాట్లాడే వ్యక్తికి ఆ భాష పైన ఎలాంటి

అధికారం ఏర్పడుతుందో, అలాంటి అధికారమే సంస్కృతం పైన కూడా ఆ భాషను అధ్యయనం చేసిన వ్యక్తికి కలిగించే అద్వితీయమైన శక్తి సంస్కృత వ్యాకరణానికి ఉంది.

సంస్కృత భాష, సాహిత్యం చదువుతూ ఉన్నప్పుడు ఆత్మాభివ్యక్తికి ఉపకరించే బలమైన సాధనం అందులో ఉందని నాకు తోచింది. అందువల్లనే నేను సంస్కృతంలో రచన చేశాను. సాధారణంగా నేనిప్పుడు ఏ విషయాలను గురించి ఆలోచిస్తున్నానో, నా సమకాలికులు ఆలోచిస్తున్నారో, వాటిని వ్యక్తీకరించడం కోసం సంస్కృతం ఉపకరించదని నాకు ఎప్పుడూ అనిపించలేదు. ఏ విధంగా మనం హిందీ, ఇంగ్లీషు మధ్య రాకపోకలు జరుపుతూ ఉంటామో, అదే విధంగా సంస్కృతం, హిందీ, ఇంగ్లీషు మధ్య కూడా జరపవచ్చు. 35 ఏండ్ల కిందట మా గురువు ప్రొ. క్షేత్రేశ్ చంద్ర చట్టోపాధ్యాయ, నేను, ఎప్పుడు ఏమి మాట్లాడినా సంస్కృతంలోనే మాట్లాడాలనే నియమం పెట్టుకున్నాం. ఈ అనుభవం వల్ల సంస్కృతం నాకు ఎల్లప్పుడు ఒక జీవద్భాషగానే తోచింది. లోతైన ప్రశ్నల గురించి ఆలోచించినప్పుడు విషయాలు నాకు సంస్కృతంలోనే స్ఫురిస్తాయి. సంస్కృతంలో సంప్రదాయం సజీవంగా ఉన్నప్పటికీ అది వర్తమాన యుగంకోసం కూడా తనను సజీవంగా ఉంచుకుంటుంది. వ్యక్తిగతంగా నాకు సంస్కృత పదాల ధ్వనులు, ఆ పదాలతో కూడిన అర్థస్ఫోకరమైన రచనలు, అందులోని సమాస నిర్మాణం, ఛందస్సు, లయ, వీటిపట్ల చిన్నప్పటి నుంచీ నిరోధించలేని ఆకర్షణ ఉంటూ వచ్చిందని అంగీకరించడానికి నాకు ఎలాంటి సంకోచం లేదు. అన్నిటికంటే ముందు నేను సుమిత్రానందన్ పంత్ 'పల్లవ్' కవితా సంపుటి చదివి, అందులోని పదాల లాలిత్యం పట్ల ముగ్ధుణ్ణయ్యాను. ఆ తర్వాత కొద్ది రోజుల్లోనే 'రఘువంశం' చదివాను. అప్పుడు ఛాయావాద (హిందీ భావవాద) కవిత్వంలో ఉన్నది సంస్కృత ఛాయే అని అనిపించింది.

నేనింత వరకు భాష, సాహిత్యం, సంస్కృతి గురించి సాధారణంగా నా ఆలోచనలు ఏమిటి? అనే దాన్ని గురించి క్లుప్తంగా చెప్పాను. 'భాగీరథీ' (సరస్వతీ సమ్మాన్ పొందిన రచన) గురించి విశేషంగా ఏమైనా చెప్పే అధికారం నాకులేదు. అయినా కొంత చెప్పేందుకు సాహసిస్తాను. 'కాలంతో పోటీ పడే' శక్తి ఏ మానవునికీ లేదు. అయినా దేవవాణి సంస్కృతం అన్ని యుగాల్లో అమృతత్వ సందేశం ఇస్తుంది. అనేక యుగాల్లో దేవవాణి సంస్కృతం ఆర్జించిన శక్తి ఆధారంగా నేను కూడా 'భాగీరథీ' స్వప్నం చూశాను. సంస్కృతం ప్రపంచంలో అన్నిటికంటే ప్రాచీనమైన, సమృద్ధి గలిగిన భాష. దీనికి ఐదువేల సంవత్సరాల అవిచ్ఛిన్నమైన చరిత్ర ఉంది. కేవలం భారత దేశంలోనే కాదు, మొత్తం ఆసియా, మధ్య ఆసియా, దక్షిణ ఆసియా, దక్షిణ-పూర్వ ఆసియాలో చాలాకాలం దాకా దీని వ్యాప్తి కొనసాగింది. మతపరమైన జీవితం కారణంగా, విద్యాబోధనకు సంబంధించిన రచనలు చేసే సంప్రదాయం కారణంగా సంస్కృతం ఇప్పటికీ ప్రాణవంతమైన భాషే. ఇంగ్లీషు ప్రొఫెసరు నా మిత్రుడొకాయన ఒకసారి ఇంగ్లీషు కవిత్వాన్ని సంస్కృతంలో అనువదించడం వీలుకాదని సవాలు చేశాడు. దానికి జవాబుగా నేను 'అస్తాచలీయమ్' రాశాను. అందులో నలభై మంది ఆధునిక ఇంగ్లీషు కవుల కవితల అనువాదం ఉంది. 'భాగీరథీ'లో ఇతర రచనల ఛాయ ఉన్న రెండు-మూడు కవితలు తప్ప మిగిలినవన్నీ పూర్తిగా నా మౌలిక రచనలే. ఏ విధంగా నా జీవితంలో, నా పరిసరాల జీవితంలో కొత్త-పాత, స్వదేశీ-విదేశీ అంశాలు దట్టంగా అలుముకొని ఉన్నాయో, అదే విధంగా 'భాగీరథీ'లో కూడా ఉన్నాయి. నాలో సనాతన ధార్మిక సంప్రదాయాలు, సంస్కృత శాస్త్రాల అధ్యయనం, ఇవన్నీ సమృద్ధిగా ఉన్న కుటుంబం నుంచి వచ్చిన సంస్కారాలు ఒకవైపు ఉంటే, మరోవైపు ఆధునిక విశ్వవిద్యాలయ విద్య, దేశ-విదేశాల అనుభవం ఉన్నాయి. వీటితోనే నా జీవన దృక్పథం ఏర్పడింది. అందులో వేదాంత దృక్పథం, బౌద్ధ సిద్ధాంతాల దృక్పథం, రెండింటి ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ రెండు దృక్పథాలు పరస్పరం వ్యతిరేకం అని చాలా మంది నమ్ముతారు. అయితే నేను ఈ రెండింటిలో లోతైన ఐక్యత ఉందని ప్రతిపాదించాను.

భారతీయ సంస్కృతి వైదిక, శ్రమణ, ఈ రెండు సంప్రదాయాల మూల సూత్రాలతో నిర్మితమైంది. ఆధునికత ప్రవేశం కూడా అందులో ఎలాంటి అనివార్యమైన వ్యతిరేకతను పుట్టించదు. వైజ్ఞానికత, తార్కికత, వ్యక్తి స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, మొదలైన వాటి మూల సూత్రాలు భారతీయ సంప్రదాయంలో వైదిక యుగం నుంచే కనిపిస్తాయి. భూస్వామ్యవాద యుగం నాటి, వలసపాలన యుగం నాటి అంధ సంకీర్ణతలు గత రెండు శతాబ్దాల పునరుజ్జీవన భావజాల ప్రభావంతో చాలా వరకు తొలగి పోయాయి. అయినా కనుమరుగై పోయిన సంపదను వెలుగులోకి తీసుకొచ్చే పని ఇంకా జరగాల్సి ఉంది. కాల మహిమ చాలా బలమైంది.

అందులో భయం, విషాదం, ఆశ మూడూ ఉన్నాయి. స్మృతుల్లో గతం జీవించి ఉంటుంది. అయితే అది భవిష్యత్తుకు ఆరంభం కూడా అవుతుంది.

'భాగీరథీ'లో అనేక స్వరాల ఝంకృతి ఉంది. అయితే చరిత్ర, ప్రకృతి, చైతన్యం ఇందులోని ముఖ్యమైన విషయాలు.

చైతన్యంలో లోతుగా ప్రవేశించడం, సత్యసారాన్ని అన్వేషించడం 'భాగీరథీ'లోని మరో దిశ.

ఇప్పుడు కవికుల గురువు కాళిదాసు మరో వ్యాక్యాన్ని గుర్తుకు తెచ్చుకోవడం సమంజసమనుకుంటాను--

**ఆ పరితోషాద్విదుషాం న సాధు మన్యే ప్రయోగ విజ్ఞానమ్।**
**బలవదపి శిక్షితానామాత్మన్య ప్రత్యయం చేతః॥**

*(అభిజ్ఞాన శాకుంతలమ్)*

(పండితులైనవారు సంతృప్తి చెందేవరకు నా నాటకకళ సఫలమైనట్లుగా నేను భావించను. ఎంతో బాగా శిక్షణ పొందినవారు కూడా (పండితుల ఎదుట) భయకంపితులు కాకుండా ఉండలేరు)

చివరన 'భాగీరథీ'ని ఈ పురస్కారానికి యోగ్యమైందిగా భావించిన గౌరవనీయులు శ్రీ కే.కే. బిర్లా గారికి, ఆయన స్థాపించిన సంస్థకు, దాని సంచాలకులు శ్రీ బిశన్ టండన్‌కు, చయన పరిషత్తు అధ్యక్షులు న్యాయమూర్తి శ్రీ జి.బి. పట్నాయక్ గారికి, ఇతర సభ్యులకు నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

**జీవితం, సాహిత్యం:**

గోవింద చంద్ర పాండే 1923లో అలహాబాదులో జన్మించారు. 1937లో పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి మొదటి తరగతిలో మెట్రిక్ పరీక్ష ఉత్తీర్ణులయ్యారు. 1940లో మొత్తం ఉత్తరప్రదేశ్‌లో ఇంటర్మీడియట్‌లో మూడవ స్థానం పొంది మొదటి తరగతిలో ఉత్తీర్ణులయ్యారు. ఈ పరీక్షలో సంస్కృతంలో విశిష్టమైన యోగ్యత, ప్రథమ స్థానం పొందారు. ఆ తర్వాత అలహాబాదు విశ్వవిద్యాలయం నుంచి బి.ఏ. ఎమ్.ఏ. రెండు పరీక్షలు ప్రథమ స్థానం పొంది ఉత్తీర్ణులయ్యారు. 1947లో డి.ఫిల్. డిగ్రీ పొందారు. సంస్కృతం, పాలీ, ప్రాకృత భాషల్లో వీరు మంచి పాండిత్యం సంపాదించారు. పండిత్ రఘువీర దత్త శాస్త్రి, పండిత్ రామశంకర్ ద్వివేదీ, పండిత్ పి.కే. చట్టోపాధ్యాయ లాంటి ప్రసిద్ధ సంప్రదాయ పండితుల వద్ద, ఆధునిక పండితుల వద్ద ఈయన సంస్కృత అధ్యయనం చేశారు. ఫ్రెంచ్, జర్మన్, బుద్ధ – చైనీస్, గ్రీక్, ల్యాటన్, పారసీ భాషలు కూడా అభ్యసించారు. డబ్ల్యు. పాబో నుంచి ఈయన బుద్ధ–చైనీస్ చదువుకున్నారు. 1947 నుంచి 1957 దాకా అలహాబాదు విశ్వవిద్యాలయం లోని ప్రాచీన చరిత్ర–సంస్కృతి, పురాతత్త్వ శాస్త్ర విభాగాల్లో లెక్చరర్‌గా, రీడర్‌గా పనిచేశారు. 1957లో గోరఖపూర్ విశ్వవిద్యాలయంలో ప్రాచీన చరిత్ర–సంస్కృతి, పురాతత్త్వశాస్త్ర విభాగంలో ప్రొఫెసరు అయ్యారు. అక్కడ ఉండగానే ఆయనకు 1962లో రాజస్థాన్ విశ్వవిద్యాలయం జయపూర్ నుంచి భారతీయ సంస్కృతి ప్రొఫెసరుగా, చరిత్ర విభాగం అధ్యక్షుడుగా పదవి స్వీకరించమని ఆహ్వానం అందింది. 1968 నుంచి 1971 దాకా అక్కడి Arts Faculty కి Deanగా ఉన్నారు. రాజస్థాన్ విశ్వవిద్యాలయంలో 1974 నుంచి 1977 దాకా కులపతిగా ఉన్న తర్వాత 1978లో మునుపు చదువుకున్న అలహాబాదు విశ్వవిద్యాలయానికి తిరిగి వచ్చి 1984లో కులపతి పదవి నుంచి పదవీ విరమణ చేశారు. 1984–85లో బనారస్ హిందు విశ్వవిద్యాలయంలో విజిటింగ్ గయక్ వాడ్ ప్రొఫెసరుగా, 1985–86లో Indian Council for Historical Research లో మొదటి National fellow గా ఉన్నారు. ఆ తర్వాత సిమ్లాలోని Indian Institute of Advanced Study కి, Allahabad Museum Societyకి, సారనాథ్‌లోని Central Institute of Higher Tibetan Studiesకు అధ్యక్షులుగా, Project in Indian History of Science, Philosophy and Culture కు Editorial Fellow గా బాధ్యతలు నిర్వహించారు.

వృత్తిరీత్యా చరిత్రకారుడైన ప్రొ. పాండే బహుముఖ ప్రతిభా సంపన్నుడైన పండితుడు, తత్త్వవేత్త. ప్రవృత్తి రీత్యా చింతకుడు, కవి. వీరి రచనలు శాస్త్ర రచన మొదలుకొని కావ్యరచన దాకా విస్తరించి ఉన్నాయి. వాటి వ్యాప్తి మూడు భాషలు – ఇంగ్లీషు, హిందీ, సంస్కృతం – దాకా ఉంది. వీరి మొదటి రచన Studies in the Origins of Buddhism అంతర్జాతీయ స్థాయి చర్చల్లోకి చేరింది. 1961లో Journal of German Oriental Society (Z.D.M.G.) ఈ విషయం పైన గత 20 ఏండ్లలో వచ్చిన రచనల్లో సర్వశ్రేష్ఠమైందిగా దీన్ని పేర్కొంది. అప్పటి నుంచి ఇంగ్లీషు, హిందీ, సంస్కృతంలో వీరి 42 పుస్తకాలు, వివిధ అంశాలపైన 100 కు పైగా

పరిశోధన పత్రాలు, పరిశోధనా వ్యాసాలు వెలువడ్డాయి. ఆలోచనల, సభ్యతల చరిత్ర గురించి ఆయన రాసిన ప్రసిద్ధ పుస్తకాలు: 'బౌద్ధధర్మ'కే వికాస్ కా ఇతిహాస్' (నాకామురా తన ప్రసిద్ధ Bibliographyలో దీన్ని ఏ భాషలో నైనా document చేయబడిన విలక్షణమైన రచనగా పేర్కొన్నారు.) Foundations of Indian Culture (రెండు భాగాలుగా వెలువడిన క్లాసిక్ రచన. సంస్కృతిని దృష్టి ఐక్యతగా, ప్రతీకాత్మక రూపాలుగా, సామాజిక యదార్థంగా చూపుతుంది) 'భారతీయ పరంపరా కే మూలస్వర్' (మొదటి శంకర పురస్కారం పొందిన రచన) వీటి తర్వాత 'భారతీయ సమాజ్ : ఏక్ తాత్విక్ వివేచన్', The History of Indian Science, Philosophy and Culture, Vols I & II అనే వీరి రచనలు వెలువడ్డాయి. ఇవి భారతీయ చరిత్ర రచనలో ఒక కొత్త, గొప్ప ఆరంభాన్ని సూచిస్తాయి. 'వైదిక సంస్కృతి' అనే రచన భారతీయ, పాశ్చాత్య, విద్వత్తులను సమాలోచనాత్మక దృష్టితో సంశ్లేషితం చేయడమే కాక వేదాల మరింత లోతుల్లోకి దిగి పరీక్షిస్తుంది. వైదిక కవిత్వాన్ని అర్థపూరితంగా ఎలా అనువదించాలో చూపుతుంది కూడా.

**తత్త్వశాస్త్రానికి సంబంధించిన వీరి ప్రధాన రచనలు :**

'మూల్య మీమాంస' (తత్వశాస్త్రంలో ఒక మౌలిక రచనగా గుర్తించి భారత ప్రభుత్వం దీన్ని పురస్కరించింది), 'శంకరా చార్య : విచార్ ఔర్ సందర్భ్' (శంకరాచార్యుని జీవితం, చింతన శంకరాచార్యుని చింతనకు సంబంధించిన చారిత్రక, తాత్విక సమస్యలను పరిశీలించే రచన) Meaning and Process of Culture (భారతీయ సంప్రదాయం వెలుగులో చారిత్రక తత్వశాస్త్రాన్ని వివేచిస్తుంది) సంస్కృతంలో రచించిన మూడు విమర్శలు భక్తి దర్శన విమర్శ: సౌందర్య దర్శన విమర్శః ఏకం సద్విప్రాః బహుధా వదంతి- భక్తి, సౌందర్యం, మతంలోని ఏకత్వాన్ని, వాటి తత్వశాస్త్రాన్ని వివేచిస్తాయి. 'అపోహసిద్ధి', 'న్యాయబిందు' బౌద్ధ తర్కశాస్త్రానికి కొత్త టీకాతో కూడిన హిందీ అనువాదాలు. ప్రొ. పాండే అమెరికా, ఇంగ్లాండు, మెక్సికో, స్విట్జర్లాండు, ఆస్ట్రియా, జర్మనీ, న్యూజిలాండు, చైనా, శ్రీలంక మొదలైన దేశాల్లో పర్యటించి, అనేకచోట్ల ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఉపన్యాసాలు కూడా ఇచ్చారు. గొప్ప పాండిత్యం కారణంగా ప్రొ. పాండే ఎన్నో గౌరవ ఉపాధులు, పురస్కారాలు పొందారు. గౌరవ ఉపాధుల్లో డి.లిట్ (బనారస్ హిందు విశ్వవిద్యాలయం, 2001) విద్యావారిధి (డి.లిట్.తో సమానమైంది, నవ నాలందా మహావిహార్, 1981), సాహిత్య వాచస్పతి (సాహిత్య సమ్మేళనం, అలహాబాదు) మహామహోపాధ్యాయ (లాల్ బహదూర్ శాస్త్రి రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠ్, న్యూఢిల్లీ 1999), వాక్పతి Central Institute of Higher Tibetan Studies, Saranath, 1998) చేరి ఉన్నాయి. అంతేకాక లక్నోలోని హిందీ సంస్థాన్ సమ్మాన్, కే.కే. బిర్లా ఫౌండేషన్ వారి శంకర్ సమ్మాన్, భారతీయ భాషా పరిషత్, కలకత్తా వారి మనీషా సమ్మాన్, మౌలిక హిందీ రచన 'మూల్య మీమాంస'కు భారత ప్రభుత్వ పురస్కారం, హిందీ సాహిత్య సమ్మేళన్, అలహాబాదు వారి మంగళా ప్రసాద్ పురస్కారం, దర్శన-విజ్ఞాన పురస్కారం, నరేశ్ మెహతా పురస్కారం కూడా వీరు పొందారు.

ప్రాచీన చరిత్రలో, తత్వశాస్త్రంలో లబ్ధప్రతిష్ఠుడైన పండితుడుగా, ఒక సృజనాత్మక కవిగా గోవింద చంద్ర పాండేకు సాహిత్య అకాడెమీ తన సర్వోన్నత సన్మానం 'మహత్తర సదస్యత' ఇచ్చి సత్కరించింది. "కాశ్మీర్‌లోనే ఎక్కువగా గడిచిన నా బాల్యం నుంచి నేను ప్రకృతి సౌందర్యం పట్ల ఆకర్షితుడనవుతూ, మృత్యువు రహస్యం పట్ల విభ్రమం చెందుతూ వచ్చాను. కాలం గడిచిన తర్వాత భారతీయ సాహిత్యంలో, ముఖ్యంగా సంస్కృత సాహిత్యంలో అభివ్యక్తి పొందినంత గొప్పగా ప్రకృతి సౌందర్యం మరెక్కడా అభివ్యక్తి పొందలేదని, భారతీయ సంప్రదాయంలో జరిగినంతగా మృత్యురహస్య గంభీర అన్వేషణ మరే సంప్రదాయంలోను జరగలేదని తెలుసుకున్నాను. అర్ధ శతాబ్దానికి మించిన నా జీవితంలో పాశ్చాత్యులు సరిగా అర్థం చేసుకోలేక పోవడం వల్ల కొన్ని అపోహలకు గురి అయిన భారతీయ సంప్రదాయపు మూల రూపాలను వెతికి కనుగొనే ప్రయత్నం చేశాను. నిశిత దృష్టితో, కల్పనా శీలతతో కూడిన ఈ మూల రూపాలు శాశ్వత ప్రాధాన్యం కలవి. ప్రతి యుగంలో మౌలిక చింతనను, సృజనాత్మక కల్పనను ప్రేరేపించే విధంగా వీటిని పునర్వ్యాఖ్యానించడం, వీటికి కొత్త అభివ్యక్తినివ్వడం, ఏ విధంగా జరిగిందో చూస్తే వాటి బలం తెలిసి వస్తుంది. ఇంగ్లీషులోగానీ, హిందీలోగానీ, సంస్కృతంలోగానీ, నేను చేసిన రచనలు 'భారతీయ సంప్రదాయం అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ వస్తూ ఉంది, నేటి పరిస్థితులకు అది తగినట్లుగా కూడా ఉంది', అనే దృష్టితో రాసినవే". అంటారు ప్రొ. పాండే. ⓜ

## క్రీడాభిరామం కావ్యంలో

# సామాజిక జీవన విశ్లేషణ

- ఎన్నార్కె

పదిహేనవ శతాబ్దంలో రచించ బడిన *క్రీడాభిరామం* అనే గ్రంథం గురించి క్రిందటి శతాబ్దం వరకూ పేరు వినటమే తప్ప మిగిలిన విషయాలు అంతగా తెలియవు. దీని అసలు తాటాకు ప్రతి తంజావూరు సరస్వతీ మహల్ లైబ్రరీలో డి.నెం. 512 గా నమోదై భద్రపరచబడి వుంది. మొదటి సారిగా దీనిని వెలుగులోనికి తెచ్చి 1909లో అచ్చు వేయించిన వారు కీ॥శే. మానవల్లి రామకృష్ణకవిగారు. దీని కృతికర్తయిన వినుకొండ వల్లభరాయుడు కడప జిల్లాలోని పులివెందుల తాలూకాలోని మోపూరుకు అధికారి. ఇతను చంద్రమాంబిక, తిప్పన్నల పుత్రుడు. ఆశ్వలాయన శాఖలో ఋగ్వేదాన్ని కరతలామలకంగా పఠించిన వాడు. కామకాయనస విశ్వామిత్ర గోత్రజ్ఞునిగా ప్రసిద్ధికెక్కినవాడు. ఈ *క్రీడాభిరామం* పదమూడవ శతాబ్దానికి చెందిన రావిపాటి త్రిపురాంతకుని *ప్రేమాభి రామం* అనే-సంస్కృత కావ్యానికి అనుసరణ. రావిపాటి త్రిపురాంతక దేవుడు రెండవ ప్రతాప రుద్రుని ఆస్థానంలో వున్నట్లు కొందరు పరిశోధకులు భావించారు. ఇది కొంత వివాదాస్పదం. *మదన విజయం, అంబికాశతకం, త్రిపురాంత కోదాహరణం, చంద్ర తారావళి* అతను రచించినట్లు తెలుస్తుంది. సంస్కృత ప్రణీతమైన ఈ *ప్రేమాభిరామం* ప్రస్తుతం అలభ్యం.



కీ॥శే. వేటూరి ప్రభాకర శాస్త్రి దీనిని పరిశీలించి, ఇందులోని రచనాశైలి ఆధారంగా ఇది శ్రీనాథుని రచనగా భావించారు. భావించటమే కాదు దీని తరువాత ముద్రణలో ఆ విధంగా ప్రచురించారు. 'శ్రీనాథుని వీధి' పేరుతో ముక్తకాల రూపంలో చెదురుమదురుగా నున్న ఆయన చాటువులతో కూడిన గ్రంథమొకటి ఉంది. అందులో రెండు పద్యాలు క్రీడాభిరామంలో ఉన్నాయి. వేటూరి వారు దీనిని బూతు పుస్తకముగా, అసభ్యము, అశ్లీలమైనదిగా అభిప్రాయపడ్డారు. మొదట్లో క్రీడాభిరామ ప్రతులను పరిమిత సంఖ్యలో మాత్రమే ప్రచురించి, ఆ ప్రతులు పరిణత బుద్ధులకు మాత్రమే (అడల్ట్స్ వోన్లీ) అందేటట్లు అప్పటివారు జాగ్రత్త పడ్డారు. శ్రీనాథుడు దీనిని వ్రాసి సొమ్ము కొరకు వల్లభరాయుని పేర ప్రచురించారని పేర్కొన్నారు. వేటూరి వారి వాదనను అనేకమంది పూర్వపక్షం చేసి ఇది నిస్సందేహంగా వినుకొండ వల్లభ రాయుని రచనేనని తేల్చి చెప్పారు.

ఇది దృశ్యకావ్య విభాగానికి చెందిన దశరూపక భేదాలలో 'వీధి' అనే రూపక భేదానికి చెందినది. వీధిగా పిలువబడే ఈ దృశ్య విభాగం స్త్రీ, పురుష అన్యోన్యాను రాగ సంబంధం కలిగినదిగా ఉంటుంది. అందులో ఒకరిద్దరు వ్యక్తుల పాత్రలే ఉంటాయి. ఒక దినంలో జరిగిన వృత్తాంతమే సాధారణంగా కథనం గావింపబడుతుంది. ఈ ప్రక్రియలో ఇతర పాత్రలతో కథానాయకుడు చేసే సంభాషణ, ఆ ఇతర వ్యక్తులు రంగస్థలంలో కనిపించరు కాబట్టి ఆకాశభాషణ రూపంలో ఉండి అభినయింప బడతాయి.

ఇది పూర్తిగా పద్యకావ్యం కావటంతో దీనిని ఎక్కువ మంది పాఠకులకు చేర్చాలనే ఉద్దేశంతో ఆచార్య యార్లగడ్డ బాలగంగాధర రావుగారు దీనిని సరళ సుందరంగా సరసమైన భాషలో వచనంగా వ్రాసి మెప్పించారు. దీని అనువాదంలో రెండు ప్రధానమైన అడ్డంకులున్నాయి. అందులో మొదటిది భాష ఇది ఎనిమిది వందల సంవత్సరాల నాటిది. అప్పటి తెలుగులోని ఎన్నో మాటలు ఇప్పుడు వాడుకలో లేవు. కొన్నిటికి స్పష్టమైన అర్థం తెలియదు, అన్వయార్థం

తప్పు. రెండవది దీనిలో శృంగార స్ఫురణ పాలెక్కువ. కొన్ని చోట్ల మోతాదు మించినట్లు సభ్యసమాజం భావించ వచ్చు. ఈ రెంటినీ ఆయన ఎంతో ప్రతిభతో, నేర్పుగా నెట్టుకొచ్చారు. మూలానికేమాత్రం భంగం కలుగకుండా యథావిధిగా అనుశీలన చేస్తూనే శృంగారం, చమత్కారంగా గిలిగింతలు పెట్టేటట్లుగా వ్రాశారు. అయినప్పటికీ చాలా చోట్ల స్త్రీ స్తన, జఘనాంగ వర్ణనలు తప్ప లేదు. పదమూడవ శతాబ్దపు నాటి కాకతీయ ప్రభువుల కాలంలోనున్న ఆచార వ్యవహారాలు, ఆనాటి సామాజిక వాతావరణం – సమాజ జీవనశైలిని తెలుసుకోవడానికి దీనికి మించిన ఉపకరణం మరొకటి లేదు.

ఇక కథలోకి వద్దాం. మంచనశర్మ అనే బ్రాహ్మణున్నాడు. ఆయనకో వైశ్యమిత్రుడున్నాడు. పేరు టిట్టిభసెట్టి. మంచనశర్మ కాసల్నాటి వాడు. ఆయనకు నాటి ఆంధ్రరాజధానీ నగరం ఓరుగల్లులో ఓ ననుపుకత్తె వుంది. ఆవిడ పేరు కామమంజరి. ఆమె కన్యగా వుండగానే ముండమోసింది. ఇలా అనడం ఎందుకంటే ఆమె పునర్భువుగా పరిచయం చేయబడింది గనుక! ఆమెను చేరదీసాడు ఈ మంచనశర్మ. మంచనశర్మ ఒక సంవత్సరంగా కాలు అటు మళ్ళించినట్లు లేదు. ఇప్పుడు బుద్ధి అటు తిరిగినట్లుంది. కాలు అటు సాగించాడు. అలాంటి ఉబలాటమే వున్న మంచన మనసెరిగిన మిత్రుడు టిట్టిభసెట్టి. మిత్రులిద్దరూ ఓరుగల్లు నగర ప్రవేశం చేయాలను కుంటారు.

అప్పుడే తూర్పున చుక్క పొడుస్తుంది. అంతలోనే గుడ్లగూబ కూత ఎడం పక్క నుండి వినిపిస్తుంది. నెమలి షడ్జమంలో క్రీంకారం పెడుతుంది. ఇది మంచి శకునంగా భావించి, మంచన శర్మ మిత్రునితో నగర ప్రవేశానికి గోధూళి వేళ ప్రశస్తం, అందులోనూ ముఖ్యంగా ఉషః కాలం మంచిదని గార్గ్యుని మతం, శకునం చూసి బయలుదేరమంటుంది బృహస్పతి భాష్యం. అదేమీ కాదు నీమనసుకు బాగుంది అనిపించిన వేళే మంచిదని చెబుతుంది వ్యాసుని పద్ధతి. ఏది ఏమైనా అన్నివిధాల ఇది శుభలగ్నమని భావించి ఇద్దరూ బయలుదేరి నగరం బయటనున్న వెలిపాలెం పరిసరాల్లో చేరుకుంటారు. ''మిత్రమా! ఈ పల్లెపట్టుల్లోని ధనవంతులున్నారే, వారు ఉదయాన్నే కొఱ్ఱ అన్నంలో ఇంత లేత ఆవకూరవేసుకుని అందులో పూస గట్టిన పేరునెయ్యి కలుపుకొని తిని, చివరకు ఇంత గడ్డపెరుగు వేసుకొని జుఱ్ఱుకొని బ్రేవ్‌మని తేన్చుతారు. దానిని గనుక విలువ గట్టితే కనీసం ఒక మాడ విలువైనా వుంటుందయ్యా. మరి అదృష్టమంటే వాళ్ళదే గదా" అని సెట్టి ఒక ముచ్చట చెప్పాడు. ఇలా అక్కడి విశేషాలు చూడ వచ్చారు.

అక్కడ ఒక్క కరణదేశపు మేదరవేశ్య తన గుడిసె తడిక తలుపు దగ్గర వెదురు బొంగులతో కూర్చిన పెద్ద పీట వేసుకొని దాని మధ్యలో మాంచి కుశాలగా కూర్చొని వుంది. ఆమె వైఖరి ఎలావుందంటే, ఉన్నట్లుండి ఎకసికంగా ఏదైనా ఒక మాట అంటుంది. అంతలో పాట అందుకుంటుంది. అద్దపు ముక్కలో ముఖం చూసుకుంటూ కొనగోళ్ళతో జుట్టు సవరించుకొని పాపిడి సరిదిద్దుకుంటుంది. పైట దిగజార్చి, చేతినిలోనికి పోనిచ్చి వక్షోజాలను కదుపుకుని గుత్తంగా కూడ దీసుకుంటుంది. సన్నని సవ్వడితో సాగదీస్తూ తీగె నవ్వు నవ్వుతోంది. చెవులకున్న తాటాకు కమ్మలను తిప్పుకుంటుంది.

ఒక కర్ణాటస్త్రీ బిందెతో నీళ్ళుమోసుకుంటూ రావడాన్ని చూస్తారు. అసలే భారమైన పిరుదులు, సన్నని నడుము. ఆపైన ఆ నడుము మోయలేనంతటి చనుదోయి బరువును కల్పించాడు ఆ బ్రహ్మిగాడు. ఆ భారాన్నే మోయలేక పోతోందనుకుంటే ఆపైన ఈ నిండు నీళ్ళబిందొకటి దాపురించింది గదా అని వీరు తనను గూర్చి అన్న మాటలను విని ఆమె తన తలకొప్పు కదిలిపోయేటంతగా, కళ్ళు టపటపలాడిస్తూ సంతోషాన్ని మెరపింపచేస్తూ నవ్వుకుంటూ ముందుకు సాగిపోయింది.

అలా ముందుకుపోగా పోగా అక్కడ ఒక చోట జూదం ఆడటం కనుపించింది. ఆడేవాళ్ళు ఆడుతూవుంటే – చూడటానికి చేరిన జనంలో ఒకటే ఉబలాటం. నిజానికి వీళ్ళకే ఆదుర్దా ఎక్కువగా ఉంది. వారిలో వారు అంతలో జత కడతారా! అంతలో పోట్లాడుకుంటారు. ఒకసారి గెలుస్తారు. మరోసారి ఓడిపోతారు. ఎకసికాలు, అంతలో మాట పట్టింపులు, బండబూతులు తిట్టుకుంటారు. ఈ జూదమాడే బరి గదంతా ముద్రలు చెక్కిన చెక్కపాచికల మయం. ఈ పాప జూదంలో మునిగిన వాళ్ళకి చివరికి మిగిలేది గోచిపాతలే సుమా! అనుకుంటూ నడుస్తున్నారు.

కోట దగ్గరలోకి వచ్చారు. వచ్చి కోటకు ముందు చుట్టూవున్న అగడ్తను చూసారు. అబ్బో! దాని లోతు ఎంతుంటుందో! బహుశా ఈ అగడ్త గుండా పాతాళలోకం జేరుకోవచ్చునేమో! ఆ లోకం చేరుకోవడానికి ఇదే దగ్గరి రాచబాటేమో మరి! అని అనుకుని కోటగోడ మీదికి తమ

దృష్టి మళ్ళించారు. ఎలాగో, కాస్త అనువుచూసుకుని ఆ దారిలోకి ప్రవేశించారు. వామ్మో! ఇవి కోట తలుపులే! ఎంత పెద్దవి. మేరుపర్వతపు మెరుపురెక్కలుగా తలపిస్తున్నాయే! ఏనుగులు, గుంపులు గుంపులుగా తిరుగాడుతున్నాయి. వాటి బారినుండి ఎలాగో సందుచేసుకుని తప్పుకుని ఒదిగి ఒదిగి నడుస్తూ ఎలాగో ఆ దుర్గ ద్వారం గుండా ఓరుగల్లు నగరంలో ప్రవేశించారు.

"మనం మధ్య బజారులోకి ఆ వీధి వుంది చూసావ్. అది మన్మథుని విహారభూమి. అదేనయ్యా! వేశ్యావాటిక, అక్కడ బోలెడంత కాలక్షేపం. కంటికింపైన, మనసుకు నచ్చిన మదవతులతో మనసార ముచ్చట్లాడు కోవచ్చు. మాంచి పసందైన కాలక్షేపం. అలా ఆ పాటికి మధ్యాహ్నమవుతుంది గదా!" అంటాడు మిత్రునితో మంచన.

అక్కడ ఆ పోతురాజు స్తంభం దగ్గర త్రిశూలాన్ని పాతి శీలం బ్రహ్మనాయుడు మొదలైన వారి బొమ్మలను నునుపుచేసిన రంగుల గద్దెపలకమీద చిత్రించారు. అక్కడ వేపచిగుళ్ళ మండలతో అలంకరించి వున్న ఏకవీరాదేవి మండప ద్వారాన్ని చూసారు. చూసి, లక్ష్మీ వల్లభుడైన విష్ణుమూర్తి కన్నతల్లికి నమస్కారం, పాములను అలంకారాలుగా ధరించిన వెంకయ్యకు దండాలు, సూర్య చంద్రాగ్నులు నేత్రాలుగా గల శివయ్యకు దండం, జగజ్జనని దుర్గాదేవికి నమస్కారం. దేవతలచేత మునులచేత, సిరులచేత సేవించబడే తల్లికి, జమదగ్ని ముద్దుటిల్లాలు రేణుకాదేవికి దండాలు. మనోహరరూప, శోభనానాకరయైన పర్వతరాజపుత్రి పార్వతీదేవికి దండాలు. నిత్యకల్యాణికి, నల్లని తలకట్టుగల తల్లికి, ఆదిశక్తికి వేదవేదాంత సారము తానై రూపుదాల్చిన అంబ ఏకవీరాదేవికి, నిండుచంద్రుని పోలిన ముఖాకృతి గల్గి సర్వసృష్టికి తల్లియైన దేవికి సాష్టాంగ దండప్రణామాలు చేస్తారు.

మండపాకలో, పెనుమాకలో, మాహురంలో, నాగవరంలో, పోలాసలో వెలిసిన ఈ తల్లి, ఈ ఓరుగంటిలో వెలసిన ఈ ఏకవీరాదేవి సాక్షాత్తూ కాకతమ్మకు సోదరి సుమా! అని ఆమెను వర్ణిస్తాడు మంచన.

అక్కడ ఒక ఇంటిముందర అక్కల ఆరాధనోత్సవం జరుగుతోంది. ఏడుగురు స్త్రీలను అక్కలుగా అలంకరించి పీటలపై కూర్చో పెట్టారు. ఉరుమువాయిద్య ధ్వని అంతకంతకూ అధికం కాగా దాని ప్రేరణతో అక్కలవేషం లోని ఒకామెకు పూనకం వచ్చింది. అంతట వెన్నెల మాణిక్యాల కాంతి ఆమె ఎర్రని చేతులలో గల పింఛం పెట్టెలోనికి విస్తరించగా, ఉపవాసంతో మిక్కిలి బలహీనమైన నడుము కుచద్వయ భారాన్ని తట్టుకోలేక జలదరింపగా తోకచుక్కల్లా వున్న ధవళ నేత్రాలు కళావైభవంతో సిగ్గుల్ని తొలగించగా కుచ్చెళ్ళు తూలి ఆమె తొడలు కాంతులీనుతూ ప్రకాశిస్తుండగా నాట్యమాడసాగింది. శివ శివా! పెద్ద మోతతో, ఝుంకారంతో, మురళీ రావంతో మూర్ఛనలతో సాగే గీతాలాపన మనసులను మత్తెక్కించడంతో ఒళ్ళుమరిచి, ఆ అక్కలు ఏడుగురూ తమ వక్షోజాలభారం వారి నడుములను ఊపివేస్తుండగా నృత్యం చేయడమారంభించారు. బహుశా ఈ ఇంటి యజమాని సంతానార్థియై కట్టిన ముడుపు చెల్లించుకోవడం కొరకు ఈ యక్షకన్యలను రప్పించి ఈ అక్కల ఆరాధనం చేయిస్తున్నట్లుంది.



అలా వెళుతూ వుంటే, ఒకచోట మంద్రం, మధ్యమం, తారాస్థాయిల్లో ఎనుబోతు కొమ్ముబూర ధ్వనితో డమరుక, డిండిమాల ధమధమలధ్వని వినిపించింది. అదేమిటని టిట్టిమసెట్టి అడగ్గా ఆయన ఇలా చెప్పాడు. వాళ్ళా! వాళ్ళు మైలారభటులు. అంటే, వాళు ౣమైలారదేవుని ఆరాధించే భక్తులు, సాహసానికి, ధీరత్వానికి వారు మారుపేరంటే నమ్ము! చూడు! వారు గుండాల్లో ఎర్రగా మండుతున్న చంద్ర నిప్పుల్లో దూకుతున్నారు. కింద పాతర లాగా తవ్వి బాణాల వాడిమొనలు పైకి వుండేట్లు పాతి, పైన దూలాలలకు కట్టిన ఉట్ల తాళ్ళను తమంత తాముగా కోసి తెంపుకుని, దాని గడకర్రకు గల గాలపు కొంకికి మెడ పైచర్మాన్ని గుచ్చుకొని వేలాడతారు. ఎర్రగా మండుతున్న నిప్పుకణికలను బంగారు పిళ్ళుగల కత్తెరలతో పట్టి గొంతులో వేసుకొని అమాంతంగా మింగేస్తారు. కీళ్ళల్లో మేకులు గుచ్చుకొంటారు. కుడి ఎడమ- రెండు అరచేతుల్లోను ఆరతులిస్తారు అని వివరించి, మిత్రునితో మధ్యాహ్నం కావచ్చింది.

ఆంధ్రభూపాలకుని మొగసాలపై నున్న గడియారం పదహారు గంటలు మోగడం విన్నావా? చూడు! సూర్యభగవానుడు కూడా పటమటికి వాలాడు. బాగా

ఆకలేస్తోంది. కనుక సెట్టీ! భోజనం చేయడానికి పూటకూటింటికి వెళ్ళి, సరిపడా డబ్బు చెల్లించి భోజనం చేద్దాం సరేనా! అక్కడే కొంచెం సేపు సేదతీరవచ్చు. అలా కాదు ఆహార విహారాలు రెండూ కావాలంటావా దానికేం, భేషుగ్గా లక్ష్మణవజ్ఝల వారిల్లు వుండనే వుంది. అక్కడ సువాసన గుబాళించే సన్నన్నం–తోడు గోధుమ పిండి పూరీలు, మరి వాటిల్లోకి ఒక గుప్పెడు పంచదార, అప్పటి కప్పుడు కాచిన ఆవునెయ్యి, పెసరపప్పు, మాంచి కొమ్ముల్లాంటి నల్లమచ్చల అరటిపళ్ళు, నాలుగో, అయిదో కూరలు, ఇక కోరినంత గడ్డపెరుగు వడ్డిస్తారు. ఇదంతా ఒక్క రూకకే సుమా అని మిత్రుని ఊరడించి లక్ష్మణవజ్ఝల ఇంట్లో భోజనం చేయిస్తాడు.



ఆ తరువాత అక్కడ పద్మాల తోరణాలతో కట్టిన ఒక అందమైన ఇంటిని చూశారు. అక్కడి వాళ్ళను దాని గురించి ఆరా తీశారు. వారు ఆశ్చర్యపోతూ లోకంలో పేరెల్లినది, మన్మథవేదానికి ఆచార్యపీఠాన్ని అధిష్టించింది, ప్రతాపరుద్ర మహారాజులుంగారి ఆస్థానంలో ప్రముఖురాలు మాచల్దేవి. పేరూ పెంపుగల వేశ్య! ఈమెనే ఎరుగవా! ఆమె ఇప్పుడు చిత్రశాలా మండప ప్రవేశం చేస్తున్నది. ఇప్పుడు పుణ్యాహవచనం జరగబోతుంది. మీరు ఆ శోభన మందిరాన్ని చూడవచ్చు. అలా చెప్పి చిత్రశాలలోనికి ప్రవేశించి చిత్రపటాలను చూసి టిట్టిభసెట్టితో మంచన మిత్రమా, ఈ పటం చూడు. అదే దారుకావనం, అతడే పరమేశ్వరుడు, వారే మహామునుల భార్యలు. అది చూడు, ఆమే కన్యకారత్నం, అతడు బ్రహ్మ, అది పడక పానుపు, ఆ పటంలో కన్పిస్తున్నవాడు– శ్రీకృష్ణుడు, వారే గోపికలు, యమునా నదీ తీరం. ఈ పటంలో వున్నది అహల్య, ఆ ప్రక్కనే వున్న వాడు ఇంద్రుడు, అదే గౌతముని పర్ణశాల నడిమిల్లు. ఆ పటంలోని వాడా! అతడు చంద్రుడు, అతని పక్కన వున్నది బృహస్పతి భార్య తార. ఆ పటంలోని జాలరిది ఎవరంటావా?... ఆమేనయ్యా సత్యవతి. అతడేమో పరాశరమహర్షి. ఇటు ఈ పటంలోని వాడు విశ్వామిత్రుడు. ఆమె మేనకాదేవి. మొత్తం మీద ఈ చిత్రశాల అంతా మన్మథుని పరాక్రమాన్ని చాటిచెపుతోంది కదూ! టిట్టిభా! బాగా గమనించావా! అని చెప్పి చిత్రశాల నుంచి బయటికి వచ్చారు.

ఆ తరువాత మిత్రునితో కలిసి తన ప్రియురాలైన కామమంజరి ఇంటికి వెడతారు.

అక్కడేదో వేడుక జరుగుతుంది. అదేమిటని మంచన అడగ్గా, కామ మంజరి నీ ప్రియపుత్రిక, పుష్యమీ నక్షత్రంలో, అద్దం చూస్తుంది. అందుకూ ఈ సంబరమంతా! మా అదృష్టం కొద్దీ అనుకోకుండా వచ్చావు. ఆ సమయంలో నీవు బిడ్డను ఆశీర్వదించాలి మరి. నీ ఆశీస్సులు దానికి దీర్ఘయువును, లావణ్యాన్ని, వివేకాన్ని, వృత్తిలో ప్రావీణ్యాన్ని, భోగభాగ్యాలు కలిగిస్తాయి. నీకు తెలియంది కాదుగా! అద్దం చూసే వేడుక పూర్తిగాకుండా వేశ్యలకు విట సాంగత్యం కూడదు గదా! యజ్ఞం చేయగోరిన వాడు ముందుగా అరణిని జాగ్రత్త చేసుకోకుండా ఎలా కుదురుతుంది. అతడికి అదెంత ముఖ్యమో, భోగకాంతలకు ఇది అంత ముఖ్యం గదా! ఈ అద్దంపు సంబరం అని వివరిస్తుంది.

ఆ తిరునాళ్ళ వేడుకలను గూర్చి – ఏం చెప్పేదిలే! గరుడధ్వజాన్ని ఎత్తి తిరునాళ్ళు ప్రారంభించింది మొదలు, మంత్రోక్తంగా పుష్పయాగంతో ఆ ఉత్సవాలకు ఉద్వాసన పలికే పర్యంతం– ఆ కృష్ణానదీ తీరం.

అప్పటికి పొద్దువాలుతోంది. సూర్యుడస్త మించడానికి ఇక నాలుగు గడియల పొద్దుంది అంటూ కొంచం ముందుకు

పోతారు. అక్కడ ఒక మండపం వుంది. సైనికులు దానిచుట్టూ మూగి గోలగోలగా అరుస్తూ వుండటాన్ని విని టిట్టిభసెట్టి వేడుక చూడ దలిచాడు అక్కడ నల్లటి నొసలుతో ఒక దృఢకాయుడు వచ్చాడు. ఆ నోసటినుండి జుట్టు కళ్ళమీదకు జారుతోంది. చిన్నసానపై నూరి కలివె గంధంతో పెట్టుకున్న బొట్టు ఆరి ముఖాన్ని బిగలాగుతూ మెలకలు తిప్పేసింది. చంకలో కట్టుకున్న తుడుము వాద్యాన్ని మువ్వల తొడుగుతో కట్టుకున్న చేతితో వాయిస్తూంటే, పెటపెట, కిటకిట చప్పుడు చేస్తోంది. ఆ చప్పుడుకు అనుగుణంగా నొసలు ముడుస్తూ ముఖభంగిమలు మార్చుకుంటున్నాడు. ఆవురుమంటూ నోరు తెరుస్తున్నాడు. కనుగుడ్లను మిటకరిస్తాడు. రాగం తీస్తున్నాడు. దానికి అనుగుణంగా వివిధగతుల్లో ఆడుతున్న వాడు గడమీద ఆడే తూర్పునాటి వాడు.

ఆ పక్కనే పొట్టేళ్ళ యుద్ధం జరుగుతుంది. అది కూడ ఒక విధంగా జూదమే! పాచికలు నిర్జీవ వస్తువులు. అదొక రకం జూదం. ప్రాణంవున్న వాటితో ఆడే జూదం ఇది అని అనుకుంటూ అక్కడ ఆగారు.

మంచనశర్మ దిగంతాన గల ఆకాశపటాన్ని చూసి మిత్రుడు టిట్టిభునితో– ఇదిగో, అలాచూడు, పశ్చిమాధిపతి వరుణుని ననుపుకత్తె చేతి అద్దాన్ని పోలి సూర్యుడు అస్తమించ బోతున్నాడు. కనుక ఇక మనం సందర్శనార్థం ఎటువైపుకూ వెళ్ళాల్సిన పనిలేదు. చూడాల్సినవన్నీ చూసేశాం గదా! ఈ వేళప్పుడు చిగురు పెదవుల సొగసు కత్తెలు తమలపాకు దొన్నెల్లో కొబ్బరికల్లు సేవించి తమ మందిర ప్రాంగణాల్లోని ఉద్యానవన బాటల్లో పుష్పగంధికా నృత్యాలు చేస్తూ ఆనందిస్తుంటారు. కొందరు విలాసినులైతే తమ మందిరాల ఆరుబయట, చిత్రవిచిత్రాలైన శ్లోకాలను వివిధ రాగాల్లో స్వరపరచి ఆలాపిస్తూ, వాటికనుగుణంగా భేషైన పద్ధతిలో వివిధ విన్యాసాల్లో నాట్యం చేస్తారు. మధ్య మధ్య ప్రచ్ఛేదనం, సైంధవం, ద్విమూఢకం, స్థితపాఠ్యం, అనే మార్గాభినయ భేదాల్ని రసభావాలు ఉప్పతిల్లేట్లుగా మధురాతి మధురంగా తన్వంగులు అభినయిస్తారు. నవయువతులు తమ విశాలమైన గృహాంతర్భాగాల చావిళ్ళలో వీటిని అభినయిస్తారు అంటూ మిత్రునికి చెబుతాడు.

తమ ప్రయాణంలో ఎదురు పడ్డ మేదరవేశ్య, చండాలాంగన, కర్ణాటి స్త్రీ, ములికినాటి తెలికస్త్రీ సంపెంగనూనె అమ్మే కనుమఅవ్వలి కరణ కాంత, గానుగస్త్రీ, రవిక కుట్టించుకోవడానికి దర్జీవాని వద్దకు వచ్చిన వెలచెడియ, ఈరీర్చుతున్న స్త్రీ, పసుపునూరు కుంటున్న స్త్రీ, పిడకలు చేసుకుంటున్న స్త్రీ. వాళ్ళను తలచుకుంటూ మిత్రులు వెలుపలికి వచ్చి, అప్పటికి సాయంకాలం కాగా మంచన సాయం సంధ్యను గూర్చి మిత్రునికి వివరించి చెప్పి ఆ సమయంలో, పల్లవాధరలు పుష్ప గంధికా నృత్యం చేస్తారని, వారాంగనా జనులు కొందరు విచిత్రశ్లోకాలను అనేక రాగాలలో కూర్చి లాస్యాంగాన్ని ఉత్తమంగా ప్రదర్శిస్తారని, లోపలి చావిళ్ళలో ప్రచ్ఛేద, సైంధవ, ద్విమూఢక, స్థితపాఠ్యాభి మార్గాభినయ భేదాలను రసభావ భావనామోద మధురంగా అభినయిస్తారని విశదపరిచాడు.

ఇక నర్తకీ వేషంధరించిన తరుణులు (వారు నర్తకులు గారు, ఆడుకుంటున్న తరుణులే) చాల అందమైన వారుగా–సుమధ్యలు, దీర్ఘలోచనాలు, బలుపైన ఊరువులు, కటిభారములు, ఉన్నతములు పీనములైన చనుకట్టు కలిగి వుంటారు. అలాంటి వారు బంగారంతోగాని, వెండి, కంచు, లేక కొయ్యతో చేసిన బంతులతో ఆడతారు. ఆ బంతులు బోలుగా వుండి, లోపల ఇనుప గుండ్లు వుంటాయి. ఆడేపుడు అవి ధ్వనిని పుట్టిస్తాయి. ఒకరికొకరు బంతులు విసరుకోవడం, పట్టుకోవడం, తిరిగి విసరడం– ఈ విన్యాసంలో, వారు ధరించిన గాజులు గలగలలధ్వని కలిసి మనోహరంగా వుంటుంది. కాగా, అలా ఎగురవేయబడుతున్న బంతులు, ఆ సందర్భంలో, ఆ వనితల కుచానక్తములు, ముఖ సక్తములూన పక్షులను తలపిస్తాయి. ఆటలో అటూ ఇటు పరుగెడుతూ ఉత్సాహంతో కూలీలు పెడతారు. అప్పటి వారి పదచాలనాలు (గతి,) భ్రూవిక్షేపాలు, కన్నుల కదలికలు చూసేవారి కళ్ళకు ఇంపుగావుంటుంది. ఇలా సాగుతుంది వారి ప్రయాణ విశేషాలు.

యార్లగడ్డవారు దీనిని 16 ప్రకరణాలుగా విభజించారు. వారి వచన రచనకు ఆధారమైన పద్యప్రతిని కూడా ప్రచురించారు. పదాలు పదబంధాలు, ధ్వన్యనుకరణ పదాలు, జాతీయాలు–వివరణ, నృత్యాలు, సంగీత రాగాలు ఇలా ఎన్నో విషయాల గురించి చదివేటప్పుడు మనకు యేర్పడే సందేహాల నెన్నిటినో నివృత్తిపరచే వివరణలతో పుస్తకాన్ని సమగ్రంగా మనకి అందించారు. ఈ పుస్తకం చదువుతున్నపుడు మనం ఆనాటి కాలంలోకి మనకు తెలియకుండానే ప్రయాణం చేస్తాము. ఆ మధురానుభూతిని మీరూ పంచుకోండి. మి

# యల్లాప్రగడ సీతాకుమారి



- ముక్తేవి భారతి

ఆంధ్రయువతీమండలి (బర్కత్‌పురా) ప్లాటినమ్ జూబ్లీ (75 వసంతాలు) చేరుకుంది!

ఆంధ్రయువతీమండలి వ్యవస్థాపకురాలు విద్వాన్ యల్లా ప్రగడ సీతాకుమారి. ఆమె చేసిన సేవలకి ప్రత్యక్ష సాక్షిలా యల్లాప్రగడ సీతాకుమారి హాల్ అని యువతీమండలిలోకి అడుగు పెడుతుంటే ముఖద్వారం అందర్నీ ఆహ్వానిస్తుంది. అచ్యుతుని రామబ్రహ్మం, వెంకటక్ష్మమ్మలకు సీతాదేవి 1911, అక్టోబరు 1వ తేదీన బాపట్లలో జన్మించారు. బాపట్ల మిషనరీ పాఠశాలలో ప్రాథమికవిద్య, మున్సిపల్ స్కూల్లో ఎనిమిదోతరగతి వరకు చదివారు. మద్రాసు విశ్వవిద్యాలయంవారి విద్వాన్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. సికింద్రాబాద్‌లోని కీస్ హైస్కూల్‌లో తెలుగు టీచరుగా కొంత కాలం పనిచేశారు.

ఉద్యమాలకు ఊపిర అయిన బాపట్లలో జన్మించటమే సీతాకుమారి భాగ్యం. బాపట్లతో కవులకు, కవయిత్రిలకు, సాంఘిక సేవాపరులకు, రాజకీయ వేత్తలకు ఎడతెగని అనుబంధంవుంది. ఆ ప్రేరణలవల్లే, సంఘసంస్కర్త వీరేశలింగంగారి పట్ల, కవయిత్రి, గొప్ప సంస్కర్త అయిన కనుపర్తి వరలక్ష్మమ్మ పట్ల గౌరవాభిమానాలు పెరిగాయి. బాల్యం నుంచే సీతాకుమారిగారికి, స్త్రీ జనోదర్ధరణ, స్త్రీ విద్యావశ్యకత సీతాకుమారి మనసులో గాఢముద్ర వేయటతో, ఆమె జీవితమంతా స్త్రీ జనాభ్యుదయానికే ధారపోశారనటం అతిశయోక్తికాదు. 1926లో యల్లాప్రగడ నారాయణ రావుగారితో వివాహం అయ్యాక, భర్తతో హైదరాబాదు వచ్చిన సీతాకుమారికి ఆనాటి సామాజిక స్థితి గతుల్లో స్త్రీల దుర్భర జీవితాలు మనసుని కదిలించాయి. సహృదయుము, నిరాడంబరులు అయిన నారాయణరావు గారి సాహచర్యంతో, సీతాకుమారి అభ్యుదయ మార్గం వైపు అడుగు లేశారు. బాపట్లలో పుట్టడం, కనుపర్తి వరలక్ష్మమ్మ హితైషిణీ సమాజం స్ఫూర్తికావటం. ఇల్లిందల సరస్వతిదేవి, ఈటుకూరి లక్ష్మీకాంతమ్మలాటి సాహితీవేత్తల, సంస్కర్తల సాన్నిహిత్యం, సీతాకుమారిలో గొప్ప వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేశాయి. హైదరాబాద్ రావటంతో మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, సురవరం ప్రతాపరెడ్డి, రాజబహద్దూర్ వెంకట రామిరెడ్డి మొదలైన వారితో సేవాకార్యక్రమాలలో పాల్గొనే అవకాశం కలిగింది సీతాకుమారికి. సీతాకుమారిలో సంఘసంస్కరణ భావ పెల్లుబికింది.

**ఆంధ్రయువతీమండలి ఆవిర్భావం:**

1935 వ సంవత్సరంలో దసరానాడు సీతాకుమారి తన ఇంట్లోనే అందరినీ సమావేశపరిచారు. డాక్టర్ లక్ష్మీనరసమ్మ అధ్యక్షురాలిగా, సీతాకుమారి కార్యదర్శిగా, ఇల్లిందల సరస్వతీదేవి సహాయ కార్యదర్శిగా ఆ సభలో ఎన్నుకోబడ్డారు. *ఆంధ్రయువతీమండలి* స్థాపించినప్పటి నుండి మలక్‌పేటలో సీతాకుమారి నివాసగృహమే దానిపుట్టిల్లు. పావలా సభ్యత్వరుసుము అంటూ సీతాకుమారి *ఆంధ్రయువతీ మండలి* చేసిన కృషిని ఇల్లిందల సరస్వరతీదేవి *ఆంధ్రయువతీమండలి* నా అనుబంధం అనే వ్యాసంలో వివరించారు. ఆనాడు తెలుగు పిల్లలకి పాఠశాలలు లేవు. మగపిల్లలు ఉర్దూబోధినే చదివేవారు. మరి తెలుగు బాలికల చదువు విషయం ఆలోచించి మాడపాటి హనుమంతరావు మొదలైన వారు పాఠశాల స్థాపించాలను కోవటంతో 1928,

డాక్టర్ ముక్తేవి భారతి, ఫోన్: 040-27500487

29 ప్రాంతాలలో స్థాపించబడిన ఆంధ్రబాలికోన్నత పాఠశాల ఈ నాటి మాడపాటి హనుమంతరావు బాలికల ఉన్నత పాఠశాల అని సీతాకుమారి తెలంగాణ మహిళాలోకంలో *వెలుగు రేఖలు* అనే వ్యాసంలో వివరించారు. ఆనాడు తెలంగాణాలో హిందూస్త్రీలలోకూడా పరదాలు, పాటించాల్సి రావడం, స్త్రీల అభివృద్ధికై ఆటంకంగా వుండేది. సీతాకుమారి దృష్టి స్త్రీ జనోద్ధరణపై పూర్తిగా లగ్నమయింది. ఆ రోజుల్లో గస్తీతిప్పన్ అనే సర్క్యులర్ వలన ప్రజోద్యమాలకు చాలా ఆటంకాలు ఏర్పడ్డాయి. సభలు, సమావేశాలు జరపడం కష్టమయింది. ఆలాటి ఇబ్బందులు ఎదుర్కోటానికి కొన్ని ఉద్యమాలు తలెత్తాయి. ఆంధ్రోద్యమం ప్రారంభమైంది. దానితో బాటే మహిళోద్యమం కూడా ప్రారంభమైంది.

1929లో వెలువడ్డ మొదట ఆంధ్రమహాసభతో పాటు మహిళాసభలు కూడా జరిగాయి. మహిళాసభలలో స్త్రీలకు సంబంధించిన విద్య, మొదలైన విషయాలు కూడా చర్చింబడ్డాయి. ఆ సభలు చాలా జరిగాయి. చాల ఊళ్ళల్లో. ఖమ్మం మెట్టులో జరిగిన మహిళాసభకి యల్లాప్రగడ సీతాకుమారి అధ్యక్షత వహించారు. అలాగే హైదరాబాదులో 1942లో జరిగిన మహిళాసభకు కూడా సీతాకుమారి అధ్యక్షత వహించారు. *ఆంధ్ర యువతీమండలి* స్థాపనతో మహిళాలోకానికి ఒక వెలుగుబాట వేసి నట్టయింది. సీతాకుమారి సంఘ సంస్కర్తగా చేపట్టిన కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయి. కులమతాలకు అతీతంగా, వితంతువులను, పతితలను, ఆదుకొన్నారు. సీతాకుమారిగారి యిల్లే ఒక శరణాలయంలా వుండేది అంటే అతిశయోక్తి కాదు.

కొందరు మహమ్మదీయ స్త్రీలు సీతాకుమారి పెరటి తలుపు తట్టి తమకు రక్షణయిమ్మని కోరేవారు. పెరటి తలుపు తెరిచి వారిని రహస్యంగా గదిలో వుంచి తలుపువేసి, వీధివాకిలి దగ్గరున్న వాళ్ళతో మంచిమాటలాడి వారిని పంపేవారు. అని సీతాకుమారి ఔదార్యాన్ని *తేజోమూర్తులు* అనే వ్యాస సంపుటిలో ఇల్లిందల సరస్వతీదేవికి తెలిపారు. సీతాకుమరి వారి ఇంట్లోనే స్త్రీలకై కొన్ని తరగతులు నడిపి కొందరిని తన ఇంట్లోనే వుంచి, ఆదరించి, లేదా ఒక ఉపాధి కల్పించేవారు. ఆర్థికంగా స్త్రీలు నిలబడాలని నమ్మిన సహృదయురాలు సీతాకుమారి. వయోజన విద్యా కేంద్రాలద్వారా స్త్రీలకు విద్య నేర్పేవారు. సీతాకుమారి చేసిన స్త్రీ జనాభ్యుదయం గురించి ఎంత చెప్పినా చాలదు. వితంతువులుకాని, భర్త వదిలేసిన వారుకానీ తిరిగి వివాహం చేసుకుందామను కొంటే, వారికి తగ్గ పెళ్ళికొడుకుల్ని వెతికి, తనే ఖర్చులు పెట్టి పెళ్ళి జరిపించేవారు. సీతాకుమారి జీవితంలో మరుపురాని సంఘటనలు ఎన్నో వున్నా, ఒక అనాథ పాపని పెంచటం. సీతాకుమారికి ముగ్గురు పిల్లలున్నారు. అవివాహితగా తల్లి అయిన ఓ అమ్మాయి, తను అభాగ్యురాలని ఆమె పిల్లలతో సహా చావటానికి ప్రయత్నింస్తుంటే, ఎవరో చెప్పారట. సీతాకుమారిగారింటికి వెళ్ళు ఆవిడ నీ బాధలు తీరుస్తుందని చెప్పారట. ఆమె ఆపిల్లను సీతాకుమారికి అప్పగించి వెళ్ళిపోయింది. ఆ పిల్లని పెంచి, పెద్దచేసి పెళ్ళి జరిపింది. సీతాకుమారి. ఆ పాపని అనాథశరణాలయంలో చేర్చమని చాలమంది అంటే, అందర్నీ ఎదిరించి, ఆపాపకి జీవితాన్నిచ్చిన ప్రేమమయి సీతాకుమారి. సీతాకుమారిని తెలిసిన వాళ్ళంతా ఆమె త్రికరణ శుద్ధిగా చేసిన సేవని కీర్తిస్తారు.

సీతాకుమారి రాజకీయ జీవితంలో ఒక ప్రత్యేకత ఉంది. గాంధీగారి పిలుపుతో చాలా ఉత్తేజితురాలైన సీతాకుమారికి గాంధీసతీమణి కస్తూర్బా భారత దేశ పర్యటనలో భాగంగా హైదరాబాద్ వచ్చినపుడు, స్త్రీలకై ఏర్పాటు చేసిన సభలో సీతాకుమారి పాల్గొంది. జాతీయోద్యమ సమయంలో సీతాకుమారి ఖాదీకట్టారు. సీతాకుమారి భర్త నారాయణరావు కూడా ఖాదీకట్టారు. నారాయణరావు *ఆంధ్రాబుక్‌హౌస్* ద్వారా భాషాసాహిత్యాలకు సేవ చేయటమేకాక, యువకులకు పుస్తకాలిచ్చి చదివి తిరిగి యివ్వండని, డబ్బు వసూలు చేయకపోవటంతో, ఎన్నో మంచి పుస్తకాలు చాలామంది యువకులు చదివే అవకాశం వచ్చింది.

స్వదేశీవస్తువులు కొనండి అంటూ ఇంటింటా ప్రచారం చేశారు. సీతాకుమారిగారు. అంబర్ చరఖా శిక్షణా సంస్థని నెలకొల్పి, నూలు వడికించటం నేర్పించారు. రాజకీయ రంగంలో ప్రవేశించి, పోటీలేకుండా బాన్స్ వాడ నుండి శాసన సభ్యురాలిగా ఎన్నుకోబడ్డారు. 1957-62 వరకు శాసన సభ్యురాలై, స్త్రీల సమస్యలకై కృషి చేశారు. స్నేహలతా వరకట్న నిషేధ సంఘం ద్వారా యువకులకు ఉద్బోధచేసి, వరకట్నం లేకుండా వివాహాలు జరిపించారు. సీతాకుమారిగారు రాజకీయవేత్తగా, సంఘసంస్కర్తగా ఎంతో ఎదిగిపోయినా, ఆమెలో ఒక రచయిత్రి దాగుండటం ఒక విశేషంగా గుర్తించాలి.

సీతాకుమారి రచనలు చాలవరకు అముద్రితాలుగా మిగిలి పోయాయి. కొన్ని ముద్రణకు నోచుకున్నాయి. *మందారమాల* అనే వ్యాస సంకలనంలో మహనీయుల జీవిత విశేషాలు రాశారు. *ప్రభావీచకలు* అనేది ఏడవతరగతి విద్యార్థుల కోసం విద్యాశాఖవారి ప్రణాళిక ననుసరించి, సీతాకుమారి, వెంకట నరసింహాచార్యుల వారు కలసి రచించారు. దేశభక్తుల గురించి, కవుల గురించి పిల్లలకు అర్థమయేలా సరళమైన భాషలో రచించారు. వ్యాసమాల అనే పేరున, మామిడిపూడి వెంకట రంగయ్యగారి *నాగరికత* అనే వ్యాసం, *నాట్యకళ దాని పరమార్థాలు* అన్న వ్యాసం అప్పారావుగారు రచించిన వ్యాసం, *శాంతిదూత తిక్కన కవి* ఖండవల్లి లక్ష్మీరంజనం రాసిన వ్యాసం మొదలైన సుప్రసిద్ధుల వ్యాసాలు కొన్ని సంకలనం చేసి పాఠకలోకానికి అందించారు సీతాకుమారి.

సీతాకుమారి అముద్రిత రచనలెన్నో వున్నాయి. రేడియో ప్రసంగాలు, నాటికలు, వ్యాసాలు–ఇలా చాలా వున్నా వాటిని అచ్చు వేయించుకోవాలనే ఆలోచన ఆమెకు రాలేదు. కారణం, ఆమె ఆలోచనలన్నీ, సంఘసేవవైపు పరుగుతీయడమే. అయితే, సీతాకుమరి చిన్నమ్మాయి, డాక్టర్ అంకరాజు విద్యారాణి, తల్లి అముద్రిత రచనల్నీ వెలుగులోకి తేవాలనుకుంది. కుటుంబ సభ్యులు సహకరించారు. యల్లాప్రగడ సీతాకుమారి జీవిత విశేషాలు– అనే పుస్తకం డాక్టర్ అంకరాజు విద్యారాణి, డాక్టర్ ముక్తేవి భారతిద్వారా వాటిని ముద్రించటం జరిగింది.

సీతాకుమారి ఎన్నో వ్యాసాలు రాశారు. *తిక్కన తీర్చిన రాయలు, సీతస్వాధీనపతిత, మొల్ల, జనపద సాహిత్యం లోస్త్రీ, నాట్యకళా ప్రాశస్త్యం, సాహిత్యంలో విప్లవం*–మొదలైన ఇరవై రెండు వ్యాసాలు రాశారు. నాటికల్లో–*అహల్య, అమృతవర్షం, మా యాదగిరి యాత్ర, చిలుక–చిట్టెలుక, తాతయ్య చేసిన మేలు*–ఇలా పన్నెండు నాటికలు వున్నాయి. కవితల్లో–*గణపతి, చరణసన్నిధి, ఆంధ్ర వీరనారి, లోకమాన్యుడు, వెచ్చని వేసవి, హెూళీ, నవభారత రమణి*–ఇలా ఇరవై తొమ్మిది కవితలున్నాయి. సీతాకుమారి అముద్రిత రచనలు వెలుగు చూశాయి. సీతాకుమారి స్నేహశీలి. బుర్గుల అనంతలక్ష్మీ దేవి, మాడపాటి మాణిక్యమ్మ, నడింపల్లి సుందరమ్మ, రంగమ్మా ఓబుల్‌రెడ్డి మొదలైన సంస్కర్తల, సాహితీమూర్తుల సాహచర్యంతో గొప్ప వ్యక్తిగా, సంఘసంస్కర్తగా, రచయిత్రిగా, తనదైన స్థానాన్ని సంపాదించుకొని, మహిళలందరికీ ఆదర్శమూర్తిగా జీవితాన్ని సఫలం చేసుకున్న ధన్యురాలు. సీతాకుమారి శతజయంతి సందర్భంగా మహిళా లోకం ఆమెకు శిరసువంచి నమస్కరించటమే ఆమెకు కృతజ్ఞతలు తెల్పుకోటం.

✡ ✡ ✡

**1934, డిసెంబరు 13,14,15 తేదీలలో, ఖమ్మంలో జరిగిన తృతీయ ఆంధ్ర మహిళాసభలో అధ్యక్షురాలిగా సీతాకుమారి ప్రసంగం:**

**సోదరీమణులారా!**

నేటి యీ మహాసభను నన్నగ్రాసనాధిపురాలినిగ నొనరించుట నా స్థితికిమించిన గౌరవమైనది. గత రెండు పర్యాయములు విదుషీమణులు, అనుభవశాలినులు, అలంకరించిన, యీ అధ్యక్ష పదవిని నేనుసరిగ నిర్వహింపజాలనేమో, నా లోపా లోపములను మన్నించెదరు గాక!

ఇన్ని దినములనుండి మన స్త్రీ సంఘము అన్నివిషయములయందును చాలా వెనుకబడియున్నది. కాని యిప్పటికి అన్ని దేశములవలె మనదేశమునకూడ ఆ సేతు, హిమాచల పర్యంతము స్త్రీలలో స్వతంత్ర వాంఛలు మొలకలెత్తినవి. నిజమునకు పురుషులిన్నిదినముల నుండి స్త్రీలనణచియుంచినను ఇప్పుడు మాత్రము కొందరు సోదరమహాశయులు గూడ స్త్రీ సంఘమునకు చేతననైన సాయమొనర్చుటకు సంసిద్ధులైయున్నారు. ఎటులైననేమి? ఇప్పటి మన ఉద్యమము చాలా అభివృద్ధిలోనికి వచ్చినది.

స్త్రీలలో చాలామంది అనేక కళలయందు ప్రప్రథమమున నుత్తీర్ణులగుచున్నారు. పలువిధములగు పోటీలలో అతి విషమ పరిస్థితులలో పురుషులతో సమముగ, పురుషులకన్న నెక్కుడుగ గూడ విజయమును గాంచగల్గుచున్నారు. సంఘసంస్కరణము నందు, దేశసేవయందు, ధర్మకార్యములయందు పురుషులతోపాటు ముందంజవేయుచున్నారు. అనేక పదవులను ఉన్నతోద్యోగములను ఆక్రమించుకొని ప్రకాశించుచున్నారు. కాని భారతీయ మహిళోద్యమము జరుగవలసినంత తీవ్రముగ జరుగక మందగమనమున నడుగులిడుచున్నది. దీనికి కారణము గ్రామవాసినులగు స్త్రీలయందెక్కువగ ప్రబోధము జరుగకపోవుటయే. ప్రతి స్త్రీయు

పురుషులవలెనే సర్వస్వాతంత్ర్యముల ననుభవించుటకు తమకుగూడ హక్కు గలదని తెలిసికొనిననేగాని ఏమాత్రము లాభముండదు. ఇంకను చాలమంది స్త్రీలకు అనేక శతాబ్దముల నుండి స్థిరచరాస్తులతోపాటు పురుషుల స్వాధీనమైయుండుటే అలవడిపోయినందున, తాము కొంత హీనదశయందున్నామనిగాని, తమకు కొన్ని సంస్కరణము లవసరములనిగాని తెలియనుగూడ తెలియదు. ఏ సంఘము అభివృద్ధికి రావలసియుండెనో ఆసంఘీయులకే దానితత్వము తెలియనియెడల నింకనభివృద్ధి జరుగుటెట్లు? కొంతవరకు పురుషులసహాయమవసర మైనప్పటికి స్త్రీలు తమస్వీయ శక్తిని గుర్తించి కృషి సలిపిననే గాని సత్వర స్వాతంత్ర్యము లభింప జాలదు. కనుక ముందుగ సామాన్య స్త్రీలయందంతటను బాగుగ ప్రబోధము కలుగవలెను. స్త్రీజనమందంతటను విద్యవిరివిగ వ్యాపించినయెడల నేవిధమైన ప్రత్యేక ప్రచారం అవసరములేకయే వారియందే స్వతంత్రబుద్ధి బైలుదేరును. కనుక వారి యందు విద్య చాల తక్కువగ నున్నది. కేవలము ఉత్తరములను వ్రాయుటకును చదువుటకును పనికి వచ్చునంతే విద్యగల "సాక్షర"లగు స్త్రీలసంఖ్య 1931 సంవత్సరపు జనాభాలెక్కప్రకారము వేయింటిలో పన్నెండు మాత్రమే గలదు. హిందూదేశములోని యితరరాష్ట్రముల యందలి సంఖ్యలు చూడుడు. దానిలో సాక్షరల అంకెలు వేయింటికి యీ విధముగనున్నవి.

| బంగాళము | మద్రాసు | బొంబాయి | మైసూరు | బరోడ |
|---|---|---|---|---|
| 183 | 110 | 149 | 174 | 331 |

నిజాంరాష్ట్రములోని అత్రాఫుబల్ద జిల్లా తరువాత వరంగల్లు జిల్లాయే పెద్దది. ఈ జిల్లాలో గల జనాభాలో వేయింటిలో నలుబది మంది సాక్షరలుండిరి. మొన్నటి జనాభాలో ఇది ఏబదియైదు వరకు వృద్ధి జెందినది. కాని స్త్రీలలో సాక్షరలసంఖ్య మునుపటి కంటె తగ్గినది. ఇది చాలా విచారకరమగు అంశము.

కేవలము పాఠశాలలమూలమున వీలుగానియెడల చిన్నచిన్న స్త్రీసంఘములద్వారా విద్య నేర్పవచ్చును. సామాన్యముగా గృహిణులగు స్త్రీలందరును ఇట్టి సమాజముల మూలమున నెంతయో యభివృద్ధిచెందవచ్చును. మరియు వార్తాపత్రికలద్వారా ఇతర సాధనముల ద్వారా యితర దేశముల యందలి స్త్రీలెట్లు సత్వరాభివృద్ధినొంది, సక్రమముగ సర్వహక్కులను స్థాపించగలుగుచున్నారో గమనింపవచ్చును. కాని స్త్రీ విద్యాభివృద్ధికై చేయబడుచున్నకృషికన్న వారికే విద్యయొసగుట మంచిదను వివాదములెక్కువగ చేయబడుచున్నవి. వారికి పురుషులతోపాటు విద్య అవసరమనియు, కేవలము గృహనిర్వహణము లలితకళలను మాత్రమే నేర్పవలయుననియు కొందరభిప్రాయపడుచున్నారు.

కాని స్త్రీలకు విద్యావిషయమున రక్షణలు, మినహాయింపులు లేని సంపూర్ణస్వాతంత్ర్యమే కావలెను. వారు పురుషులతోపాటు సర్వవిద్యలను సంపూర్ణముగ నభ్యసించుటకు హక్కుగలిగి యుండవలెను. ఇక సాంఘికకృషిని తలపెట్టినయెడల నెంతయో అభివృద్ధి జరుగవలసినయున్నది. అదియేమి దురదృష్టమోగాని ప్రస్తుత హిందూసంఘదురాచారములన్నియు స్త్రీ సంఘమునకే యనర్థదాయకముగ నున్నవి. పురుషులకు వానివలన నష్టము చాలా స్వల్పము. ముఖ్యముగ మన నిజామాంధ్రదేశ ప్రాంతములందు యెక్కువవ్యాప్తి యందున్న అతి బాల్య వివాహముల వలన కలుగునష్టమెంతయోకలదు. దురదృష్టమున భర్తగతించినచో అతిబాల్యముననే దుర్భరమగు వితంతుత్వమును వహించి సుఖజీవితమునకును, శుభ కార్యములకును దూరమై, ఆర్థిక దురవస్థలకులోనై, నిరాశా నిస్పృహలకు జిక్కి, మానసిక వ్యాధులకు బాల్పడి వ్యర్థ జీవితమును గడుపవలసిన వారగుచున్నారు. అటులగాక దంపతులిరువురును జీవించియున్నచో మిక్కిలి పసితనముననే మాతృత్వమును వహించి, ఒక శిశువుతోనే తన శరీరమునందలి బలమును, ఉత్సాహమును, తేజమును గోల్పోయి, బలహీనులు, వికలాంగులు, అల్పాయుష్కులునగు నా దురదృష్ట శిశువలనే సంఘమునకును, దేశమునకును తీరని ద్రోహ మాపాదించుచున్నారు.

కనుక స్త్రీలకుగూడ మైనారిటీ వదలువరకైనను వివాహముచేయక యుంచినచో ఇప్పటి నిశ్శక్తి, నిర్జీవతలను వదలి సుఖవంతులై యుండగలరు. పునర్వివాహాధికారము లేకపోవుటచే లక్షలకొలది స్త్రీలు కష్టముల ననుభవించుచుండగ పురుషులకు ద్వితీయవివాహము, బహుభార్యాత్వము సంఘనియమము నకు విరుద్ధము కాకుండుటచే, కృత్యాకృత్య విచారము లేక యెనుబదవయేట వివాహమాడిన పుణ్య పురుషులుగూడ కొందరు కలరు. అట్టి వారు నవమానవయస్కులగు వితంతువులను

వివాహమాడినను గొంతమేలే కాని, ఈ వృద్ధ మహాశయులకు కావలసిన వధువులు కేవలము బాలికలు మాత్రమే. ఇట్టివారిని దండించుటకు గూడ శిక్షాస్మృతి యందలి యేనిబంధనము వర్తింపదేమో!

ఇప్పుడు మనస్త్రీలు ఆర్థికముగ చాలదురవస్థ యందున్నారు. ఈ విశాల ప్రపంచమున స్త్రీకి నాదియని చెప్పుకొనుట కేదియునుండదు. తండ్రి యింటినుండి కాని, భర్తయింటి నుండికాని ఆమెకొక్క పైసగూడ రాదు. ఉదారుడగు భర్తయు, విధేయురాలగు భార్యయు సమకూడిన యెడల భర్త దయదలచి నగలు చీరలు కొనియిచ్చుట గలదు. ఇందువలన స్త్రీలకేమియు లాభము లేకపోగ పురుషులు యిచ్చువచ్చినపుడు దాచుకొనుటకును, సమయము వచ్చినపుడు తీసికొనుటకును యుపయోగించు ధనపుపెట్టెలుగా మాత్రము పనికి వచ్చుచున్నారు. అట్లు గానియెడల సామాన్య స్త్రీలెల్లరును ఆర్థికముగ పెక్కు యిడుములు బడువారై యున్నారు. స్త్రీలు తమకిష్టమగు పుస్తకములు, వార్తా పత్రికలు తెప్పించు కొనుటకును, స్త్రీ సంఘముల యందు సభ్యురాండ్రుగా నుండుటకును తమ కవసరమైన యితర ఖర్చులనొనర్చు కొనుటకును స్వీయధనములేకపోవుటచే వారియభివృద్ధి కేవలము పురుషుని యనుగ్రముపై నాధారపడి యున్నది. ఈ విశాల ప్రకృతిలో ఇన్నికోట్ల జీవరాసులలో ఒక్క భారత స్త్రీ తప్ప మరియే ప్రాణియు తమ జీవనభారమును పురుషజీవిపై మోపుటలేదు. తక్కువజాతి కార్మిక స్త్రీలు గూడ తమ యుదర పోషణమును తమ స్వయంకృషిపై నిలుపుకొని జీవించుచున్నారు. కేవలము నాగరికులము, అగ్రజాతుల వారము అనుకొను స్త్రీలయందే ఈ నికృష్టము వ్యాపించి యున్నది. ఇట్లార్థికముగ, స్త్రీ పురుషునిపై నాధారపడుటచేతనే పురుషులకు సహజముగ స్త్రీలపైనుండవలసిన భక్తి, ప్రేమ, గౌరవములును పోయి వందలు, వేలు వరశుల్కము సమర్పించిననేగాని భర్త లభింపని హైన్యమునకు బాల్పడి యేమాత్రము విలువలేని పదార్థమైపోయినది. హాయిగ, నిర్భయముగ, స్వేచ్ఛగ, సమస్తశక్తులతోను ప్రకాశింపవలసిన స్త్రీ తిండికి బట్టకు గూడ పురుషునిపై నాధారపడవలసి వచ్చుటచేతనే ప్రత్యేక వ్యక్తిత్వమునశించి కేవలము బురుషునిఛాయగ మాత్రమునిలిచిపోయినది. అనగ స్త్రీకి కుల, మత, గోత్రములు, పదగౌరవములు భర్త నుంచి యేర్పడునుగాని స్వీయప్రతిభచే నేర్పడుట లేదు. రాజకుమార్తె కూలి వానిని పెండ్లాడిన నామెగూడ కూలిదియగుచున్నది. కాపువాని కూతురు రాజును పెండ్లాడిన ఆమె రాణి యగుచున్నది. అంతియేగాని స్త్రీకి ప్రత్యేకముగ యేపదవియు లేదు. కనుక స్త్రీ లెల్లరు ముఖ్యముగ యీ ఆర్థిక స్వాతంత్ర్యము లభింపజేయు హక్కులకై సంఘముల ద్వారా, వ్యక్తిపరముగ, మిక్కిలి యాందోళన సలుపవలసియున్నది. ఎటులైనను స్త్రీలు పురుషులతో సమముగ ధనమునకు వారసులైనచో బహుళ సంఖ్యాకములైన సాంఘికనిర్బంధమును స్వాతంత్ర్య నిరోధకములగు పెక్కు చిక్కు సమస్యలు గూడ విడిపోవును. సమయము వచ్చినపుడు ధనసంపాదన కుపకరించు విద్యనే స్త్రీలుగూడ నేర్చుకొని యుండవలెను. సకలకార్యములును సర్వ స్వాతంత్ర్యములును, కీర్త్యున్నతులును, ఆదరాభి మానములును, ధనైక సాధితములు గనుక స్త్రీలందరును అవసరము, అవకాశము, సామర్థ్యము గలిగినప్పుడు గౌరవముగ ధనము సంపాదించుట, దాని నుచితరీతిన వ్యయపరచుట నెరిగియున్నయెడలనే సత్వరస్వాతంత్ర్యము లభింపగలదు. మతమును గురించికూడ స్త్రీలు బాగుగతెలిసికొని యుండవలెను. స్త్రీలకు మత గ్రంథముల యందెక్కువ ప్రవేశము లేకపోవుట వలననే మతనియము లెందుకు నియమింపబడినవో ఏ ధర్మసూత్రము లెందుకొరకు సృష్టింపబడినవో తెలిసికొనజాలక అవసరములగు పనులు కొన్ని విడనాడుటయు, అవసరమగుదాని నాచరించుటయు తటస్థించు చున్నది. కనుక నతిప్రాచీనమును, ఆదర్శ ప్రాయమును, అగు నీయార్యమతము జీవించి యుండవలె నన్నచో స్త్రీలకు గూడ సంపూర్ణముగ దాని తత్త్వము తెలిసియుండవలెను.

వేదకాలమున స్త్రీలకు సర్వస్వతంత్రము లుండెడివి. గార్గి, సులభ, బడబ, మైత్రేయి, సరసవాణి మొదలగు విదుషీమణులు, వేదాంతమునందు అపారజ్ఞానము నార్జించి బ్రహ్మజ్ఞాన చర్చల యందు మహాఋషులతో సమానముగ వాదించెడివారు. విశ్వాల, ముద్గలానియను వీరవనితలు ఋగ్వేదకాలమున అఖండమగు కీర్తిని గడించిరి. మరియు లీలావతియును విదుషీమణి గణిత శాస్త్రమును, ఖనాదేవి జ్యోతిశ్శాస్త్రమును రచించి స్త్రీలుగూడ సర్వవిద్యల యందును పురుషులకు తీసిపోరను సంగతి ననేకరూపముల స్థాపింపజేసిరి. అంతవరకెందులకు? ప్రథమవేదమైన ఋగ్వేదమునందును, ఉపనిషత్తుల యందును, స్త్రీలు

రచియించిన కొన్ని భాగములుకలవని శ్రీ కావ్యకంఠ గణపతి శాస్త్రుల వారొకసారి నుడివియున్నారు. అశోకుని కాలమునందుగూడ కేవలము బౌద్ధ భిక్షులేకాక అశోకుని అంతఃపుర స్త్రీలు కూడ కొందరు మత ప్రచారముచేసెడివారని తెలియుచున్నది. కాని పురాణకాలమున మాత్రము స్త్రీల హక్కులను చాల సంకుచితపరచి కేవలమువారికి సేవావిధానమును మాత్రమే నేర్పి వారి వ్యక్తిత్వములను చంపివైచినారు. అయినను స్త్రీ పురుషులిరువురుకును పనికివచ్చు నుత్తమ ధర్మములుకూడ కొన్ని పురాణముల యందు లేకపోలేదు. కాని స్త్రీలుగూడ సర్వమత గ్రంథములను సాకల్యముగ జదివి వానియందే మాత్రమైన మంచియున్నచో గ్రహింపవలిసి యున్నది. ప్రస్తుత కాలమున స్త్రీలకు ధనసంపాదనావసరము లేదు గనుక వారియందు సోమరితనము చాలాప్రబలిపోయినది. చాలామంది స్త్రీలకు తమ జీవితోద్దేశ్యమే తెలియదు. మరి బర్మాదేశపు స్త్రీలు పురుషులకన్న గూడ అతి చురుకుగ గృహకృత్యములను, బైటి వ్యవహారములను గూడ నిర్వర్తించు కొనెదరు. వ్యవసాయమునకెక్కువ పేరొందిన హాలెండు దేశపు స్త్రీలు పురుషులతో సమానముగ వ్యవసాయమున పాటుబడుటయె గాక, మిగిలిన కాలమును గూడ నూలువడుకుట మొదలగు గృహపరిశ్రమలతో ఒక్క నిమిషమును గూడ వృధాపోనిచ్చుట లేదు. ఇంకను పాశ్చాత్య దేశములందలి స్త్రీలు అనేక విషయములయందు కృషి సలిపి ప్రకృతిపరిణామము నందు, శాస్త్రీయ విషయములయందు, యంత్ర నిర్మాణము నందుగూడ అనేకవిధముల పరిశోధన చేసి అత్యవసరములును, అమూల్యములును, అతి విస్మయ జనకములును అగు పెక్కు విషయములను కనుగొని దేశమునకు హితము గూర్చుచున్నారు. కాని ఒక్క భారత స్త్రీలు మాత్రమే తమ యధాప్రకార జీవితమునకు భంగములేకుండ అసంఖ్యాక సంఘ దురాచారములలో శతసహస్ర దాస్యబంధనములలో స్వకీయ హీనదశనుగూడ తెలిసికొనజాలని స్థితిలో, ప్రపంచము నందెవ్వరికిని లేని సంతృప్తితో జీవనము గడుపుచున్నారు.

ఉద్యోగములమాట, పెద్ద పెద్ద పరిశోధనముల మాట అటుంచుడు. ప్రస్తుత గృహకృత్యముల నన్నిటికి నెరవేర్చుకొనుచునే సంసారిణులగు స్త్రీలందరును నిర్వర్తింపదగిన సంఘసేవయెంతయో గలదు. మనదేశము నందు విపరీతముగ బెరగిపోవుచున్న కోట్ల కొలది స్త్రీల యాకస్మిక మరణములకును, శిశుమరణమునకును కారణములరసి వారికి తగిన సహాయముచేసి, అట్టి అపాయముల నుండివారిని కాపాడుట, రోగార్తులు, కృశీ భూతములునగు బీదస్త్రీల కొరకాశ్రయగృహముల నేర్పరచి వారిబాధ నివర్తింపజేయుట, మన సంఘదురాచారముల నెరుగని సామాన్య స్త్రీల కందరికిని బోధించి, తన్నివారణో పాయముల నుపదేశించుట మొదలగు సేవయెంతయో జేసినకాని మనదేశముగూడ సాటి దేశములలో తలనిలుపు కొనజాలదు. ఇంకను తగిన విద్య, సామర్థ్యము, పలుకుబడి గల స్త్రీలు చిన్న చిన్న సంస్థలనేర్పరచి వానిమూలమున స్త్రీలకు ప్రస్తుత ప్రపంచ విజ్ఞానమును కలిగింప వచ్చును. లలిత కళలను, శిథిలమైన గృహపరిశ్రమలను స్థాపింపచేసి వారి సోమరితనమును నిర్వ్యాపారత్వమును, విదేశీవ్యామోహమును పోగొట్టి దేశపు ఆర్థికస్థితిని చక్కబరుప వచ్చును. అతిబాల్య వివాహములను, వృద్ధవివాహములను అసంబద్ధ వివాహములను సంఘముద్వారా మాన్పింప వచ్చును. ముఖ్యముగ గ్రామప్రాంతములందు విషజ్వరములు, అంటేవ్యాధులు వ్యాపించినపుడు గ్రామమును పరిశుభ్రముగా నుంచుటయందును తగిన సేవాశిబిరముల నేర్పరచుట యందును స్త్రీలే యెక్కువగ బాధ్యత వహింపవలసియున్నది. మరియు నిజామాంధ్రదేశపు తక్కువజాతులలో స్త్రీలయందు గూడ త్రాగుడు మొదలగు దురలవాటులు యెక్కువగా కలవు.

కనుక విద్యావంతులగు స్త్రీలు వానివలన కలుగునష్టములను బోధించినవానిని మానునట్లు చేయవలెను. సంఘమున కనర్థదాయకమగు అస్పృతను గూడ నివారించుటకు స్త్రీలేయెక్కువగా ప్రయత్నించ వలయును. ఇట్లే వారి వారి పరిస్థితులకనుకూలముగ సంఘసేవ స్త్రీలు స్వయముగ నొనరించుకొనవలసిన దెంతయో గలదు. స్త్రీల యందీవిధముగ సోమరితనము, నిర్వ్యాపారత అధికమైన కొలది వారి ఆరోగ్యము కూడ బొత్తిగ చెడిపోవుచున్నది. జనపరిగణనపు నివేదికయందు మనరాష్ట్రమునందలి హిందువుల సంఖ్య నానాటికీ క్షీణించు చున్నదనియు దీనిక కారణము స్త్రీలెక్కువ అనారోగ్యముగ నుండుటయేననియు సూచింపబడినది. సగటున వారి జీవితము గూడ పురుషులకన్న తక్కువగనె యున్నది. దీనికి కారణములు వెనుక వివరించిన బాల్య వివాహములు, మద్యపానముల మాత్రమే కాక అనవసరముగ తెచ్చి పెట్టుకొనిన గోషా పద్ధతి కూడ ఒకటియై

యున్నది. సకలజీవరాసులకు సమానహక్కులతో ప్రకృతిమాత ప్రసాదించిన గాలిని, వెలుతురును గూడ స్త్రీల ననుభవింపనీయకుండ చేయుటలో పురుషులు చాల అన్యాయమునే చేసినారు. అనేక శతాబ్దముల నుండి గోషా పద్ధతి నవలంబించుచున్న ఆఫ్ఘనిస్తాను, టర్కీ ఈజిప్టు మున్నగు మహమ్మదీయ రాజ్యములలోని స్త్రీలె ఇప్పుడు బురఖాలను వదలివైచి పురుషులతో సమానముగ క్లబ్బులకును, గాలివిహారములకును పోవుచున్నారు. కనుక నీ విజాతీయమైన అవరోధమును స్త్రీలెంత త్వరగ వదిలిన అంతమేలు. ఇంకను స్త్రీల యనారోగ్యమునకు వారియందు ప్రబలియున్న మూఢనమ్మకములు గూడ నొక కారణమై యున్నది. గ్రామదేవతలనబడు క్షుద్రదేవతారాధనము, భూత ప్రేతములవలన భయము, మ్రొక్కుబడులు, స్వాములవారి సేవ మొదలగు మూఢ నమ్మకములు ముఖ్యముగ గ్రామ స్త్రీ యందెక్కువగ వ్రేళ్ళు పాతుకొని పోవుట చేత స్త్రీలు ఆరోగ్యము నందును, ఆర్థికమునందును కూడ నష్టపడుటయేగాక యితరదేశములయందుగూడ పరిహాస పాత్రులగుచున్నారు. ఈ విషయములలోగూడ అనేక మంది మహాశయులు పరిశోధన చేసి భూత ప్రేతములు లేవని నిరూపించియున్నారు. కనుక ఇట్టి వెఱ్ఱి నమ్మకములను స్త్రీలు సాధ్యమైనంత త్వరగ వదిలి పెట్టవలెను. ఇట్టి నమ్మకములచేతను, వెనుక వివరించిన గోషాపద్ధతిచేతను స్త్రీలలో పిరికితనమెక్కువగ వ్యాపించినది. కేవలము స్త్రీ యొక్కతె ఎక్కడకు పోవుటకుగాని, ఏపని చేయుటకుగాని అసమర్థురాలు. ఎల్లవేళలనామె పురుష సహాయములేనిది యే కార్యమును నిర్వహింపజాలదు. ఈ పిరికితనమునకు ముఖ్యముగ మూడు కారణలములు కనబడుచున్నవి. మొదటిది పిశాచములని భయము. ఇది ముఖ్యముగ రాత్రులయందు కలవరపెట్టును. కనుక నట్టి భయము నిజముగ భూతములు లేవనియు, వానికి సంబంధించిన కథలన్నియు కల్పితములనియు వ్యాధులన్నియు పైత్య విభ్రమములనియు దృఢముగ నమ్మినయెడల నశించిపోవును. రెండవది చోరులవలన భయము. స్త్రీలవద్ద యెక్కువ విలువగల నగలుండుటయె యిందులకు కారణము. అమితముగ నగలను వాడుట దేశపు ఆర్థికస్థితికి కూడ భంగము కలిగింపగలదు. ఏలనన అనవసరముగ వేలకొలది రూప్యముల నాభరణరూపముగ నుంచుట కంటె వాని నేదేని యొక వ్యాపారసంస్థ యందిడినచో కొందరు నిరుద్యోగుల కాశ్రయము కలిగింప వచ్చును. కావున అట్టి నిబంధనముల విడనాడినను నష్టములేదు. ఇక మూడవది దుర్మార్గులగు పురుషులవలన భయము, అట్టి భయము సామాన్యముగ యౌవన ప్రారంభమునుండియే పుట్టుచున్నది. ఇది స్త్రీలు విద్యావంతులైన గోషాను వదలి పురుషులతో కలిసిమెలసి వర్తించుట కలవడినయెడల నశించిపోగలదు. అప్పుడే స్త్రీలు కూడ సహజముగ, స్వతంత్రముగ, నిర్భయముగ పురుషులనెదిరించు సామర్థ్యమును గలిగియుండగలరు. ఇంకను స్త్రీల యారోగ్యము సరిగనుండవలెనన్నచో వారు నియమితమగు వ్యాయామము కూడ చేయవలసియున్నది. ఇంచుక చల్లగాలియందు తిరుగుటచేగాని, వినోదకరమై కొలదిగ పరిశ్రమయిచ్చెడి యాటలచేగాని సందర్భోచితమగు శరీరసాధనచేగాని ముఖ్యముగ స్త్రీల యందెక్కువ వ్యాప్తి యందున్న క్షయ, అపస్మారకము, గర్భాశయ వ్యాధులు మున్నగువ్యాధులు నివారింపవచ్చునని చాలమంది ప్రముఖులగు డాక్టరులు అభిప్రాయముల నిచ్చియున్నారు. కనుక యిట్టి దేహపరిశ్రమలకు గూడ స్త్రీ సమాజములు ముఖ్యముగ బాలికాపాఠశాలలు శ్రద్ధ తీసుకొనవలసియున్నది. ఇంకొక విషయమును జెప్పి ముగించివైచెదను. తరతరములనుండియు భారతస్త్రీలు పాతివ్రత్యమున కెక్కువ ప్రతిష్ఠ గలిగించినారనియు, ఏమాత్రము స్వాతంత్ర్యము వచ్చినను వారు నైతిక దుష్టులగుదురనియు మనవారియందొక పెద్ద భయము వ్యాపించియున్నది. కాని యిన్ని విధములగు రక్షణలలో బానిసత్వములో స్త్రీలు పతివ్రతలుగనున్నారన అదివారి గొప్పతనమును గాక పురుషుల నిర్బంధ పాలనా నిశితమును చాటుచున్నది. కారాగృహమందలి ఖైదీ దొంగతనమును చేయలేదన్నచో అందువాని ప్రతిష్ఠ యేమున్నది? ఎప్పుడు స్త్రీ స్వతంత్రయై సమస్తహక్కులతోను ప్రకాశించుచు, యెప్పుడు తన శీలమును తాను స్వయముగ రక్షించుకొనదగియుండునో అప్పుడే ఆమెకు నిజమైన ప్రతిష్ఠ లభింపగలదు. మరియు మనప్రాచీన స్త్రీలు పూజనీయులుగా నుండిరని గాని వీరరుద్రమ, ఝాన్సిరాణిలవంటి వీరవనితలు మనదేశమునందు ఉద్భవించిరని కాని మనమూరక గర్వించినయెడల లాభములేదు. కొంతవరకైనను వారిప్రతిష్ఠను మనము నిలుపదగినప్పుడే గర్వింపవలిసయున్నది. సోదరీమణులారా? ఇంతవరకు మీ యమూల్యమైన కాలమునంతయు వినియోగించి యోపికతో నా యుపన్యాసమును వినినందులకు మీకందరకును నా కృతజ్ఞతానమస్కారములు. ◉

# నారాయణ శాసనం

– వల్లూరి సూర్యనారాయణరావు

*ఈనాటి నాయకమ్మణులు మంత్రివర్యులు, విపణిరాజులు, రియాల్టీ రింగులు, ఇలా అందరూ లక్షల కోట్ల రూపాయలు కూడ బెడుతున్నారు. అటు చూస్తే రెండుమూడు దశాబ్దాలలోనే ప్రభుత్వాలను మింగివేసే సంపదల హర్మ్యాలలో తులతూగుతున్న అంబా మాత్యుడు.*

*ఇవన్నీ ఎందుకు చేస్తున్నారు? వారి వారి వారసులకు, అంటే కొడుకులు, మనుమలకు కట్టబెట్టే ప్రక్రియ కదా. వీరంతా అసమాన్యులు. వీరినుంచి ఎటువంటీ సాహిత్యాన్నీ ఆశించలేము. అంత సమయమూ వారికుండదు.*

*కానీ ఒక సామాన్యుడు తన సామాన్య పరిస్థితుల్లో సంపాదించిన ఆస్తిపాస్తులు ఎవరికిస్తాడు? తన వారసులైన కొడుకులకే ఇవ్వాలికదా. కాని ఈ **నారాయణ శాసనం** చదవండి. వారసత్వమంటే ఏమిటి? స్వార్జితాన్ని ఎలా సద్వినియోగం చేయాలి..? ఈనాటి ఆలోచనాపరులంతా తలదించుకునేలా ఈ శాసనం లిఖించబడింది. మనకు శాసనమంటే రాజులు, చక్రవర్తులు, లేదా అగ్రహారాలందుకున్నవారు, లేదా . . . ఇంక వద్దు లెండి, వేసినవే కదా. కాని ఇది చదవండి.*

*ఈ తెలుగు సొగసు ఆస్వాదించండి.*

సాధారణముగా, జనులు తాము చనిపోకముందు, గొప్ప వ్యాధిలో నున్నపుడే, తాము యిక జీవించమనే అధైర్యముతో, తమ తుదిమరణశాసనములను, బహుతొందరగా, అనాలోచనతోకూడ మరియొకరు తోపించినట్లు వ్రాయుచుందరు. కొందరు ముందుగానే, మేల్కొని అట్టివి వ్రాసికొన్నను, వానిని యే రిజిస్ట్రేషన్ ఆఫీసులో గాని, మరియెక్కడనో దాచి యుంచెదరు. వానిని తమ యిళ్లలోనే యుంచుకొని చనిపోయిన యెడల, దానిలో వ్రాసిన విషయములు తమవారసులే విని చింపివేయవచ్చునని ఒక భయము. ఉయిలును తన జీవితకాలములోనే ప్రకటించుకొన్న యెడల, తన యవసాన కాలమందు, వారు తన కూడిగము చేయరేమో యనునది రెండవ భయము. లేదా ఆ ఉయిలులో నుదహరించిన తన యుద్దేశ్యములను మార్పించుటకు, వారు ఒత్తిడి కలుగజేయ వచ్చునని మూడవ భయము.

నాకిట్టి భయములు లేనివాడను. నా ఉద్దేశ్యములను ట్రస్టుడీడులో, వ్రాసికొని నా జీవితానంతరము వాని నమలులో పెట్టవలయునని వ్రాయవచ్చును గాని, నేను మరణించులోగానే కొన్ని సంగతిసందర్భములలో, దానిలో మార్పులు చేయుటకు వీలుండదు. ఎటులైనను నాకు మిగులు కొద్దిపాటి ఆస్తి నాకు తోచిన ధర్మమునకే, యెప్పటికైనను వినియోగ పడుచుండవలెనని నేనిప్పుడే బహిరంగపరచిన యెడల, అది, ప్రజలయెదుట చేసిన ప్రమాణమై, నీతిగలవాడు దాని నుల్లంఘింపడు. ఇట్టు ఉయిలును ప్రకటించుకొనుట స్వోత్కర్షకొరకే యని కొందరు నన్ను హేళన చేసెదరు. అట్టి యుద్దేశ్యము నాకు కలిగినను, అదియొక గొప్ప తప్పుగా నేను భావించను సరికదా, నా వంటి సామాన్యగృహస్తులు, తమ శక్తి కొలది, తమయాస్తిలో కొంతైనను ధర్మమునకు వినియోగించుటకు యీ విధానము కూడ ఒక ఆచరణ పూర్వకమగు మార్గమని నేనెంచెదను.

తన వారసులయెడ యిక నెట్టి బాధ్యతలు లేనప్పటికి, తనయాస్తిని లోకోపకారమున కుపయోగించక, తన బిడ్డలకో, వారు లేనియెడల, మరియొకరికో దానినంతయు చెందింపజేయుట మనలో ఒక మూఢాచారమైనది. దీనిని నేను సదా ఖండించుచూ కూడా నా విధానమను నేనే ఆచరణలో పెట్టక, యితరులకు శ్రీరంగనీతులు బోధించుట హాస్యాస్పదము. నానావిషయములలో, సత్యమైన పరిజ్ఞానమును, మతసాంఘిక రాజకీయార్థిక సంస్కరణావశ్యకతను, మన సామాన్య ప్రజలలో యెల్లపుడు

సేకరణ: జె. చంద్రమౌళి, ఫోన్: 9848043334

నుద్బోధించుటయే నాయాశయము. కాబట్టి ఒరుల దూషణభూషణములను లక్ష్యపెట్టక, నా మరణశాసనమును యీ క్రింద నుదహరించు చున్నాను.

* * *

**నా చివరి వీలునామా:**

ఆ 1936 సం॥రం. జనవరి 1 టో తారీఖున పశ్చిమ గోదావరిజిల్లా కొవ్వూరు తాలూకా, కొవ్వూరు గ్రామ కాపురస్తులగు, వల్లూరి వెంకటకృష్ణయ్యగారి కుమారుడును, హైకోర్టు అడ్వొకేటు నగు వల్లూరి సూర్యనారాయణరావు బి.యే., బి.యల్., యల్.టి., మంచి తెలివితోడను వ్యక్తతతోడను వ్రాసిన మరణశాసనము.

నాకుగల యావదాస్తియు నాస్వార్జితమై, నాకే దానిలో పరిపూర్ణ హక్కు భుక్తములు కలిగి యున్నందున, దాని వినియోగమును గురించి యీ క్రింది యేర్పాటులను, నా తదనంతరము జరుగునట్లు వ్రాయుచున్నాను.

నాకొమార్తె వాడ్రేవు శారదామణికి ది 9-5-1920 తారీఖున ఆమె వివాహసమయమున, నేనిచ్చిన వేయిరూపాయిలు, ఆమె పెనిమిటి వాడ్రేవు బాపిరాజుగారు బి.యే., బి.యల్., గత 15 సంవత్సరములనుండి వడ్డీకివేసి వృద్ధిచేసి, యిప్పుడు అసలు సొమ్మును ఆమెకు యిచ్చివేయగా, ఆలమూరు కోఆపరేటివు ల్యాండు మార్టుగేజి బ్యాంకులో నొక డిబెంచరును ఆమె కొనుక్కొనెను.

ఇదిగాక నేను మచిలీపట్టణములోని భారత లక్ష్మీ బ్యాంకులో వేసియున్న వేయిరూపాయల షేర్లను ఆమెకు, ది 7-10-1930 తారీఖున రిజిస్టర్డు ట్రస్టుదస్తావేజు ద్వారా యిచ్చివేసి, దానిమీద వచ్చు వడ్డిని, ఆమెకు కావలసిన ఖర్చులక్రింద నేనే యిచ్చుచున్నాను.

నా రెండవ కుమార్తె మల్లాప్రగడ సూర్యకుమారికి, నాకు మచిలీపట్టణము ఆంధ్ర బ్యాంకులో రెండు వేల రూపాయిల షేర్లను ది 29-7-28 తేదిని రిజిస్టర్డు ట్రస్టు దస్తావేజుద్వారా యిచ్చితిని. ఆ బ్యాంకు వారు నా యుత్తరువు ప్రకారము సదరు షేర్లమీది వడ్డీని ఆమెకే పంపుచున్నాను. నా తదనంతరము పై షేర్లను వారి వారి పేర్లకు బ్యాంకు లెక్కలలో ట్రాంసుఫరు చేయించుకొనవలెను. చనిపోయిన నా మొదటి కొమార్తె మల్లా ప్రగడ శాంత రాజామణికి నేను మచిలీ పట్టణములోని కృష్ణా కోఆపరేటివు బ్యాంకులో వేసిన ఫిక్సెడు డిపాజిట్టు రెండువేల రూపాయలు తీసికొని, ఆ మొత్తమును వడ్డీతో సహా వృద్ధి చేసి, ఆమె కొమారుడు శాంతారావుకు ట్రస్టీగా నుండి, అతనికి భూములను కొనుటలో ఆమె పెనిమిటియగు మల్లా ప్రగడ రామచంద్రరావు గారు బి.యే., బి.యల్., పని చేయుచున్నారు. కాబట్టి నాకొమార్తెల విషయమై నా విధ్యుక్త ధర్మమును నెరవేర్చితిని.

నాభార్య పార్వతమ్మగారిపేర, మచిలీపట్టణములోని కృష్ణా కోఆపరేటివు బ్యాంకిలో రు. 2500లు కిమ్మతుగల షేర్లును, పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని కోఆపరేటివు జిల్లాబ్యాంకులో రు. 200 లు కిమ్మతుగల షేర్లును ఉన్నవి. ఇవిగాక పైన చెప్పిన మొదటి బ్యాంకులో, రు. 2300ల కిమ్మత్తుగల షేర్లును, రెండవ బ్యాంకులో రు.1000 లు కిమ్మతుగల షేర్లును, కొవ్వూరు అర్బన్ బ్యాంకులో రు. 100 లు కిమ్మతుగల షేర్లును నాపేర నున్నవి. కాని యీ షేర్లన్నిటి మీద వచ్చు అయివజును ఆమెకే యిచ్చి వేయుచున్నాను. ఆమె పేర నున్నవి కూడా నాదతనంతరము ఆమె పేరనే ట్రాంసుఫరు చేసికొని యనుభవించుటకు సంపూర్ణాధికార మిచ్చితిని. ఆమె వానిమీద వచ్చు వడ్డినంతయు తన యిష్టప్రకారము వినియోగించుకొనవచ్చును.

నాకు బొంబాయి ఓరియంటల్ గవర్నమెంట్ సెక్యూరిటీ లైఫ్ అస్యూరెన్సు కంపెనీలో ఆయిదు వేల రూపాయలకు అస్యూరెన్స్ ఫర్ లైఫ్ పాలసీ విత్ ప్రాఫిట్స్ నెం: 29545 ఆఫ్ 1895 ఒకటి ఉన్నది. దానిని, నేనిదివరకే కంపెనీ వారి లెక్కలలో నాభార్య పేర ట్రాంసుఫరు చేసితిని. ఆ పాలసీ మొత్తము బోనసుతో సహా యిప్పటికి సుమారు యేడువేల రూపాయిలుండును. నా తదనంతరము దాని మీద రావలసిన సొమ్మంతయు నాభార్య తనయిష్టానుసారము ఖర్చు పెట్టుకొన వచ్చును. ఆమె నాకంటె ముందుగా చనిపోవుట తటస్థించిన యెడల ఆరాబోవు మొత్తము వినియోగపడవలసిన యేర్పాట్లు యిప్పుడే చేయుటకు నాకు హక్కుగలదు గనుక, నా తదనంతరము కొవ్వూరు ఆంధ్రగీర్వాణవిద్యాపీఠమువారు, ఆ మొత్తము నంతయు కోఆపరేటివుల్యాండు మార్టుగేజి బ్యాంకులలోనె డిబెంచర్లు కొని, వానిమీద వచ్చు వడ్డీని మాత్రమే, యీ క్రింద: వి (బి) పేరాలో నుదహరించిన నాఖాళీస్థలములో బీదలైన రోగులకు ప్రకృతిచికిత్స చేయుటకై, అపక్వ శాకాహారము మీదనే జీవించుచున్న యొక వైద్యుని

నెల 1టికి రు. 15లు జీతము నిచ్చుచు, మిగిలిన మొత్తమును, ఆరోగులు తాత్కాలికముగ నివసించుటకు, పాకలక్రిందను, వారి శాకాహారభోజనము క్రిందను, వీలైనంతవరకు ఖర్చు పరచవలెను. నేనే నా భార్యకంటె ముందుగా చనిపోయిన యెడల ఆమెకూడ నాపై కోర్కెను నెరవేర్చునని ఆశించుచున్నాను.

నా కొమారుడు రామమోహన్ బి.యే. ప్యాసై సంతానము లేకుండగనే, మూర్ఛగుణము, విషజ్వరముల వలన, ది 1-9-1928 తారీఖున చనిపోయెను. ఇతని భార్యా చంద్రమతీ దేవి, తనజీవితమును తన సోదరీమణులకు సేవచేయుటకే వినియోగించెదననియు, తనకు విద్యాదానము చేయవలసినదనియు నన్ను కోరగా, అయిదు సంవత్సరముల నుండి ఆమెకు నెలకు ముప్పది రూపాయిలిచ్చుచు మద్రాసులో Queen Mary's College లో యింటర్మీడియేటు పరీక్ష ప్యాసు చేయించితిని. ఆమె యింకను యే కాలేజీలోగాని యేవిధమైన విద్యనైనను అభ్యసించునంతకాలము, నేనున్నూ నాతదనంతరము కొవ్వూరు ఆంధ్రగీర్వాణవిద్యాపీఠసంఘము వారున్నూ ఆ విధముగానే ఆమెకు పంపుచుండుటకు యేర్పాటు చేయడమైనది. ఈమె కూడా నాకుమాళ్లవలెనే నాకు మంచిపేరు తేగలదని నమ్ముచున్నాను.

**నా కుమారులు:**

నా స్వకాయకష్టము వలన పితురార్జితసహాయమేమియు లేక చిన్నతనమునుండి విద్య నార్జించి యీ కొద్దిపాటి యాస్తినైనను సంపాదించుకొన గలిగితిని. దీనిలో మూడవవంతు యిదివరకే దానధర్మములు చేసికొంటిని, **మిగిలిన రెండువంతులును కూడా నాకు యుక్తమని తోచిన ధర్మకార్యమునకు, వినియోగించుటయే నావిధ్యుక్త ధర్మమని చాలా కాలమునుండియు యెంచియుంటిని. నా కొమాళ్ళు తమచిన్నతనమునుండియు, నాకంటె అదృష్టవంతులై, నాసహాయమువలన ఉన్నతవిద్య గడించి, తమ సన్మార్గ ప్రవర్తనచేతను, ప్రయోజకత్వముచేతను నాకు కూడ మంచిపేరు తేగలిగిరి. వారి కుటుంబములను వారే పోషించుకొనగలరు గనుక వారియెడల నాబాధ్యత తప్పిపోయినది. వీరినింకను ధనవంతులను చేయుట నాకిష్టము లేదు. అట్లు నేను చేయదలచుకొనినను వారు సంపాదించుకొనకుండ వచ్చిన ధనము, వారి కుటుంబములో యెన్నటికిని నిలువనేరదు. ఒక వేళ ఒకటిరెండు తరములు కొద్దిగా నిలచినను, అది తరువాత పూర్ణముగా నశించితీరును. ప్రయోజకులు, ధనవంతులు, దరిద్రులు- యిట్లు వరుసగా తరముల వెంబడి మారుచుండును.** నాకొమాళ్ళు కూడ తమసంతతి వారి యెడల నామార్గమునే అనుసరించెదరని నమ్ముచున్నాను.

**నా ఆస్తి వివరాలు:**

కొవ్వూరు గ్రామములో నాబంగాళాయున్ను, దాని కాంపౌండులోని తోటయున్నూ, కొవ్వూరు ఆంధ్రగీర్వాణ విద్యాపీఠసంఘమువారు తమ మేనేజిమెంటు క్రిందకు తీసికొని ట్రస్టీలుగా వ్యవహరించవలెను. ఈ యింటిలోను, తోటలోను మొదట నా భార్యా తనజీవితాంతమువరకును, ఆమె చనిపోయిన తరువాత నా యిద్దరు కొమాళ్ళు కృష్ణమోహన్ ఎమ్.ఏ. బి.యల్., జగన్మోహన్ బి.ఏ., ఎల్.ఇ.ఇ., గార్లు జీవితాంతమువరకును, వీరిద్దరు చనిపోయిన తరువాతపై రెండవవారి కుమార్లు సూర్యమోహన్, శివరామకృష్ణమోహన్, రామమోహన్లు తమ జీవితాంతమువరకున్ను, రైట్ ఆఫ్ రెసిడెన్స్ హక్కుమాత్రము కలిగియుందురు. వీరెవ్వరును కొవ్వూరు గ్రామములో స్థిరముగా నుండక గ్రామాంతరము లందు నివసించుకాలములో యీ యింటి యుత్తర సగభాగములో అంతలో గాని, కొంతలోగాని తమసామాను పెట్టుకొని తాళము వేసికొని తాము తిరిగి వచ్చినపుడెల్లను, యీ భాగములో నివసించ వచ్చును. లేక ట్రస్టీలగు విద్యాపీఠసంఘము వారికే స్వాధీనము చేయుచుండ వచ్చును. పైవారిలో యెవరైనను యీకొవ్వూరును స్థిరనివాసముగ చేసికొన్న యెడల యిల్లంతయు వారి స్వాధీనములోనే యుంచుకొనవచ్చును.

విద్యాపీఠసంఘము వారు యీ బిల్డింగులోనున్న బీరువాలను, కుర్చీలను, డెస్కులను యింటి దక్షిణభాగములోనే యుంచి వానిని వారే స్వయముగాని, నా సంతతివారిక్కడ స్థిరనివాసమేర్పరుచుకొన్న యెడల వీరిగుండా గాని నాట్రస్టుకార్యములకు వాడుచుండవలెను. వీరెవరును యీ ఆస్తిలో యేభాగముగాని, అద్దెలకు, లేక పబ్లికుమాటింగులకు యీయకూడదు. ఈగృహము, దీని కాంపౌండుతోట, *మనస్స్వాతంత్ర్య మందిరము* ఫ్రీ థాట్ హోమ్ అను పేరుతో వాడబడుచుండ వలెను. మత సాంఘిక రాజకీయార్థిక విద్యావిషయములలో పరిశోధన విమర్శన గ్రంథకర్తలకును, వారి కుపయోగించు గ్రంథాలయమునకును, విద్యాపీఠ

సంఘమువారు ప్రతిసాలున ప్రకటించు గ్రంథములను నిలవచేయుటకును, పండితబృంద సమావేశములకును యీ ప్రశాంతమైన స్థలమును, నాసంతతివారును, విద్యాపీఠ సంఘమువారును ఉపయోగించ వలసినదే గాని, **పబ్లికుమీటింగులకుగాని మరి యేయితర పనులకుగాని యెన్నడు నీయకూడదు.** నాసంతతివారిక్కడ లేనియెడల, యీ యింటి వెనుకభాగమున తూర్పుదిశనున్న రెండు వసారాకొట్లు, స్నానములకొట్టు, తోట మొదలగునవన్నియు కూడా విద్యాపీఠసంఘమువారి మేనేజిమెంటులో నుండవలయును.

ఈ యాస్తి యంతమీద యీయవలసిన పన్నులు, దీనికగు మరమ్మతులు నౌకర్లజీతములు నూతనముగా కొనవలిసన బీరువాలు మొదలగు సామానులు, దీపములు, మొదలగు వాని ఖర్చులక్రింద నెలకు యేబది రూపాయిలకు మించకుండ విద్యాపీఠ సంఘము వారే యెల్లపుడు భరించుచుండవలెను.

> మత సాంఘిక రాజకీయార్థిక విద్యావిషయములలో పరిశోధన విమర్శన గ్రంథకర్తలకును, వారి కుపయోగించు గ్రంథాలయమునకును, విద్యాపీఠ సంఘము వారు ప్రతిసాలున ప్రకటించు గ్రంథములను నిలవచేయుటకును, పండితబృంద సమావేశములకును యీ ప్రశాంతమైన స్థలమును, నాసంతతివారును, విద్యాపీఠ సంఘమువారును ఉపయోగించ వలసినదే గాని, **పబ్లికుమీటింగులకుగాని మరి యేయితర పనులకుగాని యెన్నడు నీయకూడదు.**

నేను కొవ్వూరు గ్రామములో, ఆంధ్రగీర్వాణ విద్యాపీఠమున కెదురుగా, రైల్వే ఫీడరురోడ్డునకు పశ్చిమమున, రీసర్వే నెం. 687 లో 78 సెంట్లు విస్తీర్ణముగల ఖాళీ స్థలమును కొని దానిలో ఒక నూతినికూడ త్రవ్వించితిని. దీనిని వినియోగపరచ వలసిన పద్ధతిని గురించి పై II వ పేరాలోని చివరిభాగములో వ్రాసియున్నాను.

నాకు కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు కోఆపరేటివుల్యాండు మార్టగేజి బ్యాంకులో యేబదినాలుగువేల రూపాయిల డిబెంచర్లును, తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు కోఆపరేటివు ల్యాండుమార్టగేజి బ్యాంకులో మూడువేల అయిదువందల రూపాయిల డిబెంచర్లుమాత్రమున్నవి. వీనిమీద సాలుకు యిరువదిమూడు వందల రూపాయిలు వడ్డిరాగలదు.

దీనిని నాజీవితాంతమువరకు నా ఖర్చుల కొఱకుంచు కొంటిని. నాతదనంతరము యిదివరకు నేను ఆంధ్రగీర్వాణ విద్యాపీఠసంఘము వారి పేర ది 9-4-31 వ తారీఖున పంద్రెండువేల రూపాయిలకు వ్రాసియిచ్చిన ట్రస్టుఫండులో దీనినికూడ చేర్చి, దానిలోని నా యుద్దేశ్యములను నెరవేర్చుటకు మాత్రమే దీనిని సదరు సంఘము వారుపయోగించవలెను. ఆదస్తావేజులో వ్రాసినప్రకారమే యీ సొమ్మును మదుపు చేయుచుండవలెను. కాని యీ క్రింది ఖర్చులపోను మిగిలిన మొత్తమునే ట్రస్టీలు నాయుద్దేశ నిర్వహణమునకు ఖర్చుపరుచుచుండవలెను.

నా వితంతుకోడలు వల్లూరి చంద్రమతి యేకళాశాలలో నైనను విద్య నభ్యసించుచున్నంత కాలము మాత్రమే సాలుకు రు. 360 లు (మూడువందల అరువది రూపాయిలు) యిచ్చుచుండవలెను. నాభార్యా మేనకోడలును, సంతానహీనురాలైన వితంతువునగు మానప్రగడ వెంకాయమ్మకు, ఆమె జీవించి యున్నంతకాలము సాలుకు రు.60లు (అరువది రూపాయిలు) యిచ్చు చుండవలెను. కొవ్వూరులోని యిల్లు, దాని కాంపౌండులోని తోటల మరమ్మతులకును, నౌకర్ల జీతములకును, పన్నులకును, నూతన సామానుకును దీపములు మొదలగు ఖర్చులకును సాలుకు రు. 600 (ఆరువందల రూపాయిలు) మించ కుండా ఖర్చుపెట్టవచ్చును.

**పండిత బృందము:**

నేను ది 9-4-1931వ తారీఖున కొవ్వూరు ఆంధ్రగీర్వాణ విద్యాపీఠ సంఘమువారిపేర వ్రాసిన ట్రస్టుదస్తావేజులోని నాయుద్దేశ్యములను నెరవేర్చుటకు ఒక **పండితబృందమును యేర్పాటు చేసెదనని వ్రాసియుంటిని.** దాని నిర్మాణమును అధికారములను యీ విధముగ నుండవలెను: **నాకొమాల్లిద్దరును, జటావల్లభుల పురుషోత్తము గారును** దీనిలో జీవితకాలపు మెంబర్లుగా నుండి వీరు ప్రతిసాలుకు ఏర్పరుచుకొను మరియిద్దరు విద్యాధికులతో కలసి మొదటి పండితబృందముగా యేర్పాటు కావలెను. వీరిలో యేకారణముచేతనైనను ఖాళీలు సంభవించుపుడు తక్కిన వారు ఆ ఖాళీలను పూర్తి చేసుకొనుచుండవలెను.

**దీనిలో చేరు మెంబర్లందరు, యేమతగ్రంథము కూడ దైవదత్తమనిగాని, దానిలోని విషయములు అనుల్లంఘ**

**నీయములనిగాని నమ్మబోమని ప్రమాణపత్రము ముందుగా దాఖలుచేయవలెను.** ఈ పండితబృందమువారు నా ట్రస్టుడీడ్డులో నుదహరించిన విషయములను గురించి **విమర్శన గ్రంథములను ఆంధ్రములో వ్రాయించి, అచ్చొత్తించి, ఆంధ్రదేశములోని ముఖ్య గ్రంథాలయముల కన్నింటికి ఉచితముగా పంపించుట, వ్యక్తులకు విక్రయించుట, మొదలగు పనులు నెరవేర్చు చుండవలెను.** ఈ పండిత బృందము కలసి పనిచేయ జాలనపుడు, నేను పైన వ్రాసిన యోగ్యతకల మెంబర్లను, ఆంధ్రవిశ్వవిద్యాలయము వారు యేర్పరచ వచ్చును. గ్రంథముల నచ్చొంత్తించుటకును, పోస్టేజికిని, విద్యాపీఠ సంఘమువారు దీనికొరకు యేర్పడిన ట్రస్టుఫండు మీద వచ్చు వడ్డీలోనుండి కావలసిన సొమ్మును వెచ్చించు చుండవలెను.

**అచ్చొత్తించబోవు ప్రతి గ్రంథమును, విద్యాపీఠ సంఘములోని శాశ్వతసభ్యుల మెజారిటీవలన అంగీకరింపబడు చుండవలెను.**

ఏకారణము చేతనైనను ప్రస్తుత కళాశాలాధ్యక్షులగు జటావల్లభుల పురుషోత్తముగారు యీ విద్యా పీఠములో నుండుట తటస్థించక పోయినను కళాశాల లోని యేయుపాధ్యా యుడును **పరిశోధన కార్యమునకు తగినవాడు కాదని పండిత బృందమువారు తలచినను,** అప్పటినుండియు, విద్యాపీఠసంఘమువారు నేనట్టి యుపాధ్యాయుని కొఱకే ది 9-4-31 తేది ట్రస్టుదస్తావేజులో యేర్పరచిన **నెల 1 కి రు. 20 లు కళాశాల నిమిత్తము ఖర్చు పెట్టకూడదు.** ఆ మొత్తమును విమర్శన గ్రంథకర్తలకు పారితోషికముగ నొసగవలెను.

ఈ పండిత బృందమునకును విద్యాపీఠ సంఘము వారికిని, అచ్చువేయబోవు గ్రంథప్రాశస్త్యమును గురించి భేదాభిప్రాయములు కలిగినపుడు ఆంధ్ర విశ్వవిద్యాలయము వారి పండితబృందము వారి నిర్బంధ మధ్యవర్తిత్వముకు ఉభయులు ఒప్పుకొని వారి తీర్మానములను బట్టి నడచుకొని తీరవలెను. **నాట్రస్టుఫండునుబట్టి వెలువడు ప్రతి గ్రంథమును, నా చిరకాల మిత్రుడగు అద్దేపల్ల లక్ష్మణస్వామినాయుడుగారి రాజమండ్రిలోని *సరస్వతీ పవర్ ప్రెస్* లోనే అచ్చొత్తించు చుండవలెను.** కొవ్వూరు ఆంధ్రగీర్వాణ విద్యాపీఠ సంఘమువారు నేనిందు మూలముగా నిచ్చిన చర స్థిరాస్తులకు ఎగ్జిక్యూటర్స్ మరియు ట్రస్టీలుగా నుండి సరిగా, ఆచంద్రార్కముగా నాధర్మమును పాలింతురని నమ్ముచున్నాను. ఈట్రస్టు మొత్తమంతయు యెల్లపుడును, యెంతవడ్డీ వచ్చినను, కోఆపరేటివు ల్యాండు మార్టుగేజి బ్యాంకు డిబెంచర్లలోనే యుండవలెను. ఈ ధర్మమునందభిమానముగల నాయాంధ్రసోదరులలో నెవరైనను, పై సంఘమువారి యొద్దనుండి లెక్క కాపీని, తడవకు రెండేసి రూపాయిలిచ్చి పొంద వచ్చును. అట్లు వారీయని యెడల Act XIV of 1920 ప్రకారం యేలూరు జిల్లా కోర్టులో పిటిషన్‌పెట్టి కావలసిన సముజాయిషీని పొందగలరు.

ఈ ధర్మమునందభిమానముగల నాయాంధ్ర సోదరులలో నెవరైనను, పై సంఘమువారి యొద్దనుండి లేఖ్క కాపీని, తడవకు రెండేసి రూపాయిలిచ్చి పొందవచ్చును. అట్లు వారీయని యెడల Act XIV of 1920 ప్రకారం యేలూరు జిల్లా కోర్టులో పిటిషన్‌పెట్టి కావలసిన సముజాయిషీని పొందగలరు. ఈ సంఘమువారు యీ ధర్మమును సరిగా పాలించుటలేదని తెలిసినపుడు, ఆంధ్ర విశ్వవిద్యాలయము వారు యీ ఆస్తినంతయు కోర్టుద్వారా స్వాధీనము చేసికొని నా యుద్దేశ్యములను యీ కొవ్వూరు ఆంధ్రగీర్వాణ విద్యా పీఠములోనే నెరవేర్చు చుండుటకు, వారికిష్టమైన యేర్పాట్లు చేయవచ్చును.

ఈ సంఘమువారు యీ ధర్మమును సరిగా పాలించుటలేదని తెలిసినపుడు, ఆంధ్రవిశ్వవిద్యాలయము వారు యీ ఆస్తినంతయు కోర్టుద్వారా స్వాధీనము చేసికొని నా యుద్దేశ్యములను యీ కొవ్వూరు ఆంధ్రగీర్వాణ విద్యా పీఠములోనే నెరవేర్చు చుండుటకు, వారికిష్టమైన యేర్పాట్లు చేయ వచ్చును. పైకొద్ది యాస్తిలో కూడ, **యెంత మిగులునో నేనిప్పుడు చెప్పజాలను. ధర్మ సంరక్షణలో, ప్రజలు దాసీనులై యుండుట వలన, నా చిరకాలానుభవమును బట్టి మన న్యాయస్థానములు తరుచుగా జూదపుటిండ్లని నేను తెలిసకొనియున్నను, ప్రకృతి యంతటిలోవలెనే, మానవసంస్థలన్నియు అపరిపూర్ణస్థితిలోనే యుండక తప్పదని గ్రహించి సదరు న్యాయస్థానములే, న్యాయసిద్ధికి కొంతవరకైనను మనకు శరణ్యములని నమ్ముచున్నాను కాబట్టి,** ధర్మ సంరక్షణోద్యమములో నేను వెచ్చించగా మిగిలిన యాస్తియే, కొవ్వూరు ఆంధ్రగీర్వాణ విద్యాపీఠము నుండి వెలువడా గ్రంథముల కుపయోగపడ గలదు. ఈ ఉయిలుమీది సాక్షిదస్కతులను, నేను స్వయముగా వెళ్లి చేయించుకొంటిని.



జె.బ్రొనోస్కి

# జన్యు పరంపర

**ఆరోహణ-11**

*(చివరి భాగం)*

జె.బ్రొనోస్కి క్షేత్రస్థాయిలో పరిశోధించి, అత్యద్భుతంగా గ్రంథస్థం చేసి, బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ టెలివిజన్ ద్వారా ప్రపంచానికి అందించిన ఈ 'అసెంట్ ఆఫ్ మాన్' శాస్త్రపరంగా మానవావిష్కరణాల పరంపరను, మానవ పరిణామ దశలను తెలయజేస్తోంది. ఈ గ్రంథాన్ని ***మిసిమి*** పాఠకులకు తెలుగులో అందించాలనే సంకల్పంతో ముక్తవరం పార్థసారథిని అడగటం జరిగింది. వీరు గత సంవత్సరకాలంగా ఈ బాధ్యతను ఎంతో సముచితంగా నిర్వహించారు. వారికి ***మిసిమి*** కృతజ్ఞతలు.

కణజీవితంలోని వివిధ దశలను నిర్ణయించే ఆజ్ఞల్ని జారీ చేస్తుంది D.N.A. జీవితానికి నిర్దిష్టమైన కాల పరిమితి ఉంటుంది. D.N.A spiral లోని మెలికలలో, కణజీవితం యొక్క time-table నిక్షిప్తమై వుంటుంది. కణాలలోని యితర భాగాలకు ఈ సమాచారాన్ని చదవగలిగే శక్తి వుంటుంది. మూడు మెలికలు (treads) కలిసి, అమీనో యాసిడ్ తయారు చెయ్యమని కణానికి సంకేతం పంపిస్తాయి. ఈ అమీనో యాసిడ్‌లే తరువాత ప్రొటీన్లుగా మారతాయి. ప్రొటీన్లు, కణనిర్మాణంలో building blocksలా పని చేస్తాయి.

ప్రతి కణానికీ, మరో జీవిని సృష్టించగల సామర్థ్యం వుంటుంది. వీర్యం, అండకణాలు మాత్రం యిందుకు మినహాయింపు. నిజానికి, యివి, (వీర్యం, అండం) అర్ధకణాలు మాత్రమే. వీటిలో కణంలో వుండవలసినదానిలో, (సంఖ్యలో) సగం జన్యువులు మాత్రమే వుంటాయి. అండకణాలు, వీర్యకణాలతో కలిసి fertilise అయినప్పుడు మాత్రమే యివి పూర్ణకణాలుగా మారతాయి. (మెండెల్ ఈ విషయాన్ని ఆనాడే సూత్ర ప్రాయంగా అర్థం చేసుకున్నాడు.) Fertilised అండం విభజన ద్వారా తిరిగి కొత్త కణాలు పుడతాయి. ఒక జీవి, జీవితకాలమంతా ఈ ప్రక్రియ యిలాగే కొనసాగుతుంది.

పిండం పెరిగే క్రమంలో కణాలు ప్రత్యేకతను సంతరించుకుంటాయి. మెదడు నాడీ వ్యవస్థ, వెన్నెముక ఏర్పడి, క్రమంగా నరాలకు, కండరాలకు యితర శరీరభాగాలకు అవసరమైన కణాభివృద్ధి జరుగుతుంది. కణాలు, D.N.A. ఆదేశాలను పాటించి అవసరమైన ప్రొటీన్లు తయారు చేసినందువల్లే ఈ ప్రక్రియ సాధ్యపడింది. పుట్టిన కణం నుండే శిశువుకు ఒక వ్యక్తిత్వం ఏర్పడుతుంది. తల్లిదండ్రుల జన్యువులు సంగమించి వైవిధ్యానికి ప్రాణం పోస్తాయి. ఇద్దరి లక్షణాలూ వారసత్వంగా పొందిన శిశవులో అవి సరికొత్తగా పరిణితి చెందుతాయి. శిశువు వారసత్వం లక్షణాలకు బందీ కాదు. తల్లిదండ్రుల అంశ ఒక పునాది మాత్రమే. భవిష్యత్తులో అవి గణనీయంగా మారిపోతాయి.

శిశువు పుట్టినప్పుడే ఒక వ్యక్తి అనుకున్నాం. కాని తేనెటీగ అలా కాదు. అనేక మగతేనెటీగలు, ఒక రాణితేనెటీగతో కలసినప్పుడు, తమ వీర్య కణాలను ఆమెలో వదులుతాయి (గాలిలోఎగురు తున్నప్పుడు) తరువాత మగతేనెటీగ మరణిస్తుంది. రాణీ తేనెటీగ, తనలో దాచుకున్న వీర్యకణాన్ని అండ కణంతో కలిపి విడుదల చేసినప్పుడు ఒక ఆడ తేనెటీగ (Worker Bee) పుడుతుంది. కేవలం



తెలుగు : ముక్తవరం పార్థసారథి, ఫోన్: 9177618708

అండాన్నే విడుదల చేసినప్పుడు మగతేనెటీగ (వీర్యంతో సంగమించకుడానే) పుడుతుంది. ఇది ఒక వింత సృష్టి. ఎన్ని తరాలు గడిచినా యిందులో వైవిధ్యానికి తావులేదు. జీవలక్షణాలలో మార్పురాదు. జీవవైవిధ్యం కాని ఈ కొత్త సంతతిని యితర జంతువులలో, మనుషులలో కూడా సృష్టించవచ్చు. క్లోనింగ్ ద్వారా యిది సాధ్యపడు తుంది. ఒకే సెక్సుకు (స్త్రీ లేదా పురుష) చెందిన జంతువు నుండి కణాలు సేకరించి అదే జంతువును సృష్టించటమే క్లోనింగ్.

ఒక జంతువుకు చెందిన అండాలను ఒకే సారి పొదిగే క్రమం క్లోనింగ్ అనుకుంటే, ఆ ప్రక్రియను మనం యిలా అర్థం చేసుకోవచ్చు. మొదట ఒక అండం ఒకసారి విభజింపబడుతుంది. అదే విభజనా క్రమం నిరంతరంగా కొనసాగే అవకాశమూ ఉంది. తరువాతి దశలో, కణవిభజన చూడటం సాధ్యపడదు. ప్రతి అండం టెన్నిస్ బంతిలా, విప్పేసి తిరిగి తొడుక్కునట్టు రూపు మారుతుంది. అలా, అండాలన్నీ ఎదిగిన జంతురూపాన్ని రేఖామాత్రంగా సంతరించు కుంటాయి. లైంగిక సంపర్కం లేని జననమిది.



మనుషులను కూడా క్లోనింగ్ చేయటం సబబేనా? ఇది వివాదాస్పద విషయం. స్త్రీలందర్నీ విశ్వసుందరులుగా, బాలురందర్నీ ఐన్‌స్టీన్‌లుగా సృష్టిద్దామా? వైవిధ్యమే జీవలక్షణం. మన కోరికలకు అనుకూలంగా, వైవిధ్యాన్ని విస్మరించి, స్త్రీ, పురుషులందరూ ఒకేలా వుండాలను కోవటం సమంజసం కాదు.

క్లోనింగ్ అంటే ఒకే రకమైన జీవుల సంఖ్యం పెంచుతూ పోవటం. ఇది సృష్టి సూత్రానికే విరుద్ధం. పరిణామ క్రమానికి మూలం వైవిధ్యం (Diversity). జంతు జాలమంతటికీ, మనిషే అత్యంత సృజనాత్మక జీవి. సృజనాత్మకత అంటే వైవిధ్యం. ఈ సత్యాన్ని విస్మరించి, అందరు మనుషులూ, రూపురేఖల్లో ఉద్వేగ, వుద్రేక స్వభావాల్లో, శారీరకంగా, మేధోపరంగా ఒకేలా వుండాలను కోవటం మనల్ని యిన్ని దశలు దాటి వున్నతస్థితికి చేర్చిన పరిణామక్రమానికి ద్రోహం చెయ్యటమే. ఐనా, పురాణగాథల్లో క్లోనింగ్ స్ఫురింపచేసే కథలూ లేకపోలేదు. లైంగిక సంపర్కం వల్ల కాక, మనుషులు యథాతథంగా అవతరించినట్టుగా అనేక సందర్భాల్లో రాశారు. (మన గాథల్లో కుంతికి, సూర్యుని వరం వల్ల కర్ణుడు జన్మించటం – ఈవ్ (Eve), ఆడాము పక్కటెముకనుండి పుట్టింది. మేరీమాత క్రీస్తుకు జన్మనివ్వటం– అనేవి). అదృష్టవశాత్తూ, మనం యింక ఆ దశకు చేరుకోలేదు. సెక్సు అత్యున్నత స్థాయికి చేరింది మానవులలోనే. అన్నికాలాలలోనూ పురుషసాంగత్యానికి అనుకూలంగా వుంటుంది స్త్రీ. స్తనాలు (పాలు ఏర్పడటానికి) సిద్ధంగా వుంటాయి. రతిలో తన జతగాణ్ణి ఎంపిక చేసుకోవటంలో ఆమె తన యిష్టాయిష్టాలు ప్రకటిస్తుంది. ఈవ్ తిన్న యాపిల్ పండు మానవజాతిని నిరంతరంగా సెక్సు గురించి ఆలోచింపచేస్తూనే వుంది.

మనుషులలో సెక్సు కొన్ని విలక్షణ రూపాలలో కనిపిస్తుంది. జీవశాస్త్రపరంగా కూడా, మనలో దీనికి ప్రాధాన్యతవుంది. ఒక చిన్న వుదాహరణ చూడండి. **జీవజాతు లన్నింటిలోనూ, సంగమ సమయంలో భావప్రాప్తి పొందగలిగింది మానవస్త్రీ మాత్రమే.** ఇది మినహా, మిగతా జంతుజాలంతో పోల్చినప్పుడు, మానవుల లోని స్త్రీ పురుషుల మధ్య అతి స్వల్పమైన శారీరక భేదాలున్నాయి. (గొరిల్లా, చింపాజీలలో, స్త్రీపురుష జాతుల మధ్య కణాలు చాలా ఎక్కువే.)

ఇక, (ఇది జీవశాస్త్రపరమైందో, సంస్కృతీ పరమైందో స్పష్టంగా చెప్పలేంగాని) మైథున సమయంలో ఎదురెదురుగా కలుసుకునే జీవులం కూడా మనమే. స్త్రీ పురుష సమానతకు ప్రతీకంగా దీన్ని చెప్పవచ్చు. పరిణామక్రమంలో కూడా ఈ అంశం దోహదపడింది. ఆస్ట్రాలో పెతికస్ ఆదిమానవుడి నుండి, తొట్టతొలి పనిముట్లు తయారుచేసిన కాలంనుండీ యిది యిలాగే కొనసాగింది.

దీని గురించి, ప్రత్యేకంగా ప్రస్తావించటానికో కారణం వుంది. **మానవ పరిణామం చాలా వేగవంతంగా జరిగింది. అంటే, సుమారు యాభైలక్షల సంవత్సరాల స్వల్పవ్యవధిలో. ఇతర జీవజాతులతో పోల్చితే, యిది చాలా త్వరగా జరిగిందనే**

**చెప్పాలి. మనుషులలో, సెక్సు పరమైన ఎంపిక ఇందులో ముఖ్యభూమిక పోషించాలి. స్త్రీలు తమకు నచ్చిన వాళ్ళనే పెళ్ళి చేసుకోవాలనుకుంటారు. పురుషులు కూడా తమ యిష్టప్రకారమే స్త్రీలను ఎంచుకొంటారు. ఇది Natural selection లో భాగమే. ఈ 'ఎంపిక' ప్రక్రియ కొన్ని లక్షల సంవత్సరాలుగా కొనసాగుతూనే వుంది. మనుషులలోని ఈ ఎంపిక సామర్థ్యమే పరిణామక్రమాన్ని వేగవంతం చేసింది.** పనిముట్లు చెయ్యటంలో కొంత సామర్థ్యం సంపాదించి, కొంత ఆలోచించ గలిగిన స్త్రీ పురుషులు, తమవంటి భాగస్వాములనే ఎంచుకోవటంలో ఆసక్తి కనపరచి ఉంటారు. వీళ్ల 'అదనపు' సామర్థ్యం వల్ల, మిగతావాళ్ళ కన్నా ఎక్కువ మంది పిల్లల్ని కని పెంచివుంటారు. వీళ్లే జీవపరిణామ క్రమాన్ని శాసించారనటం కూడా సత్యదూరం కాకపోవచ్చు. అంటే, జీవపరిణామంలో కూడా సంస్కృతీ పరమైన అంశాలు కీలకంగా మారాయన్నమాట. ఇప్పటికీ మనం పెళ్ళి ప్రస్తావన వచ్చేసరికి 'సరైన సంబంధం' గురించి మాట్లాడుతున్నామంటే, అర్థమేమిటి?వృత్తి సామర్థ్యం, మేధో పరిణతి, వగైరా విషయాలలో సరితూగ గలిగిన భాగస్వామి కోసం అన్వేషిస్తున్నట్టే కదా!



అయితే, ఈ అంశాలు మాత్రమే ముఖ్యమైతే, యింత వైవిధ్యముండేది కాదు. *వైవిధ్యానికి (Diversity) మరో ప్రధాన కారణం. రక్తసంబంధీకుల మధ్య సెక్సు సంబంధాలను నిషేధించటం (INCEST) ఒకరకంగా, ఇది సంస్కృతీ పరమైనదే. ఈ నిషేధం అంగీకరించకపోతే, ఒక కుంటుంబం లోని బలవంతులైన సభ్యులనుండి, బలహీనులకు రక్షణవుండదు.* (కోతులలో ఈ incest సర్వసాధారణం). సెక్సు భాగస్వాముల ఎంపిక, పరిణామక్రమంలో ప్రధాన అంశం. అన్ని సంస్కృతులలోనూ, పెళ్లి తంతులోని విషయాలన్నీ ఈ ఎంపికనే సూచిస్తాయి. మిగతా జీవజాతులకు భిన్నంగా, మానవ జాతి సంస్కృతీ ప్రధానమైనది. సంస్కృతిలో సెక్సు భాగస్వాముల ఎంపిక అత్యంత ముఖ్యమైనది. సాహిత్యంలో, కళల్లో ఎక్కడచూసినా అన్నీ అబ్బాయి– అమ్మాయి ప్రేమకథలే గద. ప్రేమంటే, రతికార్యానికి దారితీసే క్రమం. ప్రేమకు కారణాలు వెదకటానికి కూడా ప్రయత్నించం మనం. కాని దాని వెనక దాగిన కారణమొకటి ఖచ్చితంగా వుంది. అదే సెక్సు భాగస్వామి ఎంపిక తరువాత ఎవరివల్ల సంతానాన్ని కనాలి అనే ఆలోచన. ఇదే జీవశాస్త్ర పరమైన విచక్షణ Natural selection. ఆకుపచ్చ ఆల్గేతో ప్రారంభమైన ఈ సెక్సు ప్రక్రియ, మానవ పరిణామ క్రమంలో సంస్కృతీ పరమైన ఎంపికగా మారింది.

ఆరోహణా వ్యాస పరంపరలో ఆఖరి మజిలీకి చేరుకున్నాం మనం. (డాక్టర్ బ్రొనోస్కీ ఐస్‌లాండ్ గురించి వివరిస్తున్నాడు). ఉత్తర యూరోపులో అత్యంత ప్రాచీన ప్రజాస్వామ్యానికి కేంద్రమిది. క్రైస్తవమిక్కడికి రాకముందే, క్రీ.శ. 900లోనే, ప్రజా ప్రతినిధులు అక్కడ చట్టాలు రూపొందించి అమలు చేశారు.

ఉదాహరణకు, తనవద్ద పనిచేసే బానిసను చంపినందుకు గాను యజమానికి శిక్ష విధించారు ఇక్కడ. బానిస వ్యవస్థ అమలులో వున్న ఏ సమాజాల్లోనూ న్యాయం యింత నిష్పాక్షికంగా అమలుకాలేదు. అయితే, అన్ని సంస్కృతుల్లోనూ 'న్యాయం' అనే భావనే లేకపోలేదు. వ్యక్తి కోరికలకూ, సామాజిక బాధ్యతకూ మధ్య వైరుధ్యాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించటమే 'న్యాయం'. జంతువులకిలాంటి సమస్యలు లేవు. అవి ఒంటరిగానైనా వుంటాయి లేదా మందల్లోనైనా తిరుగుతాయి. మనిషి మాత్రమే ఏకాంతాన్నీ, నలుగురితో సంపర్కాన్నీ కోరుకుంటాడు. జీవశాస్త్రపరంగా, యిది మనిషికి మాత్రమే వున్న విలక్షణత. దీని గురించి కాసేపు మాట్లాడుకుందాం.

మనిషి శరీరనిర్మాణంలోనే 'న్యాయ భావన' అంతర్గతంగా వుందా? ఈ జీవపరమైన విలక్షణతకు

మూలమెక్కడ? జీవశాస్త్రం ప్రధానంగా, మనుషుల గురించీ, జంతువుల గురించీ, ఈ జాతుల మధ్య సారూప్యాలగురించీ, భేదాలను గురించీ అధ్యయనం చేస్తుంది. క్రీ.శ. 200కు ముందు, ప్రాచీన వైద్యాచార్యుడు అతడు, బార్బరీ ఏప్ యొక్క ముంజేతిని కోసి మరీ అధ్యనం చేశాడు. అవును మరి మనిషి గురించి ఏమి తెలుసుకోవాలనుకున్నా, అతడికన్నా ముందు ఆవిర్భవించిన జీవజాలంతోనే తత్సంబంధమైన మూలాలు వుంటాయి. కోన్రాడ్ లారెంజ్ వంటి జంతుశాస్త్రజ్ఞుల పరిశోధనల వెలుగులో మనం, బాతు, పులి, మనిషి మధ్య సారూప్యాల గురించి తెలుసుకోగలుగుతున్నాం. బి.ఎఫ్. స్కిన్నర్, పావురాలు, ఎలుకల మీద చేసిన మనో వైజ్ఞానిక ప్రయోగాలు కూడా మన అవగాహనకు తోడ్పడ్డాయి. వాళ్ళు జంతువుల మీద పరిశోధనలు చేసినా, ఆ పరిశోధనా ఫలితాల ద్వారా మానవుని గురించిన అనేక విషయాలు తెలిసివచ్చాయి. ఇదేగదా మనిషి విలక్షణత! లేకపోతే, బాతులు, కోన్రాడ్ లారెంజ్ మీదా, ఎలుకలు బి.ఎఫ్. స్కిన్నర్ మీదా పరిశోధనలు చేసి వుపన్యసించేవికావా!

ఈ గొడవంతా ఎందుకు! మనిషికీ, గుర్రానికీ శరీర నిర్మాణంలో ఎన్నో పోలికలున్నాయి. కానీ, మనిషే గుర్రం మీద స్వారీ చేస్తున్నాడు. (గుర్రం మనిషి మీద కాదు.) గుర్రం మీద స్వారీ చెయ్యటానికి, మనిషికి పుట్టుకతోనే, శరీర నిర్మాణంలోనే ఏదో ప్రత్యేక సామర్థ్యం వుందనీ కాదు. గుర్రం మీద ఎక్కగలగటమనేది ఐదువేల ఏళ్ళ క్రితమే యిది సాధ్యపడింది. ఐనా ఈ ఒక్క ప్రక్రియవల్ల సమాజాల్లో ఎన్ని మార్పులొచ్చాయని!

మార్పుకు అనుకూలగా వుండే లక్షణం మనిషి ప్రవర్తనలోనే వుంది. అదే మన ప్రత్యేకత. అవసరాన్ని బట్టి, స్వభావాన్ని బట్టి మనిషి స్పృశించని కార్యరంగం లేదు. అతని మేధోశక్తికి, వూహలకు హద్దులు లేవు.

ఈ పుస్తకం తొలి అధ్యాయాలలో ప్రస్తావించిన టాంగ్ శిశువు గురించి మరొకసారి మాట్లాడుకుందాం. అది మానవుని ప్రాగ్దశ. ఆ శిశువు మెదడుకూ మన మెదడుకూ వున్న తేడా ఏమిటి? ఎదిగిన తర్వాత కూడా ఆ 'టాంగ్' మెదడు బరువు ఒక పౌండుకు మించకపోయేది. కాని మన మెదడు బరువు రమారమి మూడు పౌండ్లుంటుంది.

మనిషి మెదడుకున్న యితర ప్రత్యేకతలేమిటి? కొందరు మెదడును కంప్యూటర్‌తో పోలుస్తారు. కాని, అది కంప్యూటర్ అయితే, కేవలం పూర్వనిర్దేశిత కమాండ్స్‌కు మాత్రమే స్పందిస్తుంది. అంటే, సృజన వుండదు. పక్షులు గూళ్ళు పెడతాయి. ఈ గూళ్ళు ఎలా నిర్మించాలో వాటికెవరూ నేర్పలేదు. వాటి మెదళ్లలో వున్న కొన్ని పూర్వనిర్దేశిత స్పందనల ఆధారంగా అవి ఆ పనులు చేస్తాయి. కాని, మనిషి ఆలోచిస్తాడు. ప్రయోగాలు చేస్తాడు. నేర్చుకుంటాడు. మొదట ఇటుకలు చెయ్యటం తెలుసుకుని, తర్వాత పార్థెనాన్, తాజ్‌మహల్ల నిర్మాణం చేపట్టాడు. సుల్తానియె, నాట్స్ టవర్స్, మాచు–పిచు, పెంటగాన్ – ఏదైనా జ్ఞానసముపార్జన ఫలితమే.

పుట్టుకతో మన మెదళ్లలో నిక్షిప్తమైన ప్రోగ్రామింగ్ ప్రకారం ప్రవర్తించే కంప్యూటర్లం కాదు మనం. మెదడుకు నేర్చుకునే శక్తివుంది. మెదడులోని కొన్ని భాగాలలోనే ఆ ప్రక్రియ కొనసాగుతుంది. ఒక్కొక్క రకమైన జ్ఞానం గ్రహించటానికి, ఒక్కో భాగం పనిచేస్తుంది.

చెయ్యి గురించి మొదట తెలుసుకుందాం. మనిషి చెయ్యికి మెదడు జారీచేసిన ఆజ్ఞలను చెయ్యి సమర్థవంతంగా అమలుచేస్తుంది. కళాసృష్టికి చెయ్యికన్నా మంచి ప్రతీక ఏముంది! శాంతికి చిహ్నం. ఆశీర్వదిస్తున్న బుద్ధుని కుడిచేయి. కాని, శాస్త్రీయంగా, మనిషి చేతికి మరో ప్రత్యేకత వుంది. బొటనవేలితో యితర వేళ్ళను తాక గలగటం మనకే సాధ్యం. కోతులా (APES) పని చేయలేవు. మన మెదడులోని grey matter బొటనవేలి గురించి ఆలోచించినంతగా, ఛాతీ గురించీ, పొట్టగురించీ ఆలోచించదు. అదే మనిషి (మెదడు) ప్రత్యేకత.

అందమైన, అత్యద్భుతమైన సమర్ధవంతమైన ఈ వేళ్లు యిలా పరిణామం చెందటానికి లక్షలాది సంవత్సరాలు పట్టింది. అవును చేతివేళ్లకూ మెదడుకూ మధ్య సంబంధం ఏర్పటానికి కారణం తలముందరి భాగంలో వుండే మెదడు అని మనకు తెలుసు.

జంతువులకు లేనిదీ, మనిషికి మాత్రమే వున్న మరో ప్రత్యేకత వాక్కు. దీనికి సంబంధించిన మెదడు భాగం వినికిడి స్థానానికి దగ్గరగా ఒక్కచోట, ముందరి పైభాగంలో మరో చోటా వుంటుంది.

మెదడులోని ఈ భాగం పనిచెయ్యక పోతే మనం మాట్లాడలేం. అయితే, మాట మనకు సహజంగా వస్తుందా? రాదు. మాటలు, భాష నేర్చుకోవాల్సిందే. మాతృభాష

బాల్యంలో నేర్చుకోగలిగిన వాళ్లే, తరువాతి దశలో యితర భాషలు నేర్చుకోగలరు. పదమూడో ఏటిదాకా ఏ భాషా నేర్చుకోనివాళ్ళు, తరువాత, నేర్చుకోవటం సాధ్యంకాదు. ఈ వాగింద్రియం మనిషికే ప్రత్యేకం. మనిషి మెదడులోని రెండు (అర్ధ) భాగాలూ సమంగా వుండవు. కొందరికి కుడి చేతివాటం, మరికొందరికి ఎడమ చేతివాటం వున్నప్పటికీ మనిషి మెదడులోని ఎడమ వైపు భాగం మాత్రమే 'వాక్కు'ను నియంత్రిస్తుంది. దీనికి మినహాయింపులు లేవని కాదు. కొందరికి గుండె కుడివైపున వుంటుంది. అలాగే కొందరికి వాగింద్రియం వునికి స్థానం కూడా మారవచ్చు.

అనుభవాన్ని సమీక్షించుకుని, దాని ఆధారంగా, ముందుచూపు, ముందు ప్రణాళికలు ఏర్పరచు కోటం కూడా మనిషికే ప్రత్యేకం. దీనికి సంబంధించిన సామర్థ్యం మెదడులో మరో చోట వుంటుంది. మనిషి మూర్ఖుడు, వెర్రివాడు కావటానికీ, జీనియస్సు కావటానికీ మెదడే కారణం, మెదడు ముందరి భాగంలోని అర్ధగోళాకార నిర్మాణం దీన్ని నియంత్రిస్తుంది.

భవిష్యత్తును గురించి ఆలోచనగల సామర్థ్యం (మెదడు లోని) ఈ భాగానికే వుంటుంది. చేసిన పనికి ఫలితం ఆశించటం కూడా దీనివల్లే సాధ్యపడుతుంది. ఈ విషయంలో, 1910లో వాల్టర్ హంటర్, 1930లో జాకబ్‌సన్ కొన్ని పరిశోధనలు చేశారు. హంటర్, మొదట ఒక బహుమతి (జున్నుముక్క) అను కుందాం) ఎలుకకు చూపించి దాచి



పెట్టాడు. ఆ తర్వాత, వెంటనే ఎలుకకు అవకాశం కల్పిస్తే, అది జున్నుకోసం వెదుకుతుంది. కాసేపాగి, విడుదలచేస్తే అది జున్ను మరిచిపోతుంది.

పిల్లల్లో ఈ ప్రక్రియ కాస్త భిన్నంగా వుంటుంది. ఏదైనా ఆశచూపి, వాళ్లను ఓ గంటసేపటిదాకా నిరీక్షింపచెయ్యవచ్చు. హంటర్, ఒకనాడు, ఒక చిన్న పిల్లకు బహుమతి (Reward) ఆశ చూపి, కబుర్లలో పెడితే, ఆ అమ్మాయి కాసేపటికి. నేను మరచిపోతానను కుంటున్నావు కదూ? అని అడిగింది.

చేసే పనులకు దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధంచేసి, ఫలితాలు ఆశించటం 'Delayed response' అంటాం. సామాజిక శాస్త్రజ్ఞులు దీన్ని Postponement of gratification అంటారు. ఈ సంక్లిష్ట స్పందనలు జంతువుల మెదడుకు సాధ్యపడవు. (బహుశా కోతులు, దీని దరిదాపులకు వస్తాయోమో!) బాల్యంనుండే మనం రేపటి గురించి ఆలోచించటం అలవాటు చేసుకుంటాం. అది మన ఎదుగుదలలో, విద్యాభ్యాసంలో ఒక భాగం. అలా, మనం, స్వభావసిద్ధంగా తక్షణం చెయ్యాలనిపించిన పనులను వాయిదా వెయ్యటానికి కారణం, అప్పటికిది అనుకూలం కాదనీ, దీని గురించిన పూర్తి సమాచారం సేకరించిన తర్వాత నిర్ణయం తీసుకోవాలనీ గ్రహిస్తాం. నిర్ణయాలను 'అనుకూల పరిస్థితుల నాశించి వాయిదా వేసే' ప్రక్రియ మనుషులకు మాత్రమే ప్రత్యేకం. (ఈ వాయిదా వేసే మానసిక ప్రక్రియ గురించి డాక్టర్ బ్రొనొస్కీ షేక్సిపియర్ నాటకం హామ్లెట్ నుండి ఓ వుదాహరణ యిస్తాడు. హామ్లెట్, తన తండ్రి హంతకుణ్ణి చంపాలను కుంటాడు. కాని, అనువైన సమయం కోసం సుదీర్ఘకాలం నిరీక్షిస్తాడు. ఎన్నోసార్లు "యిప్పుడు చంపొచ్చు, చంపాలి" అనిపిస్తుంది. కాని మళ్ళీ సందేహం వస్తుంది. చివరికి తనే హత్యకు గురవుతాడు). మనిషిలో, మెదడు కార్యాచరణను శాసించే ఒక అవయవం మాత్రమే కాదు. అది అతణ్ణి కార్యానికి సిద్ధంచేసే విధికూడా నిర్వహిస్తున్నది. ఇదంతా మన బాల్యావస్థలో నిక్షిప్తమై వుంది.

దీన్ని శాస్త్రీయ పరిభాషలో 'NEOTENOUS' అంటారు. మనం అలాంటి జీవులం. అంటే గర్భం నుండి బయటపడినప్పుడు మనం యింకా శిశువులమే. మన నాగరికత, మన సంస్కృతి 'శైశవాన్ని' అద్భుతమైనదిగా ఆరాధించటానికి యిదో కారణం కావచ్చు. చిత్రకారులు, సంగీతకారులు, రూసోలాంటి తాత్వికులు, చార్ల్స్ డికెన్స్ లాంటి


తొలి అచ్చుయంత్రం

రచయితలు బాల్యాన్ని ఆరాధించారు. పరిణామ పరంగా కూడా బాల్యానికెంతో ప్రాధాన్యతవుంది. శిశువుమెదడు గురించి ప్రకృతి ఎంత శ్రద్ధతీసుకుందని! ఎదిగిన వ్యక్తుల బరువు, మెదడు బరువుకన్నా సుమారు యాభైరెట్లు ఎక్కువ వుండొచ్చు. కాని పుట్టినప్పుడు, అది (మెదడుకన్నా) కేవలం అయిదారు రెట్లు మాత్రమే ఎక్కువ బరువుంటుంది. చరిత్రలో, నాగరికతలు బాల్యావస్థ ప్రాధాన్యాన్ని విస్మరించాయి. ఇది అర్థం చేసుకోలేని మన నాగరికత కూడా శైశవదశలోనే ఉంది. చరిత్రలో మనం తెలుసుకున్నదేమిటి? పెద్దవాళ్లు, పిల్లల్ని తమ ఆదేశాల ప్రకారం, నడుచుకోమన్నారు. తమను చూసి నేర్చుకోమన్నారు. తమలాగే బతకమన్నారు. ఈ 'క్రమశిక్షణ'తో పిల్లలు పెద్దల్ని అనుకరిస్తారు. ముక్కుపచ్చలారని బాలికలు తల్లుల్లా వుండాలను కుంటారు. అయితే! యింత మాత్రం చేత చరిత్ర గతి ఆగిందనికాదు. కాని, అనేక దశల్లో, పిల్లల ఎదుగుదల కుంటుపడింది.

ఈజిప్టు, చైనా, ఇండియా (మధ్యయుగాలనాటి) యూరోపు నాగరికతలన్నీ గొప్పవే. కాని అవి పిల్లలలోని వూహాశక్తిని పెంపొందించటమే కాక పోయాయి సరికదా, అడ్డుపడ్డాయి. తండ్రి చెప్పిందే వేదమని కొడుకనుకొంటే కొత్త వూహలెలా రెక్కలు తొడుగుతాయి? ఈ కట్టుబాట్ల వల్ల నిబంధనల వల్ల ఎంత ప్రతిభ మానవ కల్యాణానికి వుపకరించ కుండా పోయిందో! యూరోపులోని మధ్యయుగాలలో, ఈ ప్రతిభకు ప్రధాన అడ్డంకి చర్చి. ఎంత తెలివితేటలున్నా, చివరికి దైవనిర్ణయాన్ని నువ్వు ప్రశించకూడదు. అనే మతపరమైన నిబంధన ముందు తలవంచాల్సిందే. అయినా, అన్ని యిబ్బందుల్నీ అధిగమించి, కష్టనష్టాలకు వెరవక, వైజ్ఞానిక ప్రపంచ సరిహద్దుల్ని అధిగమించి, ఎరాస్మస్, జొహాన్‌ఫ్రోబెనియస్, థామస్ మోర్ లాంటి మహానుభావులు లేకపోలేదు.

మేధోశక్తి విస్తరించటంలో 'అచ్చుయంత్రం' కీలకపాత్ర పోషించాలి. 1500 ప్రాంతంలో ప్రారంభమైన పుస్తక ముద్రణ. ఈ లోకంలోని ఎన్ని విప్లవాలకు, వుద్యమాలకు ఎన్ని పరిణామాలకు దారి తీసిందో!

జ్ఞానమే నిజమైన అధికారం అనుకున్నాడు. థామస్ మోర్. మోర్ తన అధికారాన్ని ఖాతరు చేయలేదనుకున్న రాజు ఆయన్ను చంపించాడు.

మేధావులకూ, అధికారానికీ మధ్య ఘర్షణ చిరకాలంగా కొనసాగుతూనే వుంది. తనకాలంలో జీసస్ ఒక మేధావి. మతాన్ని అధికారానికి ఒక అంగంగా మార్చుకున్న ప్రభుత్వం ఆయన్ను శిలువ వేసింది. ఏథెన్స్‌లో సోక్రటీస్, ఐర్లాండ్‌లో జొనతన్ స్విఫ్ట్. ఇండియాలో గాంధీ, ఇజ్రాయేలు అధ్యక్షపదవి నిరాకరించినందుకు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ – ఇలా, అధికారుల అభిశంసనకు గురైన వారెందరో!

ఐన్‌స్టీన్ గురించి మరో విషయం కూడా చెప్పుకోవాలి. అతడు శాస్త్రజ్ఞుడు. మేధావుల తొలివరుసలో వుండేదీ, వారికి నాయకత్వం వహించేదీ శాస్త్రజ్ఞులే. ప్రభుత్వాలన్నీ శాస్త్రజ్ఞులను తమ అదుపులో పెట్టుకోవాలను కుంటాయి. కాని, శాస్త్రజ్ఞులు ప్రభుత్వాలకు దాసోహమంటే, మనుషులకు మానవత్వంలోనే విశ్వాసం నశిస్తుంది. ఈ నాటి విశ్వాసాలన్నీ, శాస్త్రీయతతో ముడిపడేవున్నాయి.

లోకాన్ని తన చెప్పుచేతల్లో పెట్టుకోవటం సైన్సు లక్ష్యంకాదు. మనుషులలో నైతికతను పెంపొందించే కృషి చేస్తుందది. నైతికత విస్మరించటం మానవజాతికి ఆత్మహత్యాసదృశం. శాస్త్రజ్ఞులు, ప్రభువులు లోకాన్ని శాసించాలనుకోవటం సరికాదు. నేటి అవసరం మేధో ప్రజాస్వామ్యం.

స్విచ్‌వేస్తే లైటు వెలగటానికి కారణం శాస్త్ర పరిశోధనే కాని విద్యుచ్ఛక్తి ప్రకృతిలో ఒక భాగమనీ, మనుషులు సంపాదించుకుంటున్న అపారజ్ఞానం కూడా ప్రకృతి ధర్మమేననే



D.N.A.



అవగాహన మనలో పెంపొందాలి. మనచర్యల వెనక ఆలోచనల వెనక మనకే స్పష్టంగా తెలియని విలువలుంటాయి. ఇవన్నీ మనిషి మేధస్సు తయారు చేసుకునే వ్యూహాల్లో, ఎత్తుగడల్లో భాగమే. తాత్కాలిక, క్షణిక ప్రయోజనాలకూ, దీర్ఘకాలిక ప్రయోజనాలకూ వంతెనలాంటివివి.

ఆరోహణ ఎటుదిశగాసాగుతోంది? ఫిజిక్సులు, బయాలజీ, యితర శాస్త్రీయ జ్ఞానాన్ని సమకూర్చుకోవటం కాదు. 'WHAT MAN IS' అనే రహస్యం తెలుసుకోవాటానికి కొనసాగాలి ఆరోహణ.

జ్ఞానమంటే, కాగితం ముక్కల మీద రాసుకున్న సమాచారం కాదు. జ్ఞానం వెనక బాధ్యత వుంటుంది. నిజాయితీ, విచక్షణ వుంటుంది మనం, మౌలికంగా నైతిక జీవుల మనే స్పృహ వుంటుంది. కొందరికి మాత్రమే జ్ఞాన సముపార్జన అవసరం. మన మాత్రం పాత, మూర్ఖ నమ్మకాలలో కాలం చెల్లిన ఆచారాలు, సాంప్రదాయాల లోనే మగ్గుతానటం సరికాదు. అందరూ శాస్త్రపరిశోధనలే జీవితలక్ష్యంగా బతకాలని చెప్పటం లేదు. కాని, మానవ జాతి మూలాలు, చరిత్ర ఆరోహణాక్రమం ప్రతి స్కూలు పుస్తకంలోనూ పాఠ్యాంశాలుగా మారాలి. ఒకప్పటి అధునాతన శాస్త్రజ్ఞానం నేడు ఎలిమెంటరీ స్కూలు పిల్లలు చదువుకుంటున్నారు. నేటి అత్యాధునిక శాస్త్రవిషయాలు, రేపటి పిల్లలకు తొలిపాఠాలు.

శాస్త్రీయత, హేతుబద్ధత యింతగా జీవితాన్ని శాసిస్తున్న రోజుల్లో కూడా కొందరు నిర్వేదంతో, అతీంద్రియజ్ఞానం, మార్మికతలాంటి అశాస్త్రీయ అనుభవాల నాశ్రయిస్తున్నారు. మనిషి తన గురించి, మానవావిర్భావం గురించి, ఈ జ్ఞానమే మన ఆలోచనాక్రమాన్ని శాసిస్తుంది. అనుభవాన్ని క్రోడీకరించి , విశ్లేషించి ఆ వెలుగులో ఆచరణను నిర్ణయించుకోవాలి.

ప్రగతిపథంలో ముందుకు కదలని అస్సీరియా, ఈజిప్టు, రోమ్ నాగరికత లేమైనాయో మనకు తెలుసు. పశ్చిమదేశాల శాస్త్ర, సాంకేతిక జ్ఞానం గురించి ఎంత మురిసినా, హేతుబద్ధతను విస్మరిస్తే, యిక్కడా ఆ దేశాల చరిత్ర పునరావృతం కాక తప్పదు.

జ్ఞానాన్ని లాటిన్ భాషలో 'సైన్సు' అంటాం. పశ్చిమ దేశాల వాళ్లు యిందులో ముందడుగు వేయకపోతే, ఆఫ్రికా, చైనాలు వీళ్లను అధిగమించే అవకాశం వుంది.

చరిత్ర అంటే గతం కాదు. ఈనాడు, ఈ క్షణం మనం తీసుకునే నిర్ణయాల వెనక వున్న జ్ఞానమే చరిత్ర.

భవిష్యతు ఎప్పుడూ అగోచరమే. ముందడుగు వెయ్యాలంటే భయంగానే వుంటుంది. కాని, అన్నికాలాల్లోనూ, అన్ని దశల్లోనూ మనిషి, తను నిర్ణయించుకున్న లక్ష్యాల సాధనలో ముందడుగు కదులతూనే వున్నాడు. అదే ఆత్మవిశ్వాసం. అదే మానవారోహణ.



... సమాప్తం ...

*(The Ascent of Man నాతో తెలుగులో రాయించిన* **మిసిమి** *సంపాదకులకు కృతజ్ఞతలు.)*

**- ముక్తవరం పార్థసారథి**

# వృత్తి కళాకారుల జీవితం

- మూలె విజయలక్ష్మి

జానపద కళలు కులాశ్రితాలు, వారసత్వ సంపద. నాడు కళకళలాడిన వృత్తి కళాకారుల జీవితం నేడు వెలవెల బోతున్నది. ఆటాడినా, పాటపాడినా ఐదువేళ్ళు నోట్లోకి వెళ్లటం లేదు. సంభావలను పుచ్చుకున్నవారే నేటి సామాజిక పరిస్థితుల్లో సంక్షోభంలో కొట్టుమిట్టాడు తున్నారు. పొట్టకూటికోసం అలోలక్షణా అని అలమటిస్తూ పలు పాట్లు పడుతున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో కుల విద్యలు వదలి కూలికి పోతున్నారు. వెతలతో వారి జీవితాలు అతలాకుతలమవుతున్నాయి.

జానపదకళ కొందరి వృత్తి. అదే జీవనాధారం. కళాప్రదర్శనతో లభించిన ధనధాన్యాలు, గుడ్డగుసురూ వారి జీవనభృతి. వృత్తి కళాకారులు ఊరూర తిరిగి పొట్ట పోసుకుంటారు. కుటుంబంలో పిల్లాపెద్ద, ఆడమగా ప్రదర్శనల్లో పాల్గొంటారు. నేడు తరతరాలుగా నమ్ముకున్న వృత్తివల్ల కూటికి, గుడ్డకు కొదవ ఏర్పడుతోంది.

ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రసారమాధ్యమ వ్యవస్థ విస్తృతమైంది. రేడియోలు, సినిమాలు, విజ్ఞాన వినోద సాధనాలుగా విరాజిల్లుతున్నాయి. నేడు కంప్యూటర్, ఇంటర్నెట్ అన్నీ అవసరాలను తీరుస్తోంది. గంటలతరబడి టీవిల ముందు, కంప్యూటర్‌ల ముందు కూర్చుంటున్నారు. జానపదకళలను ఆస్వాదించే తీరిక, ఆదరించే ఔదార్యం కరువయ్యాయి. దానికి తోడు మేరలు ఇచ్చే రైతు ఏటేటా వచ్చే కరువు కాటకాలతో కకావికలమవుతున్నాడు. పల్లెలు వదిలి పట్టణాలకు వలసపోతున్నారు. దీంతో వారసత్వంగా కళను కాపాడుకుంటూ వస్తున్న కుటుంబాలు కళను గాలికొదిలి కడుపుచూసుకొనే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. "కాటిపాపలుకంటికికనపట్టంలె, పకీర్లు, పడగెలోళ్లు, బాగోతులు, బాలసంతులు, సాధనాలాడే మాస్టీనోళ్లు, ఒగ్గుకతలు జెప్పేటోళ్ళు, పిచ్చాకుంటోళ్లు, బుర్రకతలు జెప్పే శారదలు, బుడబుక్కలోళ్లు, ఏవయిన్రో ఆ ఆటలూ, పాటలూ, ఏవయినయో... ఎనకటియవారమేదీ మిగలడంలేదు."

*(ఆర్తారావం జాతశ్రీ పు-56)*

"జేగంటలు, జమిడికలు, అందెలు, వీరణాలు, తప్పెటలు, తంబురలు, కోలలు... ఆ వాయిద్యాలేవీ... లేవీ రోజుల్లో! ఆ కళాకారులు అర్థాకలితో, అధోలోకపు జీవుల్లా జీవిస్తున్నారు. వారి పిల్లలు- సత్తుగిన్నెలు పట్టుకొని ఇల్లిల్లు యాచిస్తూ - జీవితంకాని కాకూడని జీవితం - జీవిస్తున్నారు. మానవతకు సవాల్‌గా ప్రజాస్వామ్యానికి ప్రశ్నార్థకంలా... అనాధ బాల్యాన్ని అనుభవిస్తున్నారు." *(ఆర్తారావం జాతశ్రీ పు-48)*

ఆధునిక ప్రక్రియల్లో తెలుగు కథ నూతన వస్తువును స్వీకరిస్తూ, బడుగుల భాషకు పట్టం కడ్తూ, సామాన్యుల జీవితాలను నూతనకోణాలలో ఆవిష్కరిస్తూ, సామాజిక స్పృహతో జాగృతపరుస్తోంది. ఆ దిశలోనే రచయితలు వృత్తికళాకారుల వెతలను, కళలు ఎదుర్కొంటున్న దౌర్భాగ్య స్థితిని కళ్ళకుకట్టించారు. అయితే వేనవేల కథలను గాలిస్తే లభించేవి పట్టుమని పది కథలు. ఈ కథల ఆధారంగా వృత్తి కళాకారుల జీవితాలను గమనిస్తే, కళనే వృత్తిగానో, వృత్తిలో భాగంగానో నమ్ముకున్న వారిలో ప్రధానంగా రెండురకాలున్నారు. వారు సంచార జాతులు, దళితులు. సంచారజాతులు ఊరూరు తిరుగుతూ, కళాప్రదర్శనలిస్తూ, కళపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. దళితులు పల్లెలో స్థిరనివాస మేర్పరుచుకున్నవారు. గ్రామంలో ఉత్సవాలు, ఊరేగింపులు, చావు సందర్భాల్లో సంప్రదాయం లేదా ఆచారంగా డప్పువాగిస్తూ, చిందేస్తున్నారు.

ఆచార్య మూలె విజయలక్ష్మి, ఫోన్: 9966138779

ప్రసారమాధ్యమాలధాటికి జీవికకు ఆసరాగా ఉన్న పాట, వాయిద్యం అటకెక్కి కకావికలమయిన గాయకుని జీవితగాథ గంటేడు గౌరునాయుడు *ఏటిపాట*. జముకు వాయించటంలో ఆరితేరిన వాడు పైడయ్య. దళితుడు. దానికితోడు చక్కని గొంతు. కాలంమారింది. టీవి, సినిమాలు అతని పొట్టకొట్టాయి. సంగంలో చేరాడు. నాయుడి భూమినిదున్నారు. జైలుపాలయ్యాడు. తిరిగి వచ్చిన పైడయ్య ఏటిఒడ్డున శవమయ్యాడు. పైడయ్య సంగంలో చేరడానికి ప్రధాన కారణం అన్నంపెట్టే వృత్తిని ఆదరించే వారు లేకపోవటం. గడపముందు గంటనిలిచినా చారెడు బియ్యం లభించటంలేదు. వృత్తిని వదిలి వేయక చేసేదేముంది.?

ప్రసారమాధ్యమాల ప్రాచుర్యం వల్ల ఆదరణ కోల్పోయిన దొమ్మరాట, వాళ్లదైన్య స్థితిని చిత్రించిన కథ జాతశ్రీ *విధ్వంసం*. పొట్టకూటికి లోటుచెయ్యని దొమ్మరాట నేడు నకనకలాడే కడుపులతో నడివీథిలో రండి బాబు ఆటచూడండి అని అరిచిగీపెట్టినా, డోలువగిలేలా వాయించినా చూసేపిల్లాపిట్ట లేరు. కాసువిదిల్చే నాథుడు లేడు. తమ జీవభృతిని కాటేసింది కరువు కాటకాలు కాదని టీ.విలని తెలుసుకున్నారు.

గురయ్యపోశాలు దంపతలు. "బువ్వలేని ఆటాడేబదులు అడివిలతిరిగి పసిరిగాయలేరుకున్నా మారాజుల్లా బతుకుతం." అని ఆదరణ కోల్పోయిన ఆటకి చరమగీతం పాడాలను కున్నారు వారి వారసులు. నేడు సాధానాశూరుల వృత్తివిద్యలు కడుపునింపే స్థితిలో లేవు. వారి దైన్యగాథ పెద్దింటి అశోక్ కుమార్ *గోస*. పళ్లతో నాగలిని లేదా నీళ్ళ బిందెని పైకెత్తటం, ఇనుప సలాకను గొంతుతో వంచటం తీగపై నడవటం, చిన్న రింగులో దూరటం వంటి విద్యలు ప్రదర్శిస్తారు. లింగం కొడుకు లేకపోవటంతో కూతురుకే నేర్పించాడు విద్యలన్నీ. భర్త పోవటంతో ముగ్గురు పిల్లలతో పుట్టిల్లు చేరింది శోభ. తండ్రి వృద్ధాప్యంలో కోతిని ఆడిస్తూ బతికీడుస్తున్నాడు. కన్నబిడ్డల కడుపు మంటలనార్పడానికి కడుపుతో ఉన్న శోభ సర్కస్ ఫీట్లు చేసినా కాసులు రాల్లేదు. వాగొడ్డున పట్టుకొన్న పుల్లకోళ్ళు, చేపలు పోలీసుల పరమయ్యాయి. ఇది నేటికాలంలో సాధనాశూరుల గోస. ఒకటేమిటి వృత్తికళలను నమ్ముకున్న కళాకారులందరి జీవితాలు ఇలాంటి దుర్భరస్థితిలోనే ఉన్నాయి. స్త్రీవాద దృష్టితోరాసినా పంబజోళ్ళువాయించేవారి గతితప్పిన జీవితాన్ని తెల్పే కథ జాతశ్రీ *విషాదం*. దేవరకొలువులు, తిరునాళ్లలో, ఊరేగింపుల్లో, పంబజోళ్ళు మోగిస్తూ కథలు చెప్పటం వృత్తి విద్య. కులవిద్యలు జోరుమీదున్నపుడు గుమ్ములు, గరిసెల నిండాధాన్యం. నేడు రోజులు తిరగబడినాయి. జీవన భృతికోసం ఆడవాళ్ళు. పసికందులను చూపించి యాచిస్తూ పొట్టనింపుకొంటున్నారు. పుల్మణికి సంతానం లేకపోవటం వల్ల అదీ దుర్భరమయింది.

ప్రపంచీకరణ నేపథ్యంలో విస్తృతమయిన ప్రసారమాధ్యమవ్యవస్థ ఒకవైపు, ఏటేటా వచ్చే కరువు కాటకాలు మరోవైపు వృత్తి కళాకారుల జీవితాలకు ఆశనిపాతం. కళాకారులతోపాటు వారి ఆట పాటల్లో, పాల్గొంటూ, వారి జీవన భృతికి చేదోడువాదోడుగా నిలిచే మూగజీవుల పరిస్థితీ అంతే. కోతులు, ఎలుగ్గొడ్లు, ఎద్దులను ఆడించటం కొందరి వృత్తి. సంచార జీవనంలో బరువులు మోయటానికి గాడిదలను ఉపయోగిస్తుంటారు.

మూగజీవుల ఆకలి బాధను, వాటిని నమ్ముకొని జీవనం సాగించే వృత్తికారుల మనోవ్యధను చిత్రించిన గాధ జాతశ్రీ *వ్యక్తిగతం*. మూడురోజులకోవూరు మారుతూ గంగిరెద్దును ఆడిస్తూ హాయిగా జీవించే కొమరాలు జీవితం కిందెత్తయింది. అన్నిటికీ తలవూపే గంగిరెద్దు రెండ్రోజులుగా కట్టసొప్ప కూడా అందకపోవటంతో ఆకలితో తల అడ్డంగా వూపింది. ఇచ్చిన మాటకోసం ఆట ఆడిస్తున్నాడు. ఆటలో భాగంగానే ఎదపై ఎద్దుకాళ్ళు పెట్టింది. ఎదురుగా ఆటచూస్తున్న వ్యక్తి నెత్తి మీదున్న గడ్డిమోపుపై ఎద్దు దృష్టి పడింది. నకనకలాడే ఎద్దు ఎగిరిగంతేసింది. కొమరాలు ఆకలికేక ఆఖరికేకయింది.

పట్టణీకరణ, పారిశ్రామీకీకరణ నేపథ్యంలో కట్టడాలు, రోడ్లనిర్మాణానికి కావలసిన కంకర కోసం అడవులు, కొండల్లోని బండరాళ్లు ముక్కలు ముక్కలవుతున్నాయి. పర్యావరణ సౌందర్యం దెబ్బతింటోంది.

గులకరాళ్ల కోసం పెద్ద బండరాళ్లను పగలగొట్టడానికి పెట్టిన నాట్లు పేలుడులో విషాదాంత మయిన వృత్తికళాకారుల గాధ వి.ఆర్.రాసాని *నాలుగోనాటకం*. ఆర్నెల్లు సంచారమిల్లి అడవిలో గేరికి ఆత్రంగా వచ్చిన ముడ్డిగంటోడు. ఎల్లుగ్గోడ్డోడి బండపై తమ గేరి ఆనవాళ్లు లేకపోవటం, బండ సగం కావటం ఆశ్చర్యచకితుల్ని చేసింది. కారణం కంకరకోసం అని తెలుసుకున్నాడు. గేరి దగ్గరకురావటంతో ఆనందంతో ఎలుగొడ్డు పరుగులు పెట్టింది. దాని వెనకే వీళ్ళిద్దరు. ఇంతలో

బండపగల గొట్టడానికి పెట్టిన నాట్లు పేలాయి. ఆ పేలుడు వారి ప్రాణాలతో పాటు కళకు చరమగీతం పాడింది.

సమాజంలో కులాల స్థిరీకరణ స్పష్టం. అగ్రవర్ణాలు స్థిరీకరణలో అగ్రస్థానంలో ఉన్నాయి. తరతరాలుగా అగ్రవర్ణాల ఆధిపత్యంవల్ల అంటరానితనంతో అలమటించిన వారు దళితులు. సమాజంలో స్థిరాస్తుల విలువలు, ఆర్థికకోణాన్ని బాగా ఎరిగిన వారు, అట్టడుగు వర్గాల పై ఆధిపత్యం చెలాయిస్తూ, పని పాటలు చేయించుకొని తోచినది ఇవ్వటం ఆనవాయితీగా సాగింది. పోడుకొట్టి అప్పోసప్పో చేసి కాసింత భూమి సంపాయించుకొంటే అగ్రవర్ణాల అధిపత్యానికి కంటగింపు, అగ్రవర్ణాల ఆధిపత్యంలో నలిగి వత్తలయిన వృత్తికళాకారుల జీవితాలను చిత్రించిన కథల్లో వి.ఆర్. రాసాని *వీరజాటీ* ఒకటి.

సమాజంలో స్థిరాస్తుల విలువలు, ఆర్థికకోణాన్ని బాగా ఎరిగిన వారు, అట్టడుగు వర్గాల పై ఆధిపత్యం చెలాయిస్తూ, పనిపాటలు చేయించుకొని తోచినది ఇవ్వటం ఆనవాయితీగా సాగింది. పోడకొట్టి అప్పోసప్పో చేసి కాసింత భూమి సంపాయించుకొంటే అగ్రవర్ణాల అధిపత్యానికి కంటగింపు, అగ్రవర్ణాల ఆధిపత్యంలో నలిగి వత్తలయిన వృత్తికళాకారుల జీవితాలను చిత్రించిన కథల్లో వి.ఆర్. రాసాని *వీరజాటీ* ఒకటి.

నడివీధిలో నెత్తివోపు గంగమ్మను దించి డప్పుకొడుతూ, దరువులకు అనుగుణంగా అడుగులేస్తూ, వీరజాటి శరీరానికి దెబ్బతగలకుండా కొట్టుకోవడంలో అందెవేసిన చెయ్యి కోటప్ప. సంచారజీవనం. భిక్షకవృత్తి వదలి స్థిరనివాసం ఏర్పరుచుకోవాలనే ఆశతో అప్పుచేసి పోడుబూమిని సాగుభూమిగా మార్చుకున్నాడు. అయిదొందల అప్పుతీసుకున్న పాపానికి పంటచేను వీరమనాయుడి వశమయింది. బతుకు మొదటికొచ్చింది. వేలిముద్ర వేసిన దానికి ప్రాయశ్చిత్తంగా శరీరమంతా కమ్ముకొచ్చేలా కొట్టుకొని కుప్పకూలాడు.

దళితుల కళానైపుణ్యాన్ని, ఆ కళకు లభించే ఆదరణను కూలంకషంగా కళాకారునిపట్ల నిరాదరణను దళిత ఆత్మగౌరవాన్ని అనుగుణంగా చిందులు వేయటం దళితుల కళానైపుణ్యం. అందులో పదకొండేళ్ళ సిన్నోబులు దరువేస్తే ఆరితేరినవారే ఆదమరిచేవారు.

ఎలక్షన్ల గెలుపు ఊరేగింపులో తప్పెట కొట్టినందుకు వందరూపాయలు. ఆది ఇవ్వటానికి శంకరరెడ్డి భార్య చూపించిన అహంకారం, పాటించిన అంటరానితనం సిన్నోబులు అహాన్ని దెబ్బకొట్టాయి. డబ్బు తీసుకోవటానికి కొంగుపట్టాలి. గోచితప్ప నూలుపోగులేని సిన్నోబులు గోచివిప్పి పట్టాడు. గాలికి నోటు కిందపడింది. వంగితీసుకోమన్నా తీసుకోలేదు. అది అగ్రవర్ణాల అహంభావంపై గెలుపు. గ్రామంలో ఇరు అగ్రవర్ణాల మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమంటుంది. ఆ పరగణాలోనే సమ ఉజ్జీలేని శూరుడు మాలమాస్టీడు. కర్రసాములో తనకుతనేసాటి. అతని విద్యలకు మెచ్చి రెండెకరాలు ఇనాం ఇచ్చాడు రెడ్డి. అది అవమానంగా భావించాడు నాయుడు. పందెం కాసాడు. గెలిస్తే నాలుగెకరాలు రాసిస్తానన్నారు. ఐదుమంది వస్తాదులతో అక్రమంగా దెబ్బతీయించాడు. ఇరు అగ్రవర్ణాల పంతాలు పట్టింపులతో కళాకారుడు నడుం విరిగి మంచం పాలయ్యాడు.

మనిషిని మనిషిగా ఉండనీయనిది, కుటుంబాన్ని కడగండ్ల పాల్జేసేది మద్యపానం అలవాటు.

తాగుడుకు బానిసయ్యి బతికే భాగ్యాన్ని కోల్పోయిన కళాకారుని గాథ ఎండ్లూరి సుధాకర్ రెప్పల *మీనరూపాలు* గురయ్య డప్పాటలో ఎత్తిన చెయ్యి. మట్టిమీద పచ్చనోటును డప్పుగొడుతూనే తలవంచి నుదురుకి అంటించుకుని రెప్పలమీదికి నోటును యెక్కించుకోగల ఘనుడు. తండ్రి నుండి ఈ విద్యతో పాటు తాగుడు వారసత్వంగా పొందాడు. తాగుడు ఆరోగ్యాన్ని దిగజార్చింది. ఆయుషు అర్ధాంతరంగా ముగిసింది. ఆ కళ ఆ పాయకట్టులో అతనితో అంతమయ్యింది.

ఈ కథలన్నీ వృత్తి కళాకారుల కడగండ్ల జీవితాలను కళాకాంతులు కోల్పోయిన కళారూపాల స్థితిగతులను, కళ్ళకుకట్టిస్తున్నాయి. కళవళపెట్టే ఆర్తారావాలను ప్రతిధ్వనిస్తున్నాయి.

కారణాలేమిటి?

ప్రపంచీకరణ ప్రభావంతో విస్తృతమయిన ప్రసారమాధ్యమ వ్యవస్థా? కొత్తపోకడలు పోతున్న నాగరికతా? కరువుకాటకాలతో కకావికలమవుతున్న ప్రజానీకమా?

# చదవండి...




❖ **శరణుడు-బసవడు:** సంకలనం– గుత్తి చంద్రశేఖర రెడ్డి– ఇది లక్ష్యలక్షణ గ్రంథాల్ని ఒక పుస్తకంగా అందించిన గ్రంథం. బసవాది శివశరణుల వచనములను *శూన్య సంపానము* అనుపేరుతో కన్నడంలో ఐదుగురు కవులు పదిహేనో శతాబ్దంలో సంకలనం చేశారు. ఆ గ్రంథాన్ని కన్నడం నుంచి తెలుగులోకి, వచనానువాదంతో పాటు వివేచన, విశ్లేషణలతో జోళదరాశి దొడ్డన గౌడు 1909లో వ్రాసి కన్నడ సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు అందించారు. *పుస్తకం వెల: ₹ 120–, పేజీలు: 190.*




❖ **వరమాల-జయమాల:** (పద్యగేయ సంకలనం) రచన గుత్తి చంద్రశేఖరరెడ్డి. ఇందులో ఖండికలనదగినవి కొన్ని వున్నాయి. అందులో సాంఘిక, చారిత్రిక, పౌరాణిక గాథలు కలిసి వున్నాయి. రచయితది బళ్ళారి దగ్గరకల రాయలసీమ వాసి కావటంతో అక్కడి పలుకుబళ్ళు కొన్ని మనకిచ్చుట ముచ్చటగా అనిపిస్తాయి. ఉదా: జొన్నపిసికళ్ళు, వేయించిన, వుడక బెట్టిన పాలకంకులు, పిసికి తీసి పిల్లలకు పెట్టు తినుబండారం. *పుస్తకం వెల: ₹ 50/–, పేజీలు: 134, ఫోన్ : 9177945559.*




❖ **మలగని బత్తి:** రచయిత ప్రాణ్‌రావ్. ఇది వీర తెలంగాణా పోరాట గాథ. చరిత్ర నేపథ్యంగా అల్లిన తెలంగాణా మాండలీకంలో వ్రాయబడ్డ నవల. కథ రజాకార్ల కాలం నాటిది. పాలపిట్ట బుక్స్ వారి ప్రచురణ. *పుస్తకం వెల : ₹ 80/–, పేజీలు: 175.*




❖ **బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాపరెడ్డి :** ఆంధ్ర సంస్కృతి వైతాళికులలో ఒకరు సురవరం ప్రతాపరెడ్డి. తెలంగాణా ప్రాంతంలో కవులు లేరన్న ఒక విమర్శకు సమాధానంగా 354 మంది తెలంగాణా కవుల వివరాలను వ్రాసి మన ముందుంచారు. నాటక కర్తగానే కాక తెలంగాణాను జాగృతం చేసిన *ఆంధ్రుల సాంఘిక చరిత్ర* రచయితగా ప్రసిద్ధులు. వారి వ్యక్తిత్వంపై ఇదొక రేఖా మాత్ర పరిచయం. సంపాదకులు –గంటా జలంధర్ రెడ్డి. *పుస్తకం వెల : ₹ 125/–, పేజీలు: 230.*




❖ **మాటన్నది జ్యోతిర్లింగం:** బసవన్న, దేవర దాసిమయ్య, అక్కమహాదేవి, అల్లమ ప్రభు రాసిన కన్నడ వచనాలకు దీవి సుబ్బారావుగారి తెలుగు అనువాదం. కన్నడ భాషలో పదాల కూర్పు వల్ల ఏర్పడ్డ లయ అంతస్సూత్రంగా వచన సాహిత్యం ఏర్పడింది. ఆ భాషలో వచనాలకు వచ్చినంత పేరు ఏ ఇతర సాహిత్య ప్రక్రియలకు రాలేదు. కన్నడ కస్తూరి ఘుమఘుమలు ఏ మాత్రం తగ్గకుండా దీవి సుబ్బారావు అనువాదం చేశారు. *వెల: ₹ 60/–, పేజీలు: 200 లభించుస్థలము: నవోదయ పబ్లికేషన్స్.*




❖ **జుమ్మా:** వేంపల్లి షరీఫ్ కథలు. జీవితాన్ని నిశితంగా పరిశీలించి, నేలమీద నిలబడి రాస్తున్న అచ్చమైన కథకుడీ రచయిత. ఇందులో కొన్ని కథలు పిల్లల గురించి రాసినవి. మతాన్ని మించిన ఆపేక్షలున్నాయని అమ్మ ద్వారా నిరూపించిన కథ జుమ్మా. మరోకథలో తన అక్క గురించి చెబుతూ హిందువుల మధ్య ఇంట్లో ఉంటూ, హిందూ బాలికల స్నేహం చేస్తూ, తెలుగు మీడియంలో చదువుకుంటూ, ముగ్గుల మీద ఇష్టం పెంచుకున్న అక్క, ఇంటి ముందు ముగ్గులు వేయటం ముస్లిం సాంప్రదాయం కాదని తెలిసి ఆ పిచ్చిని గోరంటాకులు పెట్టి తీర్చుకొనేది. ఒక మతానికి మరో మతానికి మధ్య తేడా ఇంతేనా. ఇంత మాత్రం దానికేనా మత సంఘర్షణలు జరుగుతుంటాయి, అని ప్రశ్నించటం హృదయమున్న వారిని కదల్చక తప్పదు. *వెల: ₹ 60/-, పేజీలు: 100.*




❖ **పరమ గీతం:** బైబిల్ లోని *సాంగ్ ఆఫ్ సాలమన్* కు దీవి సుబ్బారావు అనువాదం. పవిత్ర గ్రంథమైన బైబిల్‌లో దేవుడు అనే మాట ఒక్కచోట గూడా లేని భాగం ఈ పరమగీతం. బాహ్యార్థంలో ఇది ప్రేయసీ ప్రియుల ప్రేమను వర్ణించే ఉదాత్త ప్రేమ కావ్యంగా కనపడి నప్పటికీ, భగవంతునికి - యూదు ప్రజకు, క్రీస్తుకు-చర్చికి మధ్యగల ప్రేమానుబంధాన్ని నిరూపించేదిగా పండితులు దీని అంతరార్థాన్ని అన్వయించి చూపారు. భగవంతుని చేరుకోవటానికి భక్తుడు పడే విరహవేదన, కలయికలోని ఆనందం కూడా దీనిలో దర్శనీయం. *వెల: ₹ 30/- పేజీలు: 80, పై రెండు పుస్తకాలు కావలసినవారు: 040-24035238 సంప్రదించగలరు.*




❖ **కళాదీపికలు (సంపాదకులు వి.ఎస్. రాఘవాచారి):** సమకాలీన రంగస్థల నటీమణుల ఫోటోలతో కూడిన కరదీపిక. స్త్రీ పాత్ర స్త్రీయే నటించి ఖ్యాతిగాంచిన తొలి తెలుగు రంగస్థల నటిగా సురభి పాపాబాయి ప్రసిద్ధిపొందారు. ఈ పుస్తకం ఆమెకు అంకితమివ్వడమే కాకుండా ఆమె ముఖచిత్రంని వేసి గౌరవించారు. ఆమె 1911లో మొట్టమొదటి సారిగా తెలుగులో గ్రామఫోను రికార్డు ఇవ్వడం జరిగింది. *వెల: ₹ 150/-, పేజీలు : 135. లభించుచోటు: తిరుపతి, కళాదీపిక సెల్‌నెం:9908837451.*




❖ **మానాన్న:** రచయిత అవిజ బాలీశ్వరరెడ్డి. రచయిత తన తండ్రి యొక్క అభిరుచులను వెల్లడించటమే కాదు ఆయన ఇష్టపడి పాడుకునే సినిమాపాటలు, శ్రీ కృష్ణరాయబారంలోని పద్యాలు. దుర్యోధనుని మయసభ స్వగతం, గయోపాఖ్యాన పద్యాలు, ఇలా ఎన్నో ఆయన ఇష్టాలతో పాటు ఆయన అందమైన దస్తూరీని మనముందుంచారు రచయిత. వెల అమూల్యం. *పుస్తకం పేజీలు: 140. కావలసినవారు ఫోన్: 9246571107 లో సంప్రదించండి.*




❖ **ఒక హిజ్రా కథ:** దిగ్గజాలలాంటి సుప్రసిద్ధ ఉర్దూ, హిందీ రచయితల కథలకు పరవస్తు లోకేశ్వర్ చేసిన తెలుగు అను సృజన. ఇందులోని ఎనిమి కథలూ చారిత్రక, సాంస్కృతిక దర్పణాలు. మంచికథలు ఎలా ఉండాలో తెలుసుకోదలచినవారు తప్పక కొని చదవవలసి పుస్తకం. *పేజీలు 130, వెల : ₹ 50/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 9392698814 లో సంప్రదించండి.*

# మన హీరోలకు మరికొన్ని టిప్స్



పులిగోరు క్రాపింగు



ఎదురుపాపడ క్రాపింగు



వసారా క్రాపింగు



ఉడత క్రాపింగు



తాటిటెంక క్రాపింగు



హైరోడ్డు క్రాపింగు



ఎద్దుముఖము క్రాపింగు



ఎలుగుబంటి క్రాపింగు



రూళ్ళకర్ర క్రాపింగు



ఫ్రెంచి షోకిలా క్రాపింగు



గొర్రెపొటేలు క్రాపింగు



గ్యాలరీ క్రాపింగు

*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

**I. మిసిమి ప్రచురణలు**

| | | | ₹ |
|---|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | (హార్డ్ బౌండ్) | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | *అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి* | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు | " " | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-1 | " " | 200.00 |
| 5. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-2 | " " | 200.00 |
| 6. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-3 | " " | 200.00 |
| 7 | ఆచార్య నాగార్జునుడు | " " | 150.00 |
| 8. | దూర తీరాలలో... | *వల్లభనేని అశ్వినీకుమార్* | 60.00 |
| 9. | అమాహ | " " | 60.00 |
| 10. | అంతర్వీక్షణం | " " | 50.00 |
| 11. | సిద్ధార్థ | " " | 50.00 |
| 12. | నాలో నేను | " " | 30.00 |
| 13. | కథాంజలి-1,2 | ఎస్సారె 80.00; | 110.00 |
| 14. | హరి చందనాలు | అందవిల్లి సత్యనారాయణ | 40.00 |
| 15. | THE THUNDERCLOUD | S.R.A. | 120.00 |
| 16. | భట్టిప్రోలు కథలు | డా. నక్కా విజయరామరాజు | 150.00 |
| 17. | రెండు దశాబ్దాలు - కథ 1990-2009 | కథా సాహితి | 150.00 |
| 18. | IN QUEST OF UTOPIA | Mrs. Daggubati Purandeswari | 250.00 |
| 19. | గురవాయణం | డాక్టర్ *గురవారెడ్డి* | 150.00 |

**II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | లోకకవి వేమన - *మరుపూరు కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన - *ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన - *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం : జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన - *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం - *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |
| 11. | నూరేళ్ళ తెలుగు కథ - మహ్మద్ ఖదీర్ బాబు | |

**III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | మహాపరిత్తం - *బోధ చైతన్య* | 100.00 |
| 2. | జాతక కథలు - *శివశంకర స్వామి* | 60.00 |
| 3. | బౌద్ధ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 4. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 5. | మిళింద ప్రశ్నలు: - *బోధ చైతన్య* | 150.00 |
| 6. | బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు - అన్నపరెడ్డి బుద్ధఘోషుడు | 40.00 |
| 7. | వర్ణవ్యవస్థా లేక మరణ వ్యవస్థా *(భదంత ఆనంద కౌసల్యాయన్; అనువాదం: జె. లక్ష్మి రెడ్డి)* | 50.00 |
| 8. | జయమంగళం - బొర్రా గోవర్ధన్ | 40.00 |
| 9. | బుద్ధుని చివరి రోజులు - ఈమని శివనాగిరెడ్డి | 30.00 |
| 10. | భగవాన్ బుద్ధ *(ధర్మానంద కోశాంబి; అనువాదం: బొర్రా గోవర్ధన్)* | 150.00 |

**IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంధ్రమా? - వాగరి | 40.00 |
| 2. | యతిగీతం- స్వామి వివేకానంద (అనువాదం ; గజ్జెల మల్లారెడ్డి) | 50.00 |

మిసిమి మాసపత్రిక
**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in ; e-magazine : www.kinige.com/misimi

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹240/- తో పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా ₹30/- కలపండి.

**1. పేరు :** ..............................................................

**2. చిరునామా :**

ఇం.నెం. ..............................................................

వీథి ..............................................................

పేట ..............................................................

ఊరు ..............................................................

పిన్ ..............................................................

సెల్ ..............................................................

**3. సంతకం :** ..............................................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi



మొల్ల రామాయణం

MISIMI / **నళీబానళీ** / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14



పెండ్లికూతురు